




జ్ఞాన యోగం

విచారణ

శారదా ప్రసంగములు





సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

నన్ను "నేను" చేరుకోవటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి, అంతేగాక విలువైన గ్రంధాలు సరైన సంరక్షణ లేక కనుమరుగైపోతున్నాయి, కనుక మన అందరి కోసం భారత ప్రభుత్వం పురాతన ఆధ్యాత్మిక గ్రంధాలను సంరక్షించే నిమిత్తం ఎంతో శ్రమతో కంప్యూటరీకరణ ద్వారా ఒక చోట చేర్చుతూ ఆన్ లైన్ చేయటం జరిగింది. ఇటువంటి విలువైన జ్ఞాన సంపదను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావటానికి సాయి రామ్ సేవక బృందం ఉడతా భక్తి గా ఇప్పటివరకి దాదాపు **5000** పుస్తకాలను వివిధ వర్గాలుగా విభజించి PDF(eBOOK) రూపంలో ఆన్ లైన్ లో ఉచితంగా అందించటం జరిగింది. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం అందించిన భారత ప్రభుత్వపు వెబ్ సైట్(డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా http://www.new.dli.ernet.in), ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in), మైక్రోసాఫ్ట్ వెబ్ సైట్(http://www.microsoft.com) కు మేము ఋణపడివున్నాము.అలాగే ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి పెద్ద మొత్తం లో గ్రంధాలను అందించిన తిరుమల తిరుపతి దేవస్థానమునకు కూడా మనం ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in లేక http://www.dli.ernet.in
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com

సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement

సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంద వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము.

ఈ గ్రంధపు భారత ప్రభుత్వ డిజిటల్ లైబ్రరీ గుర్తింపు సంఖ్య: 2030020025588

Sai**R**eal**A**ttitude**M**anagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయి నాథ పాద సమర్పణమస్తు *

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఋజువర్తనులు, జవసంపన్నులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీ శారదా ప్రసంగములు

అనువాదకుడు :

శ్రీ వెదురుమూడి వేంకటకృష్ణరావు

1944

శ్రీ రామకృష్ణ మఠము

మైలాపూరు : చెన్నపురి.

తొలినుడి

శ్రీ శారదాదేవి దివ్యజీవిత చరిత్రమును మేమిదివఱకే ఆంధ్రమున వెలువరించి యుంటిమి. వర్తమాన గ్రంథము ఆ సాధ్వియొనర్చిన ప్రసంగముల సంగ్రహము. దీనిని వంగభాషలో 'మాయేర్ కథా' అను రెండు సంపుటములుగ శ్రీమద్ అరూపానందస్వామివారు వెలువరించి యున్నారు. దానినే న్యూయార్కు (అమెరికా) నగర శ్రీ రామకృష్ణ మఠాధ్యక్షులగు శ్రీమత్ నిఖిలానందస్వామివారు ఆంగ్లమునకు పరివర్తన మొనర్చియుండిరి. శ్రీ రామకృష్ణ లీలామృతమును శ్రీ రామకృష్ణుని జీవిత చరిత్రమును రచించిన శ్రీ వెదురుమూడి వేంకట కృష్ణరావు (గవర్నమెంటు ఆంధ్రానువాదకులు) గారే ఈ ఆంధ్రానువాదమును కూర్చిరి. వారికి మా ధన్యవాదములు.

సాధువులును మహాపురుషులునగు వారి సంభాషణలు ఆధ్యాత్మిక సాధనా రహస్యములను గ్రహింప దోహదపడుచుండును. అట్టి సాధన సంకేతము లనేకము లీ గ్రంథమున నున్నవి. ముముక్షువుల కివి ఆహ్లాదకరము లగునని మేము విశ్వసించుచున్నాము.

శ్రీ రామకృష్ణ మఠము
మైలాపూరు, చెన్నపురి.

ప్రకాశకులు

దేవీ స్తోత్రమ్

ప్రకృతిం పరమామభయాం వరదాం
నరరూపధరాం జనతాపహరాం,
శరణాగత సేవకతోషకరీం ప్రణమామి
పరాం జననీం జగతామ్. 1

గుణహీనసుతా నపరాధయుతాన్ కృపయాద్య
సముద్ధర మోహగతాన్,
తరణీం భవసాగర పారకరీం ప్రణమామి
పరాం జననీం జగతామ్. 2

విషయం కుసుమం పరిహృత్య సదా
చరణాంబురుహామృతశాంతి సుధాం,
పిబ భృంగమనో భవరోగహరాం
ప్రణమామి పరాం జననీం జగతామ్. 3

కృపాం కురు మహాదేవి సుతేషు ప్రణతేషుచ,
చరణాశ్రయ దానేన కృపామయి నమోఽస్తుతే. 4

లజ్జా పటావృతే నిత్యం శారదే జ్ఞానదాయికే,
పాపేభ్యో నః సదా రక్ష కృపామయి నమోఽస్తుతే. 5

రామకృష్ణ గతప్రాణాం తన్నామశ్రవణప్రియాం,
తద్భావ రంజితాకారాం ప్రణమామి ముహుర్ముహుః. 6

పవిత్రం చరితం యస్యాః పవిత్రం జీవనం తథా,
పవిత్రతాస్వరూపిణ్యై తస్యై కుర్మో నమో నమః. 7

దేవీం ప్రసన్నాం ప్రణతార్తిహంత్రీం
యోగీంద్రపూజ్యాం యుగధర్మపాత్రీం,
తాం శారదాం భక్తివిజ్ఞానదాత్రీం
దయాస్వరూపాం ప్రణమామి నిత్యమ్. 8

స్నేహేన బధ్నాసి మనోఽస్మదీయం
దోషానశేషాన్ సగుణీకరోషి,

అహేతునా నో దయసే సదోషాన్
స్వాంకే గృహీత్వా యదిదం విచిత్రమ్. 9

ప్రసీద మాతర్వినయేన యాచే
నిత్యం భవ స్నేహవతీ సుతేషు,
ప్రేమైకబిందుం చిరదగ్ధచిత్తే విషించ
చిత్తం కురు నః సుశాంతమ్. 10

జననీం శారదాం దేవీం రామకృష్ణం జగద్గురుమ్,
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః.॥



HOLY MOTHER

"Love, passion for Truth, and unflagging energy accomplish everything."

ఓమ్

నమో భగవతే రామకృష్ణాయ

శ్రీ శారదా ప్రసంగములు

(ప్రథమ భాగము) *

ఉద్బోధనాపత్రికా కార్యాలయము, కలకత్తా 1911-వ సం॥ జనవరి.

కలకత్తాలో పోటల్‌డంగా యందలి మా యింటికి ఒక శుక్రవారమునాటి యుదయమున శ్రీమాన్......గారు వచ్చి, "శ్రీమాతృదేవిని సందర్శించుటకు రేపు మేము బాగ్‌బజారుకు వెళ్లెదము. ఆ సమయమున మీరు సిద్ధముగానుండుడు." అని చెప్పినారు. ఆహా, ఇంతకాలమునకు శ్రీమాతృదేవి పాదపద్మములకు ప్రణమిల్లు మహాభాగ్యము నాకు పట్టనున్నది గదా! నా కప్పుడు కలిగిన సంతోషాతిశయముచే నాటిరాత్రి నాకు నిద్రయే రాలేదు. కడచిన పదునాలుగు, పదునైదేండ్లు నేను కలకత్తాలో నివసించుచుండినను, నేటికి తన పావనదర్శనభాగ్య మిచ్చుటకు అమ్మకు నాయందు దయ గలిగినది.

మరునాటి మధ్యాహ్నమున మేమొక బండిని కుదుర్చుకొని, బ్రాహ్మమత బాలికాపాఠశాలకుబోయి, సుమతిని వెంటబెట్టుకొని బాగ్‌బజారులోని శ్రీ మాతృదేవియింటికి బయలు

* ఈ ప్రసంగము లొక శిష్యురాలు లిఖించినవి.

వెడలితిమి. ఈ యాత్రాసమయమున నాకుకలిగిన ఆతురతయు, నుత్సాహమును వర్ణనాతీతములు. బాగ్‌బజారులో శ్రీ మాతృదేవిగారి యింటిలోనికి వెళ్లినప్పుడు, ఆమె పూజామందిరద్వారముకడ నిలుచుండి, యెవరిరాకకో ఆప్యాయముతో నెదురు చూచుచుండినట్లగుపడినారు. తలపై ముసుగు లేదు. నేను సాష్టాంగ ప్రణామము చేసినతర్వాత అమ్మగారు నన్నుగూర్చి, సుమతి నడిగిరి. తన అక్క యని నన్ను సుమతి యామెకు పరిచయ పఱచినది. కొంత కాలమునుండి సుమతి, శ్రీ మాతృదేవిని సందర్శించి వచ్చుచుండినది. పిమ్మట అమ్మగారు నావంకజూచి "అమ్మాయీ! నాస్థితి చూచితివా? నేను వీరివలన యెంత బాధ పడుచున్నానో చూచితివా? నా వదినెగారును, ఆమె కొమార్తె రాధుయునుకూడ జ్వరముతో పండుకొనియున్నారు. వారికేమి కావలయునో కనుగొని, వారికి పథ్యపానాదుల నెవరుసమకూర్చుదురో కదా! ఒక్కనిముషము వేచియుందువా, తల్లీ? నేనిప్పుడే పోయి, నా బట్ట నుదికికొని మరలవచ్చెదను." మేమట్లే వేచి యుంటిమి. కొలదినిముషములైన తరువాత అమ్మగారు మరల వచ్చి యేవో కొన్ని తియ్యని వస్తువులను మా యిరువురకును తినుట కిచ్చినారు. సుమతి పాఠశాలకు వెళ్లవలసియుండుటచే, మే మెక్కువకాల ముచ్చటనుండ వీలులేకపోయెను. పిమ్మట మేము లేచి నమస్కరించి వెళ్లునప్పుడు, "నీవు మరల రావలయును సుమా!" యని అమ్మ సెలవిచ్చినారు. ఈ అయిదు నిముషముల సందర్శనముతో, నాకెంత మాత్రమును తృప్తి కలుగలేదు. మిక్కుటమైన పునర్దర్శనాభిలాషతో నే నింటికి తిరిగి వచ్చితిని.

1911-వ సం॥ ఫిబ్రవరి 12-వ తేది.

ఈ దినము నేను ఉద్బోధనాపత్రికా -కార్యస్థానమునకు వెళ్లినప్పుడు, శ్రీ మాతృదేవి బలరాంబోసుగారి యింటికి వెళ్లినారని చెప్పినారు. నేను వెళ్లిన కొంచెముసేపటికే ఆమె తిరిగి వచ్చినారు. నేను నమస్కరించిన తరువాత, అమ్మగారు మంద హాసము చేయుచు "నీతోకూడ నే డెవరు వచ్చినారు?" అని అడిగినారు. "మా మేనల్లుడు" అని బదులు చెప్పితిని.

అమ్మ: నేడు నీ కెట్లున్నది? మీ చెల్లెలు క్షేమముగా నున్నది కదా! నీ విచ్చటకు వచ్చి యెంతకాలమో అయినది. నీ విషయమై యాందోళనపడి, నీ వెట్లుంటివో యని యనుకొంటిని.

నే నామె నొకసారియే, అయిదునిముషములవరకే, చూచి యుండినందున, ఆమె మా యెడల నింతప్రేమ కనుబఱచుటను జూచి, ఆశ్చర్యపడితిని. కన్నులానందాశ్రువులతో నిండినవి.

"అమ్మాయీ! నీ విచ్చటకు వచ్చినతోడనే, నేను తిరిగి వచ్చువరకును బలరాము నింటిలో నా కేమియు తోచలేదు. మనస్సు మిక్కిలి తల్లడిల్లినది." అని అమ్మగా రెంతో వాత్సల్యముతో చెప్పినారు. నేను పూర్తిగా ఆశ్చర్యపరవశురాలనైతిని. శ్రీమాతృదేవి మేనల్లుడగు, ఖుదే యను శిశువునకు నాచెల్లెలు, సుమతి రెండు ఉన్నిటోపీలను నా చేతికిచ్చి పంపినది. వానిని అమ్మ కిచ్చితిని. ఈ స్వల్పవస్తువులకే ఆమె యెంతో సంతోషమును వెలిబుచ్చిరి. ఆమె మంచముపైని కూర్చుండినారు. నన్నుకూడ ప్రక్కకువచ్చి కూర్చుండుమని యామె చెప్పినందున, నేనట్లే చేసితిని. నన్ను చూచి "అమ్మాయీ; నిన్నింతకు ముందున్నిసార్లో చూచినట్లు, ఎంతకాలము నుండియో నీతో నాకు

పరిచయముండినట్లు అనిపించుచున్నది.'' అని మిక్కిలి ప్రేమతో చెప్పినారు. ''అమ్మా! నాకేమియు తెలియదు. నేనొక్కనాడు మాత్రమే వచ్చి, అయిదు నిముషములవరకే యిచ్చట నుంటిని.'' అని బదులు చెప్పితిని.

అమ్మగారు నవ్వి, మా యిద్దరి భక్తిశ్రద్ధలను చాల కొని యాడ నారంభించిరి. ఆ మెప్పుదల మాటలకు నేనెంతవరకు అర్హురాలనో నాకు తెలియదు. పిమ్మట, నొకరి తరువాత నొకరు చాలమంది భక్తురాండ్రు వచ్చిరి. వారందరును కరుణా రసభరితమై, సుందరమందహాసవిలసితమై యొప్పు శ్రీ మాతృదేవి ముఖపద్మమును రెప్పవాల్పక బహుప్రేమతో తిలకించుచు ఆనం దించుచుండిరి. ఇట్టి దివ్యదృశ్యమును నేనెప్పుడు చూడలేదు. ఈ పరమానందసాగరములో నా మనస్సు మునిగి తన్మయమై యుండగా నెవ్వరో వచ్చి, నాకొఱకు బండి గుమ్మము దగ్గిర సిద్ధముగా నుండెనని చెప్పిరి. అమ్మగారు వెంటనే లేచివెళ్లి ప్రసాదమును తెచ్చి, నా యెదుట బెట్టి తినుమనిరి. అంతమందిలో నేనా ప్రసాదమును తినుటకు సిగ్గుపడుచుంటిని. ''ఎందుకు సందేహించెదవు? ఈ ప్రసాదమును తినుము'', అని అమ్మగారు చెప్పగా ఆ ప్రసాదమును చేతితో తీసికొని భుజించి, ఆమెకు ప్రణమిల్లి సెలవుగైకొని వచ్చితిని. నేను వచ్చుచుండగా ''మరల రావలెను సుమా! నీవొక్కతెవు మెట్లు దిగి వెళ్లగలుగుదువా? నేనుకూడ నీతోరానా?'' యని చెప్పుచు అమ్మగారు మేడ మెట్లవరకు వచ్చిరి. ''నేనొక్కతెనే వెళ్లగలను, మీరు శ్రమ పడవలదు'' అని చెప్పితిని. ''మరియొకనాడు ప్రొద్దుట రమ్ము'' అని తుదిమాటగా చెప్పి అమ్మగారు లోనికివెళ్లిరి. నేను సంతు

ప్రాంతరంగముతో శ్రీ మాతృదేవి యద్భుతప్రేమను దలచు కొనుచు నింటికి తిరిగి వచ్చితిని.

1911-వ సం॥ మే 14-వ తేది.

ఈనాడు శ్రీమాతృదేవికి నేను ప్రణమిల్లిన తోడనే, "నీవు వచ్చుట యెంతో మేలైనది. ఇంతకాలమును నిన్ను గూర్చియే తలంచుచుంటిని. ఇన్నాళ్లు నీ వెందుకు రాలేదు?" అని యామె ప్రేమపూర్వకముగా సెలవిచ్చిరి.

భక్తురాలు: నేను కలకత్తాలో లేను. పుట్టి నింటికి పోయి యుంటిని.

అమ్మగారు: సుమతి ఆరోగ్యముగా నున్నది కదా? ఆ పిల్ల యిక్కడకు వచ్చి యెంతకాలమో అయినది. ఊపిరి తిరుగకుండ చదువుచున్నది కాబోలు!

భక్తురాలు: ఆమె పెనిమిటి ఇక్కడ లేడు.

అమ్మగారు: ఇంకను బడికి వెళ్లుచున్నదే! వా రిరువురు సంసారము చేయుచున్నారా?

భక్తురాలు: అమ్మా, సంసారమన నేమో, గృహకృత్యము లన నేమో మాకు తెలియదు. అది యెల్ల మీాకే తెలియును.

అమ్మగారు: (చిఱునవ్వు నవ్వి:) "నే డెంత ఉక్క పోయు చున్నది!" అని చెప్పి నాకొక విసనకఱ్ఱ నిచ్చి, "అమ్మాయీ! హడావుడిగా భోజనముచేసి, యిచ్చటకు పరుగెత్తికొని వచ్చితివి. ఇటువచ్చి, నా ప్రక్కను బరుండుము, తల్లీ!" అని సెల విచ్చిరి. నే నామెప్రక్కను బరుండుటకు సందేహించుచుండుటను

జూచి, "ఎందుకు సందేహించుచున్నావు? నా మాట విని పరుండుము." అని మరల చెప్పిరి. నే నికతప్పించుకొనలేక పోతిని. అమ్మగారు నిద్రమమతగానుండిరి. నేను నిశ్శబ్దముగా బరుండి యుంటిని. ఇంతలో కొంతమంది భక్తురాండ్రును, ఇద్దరు సన్న్యాసినులును వచ్చిరి. వారిలో నొక యామెకు నలువది, నలువది యైదేండ్ల వయస్సు; ఇంకొక యామె యువతి. కన్నులు తెరువకుండగనె అమ్మగారు, "ఎవరచ్చట? గౌరీదాసియా?" యని అడిగిరి. "అమ్మా! మీ రెట్లు తెలిసికొంటిరి?" అని యా బాలసన్న్యాసిని శ్రీ మాతృదేవిని మరల ప్రశ్నించెను. "నా కట్లు పొడకట్టినది" అని శ్రీ మాతృదేవి చెప్పెను. కొలది నిముషము లైన తరువాత అమ్మగారు లేచి కూర్చుండిరి. "మేము బేలూరు మఠమునకు వెళ్లినాము. అచ్చట ప్రేమానందస్వాములవారు మాకు తృప్తిగా భోజనము పెట్టిరి. ఆయన మఠములో నున్నచో, సంతుష్టిగా భోజనము చేయకుండ తిరిగి వచ్చుట కెవరికిని శక్యముకాదు." అని బాలసన్న్యాసిని చెప్పెను. మొగమున కుంకుమబొట్టు పెట్టుకొననందుకు అచ్చటనున్నవారిలో నొకరిని, శ్రీ మాతృదేవి మృదువుగా మందలించిరి. పెండ్లియైన ప్రతి సువాసినియు మోమున కుంకుమబొట్టు పెట్టుకొనవలయును. ఇది హైందవ స్త్రీల యాచారము.

నన్నుగూర్చి గౌరీమాయి శ్రీ మాతృదేవినడిగి తెలిసికొని, నన్ను తన బాలికాపాఠశాలకు రమ్మని ఆహ్వానించెను. ఆ పాఠశాలలో నించుమించుగా అరువదిమంది బాలికలు చదువుచుండిరి. "నీకు కుట్టుపని వచ్చునా?" యని గౌరీమాయి నన్నడిగెను. "కొంచెము వచ్చును" అని నేను చెప్పితిని. పిమ్మట నామె తన

యాశ్రమములోని విద్యార్థినులకు, నాకు తెలిసినంత కుట్టుపనిని నేర్పుమని నన్ను కోరెను.

శ్రీ మాతృదేవి సమ్మతితో నేను గౌరీమాయి పాఠశాల కొకనాడు వెళ్లిచూచితిని. ఆమె నన్ను బహుప్రేమతో నాదరించి, ప్రతిదిన మచ్చటకువచ్చి శాలికలకు **గంటయో రెండు గంటలో** పాఠములు నేర్పుమని కోరెను. "నా కున్న స్వల్పజ్ఞానముతో నేను ఉపాధ్యాయునిగానుండుట అసంభవము. మీ కంతగా కావలసినచో వారికి నేను వర్ణక్రమము నేర్పగలను" అని నా అసమర్థతను వెల్లడించితిని. కాని, గౌరీమాయి నా మాట నెంతమాత్రము పాటింపకుండుటచే, నేనే లొంగిపోవలసివచ్చెను.

ఒకనాడు గౌరీమాయి పాఠశాలనుండి, నేను శ్రీ మాతృదేవిని సందర్శింపవచ్చితిని. అది వేసవికాలము. నేను మిక్కిలి అలసియుంటిని. అమ్మగారు చాలమంది భక్తురాండ్రతోకూడ తమ గదిలో కూర్చొనియుండిరి. నేనామెకు ప్రణామముచేసిన తోడనే, అమ్మగారు నావైపు చూచి వెంటనే మంచము పందిరి మీదనున్న విసనకఱ్ఱను దీసి నాకు విసరనారంభించిరి. ఎంత అపూర్వప్రేమ! ఇంతమంది భక్తురాండ్ర యెదుట అమ్మగారు నన్నిట్లు బుజ్జగించుచుండుట జూచి సిగ్గుపడితిని. అందరును రెప్పవాల్పక నన్నే చూచుచుండిరి. విసనకఱ్ఱను నా చేతికిమ్మని నేనడిగిన కొలదిని ఆమె మిక్కిలి గారాబముతో "అలాగేనమ్మా! కొంచెము తేరుకొనుము!" అని చెప్పుచు విసరుచునేయుండిరి. కొంతసేపైన తరువాత త్రాగుటకు మంచినీళ్లను, తియ్యని ప్రసాదమును తెచ్చియిచ్చిరి. నేను ప్రసాదమును తిని మంచినీళ్లు త్రాగునపుడు, అమ్మగారెంతయు సంతోషించిరి. పాఠశాలనుండి

బండి వచ్చి నాకొరకు వేచియుండుటచే నేను వెంటనే సెలవు తీసుకొని వెళ్లవలసివచ్చెను.

1911-వ సం॥ ఆగస్టు 3-వ తేది

నేను ప్రొద్దుట త్వరితముగనే బాగ్ బాజారుకు వెళ్లితిని. నేడు శ్రీమాతృదేవివలన మంత్రోపదేశము నొందగోరితిని. అందుకు వలయు కొన్ని వస్తువులనుగూడ తీసికొని వెళ్లితిని. ఈ వస్తువులను గౌరీమాయి నాకు వ్రాసియిచ్చెను. ఆమెకూడ నాతో వచ్చినది. మేము వెళ్లినప్పటికి అమ్మగారు పూజచేయుచుండిరి. నన్నుజూచి కూర్చుండుమని సంజ్ఞచేసిరి. పూజయైన తరువాత గౌరిమాయి నా మంత్రోపదేశము విషయమై అమ్మగారితో ప్రస్తావించెను. నేనుకూడ ఆమెతో ఆ విషయమై యొక నాడు ముచ్చటించి యుంటిని. నేను కొన్ని మంచి అరటిపండ్లను తెచ్చితిని. ఆ పండ్లను జూచి "ఎన్ని పండ్లను దెచ్చితివమ్మా!" అని సంతోషించి, "ఆతివాచివేసికొని నా ప్రక్కను కూర్చుండుము" అని అమ్మగారు సెలవిచ్చిరి. "నేనింకను గంగలో స్నానము చేయలేదు," అని బదులు చెప్పితిని. "స్నానము చేయనక్కరలేదు. రాత్రి కట్టుకొనిన బట్టలను తీసివేసి వేఱు బట్టలను కట్టుకొంటివి కదా?" అని యామె యడిగెను. పిదప నేనామె ప్రక్కగూర్చుంటిని. నా గుండె దడదడలాడుచుండెను. గదిలోనుండిన యితరుల నందరిని బయటకు వెళ్లుడని చెప్పి "ఏ మంత్రము నీకు కలలో తెలుపబడెనో నా కిప్పుడు చెప్పుము" అని నన్నడిగిరి. "నే నామాట నుచ్చరింతునా లేక వ్రాయనా?" అని యడిగితిని. "ఆ మాటలను నీవు చెప్పవచ్చును." అని అమ్మగారు చెప్పిరి.

మంత్రోపదేశ సమయమున ఆ మంత్రార్థమును అమ్మగారు నాకు బోధించి దాని నుచ్ఛరింపుమనిరి. ధ్యానయుక్తముగా నిటు తరువాత నేను స్మరింపవలసిన క్రొత్త మంత్రమును పిమ్మట నా కామె తెలిపిరి. ఈ మంత్రార్థమును బోధించుటకు ముందు అమ్మగారు కొలది నిముషములు ధ్యాననిమగ్నులై యుండుటను జూచితిని. మంత్రోపదేశసమయమున నా శరీరమంతయు వణక నారంభించెను. కారణమేమియో తెలియలేదు కాని, ఏడువ మొదలుపెట్టితిని. అమ్మగారు నానుదుటను రక్తచందనముతో పెద్ద బొట్టు పెట్టిరి. పూజామందిరములో దక్షిణగా కొన్ని రూపాయల నామెకిచ్చితిని. వాని నామె గోలప్‌మాయిచేతికిచ్చిరి.

మంత్రోపదేశము చేయునప్పుడు శ్రీ మాతృదేవి ముఖవైఖరి బహు గంభీరముగా నుండుటను గనిపెట్టితిని. పిమ్మట నామె పూజాపీఠమునుండి లేచివచ్చి, నన్ను మంత్రమును కొంత కాల ముచ్ఛరించుచు ధ్యానప్రార్థనలను జేయుమనిరి. నేనట్లే చేసి యామె పాదములకు ప్రణమిల్లినప్పుడు ''నీకు భగవద్భక్తి కలుగును గాక!'' అని యాశీర్వదించిరి. ఆ మాటలను నే నిప్పటికిని జ్ఞప్తియందుంచుకొని, ''అమ్మా, మీ ఆశీర్వచనమును మఱువకుడు! దాని ఫలము నాకు లభించును గాక!'' అని నే నమ్మగారిని ప్రార్థించుచుందును.

శ్రీ మాతృదేవి స్నానమునకు గంగానదికి వెళ్లుచుండిరి. గోలప్‌మాయికూడ వచ్చెను. అమ్మగారి తువాలును, చీరను చేతబట్టుకొని నేను బయలుదేరితిని. అప్పుడు వానచినుకులు పడుచుండెను. స్నానమైన తరువాత, ఘట్టముదగ్గరనున్న బ్రాహ్మణునకు అమ్మగారు కొంత పైకమును, నొక మామిడిపండు

నిచ్చుచు "ఈ ఫలమును నేను మీకిచ్చుచున్నను నిజముగా ఈ దానఫలమే మీకు చెందును సుడీ!" అని చెప్పిరి. ఆహా ఈ దాన మెవరిచ్చిరో ఆ బ్రాహ్మణున కెట్లు తెలియును! ఆ మాటల అర్థముకూడ నాతనికి తెలియనేలేదు. లెక్కలేనన్ని స్వల్ప విషయాపేక్షలతో స్వార్థపరాయణులమై కొట్టుకొనుచుండెడి అల్పజీవులమగు మేమైనను ఆ దివ్యవాక్యముల అర్థమును గ్రహింపగలిగితిమా !

స్నానమైన తరువాత అమ్మగారు పొడిబట్టను కట్టుకొని, తడిబట్టను తీసుకొనివచ్చుటకు నా చేతికిచ్చిరి. అందరికిని ముందు గోలప్ మాయియు, వెనుకను నేను నడచుచు వచ్చినాము. మా యిరువురకును నడుమ అమ్మగారుండిరి. గంగాజలముతో నిండిన యొక చిన్న చెంబును ఆమె చేతబట్టుకొని వచ్చుచు దారిలో కనుపడిన ప్రతి పవిత్రవట వృక్షమునొద్దను ఆ నీటిని కొంచెము పోయుచుండిరి. మే మింటికి వచ్చినతోడనే క్రింది యంతస్తులో, కొళాయిదగ్గరగల కుండీకి సమీపమున నీళ్ళబిందె యొకటి యుండెను. ఆ బిందెలోని నీటితో అమ్మగారు కాళ్లు కడుగుకొని "నీ కాళ్లకుకూడ బురద అంటుకొని యున్నది. నీవును కాళ్లు కడుగుకొనుము." అని నా కాన తిచ్చిరి. నీళ్ళకొఱకు నే నిటునటు చూచుచుండగా "ఆ బిందెలో నీళ్లున్నవి. ఆ నీళ్లతో నీ వేల కడుగుకొనవు?" అని అమ్మ అడిగిరి. "మీరు తాకిననీటిని * నే నెట్లు వాడగలను?" అని కొంత అనిష్టముతో బదులు చెప్పితిని. అంతట "ఆ నీటిని కొంత నీ తలపై జల్లుకొనుము." అని యామె

---

* హిందూ మతాచారము ప్రకారము, పూజ్యులైనవారు తాకిన నీటిని, కాళ్లు కడుగుకొనుటకు వాడకూడదు.

చెప్పిరిగాని నేను మాత్రము సందేహించి, "ఆ నీటిని వాడుటకు నాకు వలనుపడదు." అని చెప్పి మరియొక పాత్రతో కుండీలోని నీటిని దీసికొని కాలుసేతులు కడిగికొంటిని. ఇంతవరకును అమ్మ గారు నాకొరకు కనిపెట్టుకొని యుండిరి. పిమ్మట మేమందర మును మేడమీదికి వెళ్లితిమి. నైవేద్యము చేయబడిన కొన్ని తియ్యని పదార్థములను, పండ్లను తెచ్చి రెండువిస్తళ్లలోనుంచి అమ్మ నన్ను తమ ప్రక్కను కూర్చుండుమనిరి. మిక్కిలి గారాబముతో ఆ ప్రసాదమును నాకుపెట్టి తాముకూడ భుజించిరి.

క్రమక్రమముగా చాలమంది భక్తురాండ్రు వచ్చిరి. నేను వారి నెఱుగను. మధ్యాహ్న సమయమున వారిచ్చట భోజనము చేయుదురు. పూజమైన తరువాత మేమందరమును భోజనము చేయుటకు కూర్చుంటిమి. అమ్మగారుకూడ తమ స్థానములో కూర్చుండిరి. ఆమె మూడు కబళములనుతిని, పిమ్మట నా కిచ్చిరి. ఆ ప్రసాద మితరులందరికినికూడ నిచ్చిరి. ఇప్పుడు అమ్మగారు తమ సాధారణ రీతిని కనుబడిరి. ఎప్పటివలె నవ్వుచు, మాటలాడ జొచ్చిరి. నేను మంత్రోపదేశము నొందినప్పటినుండి యింతవర కును నామె బహుగంభీరముగను, అంతర్ముఖులుగను గనుపడిరి. ఇంతియేల? ఆమె స్వరూపము శిష్టరక్షణమును దుష్టశిక్షణమును గావింప సమకట్టిన సాక్షాత్పరదేవతను బోలియుండెను. నేను భయముతో వణకిపోతిని. అమ్మగారు తరువాత చాలమంది భక్తు లకు మంత్రోపదేశము చేయుటను జూచితినిగాని, ఇంతటి గంభీర వైఖరిని ఆమె ఆకృతిలో మరల నే నెన్నడును చూచి యుండ లేదు. నవ్వుచు, వేళాకోళము చేయుచు మెందరికో యామె

మంత్రోపదేశము చేసిరి. వారును సంతృప్తులై సుఖముగానుండిరి. మంత్రోపదేశ సమయమున అమ్మగా రెట్లుండిరని ఆతురతతోనే నా భక్తురాంద్ర నొక్కొక్కప్పుడు అడుగుచుండెడి దానను. నలువది నలువదియైదేండ్ల ప్రాయముగల వితంతువు నొకసారి నే నిట్లడిగినప్పుడు ఆమె యీ క్రిందివిధమున బదులు చెప్పెను. "మన మెల్లప్పుడును జూచుచున్నట్లే కనబడిరి. విశేష మేమియు లేదు. ఇంతకుముందే మా కులగురువు నాకు మంత్రోపదేశము చేసియుండెను. పిమ్మట శ్రీ మాతృదేవిని గురించి విని నే నామె కడకు మంత్రోపదేశమునకు వచ్చితిని. మా యింటి పురోహితు డుపదేశించిన మంత్రమును పదిసార్లు చెప్పుమని మొదట నన్న డిగి, తరువాత నా కామె మంత్రోపదేశము చేసిరి. శ్రీ రామ కృష్ణుల వారిని నా గురువుగను మఱియొక దేవతను నా యిష్ట దైవముగను భావింపుమనిరి. శ్రీ రామకృష్ణుల నిట్లు ప్రార్థింప వలయునని బోధించిరి: 'ప్రభో! యీ జన్మములోను పూర్వ జన్మములలోను నే నొనర్చిన పాపముల నెల్ల పరిహరింపుము'. ఇదే విధమున ప్రార్థనా విధానము నింకను విపులముగా బోధించిరి. నే నిప్పుడు చాల బాధపడుచున్నాను. కారణమేమో నీవు చెప్ప గలవా? అరగంటకంటె నెక్కువకాలము మంత్రము నుచ్చరింపలే కయున్నాను. ఎవరోవచ్చినా స్థానమునుండి నన్ను బయటకు లాగునట్లుండును. నీకుగూడ నిట్లేయుండునా? ఈ విషయమై శ్రీ మాతృదేవి నడుగవలెనని నే నెన్నిసారులో తలపెట్టితిని గాని, అట్లు చేయలేకున్నాను. ఆమెతో నీవు చాల చనువుగానుందువు. అమ్మగా రొకవేళ నన్ను మోసపుచ్చినారా?" ఈ వివరముల నన్నిటిని నే నెన్నడును తెలిసికొన గోరలేదు. కాని ఆ భక్తు

రాలు దాపరికమేమియు లేకుండ, ఈ వృత్తాంతమునంతను వెల్ల డించినది. "అమ్మగారికి మనసిచ్చి మీరే యామెననుగుడు. మొట్టమొదట మీకు కొంచెము సందేహము, మోమోటము కలుగవచ్చును. కాని ఆ వైఖరి క్రమక్రమముగా తగ్గి, చనువేర్ప డును. మేముకూడ మొట్టమొదట నామెతో నింత చనువుగా మెలగలేకపోతిమి. ఇప్పుడుకూడ నొక్కొక్కప్పుడామె ముఖవైఖరి బహుతీక్ష్ణముగా నుండును. అట్టి సమయములం దామెదగ్గరకు మేము పోలేము."

సాయంకాలమున నౌకరి తరువాత నౌకరు భక్తురాండ్రు సెలవు తీసికొని వెడలిపోయిరి. అమ్మగారు తమ మేనకోడండ్రను ధ్యానప్రార్థనల జేసికొనుడని యానతిచ్చిరి. కాని వా రాలస్యము చేసినందున, "చూచితిరా! సాయంత్రమైనను, ధ్యానము చేసి కొనుటకు మారుగా వీ రెట్లు పనికిమాలిన ప్రసంగములను చేయు చున్నారో!" అని యామె తమ యసంతుష్టిని వెలిబుచ్చిరి. గోలప్ మాయి, యోగినీ మాయి మొదలగు భక్తురాండ్రు శ్రీ మాతృ దేవి పాదములకు ప్రణమిల్లిరి. కొంతమందిని గడ్డములను బట్టుకొని బుజ్జగించియు, కొంతమందిని ముద్దుపెట్టుకొనియు శీర్షములపై తమ హస్తములనుంచియు ప్రేమతో నామె వారి నెల్లరను దీవించిరి. పిమ్మట శ్రీ రామకృష్ణుల పటము నెదుట ప్రణమిల్లి అమ్మగారు ధ్యానమునకు గూర్చుండిరి. ధ్యానమైన తరువాత నేను సెలవు తీసికొని యింటికి తిరిగి వచ్చితిని.

* * *

పాఠశాలలో పని యెుత్తిడివలన కొన్నాళ్లవరకు శ్రీ మాతృదేవిని సందర్శింప లేకపోతిని. నేడామెకు నేనుప్రణమిల్లిన

తోడనే యామెన న్నెన్నివిధములనో ప్రేమతో నాదరించిరి. అప్పుడు భూదేవుడను బాలుడు మహాభారతమును చదువుచుండెను. మిక్కిలి చిన్నవాడగుటచె నాతడు త్వరితముగా చదువలేకుండెను. అమ్మగారికికూడ చేయవలసిన పనులింకను నెన్నియోయుండెను, అప్పటికి ప్రొద్దుక్రుంకినది. ''ఆ పుస్తకము నీమెకిమ్ము. ఈమె దానిని బహుసులభముగా చదువును. ఈ యధ్యాయమును ముగించకుండ నేడు పురాణపఠనమును ఆపుటకు వీలులేదు'' అని యామె భూదేవునితో చెప్పిరి. అది యామె యాజ్ఞ కనుక మహాభారతమును నేను చదువ నారంభించితిని. ఇంతవరకుండెన్నడును అమ్మగారి సమక్షమున నే నే పుస్తకమును చదువలేదు. మొట్టమొదట కొంచెము సిగ్గుపడితిని గాని యెట్టకేలకు అధ్యాయమును ముగించితిని. అమ్మగారు చేతులు జోడించి, ఆ పుస్తకమునకు నమస్కరించిరి. పిమ్మట మేము సాయంకాల పూజను జూచుటకై దేవతార్చనమందిరములోనికి వెళ్లితిమి. ఉచితాసనమున అమ్మగారు కూర్చుండి శీఘ్రముగా ధ్యాననిమగ్నులైరి.

అమ్మగారు భగవన్నామమును బిగ్గరగా నుచ్చరించుచు, జపమును బూర్తిసేసి శ్రీరామకృష్ణుల ప్రతిమయెదుట ప్రణమిల్లిరి. పిమ్మట నందరకును ప్రసాదము పంచిపెట్టబడెను. తరువాత సంభాషణ, మాదినకృత్యములపై మరలెను. జయరాంబటిలో తాముగడపిన కాలమును గురించి ముచ్చటించుచు, ఎల్లప్పుడు నేదో యొకపని చేయుచుండుటవలన మనస్సునకును, శరీరమునకునుగూడ ఆరోగ్యకరముగ నుండునని, మమ్మట్లుపని చేయుచుండుడని అమ్మగారు హితవొసగిరి.

చెడుగులో మంచిని జూచుట

శ్రీ మాత్రుదేవిగారి యింటియెదుటగల గూడెములో, నితరరాష్ట్రములనుండి వచ్చి కూలిచేసి కొని జీవించుచుండిన పాటకపు జనులు కొందఱు కాపురముండిరి. వారిలో నొకని కొక యుంపుడు కత్తెయుండెను, వారిరువురును కలసి కాపురము చేయుచుండిరి. ఆస్త్రీకి ఒక సారి చాలజబ్బుచేసెను. ఆ జబ్బును గురించి చెప్పుచు, ''పాపమా కార్మికు డామె కెంత భక్తితో నుపచారము చేసెను! అట్టిది నేనెన్నడును చూచియుండలేదు. నిజమైన సేవాతత్త్వము నాతడు కనుబఱచెను.'' అని ఆతని శ్రద్ధను శ్రీమాత్రుదేవి మిక్కిలి కొనియాడిరి.

ఉంపుడు కత్తెయనినతోడనే మనము సహ్యించుకొని, తప్పక నిరసనభావమును వెల్లడించియుందుము. ఆహా! చెడుగులో నణగియుండుమంచిని తఱచుగా మనము గుర్తింపలేముగదా!

ఉత్తరదేశమునుండి వచ్చిన యొకబీదస్త్రీ వ్యాధిగ్రస్తమైన తన శిశువును చంకబెట్టుకొని శ్రీమాత్రుదేవికడకువచ్చి యామె యాశీర్వాదమును గోరెను. అమ్మగారాశిశువునుజూచి కనికరించి, త్వరలో వ్యాధికుదురునని దీవించి పూజామందిరములో భగవదర్పితములైన రెండుపెద్దదానిమ్మపండ్లను, ద్రాక్షపండ్లనుదెచ్చి ''ఇవి నీశిశువునకిమ్ము''అని యా స్త్రీ చేతికిచ్చిరి. అమ్మగారి యాధార్మికబుద్ధికి, ఆ స్త్రీ సంతోషపరవశయై, పలుమారామెకు ప్రణమిల్లెను.

1912 సం॥ ఫిబ్రవరి 11-వ తేది.

నేడు నేను శ్రీమాత్రుదేవినిజూచి ప్రణామముచేసి కూర్చుండిన వెంటనే, యామెమిక్కిలి విచారముతో నిట్లు చెప్ప

దొడగిరి: "అయ్యో! గిరీశుడు చనిపోయెను. నేడు నాల్గవదినము. ఆతనిబంధువులువచ్చితమ యింటికి నన్నురమ్మని ఆహ్వానించిరి. కాని యిక నేనాయింటికెట్లు వెళ్లగలను? శ్రీరామకృష్ణులయందు గిరీశునకెంతభక్తి, ఎంతవిశ్వాసము! ఈవిషయము నీవెప్పుడైన వినియుంటివా? తనకు పుత్రుడుగా బుట్టుమని యాతడు శ్రీరామకృష్ణులను గోరెను. 'నీపుత్రుడనుగా జన్మించుటకు నాకగత్యమేమి?' అని శ్రీరామకృష్ణులు ప్రత్యుత్తరమిచ్చిరి. కాని, దుర్గ్రాహ్యములైన భగవంతుని లీల లెవరికి తెలియును? శ్రీరామకృష్ణుల నిర్యాణానాంతరమున గొంతకాలమునకు గిరీశునకొక కొమరుడు కలిగెను. నిజముగా నతడద్భుతబాలుడు! ఆబాలునకు నాలుగేండ్లవయస్సువచ్చినను, అతడెవరితోడను మాటాడడయ్యెను. అతడు చేయుసంజ్ఞలను బట్టియే, జనులాతనిమనస్సులో నున్నదానిని గ్రహించుచుండెడివారు. వాని తల్లిదండ్రులు వానిని శ్రీరామకృష్ణునిగనే భావించుచుండిరి. అతనిదుస్తులను, కంచమునుగిన్నెను, ఇవియవియననేల అతని సర్వవస్తువులను వేఱుగానుంచుచుండిరి. ఇతరు లెవరును వానినుపయోగించుటయే లేదు!

"ఒక నాడాబాలుడు నన్ను జూడవలెనని మిక్కిలి ఆతురత నొందెను. ఆ యింటిలో మేడమీద నా చిత్రపటముండెను. అతడింటిలోని వారినందరిని అచ్చటికి లాగికొనిపోయి ఒక కేక వేసి ఆ చిత్రపటమును వారికి చేతితో జూపెను. మొట్టమొదట బాలుని వైఖరి వారికేమియు అర్థముకాలేదు. పిమ్మట వారాతనిని నాకడకు తోడ్కొనివచ్చిరి. నాలుగేండ్ల పసిబిడ్డడైనను నతడు నాకు సాష్టాంగప్రణామముజేసెను. అటుతరువాత నతడు తన యింటికిబోయి తనతండ్రిని బట్టపట్టుకొని లాగనారంభించెను.

తనతండ్రికూడ నన్ను చూడవలెనని యాతనికోరిక. గిరీశుడు వెక్కి వెక్కి యేడ్చుచు, 'నాయనా! నేను మహాపాపిని! శ్రీమాతృదేవినిచూడలేను!' అని చెప్పెను. కాని, ఆబాలుడు తానుపట్టిన పట్టు విడువనందున, గిరీశుడు లొంగిపోయి, కుమారుని చంక బెట్టుకొని, శరీరమాపాద మస్తకము వణకిపోవుచుండ, చెక్కిళ్లపై కన్నీరు కాల్వలై కారుచుండ నాదగ్గరకువచ్చి 'అమ్మా! ఈ బాలుని ధర్మమాయని, మీ పావనపాదపద్మములను సందర్శింప గలిగితినిగదా!' అని చెప్పుచు నాకు సాష్టాంగ ప్రణామము చేసెను. ఆ బాలుడుమాత్రము నాలుగవయేట నే మృతినొందెను.

"ఈ విషయము జరుగుటకు కొంతకాలముముందు గిరీశుడును, అతనిభార్యయు వారి యింటి మిద్దెపైనుండిరి. నేనప్పుడు బలరామునింటిలో నుంటిని. ఈ రెండును యిరుగుపొరుగిండ్లే. ఆ నాడు నేనుకూడ మిద్దెపైకి వెళ్లితిని. గిరీశుడు తనయింటి మిద్దెమీదనుండి నన్నుచూడగలడని నేనుతలచియుండలేదు. ఇంతలో 'అదిగోచూడుము! ఆయింటిమిద్దెపైన శ్రీమాతృదేవిగారు, విహరించుచున్నారు' అని యాతనితో అతనిభార్యచెప్పెను. వెంటనే గిరీశుడు తనవీపును నావైపునకుద్రిప్పి, 'ఇట్లు శ్రీమాతృదేవిని దొంగతనముగా చూడజాలను, చూడజాలను. నాకన్నులు పాపపుగన్నులు' అని తనభార్యతో జెప్పుచు, మిద్దెపైనుండి చరచర క్రిందికిదిగి వెళ్లెను. నేనీవిషయము నతనిభార్యచెప్పగా వింటిని."

1912 వ సం॥ జూన్ 15 వ తేది.

కొంతమంది భక్తురాండ్రతోగూడ శ్రీమాతృదేవి కూర్చుండియుండిరి. వారిలో కొంతమందిని నే నెఱుగుదును.

అమ్మగారు చాల సంతోషముగానుండిరి. నేను వచ్చినతోడనే మందహాసముతో నన్ను సమ్మానించిరి. నివేదితా సోదరి జీవితమును, శ్రీవివేకానందస్వాములవారి భారతవర్షోపన్యాసములను, ఈ రెండు పుస్తకములును తీసికొనిరమ్మని గౌరీమాయిని నేను కోరియుంటిని. నివేదితాసోదరి జీవితములోనుండి కొంత భాగమును చదువవలెనని నాకోరిక. అమ్మగారిందుకు సమ్మతించి, "నివేదితా జీవితములోనుండి చదువుము. ఈ పుస్తకముయొక్క ప్రతి మొన్ననే నాకుగూడ అందినది. కాని నేనింకను దానినిజదువలేదు." అని చెప్పిరి. అంతమంది యెదుట నే నాపుస్తకమును జదువుటకు సిగ్గుపడితిని. అయినను సరళభాషలరచించిన శ్రీనివేదితా జీవితములోనుండి చదివి వినిపించవలెనని ఆత్రపడుచుంటిని. కనుక, అమ్మగారి యాజ్ఞను శిరసావహించితిని. అమ్మగారును, ఇతర భక్తురాండ్రును అత్యంత శ్రద్ధతో వినుచుండిరి. శ్రీనివేదితా సోదరియొక్క అద్భుతభక్తిని గురించి వినినప్పుడు వారికన్నులు బాష్పపూరితము లయ్యెను. అమ్మగారి చెక్కిళులపై కన్నీరు ప్రవహించుచుండెను. నివేదితనుగురించి చెప్పుచు, "నివేదితకు యెంతగాఢమైనభక్తియుండెను! నాకెట్టియుపచారము నైనను చేయుటకు ఆమెయెల్లప్పుడును సంసిద్ధురాలై యుండెడిది. రాత్రి సమయమున తఱచుగ నామె నన్ను చూచుటకు వచ్చుచుండును. దీపపుకాంతి నాకనులకు మిక్కిలి తీక్ష్ణముగనుండుటను గనిపెట్టి దానికి యామె కాగితమును తొడుగును. ఆమె నాకు సాష్టాంగ ప్రణామముచేసి, మిక్కిలి భక్తితో నాపాదధూళిని తనచేతు మాలుతో ప్రేమమీరతీసికొనును. నాపాదములను స్పృశించుటకు గూడనామెసందేహించుచుండినట్లు నాకుతోచినది." అని అమ్మ

గారు సెలవిచ్చిరి. నివేదితను గురించి తలంచుటతోడనే యామె మానసమున్నత పథములందు విహరింపజొచ్చెను. ఆమెముఖ వైఖరి, హఠాత్తుగా గాంభీర్యమును దాల్చెను.

అచ్చటనుండినవారు నివేదితాసోదరితో తమకుగల పరిచయమును గురించి చెప్పదొడగిరి. "ఆమె అకాలమరణమునకు లోనగుట హిందూదేశముయొక్క దురదృష్టము" అని దుర్గాదేవి చెప్పెను. "ఆమె హిందూదేశమునే తన జన్మభూమిగా భావించెను. ఆమెయే, పలుసారు లిట్లు చెప్పియుండెను. సరస్వతీ పూజా దినమున హోమకుండమునందలి పవిత్ర భస్మమును నుదుటతిలకముగా నుంచికొని, పాదరక్షలు లేకుండగనే యామెనడచుచుండెడిది." అని మరియొక యామె నుడివెను. "సోదరిజీవితము" నుండి నేను చదువుచుండినప్పుడు అమ్మగారా మెయెడల తమకుగల భావముల నప్పుడప్పుడు వెల్లడించుచు చిట్టచివరకు, "నిష్కపటమైన భక్తిగలవారు భగవంతునకు మిక్కిలి ప్రియులు; కావుననే మన అంతరాత్మకు వారియం దభిమానము" అని చెప్పిరి.

సాయంకాల పూజకు వేళయైనది. అమ్మగారు వేలువస్త్రులను ధరించి, శ్రీరామకృష్ణుని ప్రతిమకెదుట చిత్రాసనముపై గూర్చుండిరి. ప్రతిమ నలంకరించుటకై ఆమెయే కొన్ని పూలదండలను గ్రుచ్చియుంచిరి. రాసవిహారియను నొక బ్రహ్మచారి ఆదండలకు దగ్గరగా నైవేద్యమునకై కొన్ని మధుర పదార్థములనుంచెను. ఆ భక్ష్యములకు చీమలు పట్టినవి. దండలలోనికిగూడ కొన్నిచీమలు ప్రాకినవి. అమ్మగారు నవ్వుచు "అమ్మా! రాసవిహారి యేమిచేసెనో చూడుము! శ్రీరామకృష్ణులను ఈ చీమలు కుట్టును." అని చెప్పుచు చీమలను దులిపి

ప్రేమమీర పూలహారములతో ప్రతిమ నలంకరించిరి. ఇతరుల సమక్షమున నామె భర్తను పూలతో నలంకరించుటను జూచి ఆమె వదినెగారు * నవ్వెను. పిమ్మట ప్రసాద మందరికిని పంచి పెట్టిరి.

బాలికల విద్యా, వివాహములు

''అమ్మా! నాకు అయిదుగురు కుమార్తెలు. వారికి తగిన వరులు దొరుకుట లేదు. దీనివలన నాకెంతో ఆందోళనగా నున్నది.'' అని ఒక భక్తురాలు నుడివెను.

అమ్మగారు: వారి పెండ్లివిషయమై మీ కేల యీచింత? వారికి తగినవరులు మీకు దొరకనిచో, నివేదితా సోదరీ బాలికా పాఠశాలకు వారినిపంపి వారికి విద్య నేర్పింపుడు. పాఠశాలలో వారు హాయిగానుందురు.

మఱియొక భక్తురాలు: శ్రీ మాతృదేవియందు మీకు నమ్మకమున్నయెడల, ఆమె చెప్పినట్లుచేయుడు. అందువలన మీకు శుభముకలుగును. ఆమెమాట మీరు వినినచో మీ కెట్టి మనోవ్యథయు నుండదు.

కాని, ఈ యయిదుగురు కూతుళ్ల తల్లికి అమ్మగారి హితోపదేశ మెంతమాత్రము నచ్చలేదని వేఱుగ చెప్ప నక్కర లేదు.

మూడవ భక్తురాలు: ఈ కాలములో తగిన వరులు

* ఈ ప్రసంగములలో నెక్కువగా వచ్చుచుండు శ్రీ మాతృదేవి పిచ్చి వదినెయును, రాధుతల్లియు నైన యీమెయు దంతమంతయు శ్రీమాతృదేవి జీవితకథా భాగములో కలదు.

లభించుట బహు కష్టము. చాలమంది బాలురు పెండ్లిచేసికొనుట కిష్టపడుట లేదు.

అమ్మగారు : ఔను. బాలురు వివేచనచేయ నేర్చుకొనుచున్నారు. ప్రాపంచిక సౌఖ్య మనిత్యమని వారు క్రమక్రమముగా గ్రహించుచున్నారు. ప్రపంచమందు సక్తత మీకెంత తక్కువగానుండునో, మనశ్శాంతి మీకంత యెక్కువగా నుండును.

ఆ రాత్రి నేను శ్రీమాతృదేవికడ సెలవుదీసికొని యింటికి తిరిగి వెళ్లుసరికి చాల నాలస్యమైనది.

మఱియొకనాడు నేను బాగ్ బజారుకు వెళ్లినప్పుడు, శ్రీ మాతృదేవి మధ్యాహ్నపు టల్పాహారమైన తరువాత పండుకొని యుండిరి. నన్ను వీవనతో విసరుమనిరి. నాయందింత యనుగ్రహము కలిగెనుగదాయని నేను చాల సంతసించుచు, అమ్మగారికి విసరుచుంటిని. హఠాత్తుగా "మీరందరు నిచ్చటకు వచ్చుచున్నారు. బాగుగనేయున్నది కాని, శ్రీ రామకృష్ణులవారేరి?" అని యామె తమలోతాము మాట్లాడిరి. "మేమీ జన్మలో నాయనను చూడ లేకపోతిమి. ఇక నెన్ని జన్మములకు మే మాయనను చూడకలుగుదుమో కదా! అయినను మీ పావన పాదపద్మములను సేవించు మహాభాగ్యము మాకు కలిగినది!" అని నేను బదులుచెప్పితిని. "అది నిజమే!" అని శ్రీ మాతృదేవి ఆనతిచ్చిరి. అంగీకార సూచకమైన యీ మాటను విని కొంచెమాశ్చర్యపడితిని. తమ్ముగూర్చి అమ్మగారెన్నడో కాని యిట్లు ప్రసంగించువారుకారు.

శ్రీ మాతృదేవియందు నమ్మకముంచి, కొంతమంది తమ రహస్యముల నామెకు వెల్లడించుచుందురను విషయమును

నే నా కాలమున నా తెలివితక్కువచే గ్రహింపలేక పోతిని. ఈ కారణమువలన, నేను వచ్చినతోడనే అమ్మగారు తమగదిలో లేనియెడల, ఆమె కొరకై యింటినంతయు గాలించుచుందును. అమ్మ వచ్చువరకు కనిపెట్టుకొని యుండగల ఓపిక నాకులేదు. ఒకనాటి సాయంకాలమున నామె గదికి నుత్తరపువైపుననున్న వసారాలో సౌందర్యవతులైన యువతు లిరువురు అమ్మగారితో నేదో రహస్యముగా సంభాషించుచుండిరి. ఇంటిలో నామె యింకెక్కడను కనుపడకపోవుటచే, నే నకస్మాత్తుగా వారి మధ్యకు వెళ్లి నిలుచుంటిని. అమ్మగారప్పుడు వారితో "మీమనస్సులో నున్న కష్టములనెల్ల శ్రీ రామకృష్ణులకు విన్నవింపుడు. కన్నీటితో మీ క్లేశముల నాయనకు దెలుపుడు. ఆయన దయవలన మీకోరిక లీడేరునని మీకే విశదమగును." అని చెప్పుచుండిరి. ఆ స్త్రీలు సంతానమునకై ప్రార్థించుచుండిరని వెంటనే నేను గ్రహింపగలిగితిని. నన్నుచూచి వారు సిగ్గుపడిరి. అంతకంటె నయోమయముగా నుండెను నామనస్సు. కాని ఆనాడు నే నొక గొప్ప గుణపాఠమును నేర్చుకొంటిని. నేను వచ్చినసంగతిని ముందుగా తెలుపకుండ, శ్రీ మాతృదేవి సమక్షమునకు మరల నెన్నటికిని పోగూడదని యానాడు ప్రతిజ్ఞ చేసికొంటిని. కొలది నెలలైన తరువాత ఆస్త్రీల నిరువురను శ్రీ మాతృదేవియింటిలో తిరిగి నేను చూచినప్పుడు త్వరలో వారి మనోరథము ఫలింప నుండెనని తెలిసికొని, సంతోషించితిని.

గౌరీమాయి అప్పుడచ్చట నుండెను. మా కోరికపై నామె శ్రీరామకృష్ణులవారిని గురించి ముచ్చటించుచు, "చాలమంది భక్తులు రాకమునుపే శ్రీరామకృష్ణుని నేను సందర్శించితిని.

అప్పటికి నరేంద్రుడును, కాళియునుగూడ చాల చిన్నవారు'' అని చెప్పెను. అంతలో సాయంకాలమైనది. సంభాషణను త్వరలో ముగించితిమి. గౌరీమాయి శ్రీ మాతృదేవికడ సెలవుతీసుకొని వెళ్లెను. నేనుకూడ వెళ్లవలసి వచ్చెను. నేను సెలవుతీసుకొన బోవుచుండునప్పుడు అమ్మగారు నన్ను వసారకడకు బిలిచి ప్రసాదము నిచ్చుచు. ''నీవు మరల రావలెను సుమా! ఎప్పుడు వచ్చినను, చాలసేపు నీవిచ్చట నుండుటలేదు. ఈ సారి యుదయముననే వచ్చి, మధ్యాహ్నము మాతోకూడ నీవు ప్రసాదము తీసికొనవలయును.'' అని చెప్పిరి.

1912-వ సం. సెప్టెంబరు 8.

గౌరీమాయి బాలికా పాఠశాలలో నేను పని చేయుచుండి నందువలన, నా యిష్టప్రకారము శ్రీ మాతృదేవిని దర్శింప నాకు వీలులేక పోయినది. ఒక నాటి యుదయముననే వారి యింటికి వచ్చితిని. అది నాకెంతో సుదినము. అమ్మగారప్పుడు స్నానమునకై గంగానదికిపోవ నుద్యమించుచుండిరి. నన్ను చూచిన తోడనే సంతోషముతో ''నీవీనాడు వచ్చుట నాకు చాల ఆనందముగా నున్నది. నేడు రాధిక పుట్టినదినము. నేను తిరిగి వచ్చువరకు నిచ్చటనే యుండుము.'' అని చెప్పిరి. నేనుకూడ వచ్చెదనని చెప్పితిని. అమ్మగారందుకు సమ్మతించిరి. కాని అప్పుడు చినుకులు పడుచుండినందున, గోలప్ మాయి వానలో వెళ్లవలదని నన్ను తీవ్రముగా వారించెను. అమ్మగారుకూడ గోలప్ మాయి పక్షము వహించి తాము శీఘ్రముగా తిరిగి వచ్చెదమనియు, అంతవరకు నన్నచ్చట నుండుమనియు చెప్పిరి. శ్రీ మాతృదేవి తలచుగా సాదుస్వభావయగు నొక చిన్న

పిల్లవలె వర్తించుచుందురు. తమ యభిప్రాయముల నితరు లామోదింపవలయునని యెన్నడును ఆమె హఠము చేయువారుకారు. ఆమె వీథిలోనికి వచ్చినతోడనే వానగూడ వెలసెను. స్నానము చేసిన తరువాత తిరిగి యింటికివచ్చి, "నేను వీథిలోనికి వచ్చినతోడనే వర్షమాగిపోయెను. నీవుకూడ నాతో రాగోరితివి. నేనును నీవు వచ్చినచో బాగుండునని తలచితిని. శ్రీ గంగాదేవిని దర్శించి యుందువు." అని అమ్మగారు చెప్పిరి. నిజము చెప్పవలసినచో గంగాదర్శనముకంటె శ్రీ మాతృదేవి పావన సహవాసమే నే నెక్కువగా నభిలషించితిని. ఐహికములగు వేనవేలు పనులలో నెల్లప్పుడు మునిగి తేలుచుండు మావంటివారికి అమ్మగారిని సందర్శించుట కెప్పుడో కాని తీరికయే కలుగదు. భాగ్యవశమున మేమామె కడకు రాగలిగిననాడు, నిముషమైన నామె సమక్షమును విడనాడుటకు మాకు మనసొప్పదు. శ్రీ మాతృదేవి మాటలను వినుచుండిన గోలప్‌మాయి, "ఈమె గంగానదిని చూడకున్ననేమి? మీ పావన పాదస్పర్శ మాత్రమున సర్వాభీష్టములు లభించును." అని నుడివెను. ఆమె చెప్పునది నిజమేయని అంగీకారసూచకముగా నేనును తల నూపితినికాని, అమ్మగారుమాత్రము, "అట్లనవలదు! ఎన్ని చెప్పినను, శ్రీ గంగాభవానియేకదా పరమపావని!" అని గంగను స్తుతించిరి. తమ దివ్యోన్నతిని మాటలలో గాని పనులలోగాని సాధారణముగా నెన్నడును వెల్లడిచేయక అందరివలె తాముకూడ నొక సామాన్య మానవవ్యక్తియే యని జను లనుకొను రీతినే శ్రీ మాతృదేవి యెల్లప్పుడును వర్తించుచుందురు. కాని మిక్కిలి యరుదుగా పుణ్యాత్ములైన కొంతమంది భక్తులపై తమ యవ్యాజ దయామృతమును కురిపించి, అమ్మ

గారు వారికి తమ దివ్యస్వరూపమును వెల్లడించి యుండుటకూడ నిజము. ఆమె గదిలోనికివచ్చి పరుపుపై -బరుండి నన్నుజూచి "చూచితివా! గంగానదిలో స్నానముచేసి వచ్చితిని!" అని హెచ్చరించిరి. తమ పాదపద్మముల నారాధింపనలయునని నా మానస మాత్ర పడుచుండెనని అమ్మ తెలిసికొనినట్లు నా కప్పుడు విశదమైనది. "నిత్య పవిత్రవతీ! తల్లీ! పావనమగుటకు గంగలో స్నానముచేయుట మీ కనావశ్యకము," అని తలపోయుచు పూవులతోడను, గంధముతోడను నే నామె పాదములకడ గూర్చుంటిని. "తులసీ దళములను మాత్రము వేయకుము." అని అమ్మగారు చెప్పిరి. పూవులతోడను, గంధముతోడను శ్రీ మాతృదేవి పాదములను పూజించి ప్రణామము చేసితిని. తరువాత అమ్మగారు భోజనమునకు గూర్చుండిరి. నన్నుకూడ ప్రక్కను గూర్చుండబెట్టుకొని తాము భుజించుచుండిన ప్రతిపదార్థమును అపార ప్రేమతో సగము నాకీయ మొదలిడిరి. మహానందముతో నే నా ప్రసాదమును నా విస్తరిలో భుజించుచుండగా నాగమహాశయుడు నాకు జ్ఞప్తికివచ్చి, "ఈ విస్తరి తఱచుగా నాగమహాశయుని నా తలపునకు దెచ్చును." అని అమ్మగారితో నంటిని.

అమ్మగారు: అతని భక్తి యెంత అద్భుతమైనది! ఎండిపోయిన యీ విస్తరాకును చూడుము. దీనినెవరు తినగలరు. కాని, యతనిభక్తి మేర లేని మహాసముద్రము వంటిది. ప్రసాద మంటుకొనిన ఆకు నతడు మ్రింగివైచెను. ఆహా! అతని కన్నులెంత ప్రేమరసభరితములు! అవి ఎల్లప్పుడు కెంపులవలె నెఱ్ఱబారి బాష్పపూరితములై యుండెడివి. ఆతని దేహము కఠిన తపస్సుచే శుష్కించెను. అతడు నన్ను చూచుటకు వచ్చుచుం

డును. నన్ను చూచిన తోడనే భక్తి పరవశుడై, శరీరమం
తయు కంపింప మెట్లెక్కలేకుండును. తూలుచు నడచును.
అట్టి భక్తినితరులయం దెచ్చటను నేనెన్నడును చూచి
యుండలేదు.

భక్తురాలు: తన వైద్యవృత్తిని వదిలిపెట్టి అహోరాత్రము
లతడు శ్రీరామకృష్ణులవారిని ధ్యానించుచు తన్మయుడై యుండు
వాడని నేనాతని జీవిత చరిత్రలో చదివియుంటిని. అతని తండ్రి
యొకనాడు కోపముతో "ప్రపంచము నెడల నీవింత నిర్లక్ష్యముగా
నున్నావు. నీ గతి యేమగునో కదా? నీకు కట్టుకొనుటకు గుడ్డ
పేలికకూడ నుండదు! ఆకలి తీర్చుకొనుటకు కప్పలను తినెదవు!"
అని మందలించెను. వారి యింటిముందు వాకిటిలో నొకచచ్చిన
కప్ప యుండెను. నాగమహాశయుడు తన యొంటిపైనున్న బట్టను
దీసి పారవైచి, ఆ కప్పనుదిని, "నీ మాటలను యిప్పుడే సార్థక
పరచితిని. నా అన్న వస్త్రములను గురించిన ఆందోళననెల్ల నీ
వింక విడనాడి, భగవంతునిపై మనస్సును మరల్పుము." అని
తన తండ్రితో జెప్పెను.

అమ్మగారు: తండ్రియందతని కెంతభక్తి! పవిత్రా
పవిత్రతలకట్టి భేదము నతడు పాటింపకుండెను. దీనిని బట్టి ఆతని
యున్నతాధ్యాత్మిక వికాసము తెలియగలదు.

భక్తురాలు: అతడొకసారి యొక పర్వదినమున కలకత్తా
నుండి యింటికి వచ్చెను. అతని తండ్రి "గంగానదికి దగ్గరగా
కలకత్తాలో నుంటివి. ఇట్టి పర్వదినమున గంగను విడిచి యింటికి
వచ్చిన నీవెంత యవివేకివి! నీవు కలకత్తాలోనే యుండి ఆ పవిత్ర
నదిలో స్నానముచేసి యుండవలసినది." అని యతనిని మంద

లించెను. కాని యానాటి పుణ్యకాలమున వారి యింటిముందు వాకిటిలో నొకచోటునుండి నీటిధార పైకెగజిమ్ముచుండుటను అచ్చటి జనులందరును చూచిరి. వాకిలియంతయు నీటితో నిండి పోయెను. నాగమహాశయుడు పరమానంద భరితుడై "తల్లీ! గంగాభవానీ! రా! రా!" అని పిచ్చివానివలె కేకలు వేయుచు ఆ నీటిని తలపై చల్లుకొనెను. ఆ యూరిజను లానీటిలో స్నానముచేసి గంగానదిలో స్నానముచేసినట్లే తృప్తిపడిరి.

అమ్మగారు : నిజము. ఎంత అసాధ్యవిషయమైనను భక్తి వలన సాధ్యమగును. ఒకసారి నేనతనికి ఒక వస్త్రమిచ్చితిని. అతడు దాని నెల్లప్పుడును తలకు చుట్టుకొనియుండెడువాడు. ఆతని భార్యకూడ చాలమంచిది, పతివ్రత. వేసవికాలములో మొన్న నన్నామె చూడవచ్చెను. ఆమె యింకను బాగున్నది.

ఈ సమయమున కొంతమంది భక్తురాండ్రు వచ్చిరి. ప్రసంగ మాపివేయబడెను. వారు శ్రీ మాతృదేవికి ప్రణామము చేసిరి. కొన్ని తమలపాకుల కిల్లీలను కట్టుమని అమ్మగారు పిమ్మట నాతో చెప్పిరి. నేను రెండు కిల్లీలను కట్టియిచ్చితిని. అందొకటి తాము వేసికొని, రెండవది నాకిచ్చిరి. మిగిలినయాకులనుగూడ కిల్లీలుగా కట్టుటకు నేను వెళ్లితిని. కొంతతడవైన తరువాత, అమ్మగారిరువురు భక్తురాండ్రతో మాగదిలోనికి వచ్చిరి. వారు నాకు సాయపడినందున, పని చాల త్వరితముగా ముగిసెను. భగవంతున కర్పించుటకై అమ్మగారు కొన్ని యాకులను తీసి వేఱుగానుంచిరి. ఆమె మిక్కిలి సంతసించుచు, "నా తల్లులు తమ పనిని చాల త్వరితముగా ముగించిరి." అని చెప్పిరి.

శ్రీ మాతృదేవి, ఆయింటి రెండవయంతస్తులోనున్న గోలపెమాయి గదిలోనికి వెళ్లిరి. కొలదినిముషములైన తరువాత నే నచ్చటికి వెళ్లితిని. అమ్మగారు గదిగుమ్మపు గడపపై తలను పెట్టుకొని నేలపై బరుండిరి. అందుచే, గడపదాటి గదిలోనికి పోవుటకు సంకోచించుచుంటిని. అమ్మగారు నన్నుచూచి గడపమీాదనుండి తలను కొంచెమెత్తి "ఇప్పుడు తప్పులేదు లోనికిరా!" అని చెప్పిరి. నేను గదిలోనికివెళ్లి, ఆమె ప్రక్కను గూర్చుండి, యామెకు విసనకర్రతో విసరుచుంటిని. గౌరీమాయి పాఠశాలనుగురించి అనేక విషయము లమ్మగారు నన్నడిగిరి. నేను సరియైన సమాధానములు చెప్పితిని. పైన పేర్కొనిన భక్తురాండ్రిరువురును అచ్చటికి వచ్చిరి. వారిలో నొకయామె అమ్మగారికి తలదువ్వెను. ఆమె యొకటిరెండు తెల్లని వెండ్రుకలను అమ్మగారి తలలోనుండి తీసి బట్టకొంగున కట్టుకొని, "నేను వీనిని స్మారకచిహ్నములనుగా దాచికొందును." అని చెప్పెను. అమ్మగారు సిగ్గుపడి, సంకోచముతో "ఎందుకిట్లు చేయుచున్నావు? ఇంతకుముందు నా తలవెండ్రుక లెన్నియో పారవైచితిని." అని చెప్పిరి. పిమ్మట యెండలో కూర్చుండుటకు అమ్మగారు మిద్దెపైకి వెళ్లిరి. మేముకూడ నామెవెంట వెళ్లితిమి. అచ్చట బట్టలెన్నియో ఆరవేయబడియుండెను. వానిని గదిలోనికి దీసికొని పొమ్మని అమ్మగారు నాతో చెప్పిరి.

అర్చనయైన తరువాత భక్తురాండ్ర మధ్యాహ్నభోజనమునకు గావలసిన సన్నాహము చేయుమని శ్రీ మాతృదేవి నాకాన తిచ్చిరి. మేమందరమును గలసి భోజనమునకు గూర్చుంటిమి. అమ్మగా రొకటిరెండు కబళములను భుజించిరి. పైనజెప్పిన

భక్తురాండ్రిరువురును మాతో నుండిరి. వారిలో నొకయామె ముదుసలియును, సుమంగలియును. ఆమె శ్రీరామకృష్ణులవారిని జూచియుండెను. రెండవస్త్రీ యామె కోడలు.

"శ్రీ రామకృష్ణులవారు మాకెన్నియో హితోపదేశములను చేసిరి. కాని మేము వానిని చాలవరకు అనుసరింపలేదు. ఆయన చెప్పినట్లే మేము చేసియుండినయెడల మేమీ ప్రపంచమున నింత కష్టపడియుండెడివారము కాము. ఐహిక విషయాసక్తులమై ఎల్లప్పుడు నేదియో పనిని బెట్టుకొని ప్రాకులాడుచుంటిమి." అని యావృద్ధస్త్రీ చెప్పెను.

"ఎల్లరు నేదోయొక పనిని చేయుచుండవలెను. కర్మబంధము కర్మమును చేయుటచేతనే తొలగవలెను; కర్మమును తప్పించుకొనుటచే మనము దానినుండి ముక్తులము కాలేము, పరిపూర్ణమైన విరక్తి, తరువాత వచ్చును. పనిలేకుండ నొక క్షణముకూడ నెవరునుండరాదు." అని అమ్మగారు బదులుచెప్పిరి.

భోజనమైన తరువాత అమ్మగారు కొంచెము విశ్రాంతి గైకొనుటకై పరుపుపై బరుండిరి. భక్తురాండ్రందరును ఆమెకేమైన సేవను స్వయముగా చేయవలెనని కుతూహలపడుచుండిరి. కాని యామె వారినందరినిగూడ విశ్రమింపగోరినందున, వారెల్లరు తమతమ పనులను జేసికొనుటకు వారి నివాసస్థలములకు వెళ్లిరి. నేనును, శ్రీరామకృష్ణుని సమకాలీనురాలైన యొక వృద్ధవితంతువును మాత్రముంటిమి. నేను అమ్మగారికి ఒళ్లు పట్టుచుంటిని. వితంతువామెప్రక్కను గూర్చుండి, తనసాంసారిక జీవితమునకు సంబంధించిన వేర్వేఱు సంఘటనలను దెలుపుచు, "అమ్మా! నాలోపములను మీరెల్లప్పుడు క్షమించుచుందురు.

గాని, నాబంధువులు మాత్రము నాయెడల మిక్కిలి కఠినముగా ప్రవర్తింతురు.'' అని చెప్పెను. ''శ్రీరామకృష్ణుని మీరు చూచి యుంటిరా?'' అని నేనామెనడిగితిని. ''ఔనమ్మా! నేనాయనను చూచితిని. మా యింటికాయన తఱచుగా వచ్చుచుండెడివారు. అప్పటికి శ్రీమాతృదేవి చాలచిన్నది.'' అని యామె బదులు చెప్పెను.

భక్తురాలు: శ్రీరామకృష్ణులవారిని గురించి యేమైన మాకు సెలవిండు.

వితంతువు: నన్ను కాదు; ఆయననుగూర్చి యేమైన మనకు దెలుపుడని అమ్మగారి నడుగుము.

శ్రీరామకృష్ణులవారి జీవిత విశేషాంశములు

అమ్మగారు కనులుమూసికొని విశ్రమించుచుండుటచే నేనామెనడుగ లేదు. కొంత సేపటికి అమ్మగారే యిట్లు చెప్పిరి: ''హృదయపూర్వకముగా ప్రార్థించువారికి భగవంతుడు ప్రత్యక్షమగును. ఇటీవలనే మా భక్తులలో నొకడగు తేజచంద్రుడు మరణించెను. అతడెంత పరిశుద్ధాత్ముడు! శ్రీరామకృష్ణులవారు తఱచుగా నాతనియింటికి వెళ్లుచుండిరి. ఆతనియొద్ద నెవరో రూ. 200 ల నుంచిరి. ఒక నాడతడు ట్రాము బండిలో వెళ్లుచుండగా నెవరో యా పైకమును తస్కరించిరి. కొంతసేపైనతరువాత సొమ్ముపోయినట్లాతడు గ్రహించి, చెప్పనలవికాని మనోవ్యథతో గంగాతీరమునకు వచ్చి, కనులనీరు నించి, ''ఓ ప్రభూ! నా విషయమున నీవేమిపని చేసితివి!'' అని శ్రీరామకృష్ణులవారిని ప్రార్థించెను. ఆ పైకము నచ్చుకొనునంత భాగ్యశాలి కాడతడు. ఇట్లాతడు విలపించుచుండగా

శ్రీ రామకృష్ణుల వారాతనియెదుట ప్రత్యక్షమై "ఎందుకు నీవట్లేడ్చెదవు? గంగయొడ్డున నదిగో ఆయిటుక క్రింద పైక మున్నది. చూడుము." అని చెప్పిరి. అతడా యిటుకను పైకెత్తిచూడగా, అచ్చట నిజముగా బ్యాంకినోట్లకట్టయతనికి దొరికెను. అతడీవిషయమును శరత్తుకు (శ్రీశారదానంద స్వామికి) తెలిపెను. "నేడుకూడ నీకు శ్రీరామకృష్ణుని దర్శనము దొరికెను. నీవు చాల ధన్యుడవు. కాని మాకాయన కనుపడరు." అని శరత్తు చెప్పెను. వారాయననింకను చూచుటెం దుకు? ఆయన సాన్నిధ్యభాగ్యమును తనివితీర వారనుభవించిరి. వారి యభీప్సితములెల్ల నెరవేరినవి. తమ స్థూలనేత్రములతో శ్రీ గురుమహారాజును దర్శించియుండని వారాయనసందర్శన మునకై చాల నాత్రపడుచురు. అప్పుడు శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరములో నివసించుచుండిరి. రాఖల్ మొదలగు భక్తు లప్పటికి మిక్కిలి చిన్నవారు. ఒకనాడు రాఖల్ (బ్రహ్మానంద స్వామి) శ్రీరామకృష్ణులకడకువచ్చి తనకు చాల ఆకలిగానుండె నని చెప్పెను. శ్రీరామకృష్ణులు గంగానది దగ్గరకువచ్చి 'ఓగౌరి దాసీ! ఇక్కడకు రమ్ము. నా రఖల్ ఆకలితో బాధపడు చున్నాడు.' అని అరచిరి. అప్పుడు దక్షిణేశ్వరములో తినుబం డారముల యంగడిలేదు. కొంతసేపైన తరువాత గంగమీదుగా నొకపడవవచ్చునుండినట్లు కనుపడెను. అది దేవాలయసమీపము ననే యాగెను. ఆపడవలోనుండి కొన్ని తియ్యనిభక్ష్యములతో కూడ బలరాంబాబు, గౌరీదాసి, మొదలగు కొంతమంది భక్తులు దిగిరి. శ్రీరామకృష్ణులెంతో సంతోషించి, రాఖల్‌ను దగ్గరగా పిలిచిరి. 'ఇటురమ్ము, ఇక్కడ భక్ష్యములున్నవి. నీకు ఆకలిగా

నున్నదంటివి.' అని ఆయనచెప్పెను. రాఖల్‌కు కోపమువచ్చి, 'నా యాకలిని మీరెందుకు చాటించుచున్నారు?' అని ఉటంకించెను. 'అయినను ప్రమాదమేమి? నీకు ఆకలిగానున్నది. తినుటకేదైన కావలసియుండెను. ఆవిషయమై మాట్లాడుటలో దోషమేమున్నది?' అని శ్రీరామకృష్ణులు చెప్పిరి. శ్రీరామకృష్ణులది కాపట్య మెంతమాత్ర మెఱుగని శిశుస్వభావము.''

ఇంతలో శ్రీమాతృదేవి మేనల్లుడు భూదేవుడు పాఠశాలనుండి యింటికి తిరిగివచ్చెను. అతనికి జ్వరము తగిలినది. శ్రీమాతృదేవి యాతనికొక శయ్య నమర్పుమని నా కానతిచ్చిరి. ఆమె బలరాంబాబుగారి యింటికి బయలుదేరుచుండిరి. ఆతని కుమారుడు రక్తగ్రహణితో బాధపడుచుండెను. సాయంకాల పూజను పూర్తిచేసి అమ్మగారు నాకు కొంచెము ప్రసాద మీయబోయిరి; ప్రసాదమును తరువాతభుజింతునని చెప్పిన పిమ్మట, తమ మేనకోడలగు నళినిని ఆప్రసాదమును కొంతసేపైన తరువాత నాకీయుమని చెప్పిరి. ఇంతలో బండివచ్చినది. తాము తిరిగి వచ్చువరకు నచ్చటనే యుండుమని నాతో జెప్పి అమ్మగారు గోలప్‌మాయితోగూడ బయలుదేరి వెళ్లి, మరలనొకగంటయైన తరువాత వచ్చిరి. శ్రీమాతృదేవి నన్ను చూచి సంతోషముతో ''నీకొరకే నేను త్వరగావచ్చితిని. ప్రసాదము తింటివికాదా?'' అని అడిగిరి. తినలేదని నేను చెప్పగా ''నళినీ! నీవీ మెకుప్రసాద మెందుకీయలేదు? ఇమ్మని నీతోచెప్పితినే.'' అని అమ్మగారు సెలవిచ్చిరి.

నళిని: ఇచ్చుటకు నేను మఱచి పోతిని. ఇప్పుడు తీసుకొని వచ్చెదను.

అమ్మగారు : ఆ శ్రమ యింక నీకక్కరలేదు, నేనే యిచ్చెదనులే. (నాతో) ప్రసాదము నిమ్మని నీవెందుకడుగలేదు? ఇది నీ సొంత యిల్లే.

భక్తురాలు : నాకంత ఆకలిలేదు. ఆకలియే యుండినచో ప్రసాదమిమ్మని యడిగియే యుందును.

కొంచెము సేపైనతరువాత పూజామందిరములో నైవేద్యము చేయబడిన తీయని భక్ష్యములను దెచ్చి, అమ్మగారు నా కిచ్చిరి. ఎంతో ప్రీతితో వానిని భుజించి అమ్మగారికి సాష్టాంగ ప్రణామముచేసి, యింటికిబోవ సెలవడిగితిని. "మా అమ్మా! దుర్గా! దుర్గా! నీవు మరల రావలెనుసుమా! నీతోకూడ క్రిందియంతస్థునకు నేనుకూడ వత్తునా? రాత్రియైనది; నీవొకతైవు వెళ్లగలవా?" అని యామె చెప్పెను. "అమ్మా, నేనొక్కతైనే వెళ్లగలను." అని నేను బదులుచెప్పితిని. అయినను నామె భగవన్నామమును పదేపదే యుచ్చరించుచు నాతోగూడ మేడమెట్లవరకువచ్చిరి. "అమ్మా! మీరింక శ్రమతీసికొననక్కర లేదు. ఇటుపైని దారి సులభముగనే తెలిసికొనగలను." అని చెప్పి యింటికి వెడలితిని.

నా డక్షయ తృతీయ—హిందువులకు చాల సుదినము. ఆ నాడు నేను శ్రీమాతృదేవిని సందర్శింప వచ్చితిని. ఇంతకు పూర్వము పేర్కొనిన వృద్ధస్త్రీయు, నామె కోడలు నచ్చట నుండిరి. అట్టి పవిత్ర సమయములం దాచారప్రకారము కొన్ని పండ్లను, పవిత్రసూత్రమును ఆ వృద్ధస్త్రీ అమ్మగారికి సమర్పింప బోయెను. ఆమెను వారించి "వీనిని నా కెందు కిచ్చెదవు? వీనిని భూదేవునకిమ్ము." అని అమ్మగారు చెప్పిరి. పిమ్మట ప్రసంగ

వశమున శ్రీ మాతృదేవి మా వైపుజూచి, "ఈ జన్మలోనే మీకు ముక్తి చేకూరునుగాక యని నేనీ పుణ్యదినమున మిమ్మాశీర్వదించుచున్నాను. జననమరణములు మిక్కిలి దుఃఖకరములు. వానిబాధ మీకెన్నటికి నింక లేకుండుగాక!" అని యవ్యాజ దయతో బలికిరి.

అది పవిత్ర రథయాత్రా* దినము. ఉదయ మేడుగంటలకు గౌరీమాయి ఆశ్రమమునకు వెళ్లితిని. ఆమె నన్ను మధ్యాహ్నమచ్చట భోజనమునకు బిలిచినది. పాఠశాలనుండి శీఘ్రముగా శ్రీ మాతృదేవికడకు వచ్చుటకు నే నెంత కుతూహల పడినను, అవకాశము దొరకలేదు. మధ్యాహ్నము రెండుగంటలకు గౌరీమాయియు, నేనును భోజనముచేసి శ్రీ మాతృదేవి యింటికి వచ్చునప్పటికి సాయంకాలము నాలుగు గంటల వేళ యైనది. అమ్మగారు పూజామందిరములో సాయంకాల పూజచేయుచుండిరి. మేమామెకు ప్రణామముచేసిన తరువాత గౌరీమాయి యామెను ప్రక్కకు బిలిచి రహస్యముగా నేమియో చెవిలో చెప్పెను. తరువాత వారు నన్నుకూడ రమ్మనిరి. అమ్మగారికొఱకు నేను తెచ్చిన పట్టుచీరను ఆమె పాదముల దగ్గరనుంచి "అమ్మా! దయయుంచి మీరు దీనిని ధరింపుడు." అని చెప్పితిని. "ఆ! తప్పక ధరించెదను తల్లీ!" అని అమ్మగారు నవ్వుచు చెప్పిరి. అదే సమయమున కొంతమంది పురుషులు, అమ్మగారి భక్తులువచ్చి యామెకు సాష్టాంగప్రణామము చేసిరి. అంతట మేము వసారాలోనికి వెళ్లితిమి. ఒక భక్తుడు తాను తెచ్చిన గన్నేరుపువ్వులను గులాబిపువ్వులను మల్లె

---

* ఈ పావన హైందవ పర్వదినమున శ్రీ జగన్నాథములోని విష్ణుమూర్తిని రథములో బెట్టి ఊరేగింతురు.

పూల దండను తియ్యని పదార్థములను అమ్మగారి పాదముల కడ నుంచి, యామెను ఆరాధింప మొదలుపెట్టెను. దివ్యానందముతో నొడలెల్ల పులకరించు మహాద్భుత దృశ్యమది! ఆ లౌకిక సౌంద ర్యామృతమొలుకు మందహాసము మోమున చిందులాడ, శ్రీ మాతృదేవి ప్రశాంతముగా గూర్చుండిరి. మెడలో మల్లెపూల దండ వ్రేలాడుచుండెను. పూవులు పాదముల నలంకరించు చుండెను. ఆరాధనమైన తరువాత భక్తుడు ప్రతి ఫలమునుండియు తియ్యని పదార్థమునుండియు కొంతభాగమునుతీసి యామెను ఆర గింపుడని ప్రార్థించెను. గౌరీమాయి నవ్వుచు. "మీ రిప్పు డొక వీరభక్తుని యాధీనములో నున్నారు. ప్రతి పదార్థమును కొంచెము తినక తప్పదు." అని చెప్పిరి. అమ్మగారుకూడ నవ్వుచు, "ఇంత వలదు. ఇంత నేను తినలేను," అని చెప్పుచు, నివేదన చేయబడిన ప్రతి పదార్థమునుండియు, కొంచెము భుజించిరి. ఆ ప్రసాదమును భక్తుడు చేతితో దీసికొని తన నుదిటి కద్దుకొనెను. వర్ణింప నలవికాని ఆనందముతో నాతని మోము ప్రకాశించుచుండెను. అమ్మగారి కతడు ప్రణామముచేసి వెడలిపోయెను. మెడలోని పూలహారమునుదీసి అమ్మగారు గౌరీమాయి కిచ్చిరి. ఆమె కర్పిత మైన పూవులన్నియు నచ్చటి భక్తురాండ్రకు పంచిపెట్టబడెను.

ఆ నాడు రథయాత్రయని నేనిదివరకే చెప్పితిని. భూదేవు డొక రథమును సిద్ధముచేసెను. శ్రీ రామకృష్ణుల ప్రతిమ నీ రథ ములోపెట్టి యూరేగించుటకు సన్నాహము చేసిరి. పాఠశాలలో ముఖ్యముగా చేయవలసిన పనియుండి, గౌరీమాయి మమ్ము విడిచి వెళ్లవలసి వచ్చెను. పిమ్మట ప్రసంగము గౌరీమాయి పైకి బోయెను. "పాఠశాలలోని బాలికలను పెంచుటకే, ఆమె తన

శక్తినంతను ధారపోయుచున్నది. వారికి అనారోగ్యముగా నున్నప్పుడు, ఆమెయే సర్వోపచారములను జేయును. ఆమెకు సొంత కుటుంబమేమియు లేదు. ఈ బాలికల నిమిత్తమున నామె మాతృహృదయము సార్థకతను గాంచుచున్నది. ఆమె కిదియే కడపటి జన్మమగుటచే యీ యనుభవముల నెల్ల నొందుచున్నది.'' అని అమ్మగారు చెప్పిరి.

శ్రీ రామకృష్ణుని చిత్రపటమును రథములో నుంచిరి. తమ శయ్యలోనుండి అమ్మగారు ఆ పటమును జూచి మిక్కిలి సంతోషించిరి. రథమును బయటకు తీసికొనివచ్చి, వీథులలోను గంగానదీ తీరమందు నూరేగించిరి. కనుచీకటి పడినతరువాత రథము మరల మాతృదేవి యింటికి వచ్చెను. మేడమీద వసారాలో భక్తురాండ్రు రథమును లాగిరి. అమ్మగారును, ఆమె మేనకోడం డ్రిద్దరును, నేనునుకూడ వారితోగలసి రథమును లాగితిమి. రథము వీథిలో వెళ్లుచుండినప్పుడు, ''రథోత్సవము*ను చూచుటకు అందరును జగన్నాథము వెళ్లలేరు. ఈ రథములో శ్రీ రామకృష్ణులను చూచినవారు భగవత్సాక్షాత్కారమును బడసెదరు.''* అని అమ్మగారు చెప్పిరి.

1912–వ సం॥ అక్టోబరు

దుర్గాపూజ సెలవులలో నొకనాడు శ్రీ మాతృదేవిని సందర్శింప వచ్చితిని. ఆమె చాలపనిలో నుండిరి. నే నామె సమీపమున గూర్చుంటిని. రాంచీనుండి వచ్చిన భక్తుని దీసికొని

---

* జగన్నాథములో రథమునందలి విష్ణు విగ్రహమునుచూచిన వారికి భగవత్సాక్షాత్కారము కలుగునని హిందూజన సామాన్యము యొక్క నమ్మకము.

రమ్మని యామె యొకరిని బంపిరి. అతడు చాలపువ్వులను, పండ్లను, ఒక చీరను, నూలుబట్టతో చేసిన పువ్వులదండను తెచ్చెను. ఆ దండను మెడలో ధరింపుడని ఆతడు కోరిన పిమ్మట, అమ్మగారు దానిని ధరించిరి. దండలోని ఆ పూవులను తీగెతో గ్రుచ్చినందున, అమ్మగారికి హానికలుగవచ్చునని గోలపేమాయి యా భక్తుని మందలించెను. అమ్మగారు మాత్రము శాంతముగా "భయములేదు. దండను నా చీరపైననే వేసికొంటిని," అని చెప్పిరి. నేను కొన్నిపండ్లను మధుర పదార్థములను దెచ్చి యుంటిని. వానిని భగవంతునకర్పింపుమని అమ్మగారు నాతో చెప్పిరి. ఒక ద్రాక్షపండును నోటిలో వేసికొని, అది చాలతియ్యగా నుండెననిరి. కొలదినాళ్ల క్రింద నే నిచ్చిన చీరనే యామె కట్టుకొని యుండెను.

ఆడువారికి ఓరిమి యుండవలయును

దానిని నాకు చూపుచు, "చూచితివా? దానినే ధరించితిని. ఇప్పుడది మాసిపోయినది." అని యామె చెప్పిరి. దీనిని చూచి నే నాశ్చర్యపడి, నావంటి పనికిమాలిన భక్తురాలియెడలగూడ అమ్మగారికి యెంతటి అపార ప్రేమయుండెనో గ్రహించితిని. ఆమె మేనకోడలు నళిని కోపముగానుండెను. "ఆడువారి కింత శీఘ్రముగా కోపము రాకూడదు. వారు సహనము నభ్యసింపవలయును. బాల్యమునందు వారికి తల్లిదండ్రులే రక్షకులు; యౌవనములో భర్త రక్షణముక్రింద నుందురు. సామాన్యముగా ఆడువారికి అభిమాన మెక్కువగానుండును. వారిని కలవరపరచుటకు, ఒక మాటయే చాలును. ఈ రోజులలో మాటలకేమి కొదువ? కనుక ఓర్పుతో వారు కష్టసమ

యములందు, తల్లిదండ్రులనుగాని, భర్తలనుగాని యెదిరింపక వారికి విధేయులై యుండుటకు ప్రయత్నింపవలెను'' అని చెప్పి అమ్మగారామెను మందలించిరి.

రాధు తన చీరను మోకాళ్లపైకి నెగద్రోసికొని మా దగ్గర కూర్చుండెను. అమ్మగారది చూచి, ''అమ్మా! ఆడుది యిట్లు తన చీరను మోకాళ్లపైకి నెగద్రోసికొనుట యెందు కమ్మా?'' అని యామెను మందలించి ''మోకాళ్లపైకి బట్ట నెగ ద్రోసికొనుటయును, వివస్త్రయగుటయు నొకటియే కాదా?'' అను నర్థమిచ్చు నొక పద్యమును చదివిరి.

చంద్రబాబు సోదరి మమ్ము చూడవచ్చి, ''శ్రీ మాతృదేవి భర్తగారింకను సజీవులై యున్నారా? ఈ పిల్లలందరు నాయన బిడ్డలును, కోడండ్రునా?'' అని ప్రసంగవశమున నడిగెను. ''మీ మాట యెంతో బాగున్నది! శ్రీ రామకృష్ణులవారి యుపదేశములను మీరు చదువలేదా? కామకాంచనముల రెండి టిని పరిత్యజింపుడని జనుల నందరిని ఆయన యెల్లప్పుడు హెచ్చ రించుచుండెను'' అని నేను బదులు చెప్పితిని. ఆమె తెల్లపోయి, ''నన్ను క్షమింపుడు. వీరందరు నామె సొంత బిడ్డలనుకొంటిని'' అని నుడివెను.

దుర్గపూజాసమయ మాసన్నమైనది. అమ్మగారి దగ్గర నుండిన క్రొత్త బట్టల మూటలోనుండి యామె తన ముగ్గురి మేనకోడండ్రి భర్తలకై యుద్దేశించిన బట్టలను దీసి వేఱుగా నుంచి మరియొకబట్టను చేతితో బుచ్చుకొని ''ఈ క్రొత్తబట్టను పూజాసమయమున గ—ధరించి దానితోడనే బేలూరుమఠము నకు వెళ్లు,'' అని చెప్పిరి.

మధ్యాహ్నసేవయైన తరువాత మేము భోజనము చేసితిమి. అమ్మగారు విశ్రమించుచుండిరి. నేనామె ప్రక్కను కూర్చుండి విసనకఱ్ఱతో విసురుచుంటిని. "అక్కడ ఒక తలగడ ఉన్నది. దానిని తెచ్చుకొని నా దగ్గర పరుండుము. నాకింక విసర నక్కరలేదు," అని ఎంతో ప్రేమతో నామె చెప్పిరి. ఆమె తలగడను వాడుటకు సందేహించి, రాధు గదిలోనుండి నేనొక తలగడను దెచ్చితిని. అమ్మగారు నవ్వుచు, "ఈ తలగడ పిచ్చిదియైన రాధుతల్లిది. ఆమె గొడవ చేయును. నా తలగడనే వాడుకొనుము. దానిలో ప్రమాదమేమియు లేదు," అని నాతో చెప్పి, పిమ్మట రాధును బిలిచి "నీ విచ్చటకు వచ్చి నీ అక్కగారి చెంతను బరుండుము," అని యానతిచ్చిరి. తరువాత ప్రసంగము, పైనచెప్పిన చంద్రబాబుసోదరి మాటలపైకి పోయినది. "మంచిది! నా భర్త ఈ పూజామందిరములో నున్నారనియు మీ రందరును ఆయన బిడ్డలే యనియు నీవు వెంటనే చెప్పియుండవలసినది," అని అమ్మగారనిరి. అందుపైని "ప్రపంచ మందలి స్త్రీ పురుషు లందరును ఆయన బిడ్డలే!" అని నే నంటిని. అమ్మగారు నవ్వుచు "జను లిచ్చటకు రకరకములకోరికలతో వచ్చుచుందురు. ఒక డొక దోసకాయను దెచ్చి శ్రీ రామకృష్ణులకు సమర్పించి, స్వప్రయోజనములకైన తన ఈప్సితముల నీడేర్పుమని ప్రార్థించును. సామాన్య జనుల స్వభావమిది," అని సెలవిచ్చిరి.

కొంచెము విశ్రమించి మేము లేచితిమి. కొందరు భక్తురాండ్రు ప్రక్కగదిలో నుండిరి. వారిలో నిద్దరు కాషాయవస్త్రములను ధరించిరి. వారిరువురును శ్రీమాతృదేవికి ప్రణామము

చేసిరి. తమతోకూడ భగవంతున కర్పించుటకై కొన్ని మధుర భక్ష్యములను దెచ్చిరి. వారు కాళీఘట్టమునందుండు శ్రీనారాయణపరమహంస శిష్యురాంద్రని మాకు తెలిసినది. అప్పుడాయన యొక పెద్ద యాగమును చేయుచుండెను.

ఆ సన్న్యాసినులలో నొకరు "ప్రతిమార్చనలో నేమైన సత్యమున్నదా? మా గురువుగారు దాని నొప్పుకొనరు. ఆయన అగ్ని, సూర్యారాధనలను జనులకు బోధింతురు" అని చెప్పిరి.

ప్రతి మార్చన

అమ్మగారు: మీ గురువుగారి మాటలను మీరు సందేహింపకూడదు. ఆవిషయమై నన్నేల అడిగెదరు? మీ గురువుగారి యభిప్రాయమును మీరు వినియున్నారు కారా?

సన్న్యాసిని: మీ అభిప్రాయమేమో తెలిసికొనగోరుచున్నాము.

ఆ విషయమై అమ్మగారు తమ అభిప్రాయమేమియు నీయమనిరి. కాని, యా సన్న్యాసిని పట్టుబట్టి ప్రత్యుత్తరము కొరకు ఒత్తిడిచేయ నారంభించెను. అమ్మగారు చిట్టచివర కిట్లు చెప్పిరి: "మీ గురువుగారు నిజముగా సర్వజ్ఞులేయైనచో నిట్లు చెప్పియుండరు. ఇట్లనవలసి వచ్చినందుకు నన్ను క్షమింపుడు. అనాదిగా జను లెందరో ప్రతిమార్చనజేసి ఆధ్యాత్మికజ్ఞానమును బడసిరి. ఈ యథార్థవిషయమును మీరు కాదందురా? శ్రీ రామకృష్ణులవారెన్నడు నిట్టి సంకుచితదృష్టిని, పక్షపాతబుద్ధిని గనుబరచియుండలేదు. భగవంతుడు సర్వాంతర్యామి. అజ్ఞానాంధకారమునబడి దారి తెలియక పరితపించు మానవజాతికి తరణోపాయమును జూపింప, ప్రవక్తలును, అవతారపురుషులును ఈ లోక

మున జన్మించుచుందురు. జనులకు వారి వారి మానసికతత్వములను బట్టి, వారు వివిధములైన యుపదేశముల జేయుచుందురు. సత్యమును గ్రహించుటకు మార్గము లనేకముగనున్నవి. ఈ యుపదేశములన్నిటికిని సందర్భానుసారమైన ప్రయోజనమున్నది. ఉదాహరణమునకు ఒక చెట్టునుదీసికొనుడు. దానికొమ్మలపై చాల పక్షులు వ్రాలియుండును; వానిలోకొన్ని తెల్లగను, కొన్నినల్లగను, కొన్నిపచ్చగను, ఈవిధముగా వేర్వేరురంగులు కలిగియుండును. వానికూతలు గూడ రకరకములుగా నుండును. కాని, మనమా కూతలన్నియు పక్షికూతలేయని చెప్పుదుము. ఆ కూతలలో నేదియోయొకటి మాత్రమే పక్షులకూతయనియు తక్కినవి పక్షుల కూతలు కావనియు నెన్నటికిని చెప్పము.''

ఆ సన్న్యాసినులు కొంతసేపటికి వాదమును విరమించుకొని, శ్రీమాతృదేవి కలకత్తా నివాసము నడిగి తెలుసుకొని, మరల వచ్చి యామెను దర్శింప కుతూహలపడుచుంటిమని చెప్పిరి. వారు వెళ్లిన తరువాత, అమ్మగారు ''ఈ విధముగా వాదోపవాదములు చేయుట ఆడువారికి తగదు. వాదమువలన నెంతటిబుద్ధిమంతులకును భగవంతుని గ్రహించుటకు సాధ్యముకాదు. బ్రహ్మము వాదమువలన తేలెడు విషయమా?'' అని చెప్పిరి. కొన్నాళ్లైనతరువాత అమ్మగారు కాశీకి ప్రయాణమగుటకు నిశ్చయించుకొనిరి. కొంతకాలమువరకు నేనామెను చూచుటకు వీలుండదు. నేను సెలవుతీసికొని వెళ్లునప్పుడామె నాయెడల గనుబరచిన దయాతిశయము నాహృదయమును చూఱగొనెను. కేవలము నేను పరవశనై యారాత్రి నింకెవరితోడను, మాటాడనే లేదు.

1913-వ సం॥ జనవరి 31-వ తేది

శ్రీమాతృదేవి కాశీనుండి తిరిగి వచ్చిరి. ఒకనాటి యుదయమున వారి యింటికి వెళ్లితిని. అమ్మగారప్పుడు పూజ చేయుచుండిరి. పూజయైనతరువాతవచ్చి, "అమ్మా నిన్ను చూచుట నాకు చాలసంతోషముగానున్నది. నిన్నే నేను తలచుచుంటిని. కొలదికాలములో మేము మాగ్రామమునకు వెళ్లెదము. గ్రామమునుండి తిరిగి యిచ్చటకు వచ్చువరకును నీవు కనుపడవేమోయని భయపడితిని," అని చెప్పిరి.

శ్రీ విద్య

అప్పటికి ప్రొద్దుట తొమ్మిదిగంటలపైగా అయినది. అమ్మగారిమేనకోడలు రాధు కొలది దూరములోనున్న క్రైస్తవ పాఠశాలకు పోవుటకు సిద్ధపడుచుండెను. ఇంతలో గోలప్‌మాయివచ్చి, "రాధు పెద్దపిల్ల అయినది. ఇంకను పాఠశాలకెందుకు వెళ్లవలెను?" అని అమ్మగారితో చెప్పి, రాధును బడికిపోవలదనెను. రాధు ఏడుపు నారంభించెను. "మరీ అంత పెద్దదికాలేదు. దానిని బడికి వెళ్లనిమ్ము. విద్యావతియైనచో పాఠశాలలో కొన్ని ఉపయోగకరమైన పనులను నేర్చుకొని యామె ఇతరులకెంతో మేలుచేయగలదు. ఈ పిల్లను నాక కుగ్రామములో నివసించు బాలునకిచ్చి పెండ్లిచేసిరి. చదువుకొనినయెడల ఈమె తాను బాగుపడుటయే కాకుండ, ఇతరులకు సాయము చేయగల స్థితిలోగూడ నుండును," అని అమ్మగారు చెప్పిరి. ఇందువలన రాధును బడికి వెళ్లనిచ్చిరి.

శ్రీమాతృదేవియొద్ద మంత్రోపదేశము నొందుటకై కుతూహలపడుచుండిన యొకబాలికను అన్నపూర్ణతల్లి తనవెంట తీసుకొనివచ్చి, "అమ్మా! మీయొద్ద మంత్రోపదేశము నొందు

టకు తనను తీసుకొని వెళ్లుమని ఈపిల్ల నన్ను వేధించుచున్నది. నేను కాదన లేకపోతిని. కనుక, మీకడకిప్పుడీమెను తోడ్కొని వచ్చితిని'' అని చెప్పెను.

అమ్మగారు: నేనన్నుడే భోజనము చేసితినే*. ఇక మంత్రోపదేశము చేయుట ఎట్లు పొసగును?

అన్నపూర్ణతల్లి: కాని, ఈపిల్ల ఇంతవరకు భోజనము చేయలేదు. కనుక మీరు భోజనము చేసియున్నను, చేయక పోయి నను ప్రమాదమేమియు లేదు.

అమ్మగారు: ఈమె మంత్రోపదేశమునకు సిద్ధముగా నున్నదా?

అన్నపూర్ణతల్లి: ఔనమ్మా! పూర్తిగా సిద్ధపడియే వచ్చినది.

అమ్మగారు మంత్రోపదేశము చేయుటకు సమ్మతించిరి. మంత్రోపదేశమైన తరువాత అన్నపూర్ణతల్లి ఆ బాలికను గురించి ప్రసంగింప మొదలుపెట్టి, ''ఈమె సామాన్య బాలిక కాదు. శ్రీ రామకృష్ణులవారినిగూర్చి చదివిన తరువాత, ఈమె కఠినమైన ఆధ్యాత్మిక సాధనలను చేయనభిలషించి, జుట్టునుకత్తిరించుకొని, పురుష వేషమునుదాల్చి, తీర్థయాత్రకు బయల్వెడలెను. వైద్యనాథ్ వరకువెళ్లెను. ఆస్థలము కలకత్తాకు రెండునందల మైళ్లకు పైబడిన దూరములోనున్నది. అచ్చట నొక యడవిలో ప్రవే శించి విశ్రాంతి తీసుకొనుచుండెను. అప్పుడామె తల్లియొక్క గురువు ఆదారిని పోవుచు నామె యెక్కడ నివసించుచున్నదియు,

* గురువు భోజనము చేయకముందు మంత్రోపదేశము చేయుట సామాన్యాచారము.

నడిగి తెలిసికొని యామెతండ్రికి తెలిపెను. అంతవరకు నామెను ఆగురువు తనసంరక్షణ క్రిందనుంచుకొనెను. తరువాత ఆమె తండ్రి అచ్చటకువచ్చి యామెనింటికి తీసుకొనిపోయెను.'' అని చెప్పెను.

అమ్మగారీమాటలను విని ''ఆహా! ఏమిభక్తి!'' అని మెచ్చుకొనిరి. అప్పుడచ్చటనుండిన యితరభక్తురాండ్రు ''ఏమి యీ వింత! ఎంతఅందమైనపిల్ల! భక్తిశ్రద్ధలెంత యెక్కువగా నున్నను, ఒంటిగా నీమె యెట్లువెళ్లగలిగెను?'' అని తమ ఆశ్చర్యమును వెలిబుచ్చిరి. ''మా ప్రాంతములలో నిట్టిది జరిగిన యెడల తప్పక జనాపవాదము కలిగియుండెడిది.'' అని నళిని తన యభిప్రాయమును ప్రకటించెను.

మధ్యాహ్నభోజనమైన తరువాత మేమందరమును ప్రక్కగదిలోనికిబోయి విశ్రాంతి కొఱకు పరుంటిమి. అమ్మగారు తమ నూతన శిష్యురాలితోకూడ కొంతతడవు విశ్రమింపుమనిరి. పగటిపూట పరుండు నలవాటు తనకు లేదని యాబాలిక చెప్పెను. శ్రీ మాతృదేవి యాజ్ఞను మీరకూడదని నేనంటిని. ఆమె యొప్పుకొనెను గాని కొలది నిముషములైన తరువాత ప్రక్కలోనుండి లేచి వసారాలోనికి వెళ్లెను. ''ఆమెకు కుదురులేదు. అందుచేతనే యామె యింటిని విడిచి వెళ్లినది.'' అని చెప్పి, ఆమెభర్తకేమి పని? అతడామెను తనయొద్దనెందుకుంచుకొనడు?'' అని అమ్మగారు ఆ బాలిక పరిచారికనడిగిరి. ''అతనికి స్వల్పజీతము వచ్చును. ఇంతేకాక, అతనియింటిలో యెవ్వరునులేరు. అతడీ బాలికనొకతె నింటిలోనుంచుకొనలేడు కనుక, తనతండ్రియొద్దనే ఆమె యుండును. ప్రతి శనివారమును ఆదివారమును భర్త తనమామగారి యింటికివచ్చుచుండును.'' అని యాపరిచారిక బదులు

చెప్పెను. తరువాత అన్నపూర్ణ తల్లి అందుకుని "ఈ పిల్ల తన భర్తతో నీవు నాభర్తవు కావు. జగదీశ్వరుడే నాభర్త. అని చెప్పుచుండును." అని నుడివెను. శ్రీమాతృదేవి యేమియు బదులు చెప్పక యూరకుండెను.

కొన్ని ఆధ్యాత్మిక బోధలు

పూజామందిరమున కుత్తరము వైపునగల వసారాలో బిగ్గరగా మాట్లాడుచుండిరి. "నీవు వెళ్లి, వారిని మెల్లగా మాట్లాడుడని చెప్పుము. ఇట్టి గోల శ్రీ శారదానంద స్వామిని చీకాకు పఱచును," అని యొకరితో అమ్మగారు చెప్పిరి. అప్పుడామెగదిలో నింకెవరును లేరు. ఆధ్యాత్మిక సాధనలను గురించి యామెను కొన్ని ప్రశ్నలడిగితిని. అమ్మగారిట్లు చెప్పిరి: "శ్రీరామకృష్ణులకును నాకును ఏవిధమైన భేదమును పాటింపకుము. నీకు కనుబఱచిన భగవంతుని విశేషస్వరూపమును ధ్యానించుచు, ప్రార్థింపుము. ధ్యానము హృదయములో నారంభమై, శిరస్సునందలి సహస్రారములో ముగియును. మంత్రములవలనగాని, వేదపఠనమువలనగాని లాభమేమియు లేదు. భక్తియే ముఖ్యము. భక్తికి సాధ్యముకాని దేదియు లేదు. గురువు, ఇష్టదైవము, సర్వము శ్రీరామకృష్ణులే. సర్వాధికారి ఆయనయే."

పిమ్మట ప్రసంగము గౌరీమాయిపైనను, ఆమె శిష్యురాలు దుర్గపైనను పోయెను. వీరిరువురను అమ్మగారు మిక్కిలి కొనియాడి, "అమ్మాయీ! సావధానముగా వినుము. సంసార సంపర్కమాలిన్యము తమతమ హృదయములలో చేరి గడ్డకట్టిన తరువాత, భగవన్నామమును చాలమంది స్మరింతురు. కాని, బాల్యమునుండియు భగవద్భక్తి కలవాడే ధన్యుడు. ఈ బాలిక

మల్లెపువ్వువంటి నిష్కళంకురాలు. గౌరీదాసి యామె శీలమును చక్కగాదిద్ది తీర్చినది. ఆమెకు పెండ్లిచేయవలెనని ఆమెసోదరు లెంతో ప్రయత్నించిరి. కాని గౌరీదాసి యామెనింటిలోనుండి తీసికొనిపోయి యెచ్చటెచ్చటనో దాచియుంచి, చిట్టచివరకు జగన్నాథమునకు తోడ్కొనిపోయి, జగన్నాథునితో పూలదండను మార్చుకొనునట్లుచేసి, యామెకు సన్న్యాసమిచ్చెను. ఆ బాలిక జగత్ప్రభువైన జగన్నాథుని పెండ్లియాడెనని దీనియర్థము. అప్పటినుండి యామె సన్న్యాసినిగనే జీవితమును గడపుచున్నది. ఎంత మంచి నిర్మలమైనపిల్ల! ఆమె బాగుగా చదువుకొన్నది. ఏదియో సంస్కృతపరీక్ష నిచ్చుటకు సిద్ధపడుచున్నదని వింటిని.'' అని చెప్పిరి. గౌరీమాయి జీవితప్రారంభ దశలోని యనేక విశేషముల నామె చెప్పగా విని, గౌరీమాయి జీవితములోకూడ నిటువంటి ఒడిదుడుకులుండెనని గ్రహించితిని. తమ కాశీయాత్రను గురించి ముచ్చటించుచు, అచ్చట కొన్నాళ్లు మిక్కిలి సుఖముగా గడపితిమని శ్రీ మాతృదేవి చెప్పిరి.

కొంత తడవైన తర్వాత నలుగురైదుగురు భక్తురాండ్రు వచ్చి, కొబ్బరి బొండములను కొన్ని పండ్లను సమర్పించిరి. వారిలో నొకయామె శ్రీమాతృదేవి పాదములను స్పృశించుటకై దగ్గరకు వచ్చుచుండగా, ''దూరమునుండియే నమస్కారము చేయుడు.'' అని అమ్మగారు చెప్పిరి. వారు కొంతపైకమునుగూడ నీయబోయిరి. కాని, అట్లు చేయవలదని అమ్మగారు వారిని వారించిరి. పిమ్మట తమకేమైన ఆధ్యాత్మిక బోధలను చేయుడని వారు కోరిరి. అమ్మగారు మందహాసము చేయుచు, ''నేను మీకు దేనిని గూర్చి బోధచేయుదును? శ్రీ రామకృష్ణులవారి యుపదేశములు

పుస్తకరూపమున వెలువడినవి. ఆ యుపదేశములలో నొకటినైనను మీరు గ్రహించి ఆచరింప గలుగుచో, జీవితములో సర్వమును మీకు లభించును.'' అని బదులు చెప్పిరి. వారు సెలవు దీసికొని వెళ్లిన తరువాత ''ఆధ్యాత్మికబోధను గ్రహించుకొనగలవా రెక్కడున్నారు? మొట్టమొదట అభ్యాసకులకు అర్హతయుండవలయును; లేనిచో నెన్ని యుపదేశములైనను నిష్ప్రయోజనము లగును.'' అని శ్రీ మాతృదేవి సెలవిచ్చిరి.

ఇంతలో అన్నపూర్ణ తల్లి గదిలోనికివచ్చి, ''అమ్మా, మీరు నాకు కలలోకనుపడి మీ ప్రసాదమును నేను తీసికొన్నచో నా వ్యాధి కుదురునని చెప్పితిరి. కాని యెవరిప్రసాదమునుగూడ నేను తినకూడదని శ్రీ రామకృష్ణులవారిఆజ్ఞ. అయినను మీ ప్రసాదమును నాకు కొంచెము దయయుంచి యిచ్చినచో, నేను సంతోషింతును'' అని చెప్పెను. ఆ రీతిని చేయుటకు అమ్మగారు వీలులేదనిరి. కాని, యా స్త్రీ ప్రసాదమీయుడని పట్టు బట్ట నారంభించెను.

అమ్మగారు : శ్రీ రామకృష్ణుల వారిమాట నతిక్రమించుట నీ కిష్టమా?

అన్నపూర్ణతల్లి : మీరును శ్రీ రామకృష్ణులును వేఱని నేను తలచుచుండినంతవరకు, శ్రీ రామకృష్ణుల వారిమాట చెల్లతగి యుండును. కాని, మీ యిరువురకును భేదమేమియు లేదని నే నిప్పుడు గ్రహించియున్నాను. కనుక దయయుంచి మీ ప్రసాదమును నా కీయుడు.

అమ్మగారు లొంగిపోవలసి వచ్చెను. కొంతసేపటికి నేను సెలవు తీసికొని వెళ్లితిని.

మఱియొకనాడు శ్రీ మాతృదేవిని నేను సందర్శించి నప్పుడు, నా భర్తనుగూర్చి అమ్మగారు నన్నడిగిరి. వారి యారోగ్యమంత బాగుగాలేదని నేను చెప్పితిని. పిమ్మట అమ్మగారు చెప్పిన ప్రకారము నేనొక యుత్తరమునువ్రాసి యామెకిచ్చితిని. మధ్యాహ్నమున భోజనముచేసి అమ్మగారు కొంచెము విశ్రమించు చుండగా, ఆమె గదిలోనికి కొందరు భక్తురాండ్రు వచ్చిరి. మామూలు మర్యాదలైన తరువాత వారిలో నొకరు, "నా కొక మంచిమేక యున్నది. అది రోజుకు నాలుగు శేర్ల పాలిచ్చును. మూడుపక్షులనుగూడ నేను పెంచుచున్నాను. వానితోడ నే కాలమును వెళ్ళబుచ్చుదును. ఇప్పుడు నేను చాల ముసలిదాననైతిని." అని ఆమె చెప్పుచుండగా, "మనమొక పిల్లినో కుక్కనో పెంచుచు భగవంతుని మరచిపోవునట్లు మహామాయ, విశ్వమునెల్ల నావరించియున్న ఆ మహాశక్తి చేయుచున్నది. ఈ విశ్వనాటక మీ విధముగా జరుగుచున్నది." అని ఇట్టి లౌక్యుల విషయమున శ్రీరామకృష్ణులవారు చెప్పినమాటలు నాకు జ్ఞప్తికి వచ్చినవి. ఈ భక్తురాండ్రు సంభాషించుచుండినపుడు శ్రీ మాతృదేవి యొక మాటయైనను పలుకక, యూరకతలనూపుచుండిరి. మాకొరకై యామె యెంతదారుణబాధను సహించుకొనవలసి వచ్చెను! మేమామెను కొంచెమైనను విశ్రాంతి నొందనీయలేదు. పనికిమాలిన యేవో చెత్తమాటలతో నామెను వేధించితిమి. నేను సెలవుదీసికొని సాయంకాలమున నింటికి వెళ్ళితిని.

* * *

సాత్వికగుణము వలన త్యాగమలవడును.

నేనొక నాటిరాత్రి అమ్మగారినిదర్శించినపు డామె శయ్యపై బఱుండి యుండిరి. ఆమెప్రక్క నింకొక స్త్రీ యుండెను. నన్ను

చూచినతోడనే అమ్మగారు లేచి కూర్చుండిరి. నే నామెకు ప్రణామము చేయుటకు వీలుగానుండుటకై యామె యిట్లు చేసిరి. ప్రసంగ వశమున శ్రీమాతృదేవి యిట్లు సెలవిచ్చిరి. ''సృష్టి సమయమున జనులు సత్వగుణ యుక్తమైన తేజస్సుతో బుట్టిరి. పుట్టినప్పటినుండియు వారు జ్ఞానులే. ఈ కారణమువలన, జగత్తుయొక్క అనిత్య స్వభావమును వారు వెంటనే గ్రహించి, దానిని పరిత్యజించి, పారమార్థిక సాధనచేయుచుండెడి వారు. మిక్కిలి త్వరితముగా వారికి ముక్తిలభించుచుండెను. తన సృష్టి వ్యర్థమై పోవుచుండెనని సృష్టికర్త గ్రహించెను. ఇట్లు ముక్తి నొందిన జ్ఞానులు జగన్నాటక నిర్వహణమునకు పనికిరాకుండిరి. పిమ్మట, భగవంతుడు సృష్టిని మరల ప్రారంభించి, సత్వముతో రజస్తమోగుణములను గూడ గలిపెను; ఆయన యుద్దేశ్య మప్పుడు నెఱవేరెను.'' పిమ్మట సృష్టిని గురించి, ప్రజలలో విశేష ప్రచారముగల యొకపద్యమును జదివి, ''మా చిన్న తన మందు వీథి నాటకముల వలన మాకీ యూహలు పట్టుబడినవి. ఇప్పుడీ నాటకములే అరుదై పోయినవి,'' అని అమ్మగారు సెలవిచ్చిరి.

కొంతమంది యువతులు, శ్రీమాతృదేవి బంధుకోటిలోని వారు, మరియొక గదిలో నొక పుస్తకమును బిగ్గరగా చదువు చుండిరి. ''వా రెంత బిగ్గరగా చదువుచున్నారో వినుడు. క్రింది అంతస్తులో చాలమంది జను లున్నారను విషయమును వారు మరచిపోయిరి.'' అని అమ్మగారు చెప్పిరి.

అమ్మగారి పిచ్చివదినెగారు, రాధుతల్లి, గదిలోనికివచ్చి, ''లక్ష్మీమణి (శ్రీరామకృష్ణులవారి మేనకోడలు) నవద్వీప

యాత్రకు పోవుచున్నది. నేనుకూడ నామెతో పోవ నిచ్ఛగించితిని. వెళ్లకుండ నన్ను మీా రాటంక పెట్టినారు,'' అని చెప్పి వీరావేశముతో గదిలోనుండి వెడలిపోయెను.

భక్తులు వర్ణనియమములకు అతీతులు.

తరువాత అమ్మగారిట్లు చెప్పిరి: ఈమె లక్ష్మితోగూడ వెళ్లుటకు నే నెట్లు సమ్మతింపగలను? లక్ష్మి భక్తురాలు. ఆమె యితర భక్తురాండ్రతోఁగలసి పాడును, నృత్యము చేయును. ఆమె వర్ణభేదమును పాటింపక యితరులతో భోజనముచేయును. రాధు తల్లికిది బోధపడదు. తమలో తాము భక్తురాండ్రు వర్ణనియమములను పాటింప నవసరము లేదను సంగతి యీామెకు తెలియనే తెలియదు. ఇట్టి సందర్భములో నామెయింటికి తిరిగి వచ్చి అందరియెదుటను లక్ష్మియొక్క ప్రవర్తనను ఖండించును. లక్ష్మిని నీవు చూచితివా?''

భక్తురాలు: లేదమ్మా

అమ్మగారు: ఆమె దక్షిణేశ్వరములో నున్నది. ఒకనాడు వెళ్లి యామెను చూడుము. నీవు దక్షిణేశ్వరమున కెప్పుడైనను వెళ్లియుంటివా?

భక్తురాలు: ఔనమ్మా! అచ్చటికి నేను చాలసారులు వెళ్లితిని. కాని, ఆమె యచ్చట నివసించుచుండెనని మాత్రము నాకు తెలియదు.

అమ్మగారు: దక్షిణేశ్వరములో నేను నివసించు చుండిన నౌబత్తుగది చూచితివా?

భక్తురాలు: ఔనమ్మా! దానిని బయటనుండి చూచితిని.

అమ్మగారు : మరి యొకనాడు నీవచ్చటకు బోవునెడల, ఆ గదిలోనికి వెళ్లుము. నేనచ్చటనుండినప్పుడు నా ప్రపంచమంతయు ఆ చిన్నగదియే............... బేలూరులో శ్రీ రామకృష్ణులవారి జయంత్యుత్సవమును చూచితివా ?

భక్తురాలు : లేదమ్మా! బేలూరునందలి మఠమునకు నే నెన్నడును వెళ్లలేను. అచ్చట నివసించు సన్యాసులకు, మఠములోనికి స్త్రీలు గుమికూడివచ్చుట యిష్టములేదని వింటిని. కనుక నే నచ్చటికి వెళ్లుటకు వెనుదీయుచున్నాను.

అమ్మగారు : ఒక్కసారి యచ్చటకు వెళ్ళి శ్రీ రామకృష్ణుల వారి జయంత్యుత్సవమును చూడుము.

* * *

నేను శ్రీ మాతృదేవిని సందర్శించుటకై బాగ్ బజారుకు వెళ్లునప్పటికి సాయంకాలమైనది. చిత్రాసనమును నేలపై బఱచి, జపమాలను దీసికొనివచ్చి, యిమ్మని అమ్మగారు ప్రేమతో నా కానతిచ్చిరి. నే నట్లుచేసినతోడనే యామె ధ్యానముచేయ నారంభించిరి. అమ్మగారున్న ఇంటికెదురుగా నొక బయలుండెను. అచ్చట పాటకపుజాతి మనుష్యులు కొందరు తమ కుటుంబములతో కూడ కాపురముండిరి. వారిలో నొకడొక స్త్రీని (బహుశః తన భార్యనే) దారుణముగా కొట్టుచుండెను. లెక్కలేకుండ చెంపకాయలు గ్రుద్దులు కురిపియుచుండెను. పిమ్మట వాడామెను తన శక్తికొలదిని తన్నెను. అప్పుడామె తన చేతులలోనున్న చంటిబిడ్డతోకూడ దూరముగా వెళ్ళి పడిపోయెను. అంతతో వాడాగక యా స్త్రీని మరల తన్ననారంభించెను. అమ్మగారి కిక ధ్యానము సాగించుటకు సాధ్యముకాలేదు. సాధారణముగా శ్రీ మాతృదేవికి

లజ్జమిక్కుటము ; క్రింది యంతస్తులోని వారికికూడ వినపడనంత మెల్లగా నామె మాట్లాడుదురు ; కాని యీ సమయమున మాత్ర మామె తమ సహజమ్మైదు స్వభావమునెల్ల విడనాడి, రెండవ యంతస్తునగల వసారాలోనికివచ్చి, ఇనుపకమ్ముల ప్రక్కను నిలువబడి "ఓరీ! దుర్మార్గుడా! ఏకముగా పిల్లను చంపివేసెదవురా? అది యిప్పటికే చచ్చిపోయిన దేమో అని భయ మగుచున్నది!" అని కోపోద్దీపితులై గర్జించిరి. ఏమి చిత్రమో కాని, అమ్మగారిని వాడు చూచిన వెంటనే మంత్రగాని యెదుట బడిన సర్పమువలె, నణగిపోయి, శాంతించి, యాస్త్రీని వదలి వేసెను. అమ్మగారు కనుబఱచిన దయనుజూచి, పాపమా యాడుది వెక్కి వెక్కి యేడువసాగెను. వేళకు వంటచేయక పోవు టనే యామె చేసిన గొప్పనేరమని తరువాత మాకు తెలియ వచ్చెను. పిమ్మట తన దురాగ్రహావేశము విడనాడి, యా మను ష్యుడు శాంతముగా నామెతో సఖ్యపడగోరెను. ఈ వైఖరిని చూచిన తరువాతనే, శ్రీమాతృదేవి మరల తమ గదిలోనికి వచ్చిరి.

కొంత తడవైన తరువాత ఆ సందులో నొక బిచ్చగాని కేక వినవచ్చెను. వాడు 'రాధాగోవిందా! భగవాన్ కీజై! గ్రుడ్డి వారిని కనికరించు' అని అరచుచుండెను. వానిని గురించి అమ్మ గారిట్లు చెప్పిరి: "ఆ సందులో ప్రతిరాత్రి ఈ బిచ్చగాడు పోవు చుండును. మొట్టమొదట వాడు 'గ్రుడ్డివాండ్రను కనికరించండి' అని కేక వేయుచుండువాడు. కాని ఒకనాడు "ఆ కేకతోపాటు 'రాధాకృష్ణా!' యను భగవన్నామమునుకూడ ఉచ్చరించు చుండుము. దీనివలన నీవు రెండు పనులను సాధించిన వాడవగు

దువు. పావనమైన భగవన్నామమును నీవు స్మరించుటయేకాక, గృహస్థుల జ్ఞప్తికికూడ తెచ్చుచుందువు. లేనిచో అహోరాత్రములు నీ గ్రుడ్డితనమును గురించి మాత్రమే నీవు తలపోయుచుందువు.'' అని గోలప్‌మాయి వానికి సరియైన హితవు చెప్పెను. అప్పటినుండి ఆ గ్రుడ్డివాడు భగవన్నామమును బిగ్గరగా నుచ్చరించుచు ఈ సందులో పోవుచుండును. గోలప్‌మాయి వానికొక బట్టనుకూడ నిచ్చెను. ఇతర వస్తువులును వానికి దొరుకుచుండును.

* * *

నేనొకనాటి సాయంకాలమున బాగ్‌బజారుకు వెళ్లినప్పుడు శ్రీ మాతృదేవి ఇట్లు ప్రసంగించు చుండిరి:-

పూజామందిరములో స్వామినర్చించు పద్ధతి.

''క్రొత్తగావచ్చు భక్తజనులకు పూజామందిరములో, స్వామి సేవావకాశము నిచ్చుచుండవలయును. నవనవోత్సాహ పూరితులై వారు శ్రీ భగవానుని శ్రద్ధగా సేవింతురు. ఇతరుల కీసేవ ఆయాసకరముగ నుండును. నిజమైన సేవయనిన వేళాకోళముకాదు. మనము చేయు భగవంతుని సేవలో నే విధమైన లోపము రాకుండ బహుజాగరూకులమై యుండవలయును. కాని, నిజమేమనగా దయామయుడైన శ్రీ భగవానుడు మనయవివేకమును గ్రహించి మనలను క్షమించుచుండును.'' అమ్మగారిప్రక్కనే యొక భక్తురాలుండెను. అమ్మగారి మాటల నామెనుద్దేశించియే చెప్పుచుండిరేమోయని నాయనుమానము. సరియైన రకపు పువ్వులనే కోయుమని, అర్చనకు గంధమును తీయుమని, పూజామందిరములో 'పనిచేయుచుండునప్పుడు శరీరమందలి యేభాగమునుగాని, బట్టనుగాని వెంట్రుకనుగాని చేతితో తాకవలదని శ్రీ మాతృదేవి యామెకు హితోపదేశము చేసి, ''పూజామందిరములో మనము బహుశ్రద్ధతో వ్యవహరిం

చుచు, నైవేద్యమును తక్కిన ఇతరసేవలను సరియైన కాలములో చేయుచుండవలయును.'' అని చెప్పిరి.

* * *

నేను శ్రీ మాతృదేవి యింటికి వెళ్లినప్పుడు రాత్రి యెనిమిది గంటల ముప్పదినిమిషములైనది. పూజా మందిరమునకు ఉత్తరముననున్న వసారలో నామె ధ్యాననిష్ఠలో నుండిరి. ఇంకొక గదిలో మేము కొంతతడవు వేచియుంటిమి. అమ్మగారచ్చటకు వచ్చి మందహాసముచేయుచు, ''నా తల్లీ ! నీవువచ్చుట నాకెంతో సంతోషముగా నున్నది.'' అని చెప్పిరి.

భక్తురాలు : అమ్మా ! నాతో నా చెల్లెలినిగూడ తీసుకొని వచ్చితిని. సాయంకాల పూజయైనదా ?

అమ్మగారు : లేదు. మీరు దానిని చూడవచ్చును. నేను కూడ ఇప్పుడే వచ్చెదను.

సాయంకాల పూజ త్వరలో ప్రారంభమయ్యెను. చాల మంది స్త్రీలు పూజామందిరములో గూర్చుండి ప్రార్థన చేయ మొదలు పెట్టిరి. పూజయైన తరువాత మేము ప్రతిమకు సాష్టాంగముచేసి, శ్రీ మాతృదేవిని జూచుటకై ప్రక్కగదిలోనికి వెళ్లితిమి. ఆమె యింటిలో మేమున్నప్పుడు ఒక్కనిమిషమైనను ఆమెను విడిచియుండుటకు మా మనసొప్పదు.

శ్రీ రామకృష్ణుల గాన నైపుణ్యము

కొలది నిముషములైన తరువాత అమ్మగారు గదిలోనికి వచ్చిరి. ఒక వృద్ధస్త్రీ మఱియొకరిచే నొక హరికీర్తనను చెప్పించుకొనుచుండెను. ''ఆ పాట నామె సరిగా నేర్పలేదేమో యని నాకు సందేహము కలుగుచున్నది. ఆహా ! శ్రీ గురుమహారాజుగా

రెంత బాగుగా పాడెడువారు! ఆయన కంఠముకూడ ఎంతో మధురముగా నుండెడిది. పాట పాడుచుండినప్పు డాయన తన్మయులై యుందురు. ఇప్పటికిని ఆయన పాటతీరు నా జ్ఞప్తికి వచ్చుచుండును. అది నాతలపునకు వచ్చినప్పు డితరుల పాటలు మిక్కిలి పేలవముగా కనుపడును. నరేనుని కంఠముకూడ మధురముగా నుండెడిది. ఈ యూరువిడిచి వెళ్లునప్పు డాతడు నన్ను చూచుటకై వచ్చి కొన్ని పాటలు పాడెను. నాయొద్ద సెలవు తీసికొని వెళ్లునప్పు డాతడు 'అమ్మా! నా పురుషజన్మను సార్థకము చేసికొని, నేను మరల రాగలిగినచో మిమ్ము తిరిగి దర్శింతును; లేనిచో యిదియే కడసారి చూపు!' అని చెప్పెను. 'నాయనా! నీ యుద్దేశ్యమేమి?' అని నిర్ఘాంతపడి అడిగితిని. అందుల కాతడు 'మంచిది! మీ దయావిశేషమువలన నేను త్వరలోనే తిరిగివచ్చెదను.' అని బదులు చెప్పెను. గిరీశబాబు కంఠముకూడ మధురమైనదే.'' అని అమ్మగారు చెప్పిరి

ఇంతలో గదిలోనికి రాధువచ్చి, అమ్మగారిని తనయొద్ద పరుండగోరెను. ''నీవు వెళ్లి పరుండుము. ఎంతోదూరము నుండి వీరు వచ్చినారు. కొంచెముసేపు వీరిదగ్గర కూర్చుండెదను.'' అని అమ్మగారు బదులుచెప్పిరి. కాని, యామె రావలయునని రాధు పట్టుపట్టెను. అంతట ''మీ పడక గదిలోనికి బోవుదము రండు. అచ్చట మీ రిరువురును బరుండవచ్చును.'' అని నేను మనవిచేయ, శ్రీమాతృదేవి యట్లేచేసిరి. నేను కొంత తడవు వీవనతో విసరిన తరువాత, ''ఇప్పుడు చల్లగానున్నది. ఇంక నీ వాయాసపడవలదు.'' అని అమ్మగారు సెలవిచ్చిరి. పిమ్మట నేనామె పాదములను బట్టుచుంటిని. ఒక వృద్ధస్త్రీ

యోగశాస్త్రములోవచ్చు షట్చక్రములనుగురించి మరియొక యామెకు బోధించుచుండెను. ఆ బోధను మాని వేయుమని గోలప్ మాయి యామెను కోరెను. కాని యామెవినక యింకను చెప్పు చుండెను. అమ్మగారామెమాటలనువిని, చిరునవ్వునవ్వుచు "నా కొరకు శ్రీ రామకృష్ణులు స్వహస్తముతో కుండలిని, యోగ షట్చక్రములను చిత్రించిరి." అని నాతో చెప్పిరి. ఆచిత్రమింకను నుండెనాయని యామె నడిగితిని. "లేదమ్మా! మా కడకు భక్తులు వచ్చెదరని నేనప్పు డూహింపలేదు. ఆ కాగితము పోయినది." అని అమ్మగారు చెప్పిరి.

గృహస్థులు— ఆధ్యాత్మికాభివృద్ధి

అప్పటికి రాత్రి పదునొక్క గంటయైనది. అమ్మగారు మా ప్రణామముల నందుకొని, తమ పరుపుపై గూర్చుండి మమ్మాశీర్వదించి, నన్ను ప్రక్కకుపిలిచి, "భార్యాభర్తలు మత సాధనలను గురించి యేకాభిప్రాయులై యున్నచో, ఆధ్యాత్మికాభివృద్ధి వారికి సులభముగా కలుగును," అని చెప్పిరి. కొలదినాళ్లైన తరువాత అమ్మగారిని నేను మరల సందర్శించినప్పుడు, "అవ

గురుభక్తి

సరమైనచో గురువునకుగూడ మనమేది ధర్మమో చెప్పవలసినదే. శిష్యులట్లు చేయుటలో దోషమెంతమాత్రమును లేదు. కాని, గురువునందు శిష్యునకు అచంచలమైనభక్తి యుండవలెను. గురుని ప్రవర్తన మెట్లున్నను, నాతని యందట్టి భక్తి కలిగియున్నచో, శిష్యుడు ముక్తిని సాధింపగలుగును. తమ గురుదేవుడనిన శ్రీ రామకృష్ణుల శిష్యులకు గల భక్తిని చూడుడు. తమ దేశకుని పట్లగల యీ ప్రేమచే, శ్రీ రామకృష్ణుల కుటుంబమునకు చెందిన నెవరినైన

వారు ప్రేమింతురు; చివరకాయన గ్రామములోని పిల్లినిగూడ అభిమానముతో జూతురు.'' అని యామె చెప్పుచుండగావింటిని.

* * *

1913-వ సం॥ నవంబరు 11-వ తేది

శాలిగంజ్ యందలి మా యింటిలో పువ్వులు విస్తారముగా గలవు. పువ్వులనిన శ్రీ మాతృదేవికెంతో యిష్టము. నేనొకనాడు వానిని సమృద్ధిగా కోసికొని యామెను దర్శింపవచ్చితిని. అప్పుడామె పూజచేయుటకు సిద్ధముగానుండిరి. ఆ పూలను పళ్లెరములో సర్దియుంచితిని. కాని, అమ్మగారి పాదముల నర్చించుటకు కొన్నిటిని వేఱుగా దీసియుంచ మఱచినందున, ఆనాటికి శ్రీ మాతృదేవిని పూజించుటకు నాకు వీలుండదుగదా యని చింతించుచుంటిని. కాని, నారహస్యాభిలాషను కనిపెట్టి అమ్మగారే కొన్ని పూలను పళ్లెరములో వేఱుగానుంచిరని త్వరలో కనుగొంటిని. పూజయైన తరువాత, ''అమ్మాయీ! ఇట్లు చూడుము! ఆ పళ్లెరములో నీకొఱకు నేనా పుష్పములనుంచితిని. వాని నిచ్చుటకు తీసికొనిరా.'' అని యామె నాతో చెప్పిరి. అప్పుడే యొక భక్తుడు పెద్దపండ్లగంపతో, అమ్మగారిని దర్శింపవచ్చెను. అతనిని జూచి శ్రీ మాతృదేవి మిక్కిలి సంతోషించి, యాతనినుదుట మంచిగంధపు బొట్టుబెట్టి, యాతని గడ్డమును నిమిరి ముద్దాడెను. ఏ భక్తునిపైనను తమ ప్రేమామృతము నీరీతిని అమ్మగారు వర్షించుట నే నెన్నడును జూడలేదు. పిమ్మట నన్ను, కొన్నిపుష్పములాతని కిమ్మనిరి. భక్త్యావేశముతో శరీర మాపాదమస్తకము కంపించుచుండ, నతడా పుష్పముల గైకొని, మహానందముతో వానిని శ్రీ మాతృదేవి పాదములకు సమర్పించి, ప్రసాదము దీసికొని వెళ్లెను. ఆమె మంచముపై గూర్చుండి మిక్కిలి యాప్యాయ

ముగా నన్ను దగ్గరకు రమ్మనిరి. నేనామెపాదములను అర్చించితిని. బహుప్రేమతో తమ హస్తమును నా శిరస్సుపైనుంచి, నన్ను ముద్దాడిరి. ఆమె యాశీస్సులచే నా హృదయము కరగిపోయెను.

కొంత తడవైన తరువాత అమ్మగారు డాబామీద తల నార్చుకొనుచు, నన్నుగూడవచ్చి, తలపిడపను దీసివైచి తల నార్చుకొనుమని, లేకున్న జబ్బుచేయ వచ్చునని చెప్పిరి. గోలప్ మాయి డాబామీదకువచ్చి పూజామందిరములోని ప్రతిమలకు నైవేద్యము చేయుడని శ్రీమాతృదేవి నడిగెను. అమ్మగారు డాబా మీదనుండి దిగివచ్చిరి. కొలది నిముషములైన తరువాత నేను కూడ క్రిందికి దిగివచ్చితిని. ఆమె పూజామందిరములో నొక పెండ్లికూతురివలె సిగ్గుపడుచు "ఇకరండు! వడ్డనయైనది." అని శ్రీరామకృష్ణులవారిని పిలుచుచుండెను. పిమ్మట గోపాల ప్రతిమ దగ్గరకువచ్చి, "ఓ నా గోపాలా! భోజనమునకు రా!" అని సంబోధించుచు, అకస్మాత్తుగా వెనుకకు తిరిగి నన్నుచూచి నవ్వుచు "వీరినందరిని భోజనమునకు బిలుచుచుంటిని." అని అమ్మగారు చెప్పిరి. ఈ మాటలు చెప్పుచు, శ్రీమాతృదేవి నైవేద్యముండిన గదిలోనికి వచ్చిరి. అమె శ్రద్ధాభక్తులనుజూచి ప్రతిమలామె మాటలను శిరసావహించి యామెతోకూడ నైవేద్యపు గదిలోనికి వచ్చినట్లే యనిపించి, ఆశ్చర్యపారవశ్యమున నేను నిశ్చేష్టురాలనై నిలిచితిని.

ఎంత స్వల్పవస్తువులైనను వ్యర్థము చేయకూడదు.

నైవేద్యమైన తరువాత మేమందరము కలిసి భోజనమునకు గూర్చుంటిమి. పిమ్మట అమ్మగారు నన్ను కొంతతడవు విశ్రమింపుమనిరి. అంతలో నొకపురుషుడు పండ్ల

గంపతో వచ్చెను. పండ్లు నైవేద్యము చేయబడును. గంపనేమి చేయవలయునని యాత డచ్చటి సన్న్యాసుల నడుగగా, వారు దానిని సందులో పారవేయుమనిరి. అమ్మగారు తమశయ్యలోనుండి లేచి వసారాలోనికివచ్చి, సందువైపుజూచి, ''ఇటువచ్చి చూడుము. ఎంత చక్కనిగంపను సన్న్యాసులు పారవేయుమనిరి! వారికది చీమకుట్టి నట్లైనను లేదు. వారందరు సన్న్యాసులు, పరిపూర్ణ విరక్తులు. కాని, మనమట్లు వస్తువులను పారవేయలేము. మన మా గంపను కూరల చెక్కునుంచుటకైనను వినియోగించి యుందుము,'' అని నాతోచెప్పి యొకరినివెళ్లి యా గంపను తెచ్చి కడుగుమనిరి. అట్లే ఆ గంపను తెచ్చియుంచిరి. ఈ సంఘటనవలన నే నొక గుణపాఠమును నేర్చుకొంటిని. విషయ గ్రహణములో మన మెంత మందముగా నుందుము!

ఆయా విధ్యుక్త ధర్మము ప్రకారము, మనము మనుష్యులందరియెడలను ప్రవర్తింపవలయును.

కొంతసేపైన తరువాత నొకయాచకుడువచ్చి, బిచ్చమడిగెను. సన్న్యాసులు విసుగుకొని, వానిని గొడవచేయక పొమ్మనిరి. ఈ మాటలను శ్రీమహాత్మ దేవి విని ''వారేమి చెప్పిరో వినుచుంటివా? పాపమా బిచ్చగానిని వారు వెడలగొట్టిరి. బద్ధకమును విడిచి కదలుటకిష్టపడక, వానికేమియు వారియ్యలేకపోయిరి. ఒకపిడికెడు బియ్యముకంటె వాడెక్కువ నేమియు నడుగలేదే! ఈ మాత్రపు చిన్నపనినికూడ చేయుటకు వారు శ్రమపడలేక పోయిరి. విధ్యుక్తధర్మము ప్రకారము ఒకనికి రావలసిన దానిని రాకుండ చేయుట న్యాయమా? ఆవులకుగూడ ఈ కాయగూరల చెక్కులను పెట్టుట మన విధాయకధర్మము. వీనిని

దీసికొనివెళ్లి మన మావుల మూతులదగ్గర బెట్టవలెను.'' అని చెప్పిరి.

*　　*　　*

చాల నాళ్లకు నేను మరల శ్రీమాతృదేవిని సందర్శింప వెళ్లితిని. ఆమె తమస్వగ్రామములోని యింటికివెళ్లి దుర్గాపూజకు కొన్నాళ్లుముందుగనే కలకత్తాకు తిరిగివచ్చిరి. ఒకనాటి మధ్యాహ్నమున నేను వెళ్లినప్పుడు, ఒక స్త్రీ ఆమెపాదములచెంత సాగిలబడి మంత్రోపదేశమునకై కన్నుల నీరుపెట్టుకొని ప్రార్థించుచుండెను. అమ్మగారు మంచముపైన గూర్చుండిరి. ''నా ఆరోగ్యము సరిగాలేదు. నేనిప్పుడు నీకు మంత్రోపదేశము చేయజాలనని యిదివరకే చెప్పితినే.'' అని యామె యాస్త్రీ కోరికను నిరాకరించుచుండిరి. కాని, యాస్త్రీ తాను పట్టినపట్టు విడువదయ్యెను. అమ్మగారు విసుగుకొని, ''మంత్రోపదేశమనిన, నీకంత తేలికగానున్నది. నీకు పరమమంత్రము దొరికెనను సంబరమే కాని, దానివలన కలుగు మంచి చెడ్డలను గురించి యెన్నడును ఆలోచింపవు,'' అని యామెను మందలించిరి. కాని, యాస్త్రీ 'సరేమిరా'యని యొకటేపట్టు పట్టెను. అచ్చట నున్నవారందరు నసహ్యించుకొనిరి. చిట్టచివరకు మాతృదేవి యామెను మఱియొకనాడు రమ్మనిరి. పిమ్మట, తనకచ్చటనుండిన సన్న్యాసులలో నెవరిచే నైన మంత్రోపదేశము చేయింపుడని యాస్త్రీ అమ్మగారి నడిగెను.

అమ్మగారు: వారు నామాట వినకపోవచ్చును.

స్త్రీ: అమ్మా! మీ యూహయేమి? వారు మీ మాటను శిరసావహించి తీరవలెను.

అమ్మగారు: ఈ విషయమున నాకోరికను వారు మన్నింపక పోవచ్చును.

ఆస్త్రీ పట్టినపట్టును విడువకుండుటను జూచి, "మంచిది. శాస్త్రిగారి నడిగెదను. ఆయన నీకు మంత్రోపదేశము చేయును" అని అమ్మగారు చెప్పిరి. కాని యాస్త్రీ తన మొదటి కోరికనే తిరిగి ప్రారంభించి పట్టుపట్టుచు, "మీరు నాకు మంత్రోపదేశము చేసినచో నాకు పరమానందముగా నుండును. మీ కిష్టమున్న యెడల, నాకోరికను మీరు తప్పక నెరవేర్పగల సమర్థులు," అని చెప్పి పదిరూపాయలను బయటకుదీసి, "ఈ పైకమును పుచ్చుకొని మంత్రోపదేశమునకు కావలసిన వస్తువులను మీరు కొనవచ్చును." అని పలుక సాహసించెను.

*　　　*　　　*

ఇట్టి అగౌరవకార్యమునకు మేమందరమును సిగ్గుపడితిమి. ఈతడవ శ్రీమాతృదేవి కోపము తెచ్చుకొని "ఏమి; నీవు నాకు డబ్బునుచూపి బెల్లింప కోరుచుంటివా? ఈ కాసులతో నీవు నన్ను వశపరచుకొనజాలవు. వీనిని తీసికొని పొమ్ము" అను పరుషముగ పల్కి వెంటనే గదినివిడచి వెళ్లిపోయిరి. ఆమె మిక్కిలి పట్టుపట్టుటుదకెట్లో మాతృదేవి మహాష్టమినాడు మంత్రోపదేశము నొసర్ప 'నంగీకరించిరి. తరువాత, ఆమె తొందరగనే వెళ్లిపోయెను. అప్పుడు నాతో మాట్లాడ అమ్మగారికి కొంత అవకాశము చిక్కినది.

*　　　*　　　*

రెండు నెలల పదునైదు నాళ్లైన తరువాత, అమ్మగారిని నేను చూచినప్పుడు, 'ఆహా! నిన్ను చూచి యొకయుగమైె

నట్లున్నది!' అని తమకు నాయందుగల ప్రేమాతిశయమును ఉత్కంఠతో నామె వెల్లడించిరి. క్రిందటిసారి మంత్రోపదేశమునకై పట్టుపట్టిన స్త్రీనిగురించి ప్రసంగవశమున నామె నడిగితిని.

అమ్మగారు: నిర్ణీతమైనదినమున నామె రాలేకపోయెను. "నాకిప్పుడు జబ్బుగానున్నది. కొంచెము నెమ్మదిగానున్న తరువాత నీకు మంత్రోపదేశము చేసెదను." అని నేనామెతో చెప్పినట్లే జరిగినది. మహాష్టమిదినమున నామెయే జబ్బుపడి రాజాలక, చాలనాళ్లైన తరువాత వచ్చినది. మంత్రోపదేశముచేసితిని.

భక్తురాలు: మీ నోటినుండి వచ్చుమాటలు జరిగితీరును. మీ సంకల్పములకు విరుద్ధముగ నడచుటచేతనే మేము కష్టపడుచుందుము. మీకు జబ్బుగా నున్నప్పుడుకూడ, మాబోంట్లకు మంత్రోపదేశము చేయుటకు సమ్మతించుటవలన, మా బాధలనన్నిటిని మీరు భరించి, మునుపటికంటె నెక్కువకష్టపడుచుందురు.

అమ్మగారు: ఔనమ్మా! ఇతరుల బాధలను తాము వహించియుండనిచో, తమశరీర మెంతమాత్రము కష్టపడియుండెడిది కాదని శ్రీరామకృష్ణులుకూడ చెప్పుచుండెడువారు.

నాతో నావదినెకూడ వచ్చెను. ఆమెనుగురించి, "ఎంత మంచిపిల్ల! ఎంతశాంతస్వభావము! ఉన్నదొకటే కూర. ఆ కూరయొకటియు రుచిగానుండనిచో, భోజనమంతయు పాడైపోవునుగదా." అని అమ్మగారు చెప్పిరి. నాకొకవదినెయే యున్నదనియు, ఆమెమంచిది కానిచో నా జీవితము దుఃఖమయమైయుండెడిదనియు దీని అర్థము.

1914-వ సం॥ ఫిబ్రవరి.

నే నొకనాటి ప్రొద్దుట గంపనిండ పువ్వులను దీసికొని బాగ్‌బజారుకు వెళ్లి, వానిని శ్రీమాతృదేవికి సమర్పించితిని. ఆమె యపరిమితముగా సంతోషించి, వానితో శ్రీరామకృష్ణుల ప్రతిమ నలంకరింప జొచ్చిరి. అందుండి అమ్మగారు కొన్ని నీలపు రంగు పువ్వులను తమచేతులతో దీసి, "ఆహా! ఎంతసొగసైన రంగు! దక్షిణేశ్వరములో ఆశా యను పేరుగల యొక బాలిక యుండెను. ఒక నా డామె గుడితోటలోనికివచ్చి, నల్లని ఆకులు గల యొక మొక్కనుండి యొక ఎఱ్ఱని పువ్వునుగోసి, 'అమ్మయ్యో! నల్లనియాకుల చెట్టునకు, ఎంత ఎఱ్ఱనిపువ్వు! భగవంతుని సృష్టి ఎంత విచిత్రమైనది! ఔరౌరా!' అని యేడ్వ మొదలుపెట్టెను. శ్రీరామకృష్ణు లాపిల్లనుజూచి, 'అమ్మాయీ! నీ బాధయేమి? ఆలాగున నీ వెందు కేడ్చుచున్నావు?' అని అడిగిరి. ఒక్కమాటయైన చెప్పలేక యామె విడువకుండ నేడ్చుచుండెను. శ్రీరామకృష్ణులు చివరకామెను శాంతింపజేసిరి." అని చెప్పిరి.

అమ్మగా రున్నతిమానసికస్థితిలో "ఈ నీలిరంగుపువ్వులను చూడుము! ఇటువంటి సొగసైనపువ్వులు లేనిదే భగవంతుని అలంకరించుట యెట్లు!" అని చెప్పి చేతినిండ పువ్వుల నుంచుకొని శ్రీరామకృష్ణుని ప్రతిమకు సమర్పించు లోపున వానిలో కొన్ని యామెపాదములపై బడెను. "ఇదేమమ్మా! భగవంతునకు సమర్పింపకముందే ఈ పువ్వులు నా పాదములపై నెట్లుపడినవో!" అని యామె నిర్ఘాంతపడిరి. "బాగు బాగు!" అని చెప్పి, "శ్రీరామకృష్ణులవారు మీకు మాత్ర మెక్కువవారు

కావచ్చును. కాని మేము మీకును ఆయనకును ఏవిధమైన భేదమును పాటింపము,'' అని నేను లోలోన తలంచితిని.

ఇంతలో నొక వితంతుస్త్రీ గదిలోనికివచ్చెను. ఆమె విషయమై నేనడిగినమీదట ''ఇంచుమించుగా నొకనెల క్రింద నావద్ద నామె మంత్రోపదేశము నొందినది. అంతకు పూర్వ మీమె మఱియొక గురువును స్వీకరించి, పిమ్మట తనపొరపాటును గ్రహించి నాకడకు మంత్రోపదేశమునకై వచ్చెను. నేనెంత చెప్పినను, గురువులందరు నొకటేయను విషయము నామె యొప్పుకొనలేదు. వారందరియందును ప్రజ్వలించుదైవబల మొక్కటే.'' అని అమ్మగారు చెప్పిరి.

మధ్యాహ్నము సంభాషణ మరల పువ్వులపైకి పోయెను.

శ్రీరామకృష్ణుల జీవిత విశేషములు

అమ్మగారిట్లు చెప్పిరి: ''నేను దక్షిణేశ్వరమునం దుండునప్పుడు కొన్ని ఎఱ్ఱని పువ్వులను, కొన్ని మల్లెపూవులను గ్రుచ్చి ఏడుపేటల పెద్దదండగా నొకనాడు కట్టి, దాని నొకరాతి గోలెమున నీళ్లలో నానవైచితిని. దండలోని మొగ్గలు త్వరలో బాగుగా వికసించినవి. దండను అమ్మవారి అలంకరణమునకై కాళీదేవాలయమునకు పంపితిని. నగలనన్నిటిని తీసివైచి, శ్రీ కాళీవిగ్రహమును ఆదండతో నలంకరించిరి. శ్రీరామకృష్ణులు దేవాలయములోనికివచ్చి, పూలయలంకారముతో నతిశయించిన కాళికాదేవి సౌందర్యమును జూచినవెంటనే మహానందపరవశులై 'ఆహా! ఇంద్రనీలప్రభాసమానమైన అమ్మశరీరమునకు ఈపూలెంత వింతయందమును గూర్చుచున్నవి! ఈదండ నెవరు కట్టిరి?' అని రెట్టించి యడుగ సాగిరి. అచ్చటనుండిన వారిలో

నెవరో నాపేరుజెప్పిరి. అంతట 'వెళ్లి ఆమెను దేవాలయమునకు తీసుకొనిరండు' అని యాయన సెలవిచ్చిరి. నేను మెట్ల దగ్గరకు వచ్చి అచ్చట బలరామబాబు, సురేశబాబు మొదలైన భక్తులుండిరని కనిపెట్టి, అత్యధికలజ్జా పరవశనై బాగుగా మేలి ముసుగును మోమున సర్దుకొనుచు, బృందయను పరిచారిక చాటున దాగుకొని దేవాలయమునకు వెనుకవైపునగల మెట్లమీాదుగా లోనికి ప్రవేశింప సిద్ధపడుచుంటిని. ఈ నా ప్రయత్నమును శ్రీరామకృష్ణులు వెంటనే కనిపెట్టి, 'ఆ మెట్లమీాదుగా వచ్చుటకు ప్రయత్నింపకుము. ఆ మెట్లెక్కుచు మొన్ననే ఒక పల్లెది కాలుజారి క్రిందపడినది. పాపమామె ఎముకలు బ్రద్దలై చనిపోయెను! ముందువైపునగల ఈ మెట్లెక్కియే రమ్ము!' అని చెప్పిరి. ఆ మాటలు విని భక్తులందరు నాకు దారి నిచ్చిరి. నేను దేవాలయము లోనికి వెళ్లినప్పుడు, భక్తిభావోద్రేకములో కంపించుచుండిన గద్గదస్వరముతో శ్రీరామకృష్ణులు సంకీర్తనము చేయుచుండిరి.''

భగవత్సాక్షాత్కారము-దైవకృప

ఇంతలో కొంతమంది భక్తురాండ్రు గదిలోనికి వచ్చిరి. అమ్మగారి సంభాషణ అంతటితో ముగిసెను. నేను సెలవుతీసికొని వెళ్లుటకు సమయమైనది. మరల అమ్మగారు భగవత్సాక్షాత్కారమును గురించి ప్రసంగించుచు ''అమ్మాయీ! ఈ విషయమెట్టిదో నీకు తెలియునా? ఇదియొక శిశువుచేతిలోని కలకండముక్క వంటిది. కొంతమంది యాశిశువును దానిని తమకిమ్మని ఎంత అడిగినను ఇయ్యడు; కాని, తనకిష్టమున్న మఱియొకనికి అడిగినవెంటనే ఇచ్చివేయును. తన యావజ్జీవము నొక

మనుష్యుడు భగవత్సాక్షాత్కారముకొరకు ఎన్ని కఠిన సాధనలను చేసినను లాభములేకుండును. కాని, మఱియొకరికి ప్రాయికముగా ఏకృషియు లేకయే పరమార్థము లభించును. ఇది భగవంతుని దయపై ఆధారపడియున్నది. ఆయన తనకిష్టమున్నవారికి తనదయను ప్రసాదించును. దైవకృపయే బహు ముఖ్యము.

*　　*　　*

1917-వ సంవత్సరము

శ్రీ మాతృదేవిని సాయంకాలము సందర్శింప వెళ్లితిని. అప్పుడు నేను బాగ్‌బజారులోని మా యింటియందు నివసించుచు ప్రతిదినము అమ్మగారిని వెళ్లిచూచుచుంటినని చెప్పవచ్చును. ఆమె యొక్కరే యుండినందున "అమ్మా! ఒకనాటిరాత్రి శ్రీరామకృష్ణులవారు నాకు కలలో కనుపడిరి. అప్పుడు మీరు జయరాంబటిలో నివసించుచుంటిరి. నేనాయనకు నమస్కరించి 'అమ్మగారెక్కడ నున్నారు?' అని యడిగితిని. 'ఆ సందులోనికివెళ్లుము. నీకొక పూరియిల్లు కనుపడును. ఆమె యాయింటిముందరి వసారాలో కూర్చుండియున్నా'రని యాయన బదులుచెప్పెను" అని కలలో జరిగినవిషయము నామెకు వివరించితిని. అమ్మగారు మహోత్సాహముతో శయ్యలోనుండి లేచి కూర్చుని, "నీవు చెప్పినదంతయు నిజము. నీ కల నిజము!" అని చెప్పిరి. అందుపై నేనాశ్చర్యపడుచు, "అట్లైన ఆవిషయమే నిజమా?" అని అడిగితిని. "జయరాంబటిలో మీయిల్లు గచ్చుకట్టడమై యుండునని యూహించితిని. కాని కలలో మట్టినేల, పూరికప్పు మొదలైనవానిని జూచి, అదృశ్యమంతయు కేవలము భ్రమయని నిశ్చయించితిని." అని చెప్పితిని.

భగవత్సాక్షాత్కారము కొఱకు చేయవలసిన సాధనను గురించి చెప్పుచు, "గోలప్‌మాయియు, యోగినీమాయియు తమకాలములో విశేషభాగమును భగవద్ధ్యానస్మరణలకు వినియోగపరచిరి. యోగినీమాయి చాల కఠినసాధన చేసెను. ఒకప్పుడామె పాలను, పండ్లను మాత్రమే పుచ్చుకొనుచు, జీవించెను. నేడుకూడ తనకాలము నెక్కువగా ఆధ్యాత్మిక సాధనలలో నామె గడపుచుండును. గోలప్‌మాయి మనస్సు బాహ్య విషయములచే చలింపదు. బజారులో విక్రయింపబడు వంటకూరలు తినుట కామె సంకోచింపదు. హిందూ బ్రాహ్మణ వితంతువు లట్టికూరలను చేతితోకూడ నెన్నడును తాకరు." అని అమ్మగారు సెలవిచ్చిరి.

అమ్మగారి యింటిలో నాటి సాయంకాలము కాళీకాదేవి భజన జరుపుటకు సన్నాహముచేసిరి. బేలూరు మఠసన్న్యాసులు వచ్చి సంకీర్తనములో పాల్గొనెదరు. రాత్రి యెనిమిదిన్నర గంటలకు భజన ప్రారంభమయ్యెను. కీర్తనలను వినుటకు చాలమంది భక్తురాండ్రు వసారాలోనికి వెళ్లిరి. నేను శ్రీ మాతృదేవి పాదములకు నూనెను మర్దన చేయుచుంటిని. ఆపాటలు నే నింతకుముందెన్నిసారులో విన్నవే. గదిలోనుండి వానిని వినగలిగితిని. భక్తుల ముఖములనుండి వెడలివచ్చుచున్నందున నా కాపాటలు నాకు సరి క్రొత్తవిగా కనుపడినవి. వాని పటుత్వ మింతింతయని చెప్ప సలవిగాకుండెను. నాకన్నులు బాష్పపూరితము లైనవి. మధ్య మధ్య వారు శ్రీరామకృష్ణులు పాడిన కీర్తనలనే పాడుచుండిరి. అట్టి సమయములందు శ్రీ మాతృదేవి ఉత్సాహాతిశయమున, "ఔను! శ్రీ రామకృష్ణు లీ కీర్తన పాడెడివారు!" అని బిగ్గరగా చెప్పు

చుండిరి. సన్న్యాసులు "శ్రీ విశ్వేశ్వరీ పాదారవింద సౌందర్య సమ్మోహితమైనది నాచిత్త భ్రమరము!" అను చరణముతో ప్రారంభమగు కీర్తనను మొదలుపెట్టిరి. శ్రీమాతృదేవి యింక పరుండలేకపోయిరి. ఆమె చెక్కిళ్లపై కన్నీరు ప్రవహించుచుండ "అమ్మాయీ, రా! మనము వసారకడకు పోవుదము," అని చెప్పిరి. సంకీర్తనమైన తరువాత అమ్మగారికి నమస్కరించి, నే నింటికి తిరిగివచ్చితిని.

1918-వ సం జూలై 22-వ తేది

శ్రీ మాతృదేవి యింటికి నేను వచ్చినప్పుడు సాయంకాల మేడుగంటల ముప్పది నిముషములైనది. అమ్మగారు స్వగ్రామమునుండి తిరిగివచ్చి రెండునెలలే యైనది. అచ్చట మన్య జ్వరముచే చాలకాలము బాధపడి, యామె మిక్కిలి చిక్కిపోయిరి. సహజ మందహాసముతో నన్నాదరించి, "నేడు చాల ఉక్కగా నున్నది. కొంచెము విశ్రమించి, కోలుకొనుము. మీ చెల్లెలెట్లున్నది? ఆమె యింటికివచ్చినదా?" అని కుశల మడిగిరి.

భక్తురాలు: ఔనమ్మా, ఆమె యింటికి వచ్చినతరువాతనే, బయలుదేరితిని.

అమ్మగారు: ఈ విసనకఱ్ఱ తాఁకిచ్చి, యీ తైలమును నా వీపుపై రాయుము. నా శరీరమంతటను ఉడుకుపొక్కులు బయలుదేరినవి." నేను నూనెను రాయుటకు మొదలుపెట్టిన తోడనే, సాయంకాలపూజకు గంటకొట్టిరి. అమ్మగారు తాము పరుపుపై కూర్చుండి, చేతులు జోడించి భగవంతునకు నమస్క-

రించిరి. తక్కిన భక్తురాండ్రు పూజను చూచుటకు పూజామందిరమునకు వెళ్లిరి.

'''ఈ లోకము దుఃఖమయము. మేము దైవము నెంత ప్రార్థించినను, మా దుఃఖమున కంతము లేకున్నది.' అని యెల్లరు విచారముతో జెప్పుచుందురు. దుఃఖము భగవంతు డనుగ్రహించు వరమేకాని వేఱొకటి కాదు. అది పరమేశ్వరుని దయాచిహ్నము. ఇది నిజము కాదా?'' అని అమ్మగారు చెప్పిరి.

దుఃఖమునకు అర్థము.

ఆ నాడు నేను మనస్సులో చాల బాధపడుచుంటిని. ఆ సంగతిని తెలిసికొని, నన్నుద్దేశించియే శ్రీమాతృదేవి యిట్లు చెప్పిరి. ఆమె యీ విషయమై యింకను నిట్లు సెలవిచ్చిరి: ''ఈ లోకములో దుఃఖమనుభవించని వారెవరున్నారు? శ్రీ కృష్ణునితో నతని భక్తురాలు బృందయను నామె యిట్లు చెప్పెను: 'నీవు దయకలవాడవని యెవరు చెప్పుదురు? నీ రామావతారకాలమున యావజ్జీవమును నీ కొఱకై సీత నేడ్పించితివి. ఈ నీ కృష్ణావతారములో రాధ నీ నిమిత్తమై యేడ్చుచున్నది. నీ తల్లిదండ్రులు కంసుని చెఱసాలలో నపరిమితబాధ నొందుచు, రేయింబవళ్లు నీ నామముచ్చరించుచు విలపించిరి. అట్లైనను, నే నెందుకు నీనామస్మరణ చేయుచుందును? నీ నామము మరణ భయమును సమూలముగా పెకలించి వేయును గనుకనే!''

''అటువంటి యాకారముగల జనులకు సామాన్యముగా భగవంతునియందు భక్తియుండదు. ఇది శ్రీరామకృష్ణులవారు చెప్పగా వింటిని.'' అని యొక స్త్రీనిగురించి శ్రీమాతృదేవి చెప్పిరి.

భక్తురాలు : ఔనమ్మా! కపటహృదయులకు ఆధ్యాత్మికాభివృద్ధి చేకూరదని ఆయన చెప్పుచుండినట్లు శ్రీరామకృష్ణ వచనామృతమను పుస్తకములో చదివితిని.

అమ్మగారు : ఓహో! నీ వావిషయమై చెప్పుచుంటివా?

చేసిన పాపము, చెప్పిన పోవును.

ఆ మాటలాయన నరేనను భక్తుని యింటిలో చెప్పెను. ఒక మనుష్యునకొక యుంపుడుకత్తె యుండెను. ఒకసారి యామె శ్రీరామకృష్ణుల యొద్దకువచ్చి, "ఆ పురుషుడు నన్ను నాశనముచేసి, పిమ్మట నాయొద్దనుండిన సొమ్మును నగలను అపహరించెను," అని పశ్చాత్తాపముతో జెప్పెను. శ్రీ రామకృష్ణులు జనుల మనస్సులలో దాగియుండిన రహస్యముల నెఱిగియుండినను, వారి నోటినుండి ఆయావిషయములను గురించి వినగోరెడివారు. "ఇది నిజమా? ఆయన భక్తినిగురించి మాకు మహోపన్యాసములను చేయుచుండువాడే," అని ఆ స్త్రీతో చెప్పి, ఆధ్యాత్మిక వికాసము నడ్డగించు గుణములను వర్ణించిరి. అయినను, ఆస్త్రీ తన పాపములన్నిటిని నాయనయొద్ద నొప్పుకొని వాని దుష్టఫలముల ననుభవింపకుండ తప్పించుకొనెను.

నళిని : అమ్మా! అది యెట్లు పొసగును? ఊరక తన పాపమును చెప్పినంతమాత్రమున నెవరైనను పాపవిమోచన నెట్లు పడయగలరు? ఈ రీతిని పాపములను పోగొట్టుకొనుట సాధ్యమా?

అమ్మగారు : ఎందుకు సాధ్యముకాదమ్మా? శ్రీ రామకృష్ణులు పరిపూర్ణులు. అట్టి మహాపురుషునియొద్ద తన పాపము నొప్పుకొనినవారికి తప్పక ఆ పాపము నాశనమగును. శ్రద్ధగా వినుము;

ఒకానొకచోట జనులు పాపపుణ్యములను గురించి సంభాషించిన యెడల, అచ్చటనున్నవారికి ఆ గుణములు పట్టుపడును.

ఇది యెట్లు వీలగును?

అమ్మగారు : నేను సవిస్తరముగా తెలిపెదను, వినుము. ఒక మనుష్యుడు తన పుణ్యమునో పాపమునో నీ యొద్ద నొప్పుకొనె ననుకొనుము. అటుతరువాత ఆ మనుష్యుడు నీ తలపునకు వచ్చినప్పుడెల్ల, అతని పుణ్యకార్యములో పాపములో నీకు జ్ఞప్తికి వచ్చుచుండును. ఆ విధముగా నీ మనస్సులో అవి హత్తికొని యుండును. అమ్మాయీ! ఇది నిజముకాదా?

తిరిగి ప్రసంగము మానవజీవిత దుఃఖముపైకి మరలెను. ''చాలమంది జనులు నా దగ్గరకువచ్చి తమ తమ వ్యథలను చెప్పుకొనుచుందురు. 'మాకు భగవత్సాక్షాత్కారము కాలేదు. మాకు శాంతి యెట్లుకలుగును?' అని గోలపెట్టుచుందురు. అందుపై, ''వీరెందుకిట్లు నా దగ్గర చెప్పెదరు? నేను అమానుషవ్యక్తినా? చింత యన నేమో నే నెన్నడు నెఱుగను. కోరినపుడెల్ల భగవత్ప్రసన్నము నాకు కరతలామలక మగుచుండును......''
అను భావము నా మనస్సులో మెఱపువలె మెఱయును.

ప్రసంగము నింకను సాగించుచు అమ్మగారిట్లు చెప్పిరి: 'మ–' రచించిన శ్రీరామకృష్ణ వచనామృతము చాల బాగున్నది. అతడు శ్రీగురుదేవుని మాటలను యథాతథముగా లిఖించియుండుటయే దీనికి కారణము. ఆహా! ఆ మాట లెంత మధురములు! నాలుగైదు పుస్తకములకు సరిపడిన సామగ్రి యాతనియొద్దనున్నదని వినుచున్నాను. కాని, అతడిప్పుడు ముసలివాడైనాడు. ఈ పనిని నిర్వహింప గలడో లేడోయని నా

సందేహము. ఆ గ్రంథమును విక్రయించి ధనమెంతయో గణించి అత డొకచోట వడ్డీకి వేసియుంచెను. జయరాంబటిలో నా గృహ నిర్మాణమునకై వేయిరూప్యముల నిచ్చుటయేకాక, ఆ సందర్భ మున తగిలిన యితర వ్యయములనుకూడ నాతడు భరించెను. ఇంతేకాక, నెలనెలకు పదిరూప్యము లతడు నాకు పంపుచుం డును; నేను కలకత్తాలో నుండునపు డిరువదియో, అంతకంటె నెక్కువగనో రూప్యము లిచ్చుచుండును. ఇంతకు పూర్వము నెలకు రెండురూప్యముల నాతడు నా కిచ్చుచుండువాడు; అప్పు డతడొక పాఠశాలలో నుపాధ్యాయుడు.''

భక్తురాలు: ఆరంభములో సన్న్యాసుల పోషణ నిమిత్తము గిరీశబాబు విస్తారముగా ధనమిచ్చెనని చెప్పెదరు.

అమ్మగారు: అంత యెక్కువగా నీయలేదు. ఆ విషయ మున సురేశమిత్రుడు సమృద్ధిగా ధనసాహాయ్యము చేసెను. గిరీ శుడుకూడ అప్పుడప్పుడు ధనమిచ్చుచుండెను. ఒకప్పు డతడు పదునెనిమిది నెలలవరకు నాకైన వ్యయములన్నిటిని భరించెను. విస్తారముగా ధనమెక్కడనుండి తెచ్చి యియ్యగలడు? అతడేమ్న డును భాగ్యవంతుడు కాడు. ఆతని జీవిత ప్రారంభదశకూడ అంత నిర్మలమైనది కాదు; దుష్టులతో సహవాసము చేయుచు, నాట కములలో వేషము వేయువాడు. కాని, అతని విశ్వాసము మహో ద్భుతము. అందుచేతనే యాతనికి శ్రీరామకృష్ణుల దయ లభిం చెను. ఈ అవతారములో శ్రీరామకృష్ణులు గిరీశు నుద్ధరించిరి. భూమిపై భగవంతు డవతరించినప్పుడెల్ల, పతితుల నిట్లే ఆ దయామయుడు పావనమొనర్చు చుండును. గౌరాంగుడు జగాయ్, మాధాయ్ (జగన్నాథమాధవులు) అను నిరువురు సోదరు

లను రక్షించెను. గిరీశునియందు శివాంశము కలదని శ్రీ రామ కృష్ణులొకసారి చెప్పిరి. అమ్మాయీ! ధనములో నేమున్నది? శ్రీ రామకృష్ణులు దానిని తాకజాలకుండిరి. ధనమును తాకినచో ఆయనచేయి కొంకరలు పోవును. 'ఈ లోకము స్వప్నమువంటిది. అది యథార్థమని నే నెఱిగియుండినచో, మీ కమార్పుకూరునకు బంగారు తొడుగును వేయించి యుందును. కాని, అది అనిత్యమని నాకు తెలియును. భగవంతుడొక్కడే నిత్యుఁడు.' అని ఆయన చెప్పిరి.

''నే నొకచోట కుదురుగా నుండలేను కదా!'' అని అమ్మ గారి మేనకోడలు మకు అను నామె విచారముతో చెప్పెను. ''ఏమీ? నీవెచ్చట నున్నను నీ యింటిలోనున్నట్లే సుఖముగానుండ వలెను. నీ అత్తింటివారి గ్రామములో సుఖముగా నుందువని నీవు తలంతువు. అది యెట్లు సాధ్యము? అతని జీతము స్వల్పము. అంత స్వల్పద్రవ్యముతో నీ వెట్లు సంసారము గడపగలవు? నీవు నాతో నివసించుచున్నావు. ఇది నీ పుట్టినిల్లు వంటిదే. పెండ్లియైన బాలిక లొక్కొకపుడు తమ పుట్టినిండ్లకుపోయి, కొంతకాల ముండుట వాడుక కాదా? కొంచెము త్యాగ మభ్యసింపలేవా?''

ఆ సమయమున యోగినీమాయి కిటికీయొద్ద నిలువబడి యుండ, నే నామెతో మాట్లాడుచుంటిని. ఆమె నుద్దేశించి, ''లోనికి రా. ఈ దినములలో నీ దర్శనమే అరుదై పోయినది.'' అని అమ్మగారు చెప్పిరి. యోగినీమాయి నవ్వి, గదిలోనికి వచ్చి నది. ఆమె పాదము నాకు తగిలెను. ఆమె చేతులు జోడించి నాకు నమస్కరింప బోవుచుండగా, నే నామెనువారించి, సాష్టాంగ దండప్రణామముచేసి, ''యోగీన్ మా! ఇదేమమ్మా! మీ పాద

ధూళిని గ్రహించుటకుగూడ నే నర్హురాలను గాను. మీ పాదము నాకు తగిలినంతమాత్రమున, నాకు మీ రేల నమస్కరింపవల యును?'' అని విన్నవించితిని. అప్పుడామె, ''ఎందుకా? చిన్న దైనను, పెద్దదైనను పాము పామే. మీ వంటి భక్తురాండ్రందఱును మాకు గౌరవనీయులు,'' అని బదులు చెప్పెను. అమ్మ గారివైపు తిరిగి నేను చూచితిని. ఆమె మోముకూడ దయామృత తేజోవిరాజితమగు మందహాసముతో నొప్పుచుండెను. నేను సెలవు తీసికొని, రాత్రి ప్రొద్దుపోయి యింటికి వచ్చితిని.

1918-వ సం॥ జూలై 28-వ తేది

బాగ్‌బజారులోని శ్రీమాతృదేవి యింటికివచ్చి నే నామెను సందర్శించు నప్పటికి సాయంకాలమైనది. సాయంకాలపూజ ప్రారంభము కానున్నవేళకు, వృద్ధవితంతు వొకయామె వచ్చి, తన శిరస్సును అమ్మగారి పాదములపై నుంచి నమస్కరించెను. అమ్మ చాలవిసిగికొని, ''తలతో పాదము లెందుకు తాకెదవు? నా ఆరోగ్య మెంతమాత్రమూ బాగులేదు. ఇటువంటి సందర్భములవలన అది మఱింత చెడును,'' అని చెప్పెను. ఆ వితంతువు వెళ్లినతరువాత, శ్రీమాతృదేవి తన పాదములను కడిగికొనెను.

కొంత తడవైన తరువాత, అమ్మగారికి నేను తైలమును రాయుచుంటిని. ప్రసంగము లలితబాబుపైకి మరలెను. గృహస్థులగు గొప్పభక్తులలో నతడొకడు. ''అతడొకప్పుడు ప్రాణాపాయకరమైన వ్యాధితో బాధపడుచుండెను. కాని, మీ దయా విశేషమువలన మరల నారోగ్యవంతుడై నాడని వింటిని,'' అని చెప్పితిని.

అమ్మగారు : అతని కెన్నికోరికలో యుండెను. కాని శరీర మంతయు రక్తహీనమై యుబ్బుచూప, బ్రతుకునను ఆశయేలేక చివరకాతనికి ప్రాణముమీదికి వచ్చెను. ఇట్టిస్థితిలో "అమ్మా! నాకు కమార్పుకూరులోను, జయరాంబటిలోను దేవాలయములను, ఆసుపత్రు (ఔషధశాల) లను కట్టించవలెనను కోరిక మిక్కుట ముగా నున్నది. కాని ఈ నాకోరిక ఫలించునట్లులేదు," అని ఆతడొకసారి బహుదీనస్వరమున నాతో జెప్పెను. ఆహా! ఆసారి శ్రీ రామకృష్ణులవా రతని ప్రాణమును కాపాడిరి. ఇప్పు డతడు తన యూహలను ఆచరణాలోనికి తేగోరుచున్నాడు. ప్రయత్నింపనిమ్ము. అతడు నా కొక చెరువును కొనియిచ్చెను.

1918–వ సం॥ జూలై 29–వ తేది

ప్రేమానందస్వామిని గురించి

శ్రీ రామకృష్ణుల శిష్యుడు, ప్రేమానందస్వామి సాయం కాలమున పరమపదించెను. కనుచీకటి పడుచుండినప్పుడు నేను అమ్మగారిని దర్శింప వెళ్లితిని. "అమ్మాయీ! లోనికి వచ్చి కూర్చుండుము. నేడు నా బాబూరామ్ వెళ్లిపోయెను. ఉదయమునుండి యేడ్చుచున్నాను," అని చెప్పి అమ్మగారు మరల కన్నీరు నించుచు, ఇట్లు నుడివిరి : "బాబూరామ్ నాకు అత్యంతాప్తుడు. బేలూరుమఠ మహా వటవృక్షమునకు ప్రాణబీజ ములగు మనోజవము, బలము, భక్తి, యుక్తి మున్నగు సుగుణము లన్నియు నతనిలో మూర్తీభవించినవి. ఇంతయేల? అతడు మఠ మునకు జీవమని చెప్పవచ్చును. ఆతని తల్లి నిలుపేద. వారసత్వ రీతిని తండ్రి సొత్తు సంక్రమించిన కారణమున, నామె యించుక గర్వపడుచుండెను. ఈ విషయ మామెయే నాయొద్ద నొప్పుకొని

'నాకు కొన్ని బంగారునగలుండెను. ప్రపంచ మొక బురదగుంట యని తలంచితిని,' అని చెప్పెను. ఆమెకు నలుగురు బిడ్డలుండిరి. ఒకబిడ్డమాత్ర మామె కంటిముందుగా చనిపోయెను.'' శ్రిత సాధుజీవులయం దిట్టి యవ్యాజవాత్సల్యముగల జగదేక జనని శ్రీ మహాలక్ష్మికదా శ్రీ మాతృదేవి! శ్రీమాతృదేవి కొంతతడవైన తరువాత చిత్రపటమునందలి శ్రీ రామకృష్ణుల పాదములపై తన తలనుంచి హృదయభేదకమైన స్వరముతో ''ప్రభూ! నా బాబూరామ్‌ను తీసుకొనివెళ్లితివి!'' అని విలపించెను. నేను కన్నీళ్ల నాపుకొనలేక పోయితిని. గోలప్‌మాయి కూడ రక్తగ్రహణితో మిక్కిలి బాధపడుచు ప్రాణాపాయస్థితిలో నుండెను.

1918-వ సం॥ జూలై 30-వ తేది

అప్పటికి రాత్రి యేడుగంటల ముప్పది నిముషములైనది. శ్రీ మాతృదేవి పూజామందిరములో కూర్చుండిరి. ఈనాడు కూడ ఆమె ప్రసంగము కీర్తిశేషుడైన ప్రేమానందస్వామిపైననే పోయెను. ''అమ్మాయీ! కడసారి జబ్బు వచ్చినపిదప బాబూరామ్ శరీరము రక్తమాంసము లెంతమాత్రము లేని యస్థిపంజరమై పోయెను,'' అని ఆమె చెప్పిరి. ఈ సమయమున గదిలోనికి చంద్రబాబు వచ్చి మా ప్రసంగములో పాల్గొనెను. కొందరు భక్తులు స్వాములవారి అంత్యక్రియలకై నాలుగైదువందల రూప్యముల విలువగల గంధపుచెక్కలు, వెన్న, పువ్వులు, సాంబ్రాణి మొదలగు వస్తువుల నిచ్చిరని, అత డమ్మగారితో చెప్పెను. ''వారి ద్రవ్యము నిజముగా సార్థకమైనది. ఒక భక్తునికై దానిని వారు వ్యయపరచిరి. భగవంతుడు వారికి సమృద్ధిగా సంపదనిచ్చెను, ఇంకను నెక్కువగా నియ్యగలడు.'' అని

అమ్మగారు చెప్పిరి. శ్రీ మాతృదేవియొద్ద సెలవుదీసికొని చంద్ర బాబు వెళ్లెను.

సామాన్య మానవులకును, మహాత్ములకును గల భేదము

శ్రీమాతృదేవి యింకను నిట్లు సెలవిచ్చిరి: "అమ్మాయీ, వినుము. మనుష్యుడెంత ఆధ్యాత్మిక సంపత్తిగలవాడైనను శరీర సంబంధములైన బాధలను, తుదకు మరణామును తప్పించుకొనజాలడు. కాని, మహాత్మునకును సామాన్యమానవునకును గల భేదమేమనగా, ఈ శరీరమును విడిచిపెట్టునప్పుడు సామాన్యమానవు డేడ్చును, మహాత్ముడు నవ్వును. మహాత్మునకు మరణ మొక యాటవలె కనుపడును."

ప్రేమానందస్వాముల వారియు శ్రీ రామకృష్ణుల వారియు జీవిత విశేషాంశములు

"హా! శ్రీ రామకృష్ణులవారిదగ్గరకు వచ్చినప్పుడు నా నాయన, బాబురాము చాల చిన్నవాడు. శ్రీ రామకృష్ణులాతనితో వేళాకోళము లాడెడివారు. నరేను (వివేకానంద స్వాములవారు) ను, బాబురామును కడుపుబ్బ నవ్వెడువారు. ఒకసారి కాశీపూర్ ఉద్యానభవనములో మేము నివసించుచుండినప్పుడు 5 సేర్ల పాలచెంబును చేత బట్టుకొని మెట్లెక్కుచుండగా నాకు తల తిరిగినది; పాలు నేలపై నొలికి పోయెను. నా మడమలు పట్లు తప్పిపోయినవి. నరేను, బాబురాములు అక్కడకు పరుగెత్తుకొనివచ్చి నా కుపచారము చేసిరి. కాళ్లు వాచి చాల పోటుపెట్ట నారంభించెను. ఈ ప్రమాదమును విని శ్రీ రామకృష్ణులు 'సరే, బాబురామూ! నేను చక్కని అవస్థలోనే చిక్కుకొంటిని, నాకింక పథ్యపానములను

సిద్ధముచేసి యిచ్చువా రెవరు?' అని బాబురాముతో చెప్పిరి. అప్పుడాయన గొంతులో పుండువలన బాధపడుచు, నూకల జావను మాత్రము తీసికొనుచుండిరి. నేను జావను సిద్ధముచేసి, మేడమీది యాయన గదిలోనికి తీసికొని వెళ్లి తినిపించెడు దానను, ఆ కాలమున నాకు ముక్కునకొక నత్తు ఉండెడిది. శ్రీ రామ కృష్ణులు తమ ముక్కును చేతితోతాకి వ్రేలితో చక్రాకార ముగా త్రిప్పి, అట్టి నగను ధరించు నన్నావిధముగా నాతనికి తెలుపుచు, 'బాబురామ్! నీ వామెను నొకగంపలో వేసికొని, ఆ గంపను నీ భుజముపై నిడుకొని ఈ గదిలోనికి మోసుకొని రాగలవా?' అని సంజ్ఞచేసి బాబురాముతో జెప్పిరి. నరేను బాబురాములు ఈ మాటనువిని కడుపు చెక్కలగునట్లు నవ్విరి. ఈ రీతిని వారితో శ్రీవారు హాస్యము లాడెడివారు. మూడు నాళ్లయిన తరువాత నా పాదములవాపు తగ్గినది. వారి సాయ ముతో నేను పథ్యమును మేడలోనికి మరల తీసుకొని వెళ్లి యిచ్చుచుంటిని.

'నాయందు నీకుగల ప్రేమ ఎంత స్వల్పమమ్మా' శ్రీ రామ కృష్ణులు నన్ను ప్రేమించునంతగా నీవు నన్ను ప్రేమింతువా?' అని బాబురాము తన తల్లితో చెప్పుచుండువాడు. 'ఏమి నీ అవి వేకము! నేను నీ తల్లినై యుండి నిన్ను ప్రేమింపనా! ఏమి నీ యూహ?' అని యామె రోషముతో బదులు చెప్పును. అంత అపారప్రేమామృత సాగరులు శ్రీ రామకృష్ణులు! నాలుగేండ్ల బాలుడై యుండినపుడు 'నేను పెండ్లి చేసుకొనను; అట్లు కానిచో చనిపోవుదును.' అని బాబురామ్ చెప్పుచుండువాడు. శ్రీ రామకృష్ణులవారు కంఠవ్రణముతో బాధపడుచు, నాహార

మును ప్రింగలేని స్థితిలోనుండినపు డొకనాడు 'ఇటు తరువాత సూక్ష్మశరీరముతో నేను లక్షలకొలది నోళ్లద్వారమున భోజనము చేయుచుందును.' అని చెప్పిరి. 'మీ లక్షలకొలది నోళ్లతోను, సూక్ష్మశరీరముతోను నాకు పనిలేదు. ఈ నోటి ద్వారమున మీరు భోజనముచేయుట, నేను మీ స్థూలశరీరమును జూచుచుండుట—ఇవియే నాకు కావలసినవి.' అని బాబురామ్ ప్రత్యుత్తరమిచ్చెను.

''చాలమంది బిడ్డలుకలవారి నెవరిని శ్రీ రామకృష్ణులు తమ శిష్యులుగా నెన్నడును స్వీకరింపలేదు. ఒక పురుషున కిరువదియైనుగురు బిడ్డలా? ఎంత సిగ్గుచేటు! అట్టివాడు మనుష్యుడా? ఆత్మనిగ్రహ మెంతమాత్రమును లేని పశుప్రాయుడు వాడు.''

గోలప్‌మాయి కొంతకాలమునుండి రక్తగ్రహణితో బాధపడుచుండెను. నేడే యామెకు కొంచెము నయముగానుండెను. ఆమె పూర్తిగా కోలుకొనుటకు మూడు నెలలు పట్టునని వైద్యుడు చెప్పెను. అమ్మగా రిట్లు నుడివిరి : ''రక్తగ్రహణి సామాన్యమైన వ్యాధి కాదు. శ్రీ రామకృష్ణుల వా రా వ్యాధితో తఱచుగ బాధపడుచుండువారు. అది యెక్కువగా వర్ష కాలములో వచ్చెడిది. ఒకసారి ఆయన మిక్కిలి ప్రమాదావస్థలోనుండిరి. నేనే యాయన కుపచారము చేయుచుండు దానను. కాశీనుండి యొక స్త్రీ దక్షిణేశ్వరమునకు వచ్చి, యొక మందును చెప్పెను. నే నామె చెప్పిన ప్రకారము చేసితిని; త్వరలో శ్రీ గురుదేవుని వ్యాధి నివారణమైనది. ఆ స్త్రీ కూడ అంతర్ధానమయ్యెను. ఆమె మరల నాకెన్నడును కనుబడలేదు. నిజముగా నామె నా కమూల్యమైన

సాయము చేసెను. కాశీలో నామెను గురించి యెందరి నడిగినను, నేనామెజాడను కనుగొనలేకపోతిని. శ్రీ రామకృష్ణుల కవసరము కలిగినప్పుడెల్ల యెక్కడెక్కడినుండియో మనుష్యులు దక్షిణేశ్వరమునకు తమంతట తామేవచ్చి, ఆయవసరము తీరిన వెంటనే యెట్లు వచ్చిరో అట్లే అకస్మాత్తుగా మాయమగుచుండువారు. ఇది మేము తఱచుగ చూచిన విషయము.

''అమ్మాయీ, నేనుకూడ గ్రహణితో బాధపడితిని. శరీరమస్థిపంజరమై పోయెను. నేను చెరువు దగ్గర పడుండెడు దానను. ఒకనాడు నీటిలో నా నీడనుచూచి, నా శరీరములో కొలదియెముకలు మాత్రము మిగిలియుండెనని గ్రహించి 'అయ్యో! ఈ శరీరమువలన నుపయోగమేమి? ఈ శరీరము నిక నిచ్చటనే, యిప్పుడే చాలింతును గాక!' అని తలచితిని. అంతలో నొక స్త్రీ వచ్చి 'ఏమమ్మా! మీ రెందుకిక్కడ నున్నారు? ఇంటికి పోవుదము రండు,' అని చెప్పి నన్నింటికి తీసుకొని వెళ్లెను.''

శ్రీమాతృదేవియొద్ద సెలవు గైకొని, నే నింటికి వెళ్లునప్పటికి రాత్రియాలస్యమైనది.

1918 సం॥ జూలై 31-వ తేది

శ్రీరామకృష్ణుల సన్న్యాస శిష్యులు

నేడు నేను వెళ్లినప్పుడు శ్రీమాతృదేవియొక్కరే యుండినందున, మా సంభాషణ ముఖ్యముగా శ్రీరామకృష్ణుల సన్న్యాస శిష్యులను గురించి జరిగెను. ప్రేమానందస్వామి నిర్యాణమువలన గాబోలు, అమ్మగారీ సన్న్యాసులను గురించియే విడువకుండ తలంచుచుండిరి. వారి విషయమై శ్రీమాతృదేవి యిట్లు చెప్పిరి: ''శ్రీరామకృష్ణులు బాగుగా పరిశోధనచేసిన

తరువాతనే తమ శిష్యులకు ఆశ్రయమిచ్చుచుండిరి. ఆయన నిర్యాణమైన తరువాత, బారానగర్ మఠములో వారెంత కఠిన దీక్షాబద్ధమైన జీవితమును గడపిరి! నిరంజనుడు మున్నగువారు తఱచుగా నిరాహారులై తమకాలమునంతయు ధ్యానప్రార్థనములందే వినియోగించుచుండిరి. ఒకనాడీ బాలసన్న్యాసులు 'మనము శ్రీరామకృష్ణుల పేరిట సర్వసంగపరిత్యాగము చేసితిమి. మన మాయనపై కేవల మాధారపడి యూరకున్నచో, మన కాయన అన్నము పెట్టునో పెట్టడో చూతుముగాక! మనకేమి కావలయునో యెవరితోడను గూడ మనము చెప్పవలదు. యాచనకైనను మనము బయలు దేరము!' అని తమలో తాముకూడ బలుకుకొని తమశరీరములనిండ బట్టలను కప్పుకొని, ధ్యానమునకు గూర్చుండిరి. పగలంతయు గడచిపోయెను. రాత్రికూడ చాల వరకు గతించెను. అప్పుడెవరో తలుపు కొట్టుచున్నట్లు వినవచ్చెను. నరేను తనస్థానమునుండి లేచివచ్చి, సోదరసన్న్యాసులలో నొకనితో 'తలుపు తెరచి యెవరువచ్చిరో చూడుము. ఆమనుష్యుని చేతిలో నేమైననున్నదేమో మొట్టమొదట చూడుము,' అని చెప్పెను. ఎంత అద్భుతమహిమ! తలుపు తెరచినతోడనే గంగానదీ తీరమునగల గోపాలస్వామివారి యాలయమునుండి రుచియైన ప్రసాదమును తీసికొని వచ్చిన మనుష్యుడొకఁడచ్చట నిలువబడియుండెను. అపరిమితానందభరితులై, శ్రీరామకృష్ణుల అభయహస్తమెల్లప్పుడును తమ్మురక్షించుచుండెనను విశ్వాసమతిశయిల్ల వారాపదార్థమును శ్రీరామకృష్ణునకు సమర్పించి, పిమ్మట ప్రసాదముగా భుజించిరి. ఇట్టి సంఘటనలెన్నిసారులో జరిగినవి....సన్న్యాసుల కిప్పు డిట్టికష్టమేమియును లేదు. నరేను

(వివేకానందస్వాములవారు)ను, బాబూరాము (ప్రేమానంద స్వాములవారు)ను ఎంతకష్టపడిరి ! ఇప్పుడు రామకృష్ణ ధర్మ ప్రచారసంస్థకు అధ్యక్షుడైన నారాఖల్‌కూడ ఎన్నాళ్లో వంట గిన్నెలు మొదలైనవానిని శుభ్రము చేయవలసివచ్చెను. ఒకప్పుడు నరేను ఉత్తరహిందుస్థానములో నొక సామాన్య సాధువుగ దేశాటనము చేయుచుండెను. రెండునాళ్లవరకు తినుటకాహారమేమియు దొరకక అతడొక చెట్టుక్రింద పరుండెను. రుచియైన భక్ష్యములను ఒక చెంబుతో మంచినీటిని పట్టుకొని ఒక మనుష్యుడతనిదగ్గరకువచ్చి నిలువబడి 'ఇది శ్రీరామప్రసాదము. దయయుంచి మీరు దీనిని తీసుకొనుడు !' అని చెప్పెను. 'నాప్రియమిత్రుడా ! నీవు నన్నెఱుగవు. పొరబడితివి. బహుశః ఈపదార్థములను వేఱొకరికొరకు నీవు తెచ్చియుందువు.' అని నరేను బదులు చెప్పెను. అప్పుడా మనుష్యుడు బహునమ్రుడై ''స్వామీ ! లేదులేదు. మీకొరకే ఈ ఆహారమును నేను తెచ్చితిని. మధ్యాహ్నము నాకు కొంచెము కునుకు వచ్చినప్పుడు కలలో నొక పురుషుడు కనపడి : ''త్వరగ లెమ్ము. ఆ చెట్టుక్రింద నొక సాధువు పరుండియున్నాడు. అతని కైదైన ఆహారము నిమ్ము'' అని నాతోచెప్పెను. ఇది కేవల మొకకలయని నిర్లక్ష్యముచేసి, ప్రక్కకు దొర్లి మరల నిద్రించితిని. ఆ పురుషుడు తిరిగి కలలో నాకు కనపడి నన్ను చేతితో త్రోయుచు, 'నిన్ను నేను లెమ్మనుచుండగా నీవింకను నిద్రించుచున్నావే! ఇక నెంతమాత్ర మాలస్యము చేయక నా యాజ్ఞను నెరవేర్పుము.'' అని నన్ను హెచ్చరించెను. అప్పుడు నేనిది కేవలము స్వప్నముకాదని గ్రహించితిని. స్వామీ ! ఇది శ్రీరామాజ్ఞ ! కనుక, దేవుని

యానతి ప్రకారము మీ కొరకీ భక్ష్యములను తీసికొని వచ్చితిని'' అని విన్నవించెను. ఇది యంతయు శ్రీరామకృష్ణుల దయా విశేషమేకాని వేరొండుకాదని తెలిసికొని ఆపదార్థములను నరేను సంతోషముతో స్వీకరించెను.

''ఇటువంటి సంఘటనమే మరి యొకనాడు జరిగెను. నరేను హిమాలయ పర్వత ప్రాంతములో మూడునాళ్లవరకు ఆహారమేమియు లేక సంచారము చేయుచు మూర్ఛపోవుటకు సిద్ధముగా నుండినప్పుడు, ఒక మహమ్మదీయ ఫకీరువచ్చి అతని కొక దోసకాయనిచ్చెను. అప్పటి కతని ప్రాణమును ఆకాయయే రక్షించినది. అమెరికాఖండమునుండి తాను తిరిగి వచ్చిన తరు వాత ఆల్మోరాలో నొకనాడొక సభయందు నరేను ఉపన్యసించు చుండెను. అప్పుడచ్చట నొకమూల గూర్చునియుండిన ఆ మహ మ్మదీయుని చూచి, నరేను వెంటనేవెళ్లి యతనిచేతిని బట్టుకొని తీసికొనివచ్చి ఆ సభలో మధ్యను కూర్చుండబెట్టెను. ప్రేక్షకు లందరు నాశ్చర్యపడుచుండ 'ఈయన యొకసారి నాప్రాణమును రక్షించెను.' అని జరిగినయుదంతమునంతయు చెప్పి ఆఫకీరునకు నరేను కొంత సొమ్ముగూడ నిచ్చెను. కాని ఫకీరు 'నేనేమి చేసితి నని ఈ రీతిని నాకు బహుమానమియ్యవలెనని మీ రాందోళన పడుచున్నారు ?' అని చెప్పి మొట్టమొదట దానిని తీసుకొనలేదు. కాని ఆతనిమాట నరేను వినక, ఆ పైకము నతని జేబులో బల వంతముగా నుంచెను.

''మొట్టమొదటి దుర్గపూజామహోత్సవమునకు, నరేను నన్ను బేలూరుమఠమునకు తీసికొనివెళ్లి అచ్చట పూజను జరి పించుచుండిన ఆచార్యునకు దక్షిణగా నిరువదియైదు రూప్యముల

నాచే నిప్పించెను. ఆ శుభసమయమున వారు పదునాల్గువందల రూప్యములను వ్యయపఱచిరి. మఠమంతయు జనులచే క్రిక్కిఱిసి యుండెను. సన్న్యాసులందరు కష్టపడి పనిచేసిరి. నరేను నా దగ్గరకు వచ్చి 'అమ్మా! దయచేసి నన్ను జ్వరముతో పరుండనిండు.' అని చెప్పెను. ఈ మాట లతని నోటినుండి వెలువడిన వెంటనే, అతడు తీవ్రమైన జ్వరమువచ్చి పరుండెను. 'దైవమా! ఇది యేమి కర్మము! ఇతని జ్వరము కుదురుటెట్లు' అని నేను విచారపడు చుంటిని. 'అమ్మా! ఆందోళన పడకుడు. నా అంతట నేనే ఈ జ్వరముకొరకు ప్రార్థించితిని. దీనికి కారణమున్నది. ఈ బాలురు కష్టపడి పనిచేయుచున్నారు. అయినను వారెంత చిన్నతప్పు చేసి నట్లు నాకు కనుపడినను, పట్టరాని కోపముతో నేను వారినితిట్టి, చెంపకాయలుగూడ కొట్టవచ్చును. ఇది వారికిని నాకునుకూడ బాధను కలిగించును కనుక, కొంతతడవు నేను జ్వరముతో పరుం డుటయే మేలని తలచితిని' అని నరేను చెప్పెను. ఉత్సవము పూర్తియైన తరువాత నేను నరేనుని కడకువచ్చి 'నా తండ్రీ! కార్యకలాప మిప్పుడు ముగిసినది. ఇక లెమ్ము' అని చెప్పితిని. నరేను తన కప్పుడు జ్వరము పూర్తిగా పోయినదనుచు శయ్యలోనుండి లేచి కూర్చుండెను.

''అతడు దుర్గపూజకు తన తల్లినికూడ తీసికొనివచ్చెను. ఆమె ఒకతోటలోనుండి మఱియొకతోటలోనికి తిరుగుచు మిరప కాయలు మొదలైనవానిని కోయుచు, ఆ మఠవైభవమంతయు తన కుమారుడు నరేనుని కృషిఫలితమని తలంచుచు, కొంచెము గర్వపడజొచ్చెను. ఆమెదగ్గరకు నరేనువచ్చి,' అచ్చట నీ వేమి చేయుచున్నావు? వెళ్లి శ్రీ మాతృదేవి నెందుకు చూడవు? ఊరక

ఈ కాయగూరలను మాత్రము కోయుచున్నావు. నీ కుమారుడే ఈ మఠ నిర్మాణమునకు కారణభూతుడని నీవు తలంచవచ్చును. అమ్మా! కాదు, కాదు! నీవు పొరబడితివి. ఇదియెల్ల నాగురు భగవానుని మహిమ! నరేనుని లెక్కయేమి?' అని చెప్పెను. ఈ మఠము శ్రీరామకృష్ణుల దయవలన నిర్మింపబడెనని నరేనుని యభిప్రాయము. ఎంత మహోన్నతమైనభక్తి!...నా బాబూరాము గతించెనే! అయ్యో! ఈ సంవత్సరము దుర్గపూజ నెవరు జరిపింతురు?''

1918-వ సం॥ జూన్ 8-వ తేది

నేడు శ్రీమాతృదేవిని సందర్శింప నేను వెళ్ళినప్పుడు, వసారలో నామె ధ్యాననిమగ్నులై యుండిరి. కొంతతడవైన తరువాత, అయిదారుగురుభక్తురాండ్రా మె దర్శనార్థమువచ్చి పూజామందిరములో శ్రీరామకృష్ణుల ప్రతిమయెదుట సాష్టాంగ ప్రణామము చేసిరి. అమ్మగారు వారి విషయమై వారినే అడిగిరి. నళిని అమ్మగారికి వారిని పరిచయపఱచెను. వారిలో నొకరు కలకత్తాకు చికిత్సకొరకై వచ్చిరి. ఆమె వ్యాధి కడుపులో వ్రణమని వైద్యుడు నిర్ణయించి, అందుకు శస్త్రము చేయించుకొనుమని యామెకు చెప్పెను. ఈ శస్త్రచికిత్సకు ఆమె మిక్కిలి భయపడుచుండెను. అమ్మగారు వారిలో నెవరిని తమ పాదములను తాకనియ్యలేదు. కారణము నాకు తెలియదు. వారుమాత్రము పలుసారు లామెపాదములనుతాకి అందలి ధూళిని గైకొనుట కెంతో ప్రార్థించిరి. కాని అమ్మగారు వారిని దూరముగానుండి నమస్కరించి, వెళ్ళుడని నిష్కర్షగా చెప్పిరి. వారపుడు వ్యాధిగ్రస్తురాలైన బాలికను గనుపరచి, 'అమ్మా! ఈమె వ్యాధి నివా

రణ మగునట్లాశీర్వదింపుడు. తిరిగి యీ చిన్నది మిమ్ములను దర్శింప గలుగునట్లు అనుగ్రహింపుడు' అని విన్నవించిరి. "శ్రీరామకృష్ణులకు ప్రణామముచేసి ఆయనను మనఃపూర్వకముగా ప్రార్థింపుడు, సర్వమునువారే." అని ప్రత్యుత్తరమిచ్చి, పిమ్మట మాతృదేవి తత్తరపాటు కనబఱచుచు "నా తల్లులారా! ఇక వెళ్లిరండు. మీ కాలస్యమగుచున్నది." అని వారిని పంపివైచిరి.

వారు వెళ్లినతర్వాత "గదిని శుభ్రముగాతుడిచి గంగా జలమును జల్లుడు. ఇంక స్వామికి నైవేద్య సమయమైనది." అని అమ్మగారు సెలవిచ్చిరి. వెంటనే వారి యాజ్ఞప్రకారము జరిగించిరి.

ఆధ్యాత్మిక గురువుల బాధలు.

అమ్మగారు పరుపుపై బరుండి నా చేతికి విసనకఱ్ఱనిచ్చి "అమ్మాయీ! కొంచెము నాకు విసరుము. శరీరమంతయు మండుచున్నది. మీ కలకత్తా కొక నమస్కారము! జనులిచ్చటకువచ్చి తమతమ విచారపరంపరల నా యెదుట నేకరువు పెట్టెదరు. ఎన్నియో పాపములుచేసి వచ్చువారు మఱికొందరు. ఈ రెండు రకములవారును గాక, ఇరువదియైదుమంది బిడ్డలను కన్నవారుకూడ వచ్చుచుందురు. ఆ బిడ్డలలో పదిమంది చనిపోయినారని వారి యేడ్పు. వీరు మనుష్యులా? కారు కారు! హద్దుపద్దు లేని, ఆత్మనిగ్రహములేని కేవల పశువులు. ఇందువలననే 'అయిదుసేర్ల నీళ్లలో కలిపిన ఒకసేరు పాలవలెనున్న దీవ్యవహారము! ఇట్టి పాలను చిక్కపరచుటెంతకష్టము. ఈ కలగలుపు పాలను మరగ కాచుటకు, విధివిరామము లేక మంటనూది యూది నా కన్నులు వాచిపోవుచున్నవి. అట్టిపాలను చిక్కపరచుట బహుకష్ట

మైనపని. భగవంతునికొరకు సర్వమును త్యజించుటకు సిద్ధముగా నున్న విశుద్ధాత్ములగు నా బిడ్డ లెక్కడనున్నారు? వారే నా కడకు వత్తురు గాక! వారితోడనే నేను సంభాషింతునుగాక! లేనిచో జీవితము చాల దుర్భరము.' అని శ్రీరామకృష్ణులు చెప్పుచుండు వారు. ఈ మాటలెంతయు నిజము అమ్మా! వినుము. నేడు సాయంకాలము 4గంటలనుండి జను లేకధారగా వచ్చుచున్నారు. ప్రజల దుఃఖమును నే నింక భరింపలేను.

''బలరాముని భార్యకూడ నేడిచ్చుటకు వచ్చెను. ఆమె నా బాబురామునకు తోబుట్టువు. అతఁడు నిజముగా దేవతలలో చేరినవాడుగాని నా కతడు సామాన్య సోదరుడ టమ్మా!'' అని యామె వెక్కి వెక్కి యేడ్చెను.

1918-వ సం॥ ఆగస్టు 4-వ తేది

శ్రీమాతృదేవి నేను వచ్చినప్పుడు డాక్టరు బ-గారి సోదరి యగు నొక వితంతువుతో మాట్లాడుచుండిరి. ఈ డాక్టరుగారి సోదరికి చిన్నతనమందే వైధవ్యము సంభవించెను. ఆమెభర్త ఆస్తి విషయమై కొన్ని చిక్కులు బయలుదేరినవి. మరణశాసనమును ధృవపరచు పత్రము నామె సంపాదింప లేకపోయెను. ఈ విషయములను గురించి వారు మాట్లాడిన తరువాత చిట్టచివరకు ''ఆస్తిని విక్రయించుటకు నీకు హక్కులేదు కనుక, నమ్మకమైన యొక సజ్జనుని సంరక్షణక్రింద దాని నుంచుట మంచిదని నా సలహా. ధనవిషయములలో లౌక్యుల నెన్నడు నమ్మరాదు. నిజమగు సన్న్యాసి యొకడే కనకవ్యామోహమున కతీతుడు. అమ్మా! అంతగా ఆందోళన పడకుము. భగవత్సంకల్పము ప్రకారము జరుగును. నీవు ధర్మమార్గమున ప్రవర్తించుచున్నావు. భగవంతు

డెన్నడును నిన్ను కష్టములపాలు చేయదు. ఇక వెళ్లిరమ్ము. అప్పుడప్పుడుత్తరము వ్రాయుచుండుము. మరలరమ్ము'' అని శ్రీమాతృదేవి సెలవిచ్చిరి.

ఆమె వెళ్లిన తరువాత శ్యామదాసను నాయుర్వేద వైద్యుడు గోలప్‌మాయిని చూడవచ్చెను. అతనికొఱకు శ్రీమాతృదేవి కొంతతడవు వేచియుండెను; కాని అతడు వెళ్లిన తరువాత పరుప్రపై బరుండి నావైపుచూచి, ''ఇక నీ పనిని చేయవచ్చును'' అని చెప్పిరి. నేనామెకు తైలమును రాయ మొదలుపెట్టితిని. ''గిరీశఘోషు సోదరికి నేననిన బహుప్రీతి. తాను వండుకొనిన ప్రతిపదార్థమును కొంచెము నాకొఱకు వేఱ తీసియుంచి యిక్కడకొక బ్రాహ్మణునిచేపంపి, నేనావస్తువులను తినునప్పుడు నా ప్రక్కనే కూర్చుండును. నాయందామెకు నిజమైన ప్రేమయుండెను. ఆమె యత్తవారు చాలభాగ్యవంతులు. ఆమెకును మంచి యాస్తియుండెను. కాని, యామె బంధువులా ధనమును దుర్వ్యయముచేసిరి. గిరీశునిసోదరుడగు అతులుడు, అయిదువేల రూపాయల పెట్టుబడితో నొకవ్యాపారమును ప్రారంభించెను. తన మరణశాసనములో నామె నాకు నూరు రూప్యము లియ్యవలయునని కోరెను, తాను బ్రతికియుండగా నాకీ పైకమునిచ్చుట కామె సిగ్గుపడెను. నూరురూపాయలు చాలతక్కువ మొత్తమట! ఆమె చనిపోయిన తరువాత నామె సోదరుడిక్కడకువచ్చి ఆ సొమ్ము నాకిచ్చెను. దుర్గపూజకు ముందటి దినమున నన్ను చూచుటకామె వచ్చెను. ఇచ్చటనుండి నంతకాలము నన్నామె యొకక్షణమైనను విడిచిపెట్టియుండలేదు. దుర్గపూజయైనవెంటనే, నేను కాశీప్రయాణమును తలపెట్టితిని.

అందువలన నా సామానులను సద్దుకొనుచు నే నొకగదిలోనుండి మఱియొక గదిలోనికి తిరుగుచుంటిని. చిట్టచివరకు 'నాకింక సెలవా ?' అని యామె యడిగెను. నేను కొంచెము పరధ్యాన ముగానుండి 'మంచిది, వెళ్లుము,' * అని చెప్పితిని. ఆమెతొందరగా మెట్లుదిగి వెళ్లినతరువాత, నాలోనేను ఎంత తెలివితక్కువపని చేసితిని ! 'వెళ్లు' మని చెప్పితినే ఇంతకుముం దెన్నడును నే నట్లెవరిని వెళ్లుడనలేదు, అని విచారించితిని. అయ్యో ! ఆమె తిరిగి యిచ్చటికిక నెన్నడును రాలేదు. ఇట్టిమాటలు నా నోట నెట్లు వచ్చెనో నాకు తెలియదు.''

* * *

సాయంకాలము నేను 'ఉద్బోధన' పత్రికా కార్యాలయ మునకు వెళ్లినప్పుడు అమ్మగారు పరుండిరి. రాధుకూడ నామె ప్రక్కనింకొక చాపపై బరుండి, యామెను తనకొక కథచెప్పు మని బలవంతపెట్టుచుండెను. తాము చెప్పుటకు మారుగా నన్నొక కథచెప్పుమని అమ్మగారు కోరిరి. ఏమి చెప్పుటకును నాకు పాలుపోక, కొంతవడి విషమావస్థలో నుంటిని. తుదకు నాకు తెలిసిన మీరాబాయియను వైష్ణవ భక్తురాలి కథను జెప్పితిని. ''ప్రేమలేనిదే భగవంతుడు ప్రసన్నుడుకాజాలడు.'' అను చర ణముతో నంతమగు మీరాబాయి కీర్తనను నేను పాడుచుండగా అమ్మగారు తన్మయులై ''ఔను అది చాలనిజము, హృదయ పూర్వకమైన ప్రేమలేనిదే దేనినిగూడ సాధింపలేము,'' అని

* తమతమయిండ్లకు తిరిగివెళ్లుటకు సంసిద్ధులై సెలవుతీసికొను వారితో 'వెళ్లిరండు!' అని చెప్పుట హిందువుల దేశాచారము. ఎవరినైనను 'పొమ్మ' నుట మిక్కిలి అశుభప్రదము. ఆమె ఆ రాత్రియే చనిపోయెను.

బిగ్గరగా చెప్పిరి. కాని, రాధుకుమాత్ర మా కథ అంతగానచ్చ లేదు. చిట్టచివరకు సరళ నా సాయమునకువచ్చి యొకచిత్ర కథను చెప్పెను. దానిని రాధు మెచ్చుకొనెను. శ్రీమాతృదేవికి సరళయందు మక్కువ మిక్కుటము. సరళ గోలప్‌మాయి పరిచారిక. అందువలన నామె కొంతతడవైన తరువాత గదిలోనుండి వెళ్లిపోయెను. పిమ్మట రాధు నన్ను తనకాళ్లను, మర్దనము చేయుమనెను. కాని నా మర్దన మామెకునచ్చక, ఇంకను గట్టిగా బట్టుమని నన్నడిగినపిదప, ''శ్రీరామకృష్ణులు స్వయముగా నాపాదములకు మర్దనముచేసి మర్దనముచేయు పద్ధతిని నాకు నేర్పిరి. ఏదీ? నీచేతిని జూడనిమ్ము.'' అని అమ్మగారు సెలవిచ్చిన పిమ్మట, నాచేతి నామెవైపు చాపితిని. అప్పుడామె మర్దన మెట్లు చేయవలయునో తెలిపిరి. రాధు బహుత్వరితముగ నిద్రపోయెను. ''దోమలు నా కాళ్లను కట్టుచున్నవి. నీ చేతితో మెల్లగా విసురు మమ్మా!'' అని నన్నడిగి, పిమ్మట కొంతతడవూరకుండి, ''ఈ సంవత్సరము బేలూరుమఠమునకు మిక్కిలి చెడ్డది. బాబురాము, దేవవ్రతుడు, శచీంద్రుడును మరణించిరి'' అని అమ్మగారు చింతించిరి.

దేవవ్రతుని మరణమునకు కొలదినాళ్లుముందు శ్రీబ్రహ్మానందస్వామికి పిశాచములు కనుపడెనని 'ఉద్బోధన' పత్రికా కార్యాలయములో వింటిని. ఆ విషయమై అమ్మగారి నడిగితిని. అమ్మయిట్లుచెప్పెను: ''అమ్మాయీ! మెల్లగా మాట్లాడు; లేనిచో ఈ సంభాషణవిని యిచ్చటి జనులు భయపడుదురు. శ్రీరామకృష్ణులుకూడ, ఇట్టి పిశాచములను చాలసారులు చూచిరి. ఒకనాడాయన రాఖల్ (బ్రహ్మానందస్వామి) తో గూడ వేణీపాలుని

యింటికి వెళ్లియుండిరి. ఆ యింటిలో పెద్దతోటగలదు. ఆ తోటలో శ్రీవారు విహరించుచుండగా, ఒక పిశాచము దగ్గరకువచ్చి 'నీ విక్కడ కెందుకువచ్చితివి? మా శరీరములు నీ సమక్షమున దహించుకొని పోవుచున్నవి. ఈ బాధను మేము భరింపలేకున్నాము. ఇక్కడనుండి వెంటనే వెడలిపొమ్ము' అని ఆయనతో చెప్పెను. అగ్నివంటి పవిత్రమైన శ్రీహరి సమక్షమున, ఆపిశాచ మెట్లు నిలువగలదు? శ్రీరామకృష్ణులు మందహాసము చేయుచు ఆ స్థలమును విడిచివచ్చిరి. ఈ విషయ మాయన ఎవరితోడను చెప్పలేదు.

''రాత్రి భోజనమైనవెంటనె ఆయన యొకరిని బండిని తీసుకొని వచ్చుటకొరకు పంపిరి. ఇంతకుపూర్వ మాయన ఆ రాత్రి అక్కడనే యుండుటకు యేర్పాటు జరిగియుండినను, బయలు దేరి వెళ్లుటకే ఆయన నిశ్చయించిరి. బండి వచ్చెను. ఆ రాత్రియే శ్రీవారు దక్షిణేశ్వరమునకు తిరిగి వచ్చిరి. దక్షిణేశ్వర దేవాలయ ముఖద్వారము దగ్గర బండిచక్రముల చప్పుడు నాకు వినపడినది. శ్రీరామకృష్ణులు రాఖల్‌తో మాట్లాడుచుండగా చెవులు నిక్కబొడుచుకొని విని, యులికిపడితిని.' రాత్రియాయన భోజనము చేసి యుండనిచో ఈ యర్ధరాత్రి నేనెక్కడనుండి శ్రీవారి కాహారము దీసికొని వత్తును?' అని తలపోయనారంభించితిని. సాధారణముగా నేనెప్పుడును ఆయన కేదైనను, తుదకు సూకలజావ నైనను తినుటకుంచుదును. ఎందుచేతననగా, వేళకాని వేళలందు కూడ ఆయన ఆహార మడుగుచుందురు. ఆరాత్రిమాత్ర మాయన తిరిగి రారని నమ్మియుండుటచే ఏ పదార్థమునుగూడ నేనుంచ లేదు. దేవాలయపు తోటగుమ్మముల నన్నిటిని మూసి తాళము

లను వేసిరి. అప్పుడు రాత్రి యొంటిగంట యైనది. ఆయన చేతుల తో చప్పట్లుగొట్టుచు భగవన్నామముల నుచ్చరింప మొదలుపెట్టిరి. ఎట్లో ద్వారము తెరచుకొనెను. ఆయన కాకలిగానుండినచో అన్నమెక్కడనుండి తీసికొనివత్తు నాయని అందోళనపడుచుంటిని. 'నా భోజనము విషయమై ఆందోళన పడకుము. రాత్రిభోజనము చేసియే వచ్చితిని.' అని శ్రీవారు బిగ్గరగా నాతో చెప్పి, పిమ్మట పిశాచము విషయమై రాఖల్‌కు తెలిపిరి. ఉలికిపడి రాఖల్ 'ఓయి బాబోయి! ఆ విషయమై మీ పుణ్యమాయని, మీరా సమయ మున నాకు చెప్పలేదు. చెప్పియే యున్నచో, భయముతో కొయ్య బారిపోయియుందును. ఇప్పుడుకూడ నాకు భయమగు చున్నది.' అని తనభయ విస్మయములను వెలిబుచ్చెను.'' అమ్మ గారీ కథనుచెప్పి మనసు తీరనవ్విరి.

భక్తురాలు: అమ్మా! ఆ పిశాచము లెంత తెలివితక్కు వవియై యుండవలయునో కదా! శ్రీగురుదేవుని తమ మోక్ష మును కోరుటకు మారుగా అవి ఆయనను వెడలి పొమ్మనినవి.

అమ్మగారు: అవికూడ ముక్తినొందుననుటకు సందేహము లేదు. శ్రీవారి దర్శనము వ్యర్థము కాజాలదు. ఒకసారి నరేను (వివేకానందస్వామి) చెన్నపురిలో నొక పిశాచమునకు ముక్తి నొసంగెను.

నాకు వచ్చినయొక కలను అమ్మగారితో నిట్లు చెప్పితిని: "'అమ్మా! నా భర్తతోకూడ నే నెక్కడకో పోవుచున్నట్లు కల గంటిని. మే మొక నదిదగ్గఱకు వచ్చితిమి. ఆ నదియొక్క యావలి యొడ్డు మాకు కనుబడుట లేదు. ఆ నదిప్రక్కనే చెట్లనీడగల బాటపై మేముపోవుచుండగా నాచేతులకు పచ్చని తీగెయొకటి

బాగుగా చుట్టుకొనెను. నాచేతులనుండి ఆ తీగెను విదలించుకొనలేకపోతిని. ఆ నదికి ఆవలివైపుననుండి యొక నల్లని బాలుడు రేవును దాటించు పడవలోవచ్చి, 'నీ చేతినుండి ఆ తీగెను నీవు నరికివేసినప్పుడే నిన్నీనదిని దాటింతును.' అని చెప్పెను. ఆ తీగెను ముప్పాతిక మూడువీసములు నరికివైచితిని గాని, చిట్ట చివరకు మిగిలిన ముక్కను తీసివేయలేకపోతిని. ఈలోపున నా భర్తకూడ కనుపడలేదు. నేను నిరాశచేసికొని 'ఈ ముక్కను వదిలించుకొనలేకున్నాను. నీవు నన్నావలివైపునకు తీసికొని వెళ్లవలెను,' అని యా బాలునితో చెప్పి, పడవలోని కురికితిని. పడవయు సాగిపోయెను. నాకు మెలకువ వచ్చెను.''

ఐహిక వస్తువులెల్ల యెండ మావులవంటివి. వాని బంధము నుండి విడుదల నొందుడు.

అమ్మగారిట్లు చెప్పిరి: ''ఈయనంత విశ్వమునెల్ల మాయలో ముంచి నడిపించుచున్న మహామాయా శక్తియే యా బాలుడు. ఆ రూపమున నిన్ను జగజ్జనని సంసారసాగరమును దాటించెను. భర్త, భార్య, యీశరీరము–సర్వము మాయయే. ఇవన్నియు మాయకల్పించిన బంధములు. ఈ బంధములనుండి విడుదల కాగలిగిననేతప్ప, నీవీ సంసారసాగర పారమెన్నడును చేరజాలవు ఈ శరీరమునందలి మమకారము, ఈ శరీరమే నేననుకొనుటకూడ పోవలెను. నా తల్లీ! ఈ శరీరమననేమి? ఇది దహనమైనప్పుడు మూడుశేర్లబూడిదయేకాదా? నిజమిట్లుండ ఈ శరీరము విషయమై యింతగర్వమెందుకు? ఈ శరీర మెంతబలమైనదైనను, ఎంత అందమైనదైనను, చిట్టచివరకిది ఆ మూడు శేర్ల భస్మమేయగును: అయినను జనులు దానియందెంత ఆసక్తులై యుందురు! జయ్ పరమేశ్వరా!

కస్తూరి మృగమును, భగవంతుని సర్వవ్యాపకత్వమును.

"ఆ రాజిల్లాయందలి కైల్వారను నూరిలో నేనొకసారి రెండు నెలలుంటిని. గోలప్‌మాయియు, బాబూరామ్ తల్లియు, బలరాముని భార్యయు, ఇతరులును నాతోకూడ నుండిరి. ఆ దేశములో లేళ్లు విస్తారముగా నుండెను. అవి మందలు కట్టుకొని తిరుగుచుండును. మనుష్యులను చూచినవెంటనే అవి, పక్షులెగిరి పోవునట్లు, రెప్పపాటులో పారిపోవును. అంత వేగముగా పరుగెత్తుజంతువును దేనిని నేనెన్నడును జూడలేదు. శ్రీరామకృష్ణులు 'లేడిబొడ్డున కస్తూరిపుట్టును. దాని పరిమళమునకు మోహపడి యిటునటు లేళ్లు పరుగెత్తును. ఆ సువాసన యెక్కడనుండి వచ్చుచున్నదో వానికి తెలియదు. ఈ విధముగనే భగవంతుడు తన శరీరములో నున్నాడని గ్రహింపక, ఆనందముకొఱకు మనుష్యుడన్నిచోట్లను వెదకును. అది యిదివరకే తనలో నున్నదని యతనికి తెలియదు.' అని చెప్పుచుండువారు. భగవంతుడొక్కడే నిత్యము. తక్కినదెల్ల అనిత్యము. అమ్మాయీ! నీ వేమందువమ్మా?"

శ్రీ మాతృదేవికి శరీరమంతట నుడుకుపొక్కులు బయల్వెడలి యుండెను. "కడచిన మూడు సంవత్సరములనుండి నేనీ బాధ ననుభవించుచున్నాను. ఎవరిపాపములకుగాను, నే నీ బాధ పడుచుంటినో నాకు తెలియదు; అట్లుకానిచో, నాకే వ్యాధియైనను వచ్చుటకెట్లు వీలగును," అని యామె చెప్పిరి.

1918 సం॥ ఆగస్టు 22-వ తేది

నేడు శ్రీమాతృదేవికడకు నేను వెళ్లినప్పుడు, సాయంకాలమయ్యెను. మంచముదగ్గర నేలపై బఱచిన చాపమీద

నామె పరుండియుండిరి. నేను ప్రణామముచేసి, ''అమ్మా, నేను కాళీఘట్టములోని మా యింటికివెళ్లి ఎంతకాలమో అయినది. ఇప్పుడచ్చటకు వెళ్లుదునా?'' అని మా ప్రసంగసరళిలో విన్న వించితిని.

అమ్మగారు : ఇచ్చటనే మఱి కొన్నాళ్లు నీ వెందుకుండవు? ఒకసారి కాళీఘట్టమునకు వెళ్లినచో నీ విచ్చటకు తఱచుగ రాజా లవు. ఒకనాడు నీవు రానియెడల, నేను మిక్కిలి యాందోళనపడు దును. నిన్న నీ విచట లేనందున, నీ యారోగ్యమెట్లుండెనోయని కలవరపడితిని. నేడుకూడ నీవు రాకుండిన, కారణమడిగి తెలిసికొని వచ్చుటకు నే నెవరినైన బంపియుందును. నీ భర్తకు జబ్బుగానున్న యెడలగాని, అతడు తనయొద్ద నీవుండవలయునని కోరుచున్న యెడలగాని, నీవు కాళీఘట్టమునకు వెళ్లవలసినదే.

అట్టి చిక్కేదియును లేదనియు, చాలకాలము నా చెల్లెలింట నుండుచో లోకులేమనుకొనెదరో యని భయపడుచున్నాననియు చెప్పితిని. ఆ విషయమును లెక్కచేయవలదనియు, ఇంకొక నెల కలకత్తాలోనే యుండుమనియు నా కామె హితవొసంగిరి.

ఇంతలో నొక బ్రహ్మచారివచ్చి, శ్రీ మాతృదేవి దర్శనార్థమై యెవరో భక్తురాలు వేచియుండెనని చెప్పెను. అమ్మగారు చాల విసిగికొని, ''ఏమిరా దైవమా! నే నింకొకరిని చూడవల యునా! బాగుగానున్నదే!'' అని చెప్పి తమ శయ్యలో గూర్చుం డిరి. పిమ్మట, చక్కని బట్టలు కట్టుకొని యొక స్త్రీ గదిలోనికి వచ్చి, శ్రీ మాతృదేవి పాదములను తన తలతో దాకి ప్రణా మము చేసెను.

''మీరు దూరముననుండియే నమస్కారముచేసి యుండ

వచ్చునే. పాదము లెందుకు దాకెదరు?'' అని చెప్పి, అమ్మగారామె యోగక్షేమము నడిగిరి.

స్త్రీ: అమ్మా, నా భర్తకు కొంతకాలమునుండి జబ్బుగా నున్నదని మీరెఱుగుదురు.

అమ్మగారు: ఔను, జబ్బుగానున్నట్లు వింటిని. ఇప్పు డాతని కెట్లున్నది? అతని బాధ ఏమి? ఎవరు మందిచ్చుచున్నారు?

స్త్రీ: మధుమేహముతో వారు బాధపడుచున్నారు. పాదము లుబ్బుజూపినవి. ఇది అపాయకరమైన వ్యాధియని వైద్యులు చెప్పుచున్నారు. వారి అభిప్రాయములతో నాకు పని లేదు. అమ్మా! ఆయనకు మీరు వ్యాధినివారణ చేయవలయును. దయయుంచి ఆయనకు వ్యాధి కుదురునని యానతిండు.

అమ్మగారు: అమ్మాయీ! నాకేమియు తెలియదు. సర్వమును శ్రీరామకృష్ణుల ఆజ్ఞప్రకారము జరుగును. నీ భర్తకాయన వ్యాధిని కుదుర్చునెడల నీ భర్త పూర్ణారోగ్యవంతుడగును. అతనికొఱకు శ్రీ గురుదేవుని ప్రార్థింతును.

స్త్రీ: నాకిప్పు డెంతో సంతోషముగానున్నది. అమ్మా! శ్రీరామకృష్ణుల వారెన్నడును మీ ప్రార్థనను త్రోసివేయరు. ఇట్లు చెప్పుచు నామె శ్రీమాతృదేవి పాదములపై తలనుంచి యేడువసాగెను.

అమ్మగారామె నోదార్చి ''శ్రీ గురుదేవుని ప్రార్థింపుడు. ఆయన నీ భర్త వ్యాధిని కుదుర్చును. నీ భర్త కిప్పుడేమి పథ్య మిచ్చుచున్నారు?''

స్త్రీ: వారు పూరీలు, మొదలైన పదార్థములను, వైద్యుడు చెప్పినప్రకారము తినుచుందురు.

ఆమె త్వరగ శ్రీమాతృదేవి సెలవుదీసికొని శారదానంద స్వాములవారిని సందర్శింప వెళ్లెను.

"నే నితరులబాధతోను, దుఃఖముతోను రేయింబవళ్లు దగ్ధమై పోవుచున్నాను." అని అమ్మగారు చెప్పిరి. నే నామె శరీరమునకు తైలమును రాయబోవుచుండగా, పైనజెప్పిన స్త్రీకి బంధువగు నొకరు గదిలోనికివచ్చి యామెకు నమస్కారము చేసిరి. శ్రీమాతృదేవి మరల లేవవలసి వచ్చెను. అతడు గదిలో నుండి వెళ్ళిన తరువాత అమ్మగారు మరల పరుండి, "ఇంక యెవరువచ్చినను సరే నేను లేవను. అమ్మాయీ, నొప్పులెత్తు చున్న నా పాదములతో నిముష నిముషము లేచుట యెంత కష్టము! ఇంతేకాక, ఉడుకుపొక్కులవలన నావీపంతయు మంట పెట్టుచున్నది. తైలమును బాగుగా రాయుమమ్మా!" అని చెప్పిరి.

నేను నూనె రాయుచుండగా సంభాషణ ఇంతకుముందు వచ్చి సెలవుతీసికొని వెళ్లినస్త్రీ మీదకు పోయెను. "చూచితివా! ఆమెభర్త ఎంతో ప్రాణాపాయస్థితిలో నున్నాడు. ఆమెయు నాతని వ్యాధినివారణకొరకు భగవంతుని ప్రార్థించుట కిచ్చటకు వచ్చినది. పశ్చాత్తాపముతో వినమ్రమైన భక్తిభావముతో నుండుటకు బదులుగా నామెశరీరము నిండ అత్తరువులను రాసు కొనివచ్చినది. ఇదా మనము దేవాలయమునకు పోవలసినవిధము? ఆహా! మానవనాగరకుల స్వభావమిట్లున్నదికదా!" అని అమ్మ గారు చెప్పిరి. నేను సెలవుతీసికొని వెళ్లబోవుచుండగా, నాకు ప్రసాద మిమ్మని అమ్మగా రొకరికి ఆనతిచ్చిరి.

*　　*　　*

1918-వ సం॥ ఆగస్టు 23-వ తేది.

అమ్మగారిని నేను సాయంకాలమున చూడవెళ్లితిని. ఒక భక్తురాలిని గురించి ప్రసంగించుచు ఆమె ఇట్లు చెప్పిరి.''ఆయమ్మ తన కోడలిని చాల కఠినముగా చూచుచుండును. అంత అతి కర్కశత్వముకూడదు. కోడలి ప్రవర్తన నొక కంటితోచూచు చుండ వలసినదే. కాని, అత్తగారు తనకోడలికి కొంచెము స్వేచ్ఛనుగూడ నియ్యవలయును. ఎన్నిచెప్పినను కోడలింకను చిన్నపిల్లయేకదా. సహజముగా బాలికలు కొన్ని కొన్ని ముద్దు ముచ్చటలను తీర్చుకొని సుఖపడవలెనని కోరుచుండును. అత్తగారి అధికారము మితిమీరి క్రౌర్యముక్రిందకు మారినచో, కోడలు చెప్పకుండ ఇల్లువిడిచి వెళ్లిపోవచ్చును; ఒక్కొకప్పుడు బలవంత ముగా తన్నుదాను చంపుకొనవచ్చును. కోడలట్లుచేసిన యెడల, ఈయత్తగారేమిచేయును ? (నావైపుచూచుచు) ఈమె పాదము లకు కొంచెము పారాణి పెట్టుకొన్నది. ఇదికూడా ఒక తప్పా ! పాప మాపిల్ల తన భర్తను చూచుటకుకూడ వీలులేదు ! భర్త సన్న్యాసి యయిపోయెను. నా భర్తను నాకన్నులార చూచి, ఆయనకు నా చేతులతో వంటవండి ఉపచారము చేయుచు, అను మతి ఇచ్చినపుడెల్ల వారిదగ్గరకు పోవుచుంటిని......''

ఆధ్యాత్మిక సాధన-
భగవత్సాక్షాత్కారము.

మఱియొకనాడు శ్రీ మాతృదేవియింటికి నేను వెళ్లినపు డొక సన్న్యాసివచ్చి, యామెకు ప్రణామముచేసి యిట్లు విన్నవించెను: ''అమ్మా! ఒక్క నిముషమైన కుదురుపాటు లేక యెందుకీ మనస్సు కోతివలె నెప్పుడును తిరుగాడు చుండును ? అవిచ్ఛిన్నముగా నే నేల మిమ్ము ధ్యానింపలేకున్నాను ? పనికి

మాలిన తలంపులెల్ల వచ్చి నామనస్సును కలతపఱచుచుండును. కోరినంతమాత్రమున తుచ్ఛపదార్థములను సులభముగా మేము సంపాదింపగలుగుచున్నాము. భగవత్సాక్షాత్కార మెన్నటికిని నాకు కానేకాదా ? అమ్మా ! శాంతిని సంపాదించుటెట్లో దయ యుంచి సెలవీయుడు. 'ఇప్పుడు దివ్యదర్శనములే నాకు కరువై పోయెను, పరమార్థమును గాంచలేనిచో, నే బ్రతికి లాభమేమి? అట్టి పనికిమాలిన బ్రతుకు బ్రతుకుటకంటె చచ్చుటయే మేలు.''

అమ్మగారు : ఏమిమాటలివి నాయనా? ఇట్టి యూహ లనుకూడ నీ వెన్నడును పెట్టుకొనవలదు. 'ఎవరైనను ప్రతిదినము భగవద్దర్శనమును బడయగలరా? ప్రతిదినము గాలమును వేసిన వెంటనే, చేపల వేటకానికి పెద్దగండుచేప దొరుకునా? వలసిన ఏర్పాటు లెల్లచేసుకొని అతడు గాలమువేసి కనిపెట్టుకొని యుం డును. ఎప్పుడో, యొకసారి గండుచేప గాలమును మ్రింగును. కాని ఎన్నిసారులో అతనికి ఆశాభంగమే కలుగుచుండును. కనుక సాధనను సడలించవలదు. జపమును (భగవన్నామ స్మరణమును) వెనుకటికంటెను ఎక్కువగా చేయుచుండుము.' అని శ్రీరామ కృష్ణులు చెప్పుచుండువారు.

యోగీనీమాయి : ఔను. అదియే నిజము. భగవన్నామ మునకును, భగవంతునకును భేదమేమియులేదు. ఆరంభదశలో మనస్సేకాగ్రముగ నిలువలేక పోయినను, చిట్టచివరకు జయము గాంతువు.

సన్న్యాసి : అమ్మా ! భగవన్నామ మెన్నిసారులు నేను జపింపవలయునో దయయుంచి సెలవిండు. ఏకాగ్రముగా మనస్సును నిలుపుటకు నా కది తోడ్పడవచ్చును.

అమ్మగారు : పదివేలసారులో, ఇరువదివేలసారులో. నీవు జపింపగలన్ని సారులు.

సన్న్యాసి : ఒకనాడు నేను పూజామందిరములో నేడ్చుచు బండుకొనియుంటిని. హఠాత్తుగా మీరు నా ప్రక్కను నిలువబడి యుండినట్లు నాకు గనుపడెను. "నీకేమి కావలయును" అని నన్ను మీరడిగితిరి. "అమ్మా! మీదయ సురథరాజు నెట్లు కృతార్థుని జేసెనో? నన్నుకూడ కృతార్థుని జేయుడు." అని బదులు చెప్పి, వెంటనే "అమ్మా! వలదు, వలదు. అది మీ దుర్గాస్వరూపమున జరిగెను. ఆ రూపము నాకక్కరలేదు. మీ ప్రస్తుతరూపముననే మిమ్ము దర్శించుచుండవలయునని నా కోరిక," అని నా పొరపాటును సవరించుకొంటిని. అప్పుడు మీరు మందహాసముచేయుచు అంతర్ధానమైనారు. అప్పటినుండి నా మనస్సు మునుపటికంటెను కలతపడుచుండెను. ఇప్పుడు నా కెందును సంతుష్టియే లేదు. "శ్రీ మాతృదేవి సాక్షాత్కారమును బడయజాలనప్పుడు, నేను బ్రతికి యేమిలాభము?" అని తఱచుగ చింతించుచుందును.

అమ్మగారు : అంత తొందర యెందుకు నీకు, నాయనా? నీకు దొరికినదానిని వదలక నీ వెందు కనుసరింపవు? "ఎవరు లేకపోయినను చివరకు నా కొక మాతృదేవి యున్నది." అని యెల్లప్పుడును జ్ఞప్తియందుంచుకొనుము. తమ పావన పాదాశ్రయులైనవారికి, తుదకు వారిజీవితములో కట్టకడపటి దినముననైన దర్శనమిత్తుమని శ్రీరామకృష్ణులు చెప్పినమాటలు నీవు మఱచిపోలేదుకదా! ఆయన అందరినిగూడ తన సన్నిధికి తీసికొని తరింపజేయును.

సన్న్యాసి : గొప్ప భక్తుడగు నొక గృహస్థు నింటిలో నేను

నివసించుచున్నాను. ఆయనభార్య మిక్కిలి భాగ్యవంతులైన వారి యింటి ఆడపడుచు. నాకొఱకామెద్రవ్యమును విస్తారముగా వ్యయపఱచు చుండును.

అమ్మగారు: అట్లు చేయవలదని ఆమెతో చెప్పుము. భక్తులగు గృహస్థులసొమ్ము సన్న్యాసుల అవసరములకువినియోగపడును. దానితో వర్ష కాలమున నాలుగునెలలవరకు వారొకచోటనే యుండుటకు వీలగును. ఆ కాలమున భిక్షాటనమునకై బయటకు పోవుట వారికి బహుకష్టముగా నుండును.

పిమ్మట, ఆ సన్న్యాసి అమ్మగారికి ప్రణామముచేసి, వెళ్లెను.

1918-వ సం॥ సెప్టెంబరు 3-వ తేది.

శ్రీ రామకృష్ణుల జీవిత విశేషములు

కొన్నాళ్లనుండి నా శరీరారోగ్యమంత బాగుగాలేదు. నాకు నెమ్మదిగానుండిన తరువాత, ఒకనాటి సాయంకాలమున శ్రీమాతృదేవి దర్శనార్థము వెళ్లితిని. ప్రసంగవశమున శ్రీరామకృష్ణులను గురించి అమ్మగారు మాట్లాడ నారంభించిరి.

అమ్మగారు: (నన్నుద్దేశించి) నిన్ననెంత సంతోషముగా మేము కాలము గడిపితిమి! సరళ శ్రీరామకృష్ణులను గురించి చదివెను. ఎంత చక్కనిమాటలు! ఆ నాటి చర్యలింత మహాద్భుత పరిణామమునకు దారితీయునని మేమెట్లు తెలిసికొని యుండగలము! ఎంత మహానుభావు డవతరించెను! ఎంతమంది జనులాయన మాటలవలన జ్ఞానవికాసమును గాంచిరి! శ్రీరామకృష్ణులనిన, మానవాకారము దాల్చిన బ్రహ్మానందమే! దినమరువది గడియలును భక్తియుతమైన సంగీతముతోను, సంతో

షముతోను, నవ్వులతోను, బోధలతోను, కథలతోను, గడచి పోయెడివి. నాకు జ్ఞాపకమున్నంతవరకు శ్రీరామకృష్ణు లే విషయమైకాని వ్యాకుల పడుచుండుట నే నెన్నడును చూడలేదు. తఱచుగా వారు చక్కనిమాటలతో నాకు హితోపదేశము చేయుచుందురు. నేను వ్రాయనేర్చియే యుండినయెడల, ఆ మాటలను వ్రాసియుందును. మంచిది! అమ్మా, సరళా! నేడుకూడ నేమైన చదువుమమ్మా!

సరళ శ్రీరామకృష్ణ వచనామృతమను పుస్తకము చదువ నారంభించెను.

అమ్మగారిట్లు చెప్పిరి: '''సింహమునకు సింహమే పుట్టును గదా'? అని శ్రీ గురుదేవులు రాఖాలుని సంబోధించి చెప్పిన యీ మాటలను గమనించుచున్నారా? ఆయన రాఖాలుని తండ్రి నీ విధముగా సంతోషపెట్టును. అతడు దక్షిణేశ్వరమునకు వచ్చినప్పుడు, శ్రీరామకృష్ణులు జాగ్రత్తగా రుచియైన భక్ష్యములతో నతనికి విందు జేయుదురు. అత డొకవేళ బాలుని (రాఖాలుని) తీసికొని పోవునేమో యని ఆయన భయము. రాఖాలుని కొక సవతితల్లి యుండెను. తండ్రి దక్షిణేశ్వరమునకు వచ్చినప్పుడు, 'ఆయన కిక్కడనున్న వన్నియు గనుబఱపుము. ఆయనకు కావలసిన వెల్ల సమకూర్చి, యేవిధమైన లోటును కలుగకుండ చూడుము.' అని శ్రీగురు మహారాజుగారు రాఖాలుతో జెప్పుచుండువారు.''

బృందయను పరిచారికను గురించియు పూరీలకథను గురించియు సరళ యిప్పుడు చదువుచుండెను. అమ్మగారిట్లు సెలవిచ్చిరి. ''అది దురుసు నోటిమనిషి. దానిమధ్యాహ్నపు టల్పాహారమునకై కొన్నిపూరీలను ప్రత్యేకముగా నుంచుట అలవాటు. అవి లేసి

యెడల నోటికివచ్చినట్లెల్ల అది తిట్టును. 'ఈ పెద్దవారి కొడుకులను చూడుడు. వీరు నాకు రావలసిన భాగమునుకూడ తినివైచిరి. తియ్యని పదార్థములు కొంచెముకూడ నాకు మిగలనీయలేదు' అని యది బాలభక్తులను దుమ్మెత్తిపోయును. ఈ మాట లెక్కడ ఆభక్తుల చెవుల బడునోయని శ్రీరామకృష్ణులు భయపడుచుందురు. ఒకనాటి యుదయము మాయన నాబత్తుగదికడకువచ్చి 'బృందకొరకుంచిన పూరీల నితరులకిచ్చితిని. ఆమెకు కొన్ని పూరీలు చేయుము. లేనిచో, అది యిష్టము వచ్చినట్లెల్ల తిట్టును. దుష్టులకు మనము దూరముగ నుండవలయును,' అని నాతో చెప్పిరి. బృందవచ్చినతోడనే. 'బృందా, నీకు నేడు తినుట కేమియు లేదు. నేనిప్పుడు పూరీలు చేయుచున్నాను.' అని దానితో చెప్పితిని. ''సరే, మీరు శ్రమపడవలదు. వంటచేసికొనుటకు గావైన సామానులను నాకీయుడు,' అని యది చెప్పెను. నేను దానికి పిండి, వెన్న, బంగాళదుంపలు, , మరికొన్ని కాయగూరల నిచ్చితిని.''

ఒక అధ్యాయము చదివిన తరువాత, సరళ గోలప్ మాయికి జబ్బుగానున్నందున నామె కుపచారముచేయుటకు వెళ్లెను.

శ్రీమాతృదేవి మెల్లగ నిట్లు ప్రసంగింప నారంభించిరి:

సన్న్యాస సాదర్శము

''ఈ మానవశరీరమును చూచుచున్నారుగా! ఇది నేడున్నది, రేపుండదు. ఈ ప్రపంచము దుఃఖమయము. వేలాకజన్మ మెత్తుటకు జను లేల కోరి, వ్యసనపడవలయును? దాని నైసర్గిక బాధలనుండి శరీర మెన్నటికిని తప్పించుకొనజాలదు. 'అమ్మా! మేమెల్లప్పుడును

బహు జాగరూకులమై యుండవలయును. మనస్సులోనైనను మాకేదైన అపవిత్రాలోచన కలుగునేమో యని మేమెల్లప్పుడును భయముతో వణకిపోవుచుందుము,' అని మొన్న విలాసుడు నాతో జెప్పెను. ఇది యెంతయు నిజము. చలువచేసిన వస్త్రము వంటి వాడు సన్న్యాసి; గృహస్థుడన్ననో నల్లని వస్త్రమువంటి వాడు. నల్లని బట్టయందలి మచ్చలంతగా కనుపడవు; తెల్ల బట్టపైని సిరాబొట్టుకూడ ఎంతో ప్రాముఖ్యముగా కనుపడును. ఈ జీవిత మెల్లప్పుడును ప్రమాదభూయిష్ఠము. ప్రపంచమంతయు కామ కాంచన వశమై యున్నది. సన్న్యాసి నిరంతరము త్యాగశాంతముల నభ్యసింపవలయును. కనుక శ్రీరామకృష్ణులు 'సన్న్యాసి అనుక్షణము జాగరూకుడై, వివేకియై ప్రవర్తింపవలయును,' అని యుపదేశించుచుందువారు.

గృహస్థులకు ఇంద్రియ నిగ్రహము తప్పక ఉండవలెను.

ఇంతలో స్వామికి నైవేద్యము చేయుటకు హరిహర మహారాజు పూజామందిరములోనికి వచ్చెను. అమ్మగారాయనను గురించి, ''సంసారమును త్యజించిన యీతనిని చూడుడు. ఇతడు సర్వమును శ్రీరామకృష్ణులపేరున పరిత్యజించెను. లెక్కలేకుండ పిల్లలను కనుటయే యీ లోకమున తమ ధర్మమైనట్లు, సంసారులు బిడ్డలను కనుచుందురు. 'ఒక రిద్దరు పిల్లలు పుట్టిన తరువాత జనులాత్మ నిగ్రహమభ్యసింపవలయును' అని శ్రీరామకృష్ణులు చెప్పుచుండువారు. ఆంగ్లపురుషులు తమతమ సొత్తునుబట్టి పిల్లలను కనెదరని నేను వినుచున్నాను. వారికి కావలసినంతమంది బిడ్డలుపుట్టినతరువాత భార్యాభర్తలు వేత్వేరుగా కాపురముండి, ఎవరిపనిని వారు చూచుకొనుచుందురు. ఇకమన జాతిని చూడుడు!''

అమ్మగారు చిఱునవ్వు నవ్వుచు ఇంకను నిట్లుచెప్పిరి : "నన్ను చూచుటకు నిన్న నొకయువతి వచ్చెను. ఆమెవెంట కొంతమంది పిల్లల మందకూడ వచ్చెను. వారిలో కొందరామె వీపున వ్రేలాడుచుండిరి, మఱికొందరామె చేతులను గట్టిగా బట్టుకొనుచుండిరి. వారిని చూచుకొనుటయే యామెకు కష్టముగా నుండెను. ఆమె నాతో యేమిచెప్పెనో మీరూహింపగలరా? 'అమ్మా! ఈ సంసారజీవనము నా కెంతమాత్రను సుఖముగా లేదు.' అని యామెచెప్పెను. 'అమ్మాయీ! అది యెట్లు? నీ కింతమందిపిల్లలున్నారే!' అని నేను బదులుచెప్పితిని. 'వీరితో చాలును. ఇంక పిల్లలను కనను' అని యామె చెప్పెను. 'నీవు నీ యుద్దేశమును నెరవేర్చగలుగుచో చాలబాగుండును.' అని నేనంటిని" ఈ మాటలుచెప్పి అమ్మగారు నవ్వనారంభించిరి.

భక్తురాలు : మన హిందూమతము ప్రకారము భర్తయే మన కత్యంత గౌరవనీయుడైన గురువు. భర్తను సేవించుటవలన స్త్రీకి స్వర్గము లభించుటయేకాక, యామె భగవంతునితో నైక్యమొందుననికూడ శాస్త్రములు చెప్పుచున్నవి. భర్తవలదనుచుండగా ప్రార్థనాదిసాధనలద్వారమున ఆత్మనిగ్రహ మభ్యసించుటకు ప్రయత్నించిన యెడల, ఆమె పాపమును చేయుచున్నదా?

అమ్మగారు : లేదు! ఎంతమాత్రము పాపము చేయుట లేదు. ఈశ్వరసాక్షాత్కారము కొఱకు మీ రేమి చేసినను, దాని వలన ఏ విధమైన పాపమును కలుగదు. ఆత్మనిగ్రహము మిక్కిలి అవసరము. హిందూవితంతువులకు విధింపబడిన కఠిన నియమములెల్ల ఆత్మ నిగ్రహమును సాధనచేయుటయందు వారికి తోడ్పడుటకే ఏర్పడినవి.

శ్రీరామకృష్ణు లేపని చేసినను భగవంతుని ఆరాధన నిమిత్తమే చేసిరి. ఆయన యొకసారి నన్నే ఆరాధన దేవతగా ప్రతిష్ఠించి, షోడశీపూజ చేసిరి. ఆ గాజులను బట్టలను, ఇతర ఆరాధన వస్తువులను నే నేమి చేయవలయునని ఆయన నడిగితిని. కొంచె మాలోచించి వానినన్నిటిని నేను నా తల్లి కిచ్చివేయవచ్చునని శ్రీవారు చెప్పిరి. అప్పుడు మా తండ్రిబ్రతికియుండెను. 'ఈ వస్తువులను మీ అమ్మగారి కిచ్చునప్పుడు, నీవామె నొక సామాన్య మానవస్త్రీగా భావింపక, శ్రీ విశ్వేశ్వరీ ప్రత్యక్షస్వరూపమే యామెయని తలంపవలయును,' అని శ్రీరామకృష్ణులు నాతో చెప్పిరి. శ్రీ వారియుపదేశముల రీతియట్లుండెడిది.

1918-వ సం॥ సెప్టెంబరు 4-వ తేది.

అమ్మగారు చిత్రాసనముపై గూర్చుండి జపముచేయు చుండిరి. సాయంకాలపూజ పూర్తియైనది· ఒక భక్తురాలు (ఈమె అమ్మగారి వదినెగారే) అక్కడకువచ్చి "దయయుంచి నా మనస్సును సరిచేయుడు. అన్నివిధములైన విచారములతో బాధ పడుచున్నాను. ఇంక ఒకనాడైనను బ్రతుకవలెనని నాకులేదు. ఒక మరణ శాసనమును వ్రాసి నా ఆస్తినంతను మీకు అప్ప గించెదను. నామరణానంతరము ఆమరణ శాసనము ప్రకారము జరిపింపుడు." అని అమ్మగారితో చెప్పెను. అమ్మగారు నవ్వుచు, "అయితే నీ వెప్పుడు చచ్చిపోవుచున్నావు? అని మొదటకొంచెము వేళాకోళముచేసి, వెంటనే తీక్ష్ణస్వరూపము దాల్చి, అట్టి యవివేకపు తలంపులెల్ల సోమరితనమువలనను, భావోద్రేకమువలనను కలుగునని, అట్టి యూహాల నెంతమాత్రము మనసున బెట్టుకొనకూడదని యామెను మందలించిరి.

పిమ్మట, శ్రీమాతృదేవి నవ్వుచు నావైపుచూచుచు "అమ్మాయీ! చూచుచున్నావా శ్రీరామకృష్ణుల దురవగాహ లీల! నాసొంతబంధువులను చూడుము! ఎంతదుస్సహవాసము నాకు ప్రాప్తమయ్యెనో పరికింపుము. ఒకరికిదివరకే పిచ్చి. ఇప్పుడీమెకుకూడ ఆ యవస్థయే పట్టనున్నట్లున్నది. ఇక నా మూడవబంధువును చూడుము! ఆమెను సన్మార్గములో బెట్టుటకు నేనెంతకష్టపడితిని! నా శ్రమ ఆవగింజంతయయినను ఫలింపలేదు. దానికి సరియైన బుద్ధిలవలేశముకూడ కలుగలేదు. అటుచూడుము. వసారలో ఇనుపకమ్ములకానుకొని తనభర్తరాకకై ఆత్రముతో చూచుచున్నది. సంగీతము వినవచ్చుచున్న అ ఇంటిలోనికి అత డొకవేళ వెళ్లునేమోయని దానిభయము. ఏయింబవల్లు తన యెదుట భర్తనుంచుకొనవలెనని దాని ప్రయత్నము. ఎంత తీవ్ర మోహము! దానికింత వలపు కలుగునని నే నెన్నడును కలలో కూడ తలంప జాలకుంటిని," అని చెప్పిరి.

అమ్మగారి వదినెగారు విచారభావమును ప్రకటించుముఖ (వికాస)ముతో, గదినివిడిచి వెళ్లిరి. శ్రీమాతృదేవి పరుపుపై బరుండిరి.

అమ్మగారు: అమ్మాయీ, ఎంతో పుణ్యముచేసి యుండుట చేతనే నీకీమానవజన్మము లభించెను. భగవంతునియందు తీవ్రమైన భక్తికలిగి ప్రార్థింపుము. మనము కష్టపడి పనిచేయవలయును. కష్ట పడనిదే మనము దేనినైన నెట్లు సంపాదింపగలము? పగలెంతసమృ ద్ధిగా పనియున్నను, కొంతకాలమును నీవు ప్రార్థనకై తప్పక విని యోగింపవలెను. దక్షిణేశ్వరములో నుండినపుడు నేనెంతో పని చేయుచుంటిని. అయినను ధ్యానప్రార్థనములకు ఎట్లో తీరికను

కల్పించుకొనెడు దానను......మనోవ్యథతో బాధపడుచున్నానని మొఱపెట్టుచున్న నా వదినెగారుకూడ అట్లే పనిచేయనిమ్ము. తెల్లవారు జామున మూడుగంటలకే మేల్కొనిలేచి, నాగది ప్రక్కనున్న వసారాలో నామెను ధ్యానముచేయు మనుము. అప్పుడామె మనస్సులో నేమైన విచారముండునేమో చూతెము. కాని యామె ఆ పనిచేయక, తనకష్టములను గురించి మాత్ర ముపన్యాసములిచ్చుచుండును! ఇంతకు నామె పడుకష్టమేమి? అమ్మాయీ, మనోవ్యథయననేమో నేనెన్నడు నెఱుగను. కాని, నే నిపుడు మాబంధువుల కొరకు రేయింబవళ్లు కష్టపడుచున్నాను ఈ వదినెగారు మాయింటికి వచ్చినకాలము మిక్కిలి చెడ్డది. ఈమె కొమార్తెయగు రాధును నేను పెంచబూనుకొనుట వలననే. నాకీ కష్టములన్నియు కలిగినవి. వారందరును వెళ్లిపోవచ్చును. నాకెవగుసనక్కర లేదు. ఈ పిల్లలను చూడుము. వీరెన్నడును నే చెప్పినమాట వినరు. ఎంత అవిధేయులు!

గోలప్‌మాయి: వీరెట్లు సింగారించుకొందురో చూడుము. తమ భర్తలప్రేమను సంపాదించుట కదియేమార్గమని వారి తలంపు.

అమ్మగారు: హా! శ్రీ రామకృష్ణులెంత దయతో నన్ను చూచుచుండిరి. ఒక్కపరుషమైన మాటనుకూడ వారెన్నడును పలుకలేదు. ఏనాడును నామనస్సును నొప్పింపలేదు. ''మనమెల్లప్పుడును పనిచేయుచుండవలెను. పనిలేకుండ మనమెన్నడు నుండరాదు. సోమరులమై యుందుమేని బహువిధములైన చెడుతలంపులన్నియు మనస్సులో బయలుదేరును,'' అని శ్రీవారు నాతో చెప్పుచుండువారు.

అమ్మాయీ! అడవియేనుగ వంటిది ఈ మనస్సు. అది వాయువేగముతో బరుగెత్తు చుండును.

మనోనిగ్రహము-భగవత్సాక్షాత్కారము

కనుక మనమెల్లప్పుడు వివేచన చేయుచుండవలెను. ఈశ్వర ప్రసన్నమునకు మనము కష్టపడి సాధన చేయవలెను. దక్షిణేశ్వరములో రాత్రియెవరో పిల్లంగ్రోవితో పాడుచుండెడివారు. ఆపాట వినుటతోడనే భగవత్సాక్షాత్కారముకొరకు నామనస్సు మిక్కిలి తహతహపడుచుండును. ఆనాదము సరిగా భగవంతుని ముఖమునుండి వెలువడి వచ్చుచుండెనని భావించి, నేను యోగసమాధి స్థితిలోనికి బోవుచుందును. బేలూరు మఠములోకూడ ఈ ఆనందమే నే ననుభవించితిని. అప్పుడాస్థలము బహుప్రశాంతముగా నుండెడిది. తఱచుగా నేను ధ్యాన నిమగ్ననై యుండెడిదానను. ఈ కారణమును బట్టి నరేంద్రుడు (వివేకానందస్వామి) నా కచ్చట నొకయింటిని కట్టించవలెనని తలపెట్టెను. ఈ యిల్లుగల నేలను కేదారుదాసు దానముగా నిచ్చెను. కాని, యిప్పుడు నేలవెల చాలపెరిగినందున స్థలము కొనుటకే సాధ్యముకాదు. ఇది యంతయు దైవకృప వలననే జరుగుచున్నది.

ఇంతలో అమ్మగారి మేనకోడలు 'మకు, తనచంటిపిల్లవాని నెత్తుకొని, 'అమ్మా! నేనేమిచేతును? కుఱ్ఱవాడు నిద్రపోవుటయే లేదు', అని చెప్పుచు వానిని క్రిందికిదింపెను, 'ఆ కుఱ్ఱవాడు సత్త్వగుణ ప్రధానుడు. అందుచేతనే నిద్రపోవుటలేదు,' అని అమ్మగారు బదులుచెప్పిరి.

ఉదుకు పొక్కులతో శ్రీమాతృదేవి దారుణముగా బాధపడుచుండెను. ఆమెకోరికపైని నేనామెకు తైలమును రాసితిని.

ఒకనాడమ్మగారు తమయింటి మేడమీాద నుత్తరపు వసారాలో కూర్చుండిరి. ఉదుకు పోక్కులతో నింకను చాల బాధపడుచునేయుండిరి. తమ పాదస్పర్శచేసిన ఎంతమందియో భక్తుల పాపములు సంక్రమించినందుననే ఆబాధ తమకు కలిగినదని తెలిపిరి. పిమ్మట శ్రీరామకృష్ణులను గురించి ప్రసంగము జరిగెను.

శ్రీ రామకృష్ణుల జీవిత విశేషములు

అమ్మగారు: కాశీపూరులో శ్రీరామకృష్ణులు జబ్బుతో పరుండి యుండినపుడొకసారి, కొంతమంది భక్తులు దక్షిణేశ్వర దేవాలయమందలి కాళీమాతకొరకై కొన్ని భక్ష్యములను దెచ్చి, శ్రీగురుదేవుడు కాశీపూరులో నుండెనని విని, వారాపదార్థముల నెల్ల ఆయన చిత్రపటము* నెదుటనుంచి సమర్పణజేసి, ఆ ప్రసాదమును భుజించిరి.

ఈ సంగతివిని శ్రీ రామకృష్ణు లిట్లుచెప్పిరి: జగన్మాతయైన శ్రీ కాళికాదేవికొరకీపదార్థములనెల్ల తీసుకొనివచ్చి, (తనను ఉద్దేశించుచు) దీనికి సమర్పించిరి!'' ఈ విషయమై నేను మిక్కిలి భయపడి ''అయ్యో! ఈయన అపాయకరమైన వ్యాధితో బాధపడుచున్నారే! ఏమి యుపద్రవము దీనివలన సంభవించునోకదా! దైవమా! ఈ భక్తులెందుకిట్లు చేసిరి?'' అని పరి

* ఈ విషయము కాశీపూరులో జరిగెను. కాళీమాతకు సమర్పించుటకై కొంతమంది భక్తులు వేరువేరు రకముల మధుర భక్ష్యములను తీసుకొని వచ్చిరి. కాని యీ పదార్థములను దక్షిణేశ్వరములోని కాళీమాతకు నివేదన చేయుటకు మారుగా, కాశీపురోద్యాన గృహములోని చావడిలోనుండిన శ్రీగురుదేవుని చిత్రపటమునకు సమర్పించిరి.

పరివిధముల తలంచితిని. శ్రీ గురుదేవులుకూడ దీని విషయమై మరల మరల చెప్పుచుండిరి. రాత్రి చాల ప్రొద్దుకడచిన మీదట "కొంతకాలమునకు జనులింటింట నన్నెట్లారాధింతురో నీవు చూచెదవు. దీనిని (తన్నుద్దేశించుచు) జనులందరు స్వీకరించుటను నీవు చూతువు. ఇది వాస్తవముగా జరుగబోవు విషయమే," అని శ్రీవారు నాతో జెప్పిరి. ప్రథమపురుషైక వచనమగు 'నేను' అను మాటను ఆయన తన్నుగురించి ప్రయోగించుచుండగా ఆ యొక నాడే నేను వింటిని. తన్నుగురించి మాటలాడునప్పుడాయన సామాన్యముగా తమశరీరమును చూపుచు 'ఈతొడుగు' అనికాని 'దీనికి చెందిన' అనిగాని చెప్పుటయేకాని 'నేను' అనికాని 'నన్ను' అని కాని చెప్పరు.

శ్రీ గురుదేవుని నిర్యాణానంతరమున ఆయనధరించు చుండిన ఉన్నిదుప్పటి, శాలువ మొదలగు దుస్తులవంటి విలువ యైన కొన్నివస్తువు లెవరు తీసికొనవలయునను విషయమున వివాదముబయలు దేరెను. ఎవరెన్ని చెప్పినను ఈవస్తువులను అమూల్యమైన ఆస్తిగాభావించి, ఆచంద్రార్కముగా కాపాడువారుభక్తులే. తుదకు వారే వీనినన్నిటిని ఒక పెట్టెలోపెట్టి బలరాముబాబు ఇంటియందు ఒక గదిలోనుంచిరి. కాని శ్రీ గురుదేవుని సంకల్ప మేమని చెప్పుదును, తల్లీ! ఆ యింటిలో పనిచేయుచుండిన పరి చారకుడా వస్తువులలో చాలవరకు దొంగిలించి, కొన్నిటిని అమ్మి వైచెను. మరికొన్నిటిని తన ఇష్టమువచ్చినట్లు వినియోగ పఱచెను. అటువంటి వస్తువుల నొక సాధారణమైన ఇంటిలో, పది మందికూర్చుండు గదియందుంచుట ఉచితముకాదు. ఇంటిలోపలి భాగమున నెచ్చటనైన వాడు వాని నుంచియుండవలసినది. శ్రీ

గురుదేవునివైన ఆవస్తువులలో చివరకు మిగిలిన వానిని, బేలూరు మఠములో నిప్పుడు కాపాడుచున్నారు.

నా మామగారు (శ్రీ రామకృష్ణుల తండ్రి) సాధువును, పవిత్రవర్తనుడును, స్వాతంత్ర్య ప్రియుడునైన బ్రాహ్మణోత్తముడు. ఇతరులుచేయు దానములను తానెన్నడును తీసుకొనకుండుటయే కాక, తానులేని సమయమున నెవరైన నింటికివచ్చి, ఇచ్చు దానమును తనకుటుంబములో నెవరునుగూడ స్వీకరింపవలదని శాసించిన పరధనాపేక్షారహితుడాయన. కాని మా అత్తగారి స్వభావ మటువంటిదికాదు. ఎవరైనను కాయగూరలను తెచ్చి ప్రత్యేకముగా నాకిచ్చినచో, ఆమె వానిని పుచ్చుకొని, వండి కులదేవతకు సమర్పించి పిమ్మట ప్రసాదముగా నందరికిని పెట్టును. ఈ సంగతి మా మామగారికే తెలిసినయెడల, ఆయన కోపపడెడువారు. స్వార్థ మెంతమాత్రమును పాటింపని నిరంతర భగవత్సేవా దీక్షగనె, యా భక్తాగ్రేసరుని జీవనజ్యోతి కాజ్యధార! ఇందుచేతనే శ్రీగురుదేవు లాయనవంశమున జన్మించిరి.

హరిదాసియను నొక స్త్రీ నవద్వీపమునకు తీర్థయాత్రగా వెళ్లవలయునని కోరెను. కాని, యామె వాస్తవముగా నక్కడకు పోకుండ కమార్పుకూరులోనే యుండెను. ఆమెకు నాయందు బహుప్రేమ. ఆమె విశ్వాసము మిక్కిలి గాఢమైనది. శ్రీ గురుదేవుడుపుట్టిన స్థలములోని కొంతధూళినితీసి తనయొద్ద నుంచుకొని, 'ఇదియే నా నవద్వీపము; శ్రీ గౌరాంగుడుకూడ నిచ్చటనే జనించెను. నేనిక నవద్వీపమున కెందుకు పోవలయును?' అని చెప్పుచుండును. ఎంత దృఢవిశ్వాసము!

శ్రీ గురుదేవుని నిర్యాణానంతరమున, ఒరిస్సానుండి ఒక సాధువు కమర్పుకూరుకు వచ్చియుండెను. నేనాతనికి బియ్యము, పప్పుదినుసులు మొదలైన జీవితావసరపదార్థముల నిచ్చుచుండు దానను. ప్రతిదినముదయము, సాయంకాలముగూడ నేనాతనికడకు వెళ్లి, 'స్వామీ! క్షేమముగా నున్నారా'? అని అడుగుచుందును. ఆహా! నేనెంతికష్టపడి ఆతనికొరకొక పూరియిల్లును కట్టించితిని! ప్రతిదిన మాకాశమున కారుమబ్బులు క్రమ్మి, వర్షము దిమ్మరించునేమోయని తోచుచుండెను. కనుక నేను చేతులుజోడించి, "ఓదైవమా! కొంచెము తడవాగుము! నేనీ కుటీరమును ముగించిన తరువాత కుంభవృష్టిగా వర్షము కురియనిమ్ము!" అని భగవంతుని ప్రార్థించుచుండు దానను. గ్రామములోని జనులుకూడ కుటీరమున కవసరమైన కలప, గడ్డిమొదలైన సామగ్రినిచ్చి నాకు తోడ్పడిరి. కుటీర మెట్లో పూర్తియైనది కాని, పాపమాసాధువు కొలదినాళ్లైన తరువాత ఆకుటీరములోనే చనిపోయెను.

శ్రీ రామకృష్ణులు తమ శరీరము గయలోనుండి వచ్చెనని చెప్పుచుండువారు. ఆయన తల్లి మరణించిన తరువాత నన్ను గయకువెళ్లి ఆమెకచ్చట పిండప్రదానము చేయుమనిరి. కుమారుడు బ్రతికియుండగా నాకాకర్మలను చేయుట కధికారము లేదని బదులు చెప్పితిని. "కాదుకాదు నీకందుకు అధికారముకలదు. ఎటువంటి సందర్భములోనైనను, నేను గయకు పోజాలను. అక్కడకు వెళ్లితినేని, మరలనిచ్చటకు వచ్చుటకు నాకు సాధ్యమగు ననుకొనుచున్నావా?" అని శ్రీ గురుదేవులు సెలవిచ్చిరి. అందుచేతనే నాయనను అక్కడకు వెళ్లుడని కోరలేదు. తరువాత గయలో నేనే ఆ కర్మలను చేసితిని.

1918-వ సం॥ సెప్టెంబరు 28-వ తేది.

ఉద్బోధనా పత్రికా కార్యాలయమునకు నేను వెళ్లినప్పటికి తెల్లవారినది. శ్రీ మాతృదేవి పండ్లచెక్కు తీయుచుండిరి. పూజలో నైవేద్యమునకు వినియోగపఱచుటకే ఆ పండ్లు. నన్ను చూచుటతోడనే, "నీవు వచ్చుట నాకెంతో ఆనందముగానున్నది. నేడే బోధన్ పండుగ. నేనావిషయమే మరచిపోతిని*. శ్రీరామకృష్ణుల పూజకై యీ పువ్వులను సద్దుము. పండ్లతట్టను యీ వైపున నుంచుము," అని అమ్మగారు చెప్పిరి. ఆమె చెప్పిన ప్రకారము చేసితిని. తరువాత అమ్మగారికి తలదువ్వితిని. తలదువ్వుచుండగా కొనవెండ్రుకలూడి బైటకు వచ్చినవి. "అమ్మాయీ! ఇవిగోనమ్మా! వీటిని దాచియుంచుకో," అని అమ్మగారు చెప్పిరి. నిజముగా నేను ధన్యురాలనైతి ననుకొంటిని. అమ్మగారి తలవెండ్రుక లొకటి రెండు స్మారక చిహ్నములుగా దాచియుంచుకొనవలయునని నాకు మిక్కుటమైన కోరికయుండెను.

సుప్రసిద్ధ వైద్యుడగు శ్యామదాసు కవిరాజు, రాధును చూచుటకు వచ్చెను. ఆమె నతడు చూచిన తరువాత, ఆయనకు నమస్కారము చేయుమని అమ్మగారు రాధునడిగిరి. ఆప్రకారమామె చేసిన తరువాత వైద్యుడు వెళ్లిపోయెను. పిమ్మట "ఆ వైద్యుడు బ్రాహ్మణుడా?" అని యెవరో అడిగిరి.

అమ్మగారు: కాదు, ఆయనది వైద్యజాతి.

భక్తురాలు: అట్లైనచో మీరెందుకాతనికి రాధును నమస్కరింపుమన్నారు?

---

* ఇది దుర్గపూజా ప్రారంభమునకు ముందటిదినము. హిందువులకు పండుగ.

అమ్మగారు: నేనట్లెందు కనకూడదు? ఆ వైద్యుడు చాల బుద్ధిమంతుడు, బ్రాహ్మణునితో సమానమైనవాడు. అట్టి వానికి గాక మరెవరికి నమస్కరింపవలయును? అమ్మాయీ, నీ యభిప్రాయమేమి?

1918-వ సం. సెప్టెంబరు 30-వ తేది.

నేడు పవిత్రమైన మహాష్టమి. నా చెల్లెలును నేనును ఉద్బోధనా పత్రికా కార్యాలయమున కుదయమున శీఘ్రముగ వచ్చితిమి. కొంత తడవైన తరువాత కొందరు భక్తురాండ్రు పువ్వులను దెచ్చి, వానితో శ్రీమాతృదేవిని పూజించి స్నానమునకై గంగకు వెళ్ళిరి. "నేటి కిక్కడ నీ వుండవు కాదా? నేడు మహాష్టమి. దుర్గపూజాదినములలో రెండవది," అని మాతృదేవి చెప్పెను. ఉందునని నేను చెప్పితిని. కొలది నిముషములైన తరువాత శరత్ మహారాజు (శారదానందస్వామి) అమ్మగారికి నమస్కారము చేయుటకై యచ్చటకు వచ్చెను. మేము ప్రక్కగదిలోనికి వెళ్ళితిమి. అమ్మగారు పరుపుపై కూర్చుండిరి. ఆమె పాదములు నేల నానుకొని యుండినవి. చాలమంది భక్తులువచ్చి శ్రీమాతృదేవికి నమస్కరించిరి.

పిమ్మట మేము మకుతోను, ఇతర భక్తురాండ్రతోను స్నానమునకై గంగకు వెళ్ళితిమి. ప్రతిదినము మేహవాతపు నొప్పులవలన గంగలో స్నానముచేయుటకు వీలులేనందున, ఇంటి యొద్దనే స్నానము చేసెదమని అమ్మగారు చెప్పిరి. స్నానముచేసి మరల వచ్చిన తరువాత చాలమంది భక్తురాండ్రువచ్చి, శ్రీమాతృదేవిని పూజించుచుండగా చూచితిమి. అమ్మగారికి సమర్పించుటకై వారిలో నెందరో కొత్తబట్టలను తీసుకొనివచ్చిరి.

పూజమైన తరువాత కాళీఘట్టములోని కాళీవిగ్రహమునకు జనులు చేయునట్లు, వారావస్త్రములను అమ్మగారి యొంటిమీఁద కప్పిరి. పిమ్మట, ఆ బట్టలను ఒకదాని తరువాత నొకటి తీసి వేయుచు, అమ్మగారు "యీ బట్ట బాగున్నది," అని చెప్పుచుండిరి.

ఇంతలో నొక బ్రహ్మచారి గదిలోనికివచ్చి, ఇంక భక్తులు అమ్మగారికి నమస్కరించుటకై లోనికి రానున్నారని చెప్పెను. ఓహో! అది యెంత రమ్యమైన దృశ్యము! తమ చేతులతో పువ్వులను, బాగుగా వికసించిన పద్మములను, మారేడు పత్రిని బట్టుకొని భక్తులొకరివెంట నొకరువచ్చి శ్రీమాతృదేవిని ఆరాధించి, ప్రణామముచేసి వెళ్లుచుండిరి. ఈ విధముగా కొంత కాలము గడచిన తరువాత బలరాముని కుటుంబమువచ్చి, అమ్మ గారిని అర్చించెను. చిట్టచివరకు నా వంతువచ్చినది. పూజచేసిన తరువాత, నేనొక బట్టను కప్పుచుండగా తటాలున. "ఈనాఁడు నేనొక క్రొత్తబట్టను కట్టుకొనవలసి యుండుటచే, యీ బట్టనే కట్టుకొందును," అని చెప్పి శ్రీమాతృదేవి వెంటనే నేనిచ్చిన చీరనే కట్టుకొనిరి. ఇది చూచి నేను కన్నుల నీరు పెట్టుకొంటిని. అది బహు సాధారణమైన చీర. అమ్మగారి చుట్టును విలువైన చీరలెన్నియో పడియుండినవి. అమ్మగారు తమ బీద పుత్రికనైన నాయందు వెలిబుచ్చిన యీ ప్రేమాతిశయమును జూచి సిగ్గుపడి తిని. "ఈ చీరయంచు ఎంత బాగున్నది!" యని ఆమె సెలవిచ్చిరి.

కావిరంగు చీరను కట్టుకొనిన యొక స్త్రీ అమ్మగారి నారా ధించి రెండు రూప్యములను వారి పాదముల కడనుంచిరి, "శ్రీ హరీ! నీ వట్లేల చేయవలయును? కాషాయవస్త్రమును కట్టుకొని చేతికి రుద్రాక్షపూసలను పెట్టుకొంటివే!" అని చెప్పి, యాస్త్రీని

'నీ గురువెవరు?' అని అమ్మగా రడిగిరి. తన కెవరును మంత్రోప దేశము చేయలేదని యామె బలుకుచెప్పెను. "మంత్రోపదేశ ము లేకుండ, పరమార్థానుభూతి యేమియులేకుండ నీ పవిత్ర కాషాయవస్త్రమును ధరించితివి. ఇది నీకు తగనిపని. నీ విప్పుడు కట్టుకొనిన వస్త్రము బహుపవిత్రమైనది. చేతులు జోడించి నీకు "నేను నమస్కరింప నుంటిని. అందరు నీ పాదములకు ప్రణామము చేయుదురు. ఇట్టి గౌరవమును స్వీకరించుటకు అధికారమును నీవు సంపాదింపవలయును." అని అమ్మగారు మందలించిన పిమ్మట, నేను మీ యొద్ద మంత్రోపదేశము నొందవలయునని ఆశపడు చున్నాను." అని ఆ స్త్రీ చెప్పెను.

అమ్మగారు : అది యెట్లు పొసగును!

కాని యాస్త్రీ అమ్మగారిని మంత్రోపదేశము చేయు డని పట్టుపట్టి పోరుచుండెను. గోలపె మాయికూడ ఆమెను సమ ర్థించెను. అమ్మగా రందుపైని కొంచెము సమ్మతించుచున్నట్లు కనుపడి, "సరే! ఆ విషయ మాలోచించెదము," అని సెలవిచ్చిరి.

తన ఆశ్రమ బాలికలతోకూడ గౌరీమాయి వచ్చెను. వా రందరును అమ్మగారి నారాధించి ప్రసాదము తీసికొని వెళ్ళిరి.

పూజామందిరములో పూజ ముగిసిన తరువాత, బిలాన్ మహారాజు శ్రీ మాతృదేవికడకువచ్చి, ఎందుచేతనో శ్రీ రామకృష్ణు లానాడు నైవేద్య మారగింపలేదని, గాలికి కొట్టు కొని వచ్చిన అపరిశుద్ధమైన ఆ కొకటి నైవేద్యముపై పడుట వలననో, భక్తులు తెచ్చిన పదార్థములలో నేదైన దోషముం డుట వలననో, ఎందుచేతనో తనకీ యనుమానము కలిగినదని శ్రీ మాతృదేవితో రహస్యముగా చెప్పెను. అందుపైని "నైవే

ద్యముమీద గంగాజలమును జల్లితివా?'' యని అమ్మగారతని నడుగగా, ''జల్లితి''నని చెప్పి యతడు వెడలిపోయెను. ఈ విషయమును విని నేను మనసున నాయాసపడితిని.

శ్రీ మాతృదేవి ఆరాధన యింతకు మున్ను చెప్పినట్లే విధముగా జరిగెను. పువ్వులును, మారేడు పత్రియును కుప్పలు కుప్పలుగా నామె పాదములదగ్గర ప్రోగుపడుచుండెను. ఒక ప్రోగు తరువాత నింకొక ప్రోగును, పరిచారకులు తీసివేయుచుండిరి.

దీనులయెడల శ్రీమాతృదేవికి గల దయ

మధ్యాహ్న పూజా సమయమయినది. చాలదూరమునుండి కొంతమంది పురుషులును, ముగ్గురు స్త్రీలును శ్రీ మాతృదేవిని సందర్శింప వచ్చిరి. వారు నిఱుపేదలు. ఒకొక్కరికి ఒకే బట్టతప్ప వేరేమియులేదు. యాచించి కొంతసొమ్మును సంపాదించి, దానితో వారు కలకత్తాకు వచ్చిరి. వారిలో నొక భక్తుడు అమ్మగారితో నేమేమో రహస్యముగా సంభాషించుచుండెను. మధ్యాహ్న పూజాసమయము గడచిపోవుచుండెను. కాని, ఆ భక్తుని సంభాషణకు అంతు కానరాకుండెను. అమ్మగారే పూజచేయవలసియుండెను. ఉద్బోధనాపత్రికాకార్యాలయములోని యుద్యోగులకు విసుగుపుట్టెను. వారిలో నొకరు ''ఇంకను నీవేమైన చెప్పవలసి యున్నయెడల, మేడక్రిందకు దిగివచ్చి, సన్న్యాసులలో పెద్దలగు వారితో మాట్లాడవచ్చును,'' అని యా భక్తునితో స్పష్టముగా చెప్పిరి. కాని, ''పూజాసమయము దాటిపోయినను భయములేదు. వీరు చెప్పవలసియున్న విషయములను నేను వినియే తీరవలయును,'' అని అమ్మగారు కొంత పట్టుదలతో చెప్పి, అతడు చెప్పిన దానినెల్ల మిక్కిలి యోరిమితో విని, రహ

స్యముగ వానికేవియో హితబోధ లొనర్చి, పిమ్మట వాని భార్యనుకూడ దీసికొనిరమ్మని యొకరిని పంపిరి. వారికి కలలో నేదియో అనుభూతి కలిగియుండవలయునని మే మూహించితిమి. కలలో వా రొక పవిత్రమంత్రోపదేశము నొందిరని మాకు తరువాత తెలియవచ్చెను. ఒక గంటయైన పిదప వారమ్మగారి యొద్ద సెలవుతీసుకొని వెళ్లిరి. "అమ్మో! వా రెంత పేదవారు! మిక్కిలి ప్రయాసపడి వారిక్కడకు వచ్చిరి," అని అమ్మగారు సెలవిచ్చిరి.

మధ్యాహ్నపూజ యైనతరువాత మేము భోజనము చేసితిమి. శ్రీ మాతృదేవి కొంతతడవు విశ్రమింప దలచిరి. మేము ప్రక్కగదిలోనికి పోతిమి.

సాయంకాలము నాలుగు గంటలైనది. పూజామందిరములో పూజయైన తరువాత రాసవిహారి మహారాజువచ్చి, "అమ్మా! మిమ్ము సందర్శింపవచ్చి, ఒక ఐరోపీయస్త్రీ యెంత కాలమో కనిపెట్టుకొని యుండెను," అని చెప్పెను. అమ్మగారామెను తోడ్కొనిరమ్మనిరి. ఆమె అమ్మగారికి ప్రణామము చేయుచుండగా కరస్పాలనము చేయునపుడు, మన మొనర్చు రీతిని అమ్మగా రామె చేతిని బట్టుకొనిరి. దేశకాలానుసారముగా మనము ప్రవర్తింపవలయునని శ్రీ గురుదేవుడు చెప్పినమాటలీ సందర్భమున నిజమయ్యెను. పిమ్మట అమ్మగారా స్త్రీ గడ్డమును నిమిరి, ముద్దుపెట్టుకొనిరి. ఆ దొరసాని, "నా రాకవలన నేను మీ కిబ్బంది కలుగజేయ లేదని నమ్ముచున్నాను. మీ దర్శనార్థము నేను చాలసేపటి నుండి, క్రింద కనిపెట్టుకొని యున్నాను. నే నిప్పు డొక పెద్దయాపదలో నున్నాను. నా యేకైకపుత్రిక

ప్రాణాపాయకరమైన అనారోగ్యస్థితిలో నున్నది. అందుచే మీ దయను, ఆశీర్వాదముల నర్థింప నిచ్చుటకు వచ్చితిని. నా కుమార్తెను కటాక్షించి, ఆమెకు వ్యాధి నివారణచేయుడు. అది చాల మంచిపిల్ల. ఈ కాలమున మాలో మంచిస్త్రీ కనుపడుటయే అరుదు. నా కుమార్తెను పొగడుట కిదియే కారణము. మాలో చాలమంది దుర్మార్గులని, దుష్ట మనస్కులని నేను నిష్కర్షగా చెప్పగలను. కాని నా కుమార్తె స్వభావమిందుకు కేవలము భిన్నము. దయయుంచి దానిని రక్షింపుడు,'' అని ఆ స్త్రీ వంగ భాషలో చెప్పెను.

అమ్మగారు: మీ కుమార్తెకొరకు నేను భగవంతుని ప్రార్థింతును. ఆమె వ్యాధి కుదురును.

శ్రీ మాతృదేవి చేసిన యీ అభయ ప్రదానమువలన చాల ధైర్యముకలిగి, ''ఆమెకు వ్యాధి నివారణ యగునని మీరు చెప్పినప్పుడు, ఆమె వ్యాధితప్పక నివారణమై తీరును. ఈ విషయమున సందేహమేమియు లేదు,'' అని యావారసాని ప్రబలవిశ్వాసముతో, నుత్కంఠగా ముమ్మారు చెప్పెను. అమ్మగారు దయార్ద్రదృష్టిని ప్రసరించుచు, ''పూజా వేదికలోనుండి యొక పువ్వును దెచ్చి యీమెకిమ్ము. ఒక తామర పువ్వును తీసికొనిరా,'' అని గోలప్‌మాయితో చెప్పిరి. అట్లే గోలప్‌మాయి యొక తామరపువ్వును, నొక బిల్వదళమును తీసికొనివచ్చెను. అమ్మగారా తామరపువ్వును చేతితో తీసికొని, కొలది క్షణములు తమకన్నులను మూసికొని ధ్యాన నిమగ్నులైరి. తరువాత కనులు తెరచి శ్రీ రామకృష్ణుల ప్రతిమవైపు రెప్పవాల్పక చూచుచు, అమ్మగారా పువ్వును ''దీనితో మీ కుమార్తె తలను అద్దుచుండుడు,'' అని చెప్పి ఆ వారసాని

కిచ్చిరి. దానిని మిక్కిలి భక్తితో తీసికొని ఆమె అమ్మగారికి ప్రణామముచేసి, "తరువాత నేనీ పువ్వునేమి చేయవలెను?" అని అడిగెను.

గోలప్‌మాయి: అది యెండిపోయిన తరువాత గంగలో పార వేయుడు.

దొరసాని: కాదుకాదు. ఇది భగవంతునిది. దీనిని పార వేయజాలను. ఒక క్రొత్తబట్టనుదెచ్చి, దానితో నొక సంచిని చేసి దానిలో నీ పువ్వునుంచెదను. ప్రతిదినము నా కుమార్తె తలను దీనితో నద్దెదను.

అమ్మగారు: మంచిది, అట్లే చేయుము.

దొరసాని: భగవంతుఁడు పరమసత్యము. భగవంతుఁ డున్నాడు. నే నొక విషయమును మీకు తెలుపఁగోరుచున్నాను. కొంత దినాల్ల క్రిందట నా శిశువులలో నొకరు జ్వరమువచ్చి, మంచము పట్టిరి. అత్యధిక భక్తితో "ఈశ్వరా! నీ వున్నట్లు నా హృదయమునకు పొడగట్టుచుండును. అయినను వాస్తవమైన ఋజువు కోరుచున్నాను," అని భగవంతుని ప్రార్థించి, యేడ్చి నా చేరుమాలును బల్లపై నుంచితిని. చాలతడవైన తరువాత ఆ రుమాలు మడతలలో మూఁడు పుల్లలుచూచి ఆశ్చర్యపడితిని. ఈ మూఁడు పుల్లలతో శిశువు శరీరమును మూఁడుసార్లు మెల్లగా అద్దితిని. త్వరలో జ్వరము నివారణ యయ్యెను.

ఈ విషయమును చెప్పినప్పుడు దొరసాని చెక్కిళ్లపై కన్నీటికాల్వలు ప్రవహించెను. చివరకామె, "అమూల్యమైన మీ కాలమును పాడుచేసితిని. దయయుంచి నన్ను క్షమింపుడు,"

అని చెప్పెను "లేదు లేదు. మీతో మాట్లాడుట నా కెంతో సంతోషముగా నున్నది. మంగళవారమునాడు మరల నిచ్చటకు మీరు రండి," అని అమ్మగారామెనుగోరిరి. పిమ్మట దొరసాని వంగి అమ్మగారియొద్ద సెలవుగైకొని వెళ్లెను.

కొన్నాళ్లైన తరువాత నేను అమ్మగారిదగ్గరకు వెళ్లినప్పుడు, మంగళవారమునాడు దొరసాని శ్రీమాతృదేవిని సందర్శింప వచ్చెనని వింటిని. అమ్మగారామెకు ప్రత్యేకాభిమానమును గనుపఱచి మంత్రోపదేశమును చేసిరి. ఆమె కుమార్తెకుకూడ వ్యాధి నివారణమైనది.

* * *

1920-వ సం. మార్చి 24-వ తే॥.

శ్రీ మాతృదేవి జయరాం బటిలో స్వగృహమందు రమారమి ఒక సంవత్సరముండి, కలకత్తాకు వసంతఋతువులో తిరిగి వచ్చిరి. చాలకాల మామె చలిజ్వరముతో బాధపడి, చిక్కి శల్యావశిష్టులైనారు. ఆమెకు సాష్టాంగ ప్రణామము చేసిన మీదట తమ చేతిని నా తలపైనుంచి నన్నాశీర్వదించి, నా కుశల మడిగిరి. శుష్కించిపోయిన యామె శరీరమును చూచినప్పుడు, నాకు మాటయే రాలేదు. ఆమెమోమును రెప్పవాల్పక చూచి "అయ్యో! ఈమె శరీరమెంతపాలిపోయి నీరసముగా నున్నది!" అని చింతించితిని. నా చెల్లెలి పరిచారికకూడ నాతోనుండెను. అది ప్రణామము చేయుచు అమ్మగారిపాదములను తాకబోవుచుండగా "దూరముననుండియే నీవు నమస్కరింపవచ్చును." అని అమ్మగారు దానితో చెప్పిరి. ఆ పనికత్తె తలుపు గుమ్మముదగ్గర నుండియే నమస్కరించి వెళ్లెను.

ఆ నీరసస్థితిలో ఒక్క మాట మాటాడినను అమ్మగారి కెంతో బాధగానుండెను. నేను నేలపై కూర్చుంటిని. ఇంతలో రాసవిహారీ మహారాజు వచ్చి అమ్మగారితో విశేషముగా మాట్లాడవలదని నాతో చెప్పెను. అమ్మగారుమాత్ర మప్పు డప్పుడు వేర్వేరు విషయములను గురించి నన్నడిగిరి. నేను మిక్కిలి క్లుప్తముగా బదులు చెప్పితిని. పిమ్మట తన బిడ్డనెత్తుకొని రాధు వచ్చెను. నేనా బిడ్డనెత్తుకొని ఒక చిన్న బహుమాన మతని కిచ్చి తిని. దానిని తీసుకొనవలదని రాధు పట్టుపట్టెను. "ఇదేమే రాధూ? ఆమె నీ సోదరి గదా. అంత ప్రేమతో బహుమాన మిచ్చినప్పుడు నీవేల దానిని పుచ్చుకొనవు?" అని చెప్పుచు, అమ్మగారే ఆ పైకమును పుచ్చుకొనిరి. తల్లి, అమ్మమ్మల అశ్రద్ధవలన ఆ శిశువు పడుచుండిన పాట్లకు అమ్మగారు చాల చింతించిరి. ఆవేశముతో రాధు నోటికి వచ్చినట్లు మాట్లాడుచుండెను. "దానితో మాట్లాడి లాభములేదు," అని చెప్పి అమ్మగారు రూరకుండిరి. కొంత తడ వైనతరువాత సరళయును కొంతమంది భక్తురాండ్రును, అమ్మ గారిని చూడవచ్చిరి. ఆమె పరుపుపై బరుండియే వారితో సంభా షింప నారంభించిరి.

1920-వ సం. మార్చి 30-వ తేది

అయిదారు నాళ్లైన తరువాత శ్రీమాతృదేవిని సందర్శిం చుటకై వెళ్లితిని. అప్పుడామెకు జ్వరము వచ్చుచుండుటలేదు కాని, రాధుకు తన పసిబిడ్డను చూచుకొను సమర్థతకూడ లేదే యని అమ్మగారు చాల వ్యసనపడుచుండిరి. ఇంతేకాక నేడు రాధు తన చేతిని ఇనుపకమ్ములకువేసి కొట్టుకొని యుండుటచేత, చేయి యంతయువాచి, దానికి ఆముదములోముంచిన యొకముటికి

గుడ్డను కట్టు కట్టుకొని ఆమె అప్పుడే అమ్మగారిని పరీక్షచేయుటకు వచ్చిన డాక్టరు కంజీలాల్ అను వైద్యునకు చేతిని చూపించుటకు అమ్మగారి గదిలోనికి వచ్చెను.

రాధుచేతికి బాగుగా కట్టుకట్టిన తరువాత అమ్మగారు పరుపుపై పరుండి తమ పాదములను నన్ను రాయమనిరి. పాదములను రాయుచు, నాకొక విషయమడిగి తెలిసికొనవలెనని యున్నదని అందు విషయమై ప్రశ్నించినచో ఇబ్బందిలేనియెడల అడుగుదునని చెప్పితిని.

అమ్మగారు: లేదు. ఎంతమాత్ర మిబ్బందిలేదు. చెప్పదలచుకొన్న దానిని నీవు చెప్పవచ్చును.

నాకు కలిగిన ఒకానొక అనుభవమును గురించి అమ్మగారితో చెప్పితిని. అందుపై అమ్మగారిట్లు సెలవిచ్చిరి: ''ఆహా! నా తల్లీ, ఇట్టి యనుభవ మెవరికైన ప్రతిదినము కలుగునా? నీవు చెప్పినది సర్వము నిజమే. అసత్యమేమియు లేదు. సర్వము శ్రీ గురుదేవుడే. ఆయనయే ప్రకృతి. ఆయనయే పురుషుడు. ఆయనవలననే నీకు సర్వమును లభించును.''

పారమార్థిక సాధనలను అనుభవములను గురించి.

శిష్యురాలు: అమ్మా! నేనొకనాడు ఏకాగ్రచిత్తముతో జపము చేయుచుండగా చాలకాలము తెలియకుండగనే కడచిపోయెను. ఆ కారణమువలన మీరు నాకు చెప్పిన ఇతరసాధనలనేవియు, చేయకయే నేను తొందరగా ఇంటిపనులను చూచుకొనవలసి వచ్చెను. నేనట్లుచేయుట దోషమా?

అమ్మగారు : కాదు, కాదు. అందులో దోషమేమియు లేదు.

శిష్యురాలు : అర్ధరాత్రి ధ్యానము చేయుచుండునప్పుడు ఒక విచిత్రమైన నాదము వినవచ్చుచుండునని యొకరు నాతో చెప్పిరి. సాధారణముగా తన కుడిప్రక్కనుండి ఈ నాదము వచ్చుచుండునట్లును, ఒక్కొక్కప్పుడు మనస్సుదిగువస్థాయిలో ప్రవర్తించినప్పుడు ఎడమప్రక్కనుండికూడ వచ్చుచుండునట్లును అతని యనుభవము.

అమ్మగారు : (కొంత తడవు ఆలోచించి) నిజము. కుడి ప్రక్కనుండియే ఆ నాదము వచ్చును. శరీరస్మృతి యున్నప్పుడు మాత్రమే, ఎడమ ప్రక్కనుండి నాదము వచ్చును. కుండలినీ శక్తి ఊర్ధ్వముఖమైనప్పుడు, ఈ సంఘటనలు జరుగును. కుడి ప్రక్కనుండి వచ్చునాదమే నిజమైనది. కొంతకాలమునకు మనస్సే గురువగును. ఏకాగ్రచిత్తముతో రెండునిముషములైనను భగవంతుని ప్రార్థించుటయును, ధ్యానించుటయును, చంచలమైన మనస్సుతో గంటలకొలది చేయు జపతపాదులకంటె చాలమేలు.

'శరీరస్మృతి' అననేమో అడుగుటకు, అమ్మగారారోగ్యముగా లేనందున నాకు మనస్కరింపలేదు.

నేను సెలవుతీసికొని వెళ్లునప్పుడు అమ్మగారు వెంటనే తలగడపైనుండి తమ తలను పైకెత్తి "అమ్మాయీ! మంచిది! నేను తలను పైకెత్తి యున్నాను," అని చెప్పిరి. ఆచారము ప్రకారము పరుండియున్నవారికి నమస్కరింపకూడదు కనుక శ్రీమాతృదేవి ఇట్లు చేసిరి. నేను ప్రణామముచేసిన తరువాత

"మరల రావలెను సుమా! సాయంకాలము కొంచెము త్వరగా రా. నీ యింటిపనులను కొంచెము వేగముగా ముగించి రాలేవా?" అని అమ్మగారు చెప్పి, నా క్షేమముకొరకు దుర్గ పేరును ప్రార్థనగా నుచ్చరించుచు, వెళ్లుటకు నాకు సెలవిచ్చిరి. నేను వసారలోనికి వచ్చినతరువాతకూడ దయార్ద్రస్వరముతో దుర్గ పేరు నామె స్మరించుచుండగా వింటిని. ఎంత అపారమైన ప్రేమ! మే మామె యొద్దనున్నంతకాలము మా విచారములను, జీవితకష్టములను పూర్తిగా మఱచిపోదుము.

* * *

అమ్మగారి వ్యాధి నయమగు సూచన లేవియు కనుబడలేదు. ఆమె శరీరము నానాటి కెక్కువగా నీరసించుచుండెను. ఒకనాటి మధ్యాహ్నమున నే నామెను సందర్శింప వెళ్లినప్పుడు, సాయంకాల స్నానముచేయుట కామె సిద్ధపడుచు, లేచుటకు నా సాయము నడిగి, "నాకు చాల తఱచుగా జ్వరము వచ్చుచున్నది. శరీరము కూడ మిక్కిలి నీరసించుచున్నది," అని చెప్పిరి.

1920-వ సం. మార్చి 14-వ తేది.

సాయంకాలపు మంగళహారతి యైనది. అమ్మగారు జ్వరముతో పరుండిరి. రస్ బిహారి మహారాజు శ్రీమాతృదేవి చేతులను, వరదా బ్రహ్మచారి యామెపాదములను రాయుచుండిరి. ఆమెకు జ్వరమెంతయున్నదో యింకొకరు చూచుచుండిరి. అమ్మగారు కన్నులు మూసికొనియే పరుండిరి. నే నామెప్రక్కను నిలువబడి యుంటిని. "ఎవరక్కడ?" అని యొకసారి అమ్మగా రడిగిరి. రస్ బిహారి మహారాజు మెల్లగా ప్రత్యుత్తర మిచ్చెను. జ్వరము 100.1 డిగ్రీలుండెనని వింటిని. సంవత్సరాది కనుక సుధీరాసోదరి

నివేదితా పాఠశాలలోని బాలికలకు విందు జేయుచుండెను. అందు వలన, శ్రీ మాతృదేవికి పరిచర్య చేయుచున్న సరళయను శిష్యురాలు నివేదితా పాఠశాలకు వెళ్లెను. అక్కడనుండి సరళను తీసుకొనిరమ్మని అమ్మగారు వరదా బ్రహ్మచారి నడిగిరి. ఆమెయే రాధు పసిబిడ్డకు అన్నము పెట్టవలసి యుండెను. బిడ్డకు అన్నము పెట్టువేళ యింకను కాలేదు. కాని బిడ్డ డేడ్చుచుండుటచే రాధు వానికి అప్పుడే అన్నమును పెట్టగోరెను. అమ్మగారామెను వారింప ప్రయత్నించిరి. అందుపై రాధుకు కోపమువచ్చి అమ్మగారిని తిట్టుటకు మొదలుపెట్టి, "నీవు చచ్చిన బాగుండును. నీ కాష్టమునకు నేనే నిప్పంటించెదను!" అని ఆవేశముతో పలికెను. ఈ మాటలు నా కెంతో కష్టముగానుండెను. అమ్మగారెంతో జబ్బుగా నుండినప్పుడు రాధు తిట్టినతిట్లివి. ఇంతతో ఆగక ఆమె యింకను యెన్నియో కేకలు వేయుచుండెను. ఇదియే రాధు సర్వ సాధారణ ప్రవర్తన. మూర్తీభవించిన సహనమని చెప్పదగిన శ్రీ మాతృదేవి, ఎల్లవేళలందు నిట్టి ప్రవర్తనను సహించుచుండెను కాని, యీసారిమాత్రము వ్యాధిప్రకోపమువలన అమ్మగారుకూడ విసుగుకొని. "ఔను; నేను పోయిన తరువాత నీ దుర వస్థలన్ని నీవే గ్రహింతువు! ఎన్ని తన్నులు, ఎన్ని చీపురుకట్ట దెబ్బలు నీకు ముందున్నవో కదా!" అని చెప్పిరి.

ఈ మాటలను విని రాధు మరింత ఆగ్రహపరవశురాలై యెక్కువగా తిట్ట నారంభించెను. కొంతతడవైన తరువాత సరళ వచ్చి యా కుఱ్ఱవానికి అన్నము పెట్టెను. ఆనాడు జరిగిన విషయములవలన నా మనస్సు మిక్కిలి విచారగ్రస్తమయ్యెను. అమ్మగారు నన్ను తమపాదములను రాయుమనిరి.

సరిగా ఆ సమయమున రాసబిహారి మహారాజు వచ్చి మంచమునకు దోమతెరను కట్టనుండెను. కనుక నేను సెలవు దీసికొంటిని. అమ్మగారు తుదిమాటగా ''వెళ్ళిరా''అని చెప్పిరి. ఇదియే అమ్మగారు నాకు కడసారిగా దయచేసిన ఆజ్ఞ! ఆమె దివ్యవాణి నుండి నేను వినిన చిట్టచివరిమాట!

ఆనాడు నేను కాళీఘట్టమునకు వెళ్లవలసి వచ్చెను. తరువాత, యింటిలో చాలమందికి జబ్బుగానుండుటవలనను, ఇతర కష్టములవలనను అమ్మగారిని చూచుటకై వెళ్లు నవకాశము నాకు కలుగలేదు. ఆమె ఆరోగ్యము విషయమై యెప్పటికప్పుడు నాకు వర్తమానము వచ్చుచుండెను. ఆనాటి కానాడామె వ్యాధి యెక్కువగు చుండెనని తెలియవచ్చెను. పిమ్మట, నే నతిశీఘ్రముగ నొకనాడామెను సందర్శించుటకై వెళ్ళినప్పుడు, మా జీవితములలో పరమేశ్వరుడు మాకనుగ్రహించిన మహాభాగ్యమును కోల్పోవ నున్నారమని నా హృదయము చాల భయకంపితమయ్యెను. నేను నిరాశా పరవశను కాజాలనైతిని.

(ద్వితీయ భాగము *)

జయరాంబటి..... 1909-వ సంవత్సరము.

''అమ్మగారు మిమ్ము తీసికొనిరమ్మని ఒక మనుష్యుని పంపినారు,'' అని వరదామామ నాతో చెప్పెను. నేను లోపలికి వెళ్లితిని. శ్రీమాతృదేవి తమ గది గుమ్మమునొద్ద నాకొరకు కనిపెట్టుకొని నిలువబడియుండిరి. నేను నమస్కారము

* అమ్మగారి శిష్యులలో నొక సన్యాసిని ఉల్లేఖించినది.

చేసినప్పుడు, ''మీ దేయూరు?'' అని అమ్మగా రడిగిరి. నా స్వగ్రామమున్న జిల్లాపేరు చెప్పితిని.

అమ్మగారు: నీ విప్పుడు శ్రీ గురుదేవుల ఉపదేశములను చదువుచున్నావని తలంతును.

ఈ మాటలకు నే నేమియు బదులు చెప్పలేదు. నన్నెంత కాలమునుండియో ఎరిగియుండినట్లు అమ్మగారు మాట్లాడిరి. ఆమె నన్నెంత వాత్సల్యముతో చూచిరో నే నింకను మఱచి పోలేదు.

అమ్మగారు: నీది కాయస్థకులమా?

శిష్యుడు: ఔను.

అమ్మగారు: మీ రెంతమంది అన్నదమ్ములు?

శిష్యుడు: నలుగురము.

అమ్మగారు: కూర్చుని, కొంచెము ఫలాహారములను తీసుకొనుము.

ఈ మాటలుచెప్పి అమ్మగారు వసారాలో నేలమీద నొక చిన్న తివాచిని పరచి, క్రిందటిరాత్రి నైవేద్యము చేయబడిన కొన్నిపూరీలను, మధురభక్ష్యములను నాకిచ్చిరి. తారకేశ్వరము నుండి దారిపొడుగుననడచి, రాత్రికి జయరామ్‌బటికి వాయవ్య మూలనున్న దేశ్రా గ్రామమందు, మార్గమధ్యమున హరిపాల్ రయిలుస్టేషనునొద్ద నాతో కలసిన, యొక యువకునిఇంటిలో నతని యతిథిగా ఆగితిని. అమ్మగారి మాటలన్నియు విని, ఫలాహారము చేసినతరువాత, 'నీ విప్పుడు స్నానము చేయవలదు. చాల దూరము నడచివచ్చితివి,' అని చెప్పి నాకు తాంబూలమిచ్చిరి.

నేను అనుకొంటిని. రామునకు సీతవలె, కృష్ణునకు రాధవలె ఆమె శ్రీ గురుదేవునకు దేవియై యుండవలెను. నా హృదయాంతరాళమున దేదీప్యమానముగ వెలుంగుచుండిన ఈ విశ్వాసముతోనే, శ్రీ మాతృదేవికడకు వచ్చితిని.

శిష్యుడు : అట్లయినచో మీరొక సాధారణ స్త్రీవలె రోట్టెలు చేయుచున్నట్లు నాకెందుకు కనుపడుచున్నారు? ఇది మాయయని తలంతును. నిజమేకదా?

అమ్మగారు : నిజమే. ఇది మాయ. లేనిచో నేనీ స్థితిలోని కేల రావలయును? కాని, భగవంతుడు మానవవ్యక్తిగా విహరింప గోరుచుండును. శ్రీ కృష్ణుడు గోపబాలుడుగను శ్రీరాముడు దశరథుని కుమారుడుగను పుట్టిరి.

శిష్యుడు : మీ కెప్పుడైన మీ నిజస్వరూపము జ్ఞప్తికి వచ్చునా?

అమ్మగారు : ఔను. అప్పుడప్పుడు నాకారూపము జ్ఞప్తికి వచ్చుచుండును. అట్టి సమయములందు, "నేనిప్పుడేమి చేయుచున్నాను? ఇదియంతయు నెందుకు?" అని నాలో నే ననుకొనుచుందును. ఆవిధముగా నే ననుకొనునప్పుడు (తమ అరచేతితో అచ్చటి ఇండ్లను చూపుచు), ఈ యిండ్లు, బిడ్డలు నా జ్ఞప్తికివచ్చి, నా నిజస్వరూపమును మఱచిపోవుచుందును.

అమ్మగారిని నేను ప్రతిదినము వారిగదిలో చూచుచుంటిని. శ్రీ దేవిగారు పరుపుపై బరుండి నాతో మాట్లాడుదురు. ఆమె ప్రక్కనే, రాధు నిద్రపోవును. గదిలో నూనెదీపము వెలుగుచుండును. ఒక్కొక్కనాడు శ్రీ దేవిగారి పాదములకు పరిచారిక తైలమును రాయుచుండెడిది.

ఒకనాడు ప్రసంగవశమున అమ్మగారిట్లు నాతో చెప్పిరి: "నా శిష్యులలో నెవరైనను నా తలపునకువచ్చి, ఆతనిని నేను చూడగోరు నెడల, ఆ శిష్యుడిచ్చటకు రానైనవచ్చును, లేనిచో ఉత్తరమైనను వ్రాయును. ఏదోయొక భావమును మనస్సులో పెట్టుకొని నీ విచ్చటకు వచ్చియుండవలయును. బహుశః శ్రీ జగన్మాతను తలచుకొనుచున్నావు."

శిష్యుడు: జీవులందరికిని మీరే తల్లియా?

అమ్మగారు: ఔను.

శిష్యుడు: ఈ పశుపక్ష్యాదులకు కూడనా?

అమ్మగారు: ఔను, వీనికికూడను.

శిష్యుడు: అట్లైనచో, అవి యెందుకింత కష్టపడుచుండ వలయును?

అమ్మగారు: ఈ జన్మలో వానికి అనుభవము లుండ వలయును.

ఒకనాటి సాయంకాలమున శ్రీ మాతృదేవికిని, నాకును ఈ క్రింది సంభాషణ జరిగెను.

అమ్మగారు: మీరు నా స్వజనము కనుకనే యిక్కడకు వచ్చుచున్నారు.

శిష్యుడు: నేను మీ స్వజనములోనివాడనా?

అమ్మగారు: ఔను. అందువిషయమై సందేహమేమున్నది? ఒకమనుష్యుడింకొకరి సొంతమైనయెడల యుగయుగములకును వారిసంబంధ మెన్నటికిని వీడిపోదు.

శిష్యుడు: మిమ్మందరును 'మీరు' అని సంబోధింతురు.

నేనుమాత్ర మామాట నుచ్చరింపలేను. నేను 'నీవు' అని సంబోధింతును.

అమ్మగారు: అదియే మంచిది, నిజము. ఇది నాతో నీకుగల చనువును సూచించును.

"మీరు మంత్రోపదేశము చేసినవారి బాధ్యతలను మీరే వహించియుండవలయును గదా. అట్టి సందర్భములో, ఏదైనకోర్కెను నెరవేర్పుడని మేము మిమ్మడిగినప్పుడు 'ఆ విషయమై శ్రీ గురుదేవునితో మాట్లాడెదను' అని మీరేల చెప్పుదురు? నా బాధ్యతను మీరే వహింపలేరా?" అని నేను మా సంభాషణ సరళిలో అమ్మగారితో చెప్పితిని.

అమ్మగారు: నిజముగా నీ బాధ్యతను నేను వహించియున్నాను.

శిష్యుడు: ఓ తల్లీ, నాకు చిత్తశుద్ధియు భగవద్భక్తియు నుండునట్లు దయయుంచి ఆశీర్వదింపుము. అమ్మా! మా బడిలో నాకొక సాధ్యాయుడున్నాడు. నా ప్రాణస్నేహితుడైన ఆబాలుని యందు నాకుగల ప్రేమలో నాల్గవవంతు ప్రేమనైనను శ్రీ రామకృష్ణులకు నేను కనుబరచగలుగునెడల, కృతజ్ఞుడనై యుందును.

అమ్మగారు: అయ్యో! అది నిజమే! మంచిది నే నీ విషయమై శ్రీ గురుదేవునితో మాట్లాడెదను.

శిష్యుడు: శ్రీ గురుదేవునితో మాట్లాడెదమనిమాత్రమే మీరేల చెప్పెదరు? ఆయనకంటె మీరు వేరా? మీ ఆశీర్వాదములుమాత్రమే యున్నయెడల, నాకోరిక తప్పక సిద్ధించును.

అమ్మగారు: నాయనా! నా ఆశీస్సులవలన నీకు పరిపూర్ణ

జ్ఞానము కలుగునెడల, నా మనసార నిన్నాశీర్వదించుచున్నాను. ఇతరసాహాయ్యములేకుండ, మాయాబంధములనుండి తప్పించు కొనుట కెవరికైన నెప్పటికైన సాధ్యమగునా? ఇందుకే శ్రీగురు దేవుడు బహు కఠిన తపస్సునుచేసి, మానవకోటి విమోచనకై దానినెల్ల ధారవోసెను.

శిష్యుడు: శ్రీ రామకృష్ణులను చూడకుండగనే ఎవరైన ఆయనను ప్రేమింపగలరా?

అమ్మగారు: ఔను. నీవుచెప్పినది నిజము. గాలివంటి బూటకపువ్యక్తికి ఎవరైన ప్రియస్నేహితులుగా నుండగలరా?

శిష్యుడు: శ్రీ గురుదేవుని దర్శనము నాకెన్నడు కలుగును?

అమ్మగారు: తప్పక నీవాయనను చూచెదవు. సకాలమున శ్రీ గురుదేవుని దర్శనభాగ్యము నీకు కలుగును.

*　　　*　　　*

ఒకనాడు తమశయ్యపైని అమ్మగారు పరుండిరి. కామిని యను పరిచారిక, ఆమె మోకాలునకు మేహవాతపునొప్పి పోవుటకై, ఏదో తైలమును రాయుచుండెను. "శరీరము వేఱు. ఆత్మ వేఱు. ఆత్మ శరీరమంతట నిండియుండును. అందుచేతనే నా కాలులోని బాధ నాకు తెలియుచున్నది. ఈ మోకాలులోనుండి నా మనస్సును నేను తీసివేయునెడల అక్కడ నాకేబాధయు నుండదు," అని అమ్మగారు నాతో చెప్పిరి.

మంత్రోపదేశము విషయమై ముచ్చటించుచు, "అమ్మా! గురుముఖమున మంత్రోపదేశము నొంద వలసిన అవసరమేమి? ఎవడైన నొకడు

మంత్రోపదేశ మవసరమే.

తన మంత్రము నుచ్చరింప డనుకొనుడు. ఊరకే, 'అమ్మా! కాళీ!, అమ్మా! కాళీ!' అని అతడు-స్మరించు చున్నయెడల చాలదా?'' అని నేను అమ్మగారితో చెప్పితిని.

అమ్మగారు: మంత్రమువలన శరీరము పావనమగును. భగవన్మంత్ర ముచ్చరించుటవలన మానవుడు నిర్మలుడగును. ఒక కథ గలదు, వినుము. ఒకనాడు నారదుడు శ్రీ స్వామివారిని సందర్శించుటకై వైకుంఠమునకు వెళ్లి, వారితో చాలకాలము సంభాషించెను. అప్పటికి నారదుడు మంత్రోపదేశ మొంది యుండలేదు. నారదుడు వైకుంఠమునుండి వెళ్లిన తరువాత "ఆ స్థలమును ఆవుపేడతో పరిశుద్ధముచేయుడు" అని స్వామివారు లక్ష్మీదేవి కానతిచ్చిరి. "ఎందుకు స్వామీ? నారదుడు మీ యుత్తమ భక్తకోటిలోనివాడే! సందర్భమిట్లున్నను, మీ రేల ఈరీతిని చెప్పుచున్నారు?'' అని లక్ష్మి అడిగెను. "నారదున కింకను మంత్రోపదేశము కాలేదు. మంత్రోపదేశము లేనిదే, శరీరము పవిత్రము కాజాలదు,'' అని శ్రీ స్వామివారు బదులు చెప్పిరి.

ఆధ్యాత్మికాభివృద్ధి విషయమున మనస్సునకు గల ప్రాముఖ్యము.

అధమము శరీరశుద్ధికొరకైనను గురుముఖమున మనము మంత్రోపదేశము నొందవలెను. మంత్రోపదేశము చేసిన తరువాత "ఇప్పుడింక సర్వము నీ మనస్సుపైన నాధారపడియుండును,'' అని వైష్ణవాచార్యులు శిష్యునితో జెప్పును. "చెవిలో మానవగురువు మంత్ర ముచ్చరించునేకాని భగవంతుడే ఆత్మకు తేజస్సు నిచ్చును'' అని చెప్పుదురు. సర్వము మన మనస్సుపైననే ఆధారపడియున్నది.

చిత్తశుద్ధిలేనిదే, మనకేమియు లభింపదు. సాధకునకు గురుకటాక్షమును, భగవత్కటాక్షమును, వైష్ణవకటాక్షమునుకూడ కలిగినను, ఒకనిదయలేనిచో నతనికి దుఃఖము సంభవించును. మనస్సే ఆ యొకడు. సాధకునకు వానిమనస్సు సుముఖముగా నుండవలయును.

ప్రసంగ మింకను సాగించుచు, శ్రీ మాతృదేవి యిట్లు చెప్పిరి: "శ్రీ గురుదేవుని నిర్యాణానంతరమున నేనుకూడ శరీరమును చాలింపదలచితిని. ఆయన నాయెదుట కనుపడి 'వలదు. నీవిచ్చట నుండవలయును. చేయవలసిన పనులెన్నో కలవు' అని చెప్పిరి. తరువాత నేనిది నిజమని గ్రహించితిని. నేను చేయవలసిన పనులెన్నియో యుండెను. 'చీకటిలో గుమికూడి సంచరించు పురుగులవలె కలకత్తాలోని జనులు నివసించుచున్నారు. వారివిషయమై నీవు శ్రద్ధతీసుకొని, వారి యోగక్షేమమును కనిపెట్టుచుండవలయును' అని శ్రీ గురుమహారాజుగారు చెప్పుచుండువారు. భక్తుల హృదయములలో సూక్ష్మశరీరముతో మూడువందల యేండ్లవరకు తాము జీవించియుందుమని, శ్వేతజాతులవారిలో తమకు చాలమంది భక్తులుగా నుందురని కూడ ఆయన చెప్పిరి.

"శ్రీ గురుదేవుని నిర్యాణమైనతరువాత నేను సన్నని యెఱ్ఱంచుల * చీరను కట్టుకొని, నా మణికట్టుపైన బంగారు గాజులను తొడుగుకొనుచుంటిని. అందుచే జనులు నన్నొకవేళ ఆక్షేపింతురేమోయని మొట్టమొదట చాల భయపడితిని. కాని,

*- మలాదేశము ప్రకారము హిందూ వితంతువులు అంచుకూడలేని తెల్లనిచీరను కట్టుకొని, ఆభరణముల నన్నిటిని తీసివేయవలయును.

క్రమక్రమముగా నా కాభయము పోయెను. ఒకనాడు శ్రీ గురుదేవుడు నాకు కనుపడి తనకు పులగమును చేసియిమ్మని యడిగిరి. ఆ పదార్థమును నేను సిద్ధముచేసి దేవాలయములో, శ్రీ రామకృష్ణుల కుటుంబమునకు కులదేవతయగు రఘువీరున కర్పించి మానసికముగా నేను దానిని శ్రీ గురు దేవున కారగింపు చేసితిని''...

తమ్మగురించి ముచ్చటించుచు ''బలరాంబాబు 'మహాతపస్విని, మూర్తీభవించిన క్షమ' యని నన్ను గురించి చెప్పవాడు. దయలేనివానిని మానవుడని మనము చెప్పవచ్చునా? కేవల మతడు పశువు. ఒక్కొకప్పుడు దయార్ద్రహృదయనై నన్ను నేను మఱచిపోవుచుందును. అప్పుడు నేనెవరినో నాకు జ్ఞప్తియుండదు,'' అని అమ్మగారు చెప్పిరి.

''నీతో నే నెక్కువ చనువుగా మెలగుచున్నాను. కలకత్తాలో నా నివాసమునకువచ్చి, నాయొద్ద నుండుము,'' అని శ్రీ మాతృదేవి కడసారిగా నా కానతిచ్చిరి.

ఆ కాలమున నేను నా బంధువులతో సంసారములో నుంటిని. కాని, సన్న్యాసాశ్రమము తీసుకొనవలెనని నాకు ప్రబలమైనకోరిక యుండెను. ''బహుశః ముందుముందు శ్రీ మాతృదేవి కృపవలన నేను సన్న్యాసినై, అమ్మగారియొద్ద నివసింపవచ్చును,'' అని నాలో నే ననుకొంటిని.

నేను జయరాంబటిలో నుండినప్పుడు, రాధు తల్లికి పిచ్చియెత్తి యామె రాధు నగలను తన తండ్రియింటికి తీసుకొని పోయెను. ఆ నగల నామెతండ్రి, యామెయొద్దనుండి లాగుకొనెను. ఇందువలన నామెమనస్సు మఱింత వికలమై, జయరాం

బటికి తిరిగివచ్చి ఆ నగలకొరకామె సింహవాహినీ దేవాలయములో ఏడ్చుచుండెను. సాయంకాలము కనుచీకటివేళ నేను శ్రీ మాతృదేవితో, వారిగదిలో మాట్లాడుచుండగా, హఠాత్తుగా "నాయనా! నేనిక వెళ్లవలెను. నేను తప్ప నా పిచ్చివదినెకు తనవారని చెప్పుకొనతగినవారు వేఱెవ్వరును లేరు. ఆమె యిప్పుడు నగలకొరకు అమ్మవారియెదుట యేడ్చుచున్నది" అని చెప్పి అమ్మగారు గదిలోనుండి వెడలిపోయిరి. నాకుమాత్రము మనుష్యులెవరుకాని యేడ్చుచుండినట్లు వినబడలేదు; అంతదూరమునుండి వినబడుటకుకూడ వీలులేదు. కాని ఆ కంఠస్వరము అమ్మగారు గుర్తించిరి. రాధు తల్లితోకూడ, ఆమె తిరిగివచ్చెను. "ఓ వదినా! నా నగలను నీవే కనుపడనియ్యక, నాకు లేకుండ జేసితివి," అని రాధుతల్లి చెప్పగా "ఈ నగలు నావే మైనయెడల, నేను వానిని పెంటవలె వెంటనే పారవేసియుందును," అని అమ్మగారు ప్రత్యుత్తరమిచ్చిరి. రాధు తల్లినిగురించి ప్రసంగించుచు "ఆమె నాపిచ్చి చెలికత్తెయని గిరీశుడు చెప్పుచుండువాడు," అని నవ్వుచు శ్రీ మాతృదేవి ఛలోక్తిగా నాతో బలికిరి.

మొట్టమొదట శ్రీ మాతృదేవిని 'అమ్మా' యని సంబోధించుటకు నేను సందేహించుచుండువాడను. నా సొంతతల్లి నా చిన్నతనమందే చనిపోయెను. ఒకనాటియుదయమున, శ్రీ మాతృదేవి నన్నొక పనిమీద ఒకరియొద్దకు పంపిరి. నేను బయలుదేరబోవుచుండగా "ఆయనతో నేమనిచెప్పెదవు?" అని అమ్మగారు నన్నడిగిరి. "ఏమనా? 'ఆమె మీతో నిట్లు నన్ను చెప్పుమన్నారు...' అని నే నాయనతో చెప్పెదను," అని బదులు చెప్పితిని. "నాయనా! అట్లుకాదు. 'అమ్మ మీతో నిట్లు

చెప్పుమని నన్నడిగెను,’ అని ఆయనతో నీవు చెప్పవలెను,’’ అని శ్రీ మాతృదేవి చెప్పిరి. ‘అమ్మ’ యనుమాటను శ్రీ దేవివారు నొక్కి చెప్పిరి.

ఒకనాటియుదయమున శ్రీ మాతృదేవి గదికి చేరియున్న వసారాలో, అమ్మగారికిని చాలమంది భక్తులకును శ్రీ రామకృష్ణుని జీవితమును గురించిన ‘శ్రీ రామకృష్ణపుథి’ యను పద్యకావ్యమును బిగ్గరగా చదివి వినిపించుచుంటిని. శ్రీ రామకృష్ణుల వివాహసందర్భమున గ్రంథకర్త అమ్మగారిని మిక్కిలి స్తుతించుచు, ఆమెను జగన్మాతగా వర్ణించెను. ఆ ఘట్టమును నేను చదువుచుండినప్పుడు వసారాలోనుండి అమ్మగారు బయటకు వెడలి పోయిరి. ఈ గ్రంథమును చదువుటకు కొలది నిముషములు ముందు, ఉద్బోధనపత్రికలో ప్రకటింపబడిన ‘మ–’ రచించిన శ్రీ రామకృష్ణ వచనామృతమందలి యొక భాగమును చదివితిని. అమ్మగారుతప్ప వేరెవ్వరును అప్పుడులేరు. నేనీ క్రిందిఘట్టమును చదువుచుంటిని :

గిరీశుడు : నాకొక కోరిక యున్నది.

గురుదేవుడు : ఏమది ?

గిరీశుడు : ఏ విధమైన ఫలాపేక్ష లేకుండ భగవంతుని ప్రేమింపగోరెదను.

గురుదేవుడు : అట్టి ప్రేమ యీశ్వరకోటికిమాత్రమే సాధ్యమగును. సామాన్యమనుష్యుల కది లభింపజాలదు.

‘‘ ఈశ్వరకోటులని శ్రీ గురుదేవుడు చెప్పెను. ఆ మాట కర్థమేమి ?’’ అని శ్రీ మాతృదేవి నడిగితిని.

అమ్మగారు: ఈశ్వరకోటులు భగవంతునియందే పూర్ణకామసిద్ధిని గాంతురు. కనుక వారికై హికవాంఛ లేవియు నుండవు. ఏవిధమైన ఫలాపేక్షలేని దివ్యప్రేమ, ఆశయేమాత్ర మున్నను నెవరికిని సాధ్యముకాదు.

దివ్యప్రేమ - ఈశ్వరకోట్లు

శిష్యుడు: అమ్మా, మీ సొంతసోదరులీ ఈశ్వరకోటులకు సమానులా?

అమ్మగారి సొంతతమ్ములుగా జన్మించినారు కనుక వారికి శ్రీ రామకృష్ణుని సన్న్యాసశిష్యులకుగల మాహాత్మ్యమే యుండి యుండవలయునని యనుకొని, నే నడిగిన యీ ప్రశ్నకు "ఏమి పోలిక! నా తమ్ముడుగా నున్నంతమాత్రమున నెవరికైన నేమి వచ్చును? శ్రీ గురుదేవునకు ఆ ప్తశిష్యుడుగా నుండుస్థితియే వేఱు!" అని సూచించుచున్నట్లు తమ నిరసనను మాత్రము వెల్లడించి అమ్మగారూరకొనిరి.

ఒకనాటి యుదయమున శ్రీ మాతృదేవి వడ్లు దంపుపనికి సాయపడుచుండిరి. ప్రాయికముగా నామెకిది నిత్యకృత్యము. "అమ్మా! మీరేల ఇంతకష్టపడి పనిచేయుచున్నారు" అని నే నడిగితిని. "నాయనా! ఆదర్శప్రాయముగా నా జీవితముండుటకై, నేను అవసరమైన దానికంటె ఎక్కువపని నే చేయుచున్నాను." అని అమ్మగారు బదులుచెప్పిరి.

ఒక నాటిరాత్రి శ్రీ మాతృదేవి ఇంటిలో నెల్లరును నిద్ర పోవుచుండగా ఆమె మేనకోడలగు నళిని భర్త, తనఇంటికి నళినిని తీసికొని పోవుటకై హఠాత్తుగా నొక ఎద్దు బండిలోవచ్చిదిగెను.

నళిని తన అత్తవారింటినుండి తిరిగివచ్చినది. ఆమెమరల నక్కడకు వెళ్ళుటకిష్టపడలేదు. తనభర్త యుద్దేశ్యమునువిని, నళిని తన గదిలోనికిపోయి తలుపు గడియవేసుకొని, తనతోకూడ తిరిగి వచ్చుటకు తనభర్త తన్ను బలవంతపెట్టినయెడల తానాత్మహత్య చేసుకొందునని బెదిరించెను. కాని యామె తన భర్తతో కూడ తిరిగి వెళ్లనక్కరలేదని శ్రీమాతృదేవి యామెకు అభయమిచ్చి, గదిని తెరపించెను. ఆ రాత్రియంతయు కుటుంబములో అలజడికలిగి, అమ్మగారు నళిని గది వసారలో తెల్లవారువరకును కూర్చుండిరి, సూర్యోదయమగు చుండునపుడు దీపమార్పివేసి "గంగా, గీతా, గాయత్రీ, భాగవత్, భక్త, భగవాన్, రామ కృష్ణా!" అని తమలోతాము స్మరించిరి.

అమ్మగారొకనాడు సన్యాసిక వృద్ధసేవకునితోకూడ పగ్లి (పిచ్చివదినె)గారి తండ్రికడకు, ఆయనను జయరామ్ బటికి రమ్మని, లేకున్ననగలను తిరిగి ఇచ్చివేయుమని ప్రోత్సాహపరచుటకై పంపిరి. ఎంతో నచ్చచెప్పినమీదట, నగలను తీసుకొని రాకుండ ఆయన మాత్రము మాతోవచ్చెను. నగలను తిరిగి ఇచ్చివేసి ఈ విషయమై పగ్లికి మనోవేదనలేకుండ చేయుడని అమ్మగారాయనను ఎంతప్రార్థించినను, దురాశా పరుడైన యాబ్రాహ్మణుడా మాటలను పెడచెవిని బెట్టెను.

శివరాత్రికి ముందటిదినమే నేనింటికి తిరిగి వచ్చుటకు నిశ్చయించు కొంటిని. శివరాత్రియైన రెండునాళ్లతరువాత బేలూరు మఠములో జరుగు శ్రీరామకృష్ణుల జన్మదిన మహోత్సవమును చూడగోరి, నేనిట్లు చేయదలంచితిని. అమ్మగారితో నేనీ విషయమై చెప్పినప్పుడు మొట్టమొదట కమార్పకూరునకు వెళ్ల

మని యామె నాకానతిచ్చిరి. శ్రీమాతృదేవిని నేనొంటిగా వెళ్లి చూడవలయునను ఆత్రతలో నా గొడుగునుగాని, కట్టుకొనుటకు మారుబట్టనుగాని తీసికొనివచ్చుటకు మఱచిపోయితిని. అమ్మగారి కోరికపైని శ్రీగురుదేవుని జన్మప్రదేశమును దర్శించుటకు సమ్మతించితిని. ఆమె నాకొక క్రొత్తబట్టను కట్టుకొనుటకిచ్చి, దానిని నాతోకూడ తీసుకొని పొమ్మని చెప్పిరి.

అమ్మగారు: నీయొద్ద నేమైన పైకమున్నదా? బండికిరాయికిగాను నీకు కొంతపైకము కావలసియుండును. నా యొద్ద పైకమును తీసికొనుము.

శిష్యుడు: నాయొద్ద పైకమున్నది. మీ దగ్గరనుండి నేను పైకమును తీసికొన నక్కర లేదు.

అమ్మగారు: నీ వింటికి వెళ్లినతరువాత, నాకు త్తరము వ్రాయుము. అయ్యో! నా పుత్రునకు బాగుగా అన్నముపెట్టలేకపోతిని! మంచిపదార్థమొకటికూడ చేయలేదు. ఎందుచేత ననగా, ఆ సమయమున యింటిలో నళినిని గురించియు, పగ్లిని గురించియు పెద్దగొడవజరిగెను.

అమ్మగారికి నేను సాష్టాంగప్రణామముచేసి, కన్నులనీరు పెట్టుకొని బయలు దేరితిని. శ్రీమాతృదేవి మాతోకూడ కొంతదూరమువరకువచ్చి, మేము కనుపడునంతవరకు మావైపునకు చూచుచు నిలువబడిరి. నేను కమర్పుకూరుకు వెళ్లువరకును భక్తి పారవశ్యమున నేడ్చుచునే యుంటిని.

కమార్పుకూరుకు వెళ్లినతరువాత, శ్రీమాతృదేవి నివసించుచుండిన గదిని నాకు కనుబరిచిరి. అచ్చటనున్న అమ్మగారి

పటమునుచూచి, నేనామెను మరలచూచుటకు మునుపటికంటె కూడ ఎక్కువగా ఆత్రపడజొచ్చితిని. ఆ మరునాడు 'మ–'* యును ప్రబోధ బాబును జయరాంబటికి పోవుచు, కొలదిగంటల వరకు కమార్పుకూరులో ఆగిరి. ఆసాయంకాలమున, అమ్మగారి శిష్యుడగు లలితబాబు ఇజారును, మోకాళ్లక్రిందకువచ్చు పొడవైన కోటును తొడుగుకొని. తలపాగపెట్టుకొని అక్కడకు వచ్చెను. నేనొంటిగా కలకత్తాకు వెళ్లుటకష్టముగా నుండును గనుక, లలితబాబు జయరాంబటికి వెళ్లితిరిగి వచ్చినతరువాత నేనాయనతో గలిసి కలకత్తాకు తిరిగిపోవుట మంచిదియని కొంత మంది భక్తులుచెప్పిరి. అట్లే నే నాయనతోకూడ జయరాంబటికి మరియొకసారివెళ్లి, ''ఇక్కడ మరలసిద్ధమైనాను,'' అని అమ్మగారితో చెప్పితిని. అమ్మగారు చాలసంతోషించి ''చాల బాగున్నది. నీవు లలితునితో కలకత్తాకు వెళ్లవచ్చును,'' అని చెప్పిరి.

శివరాత్రి పండుగయైన తర్వాత భక్తులందరును భోజనమునకు గూర్చుండిరి. మొట్టమొదట వారికి విస్తళ్లలో ప్రసాదమును వడ్డించిరి. అదియేమని నేనడుగగా, శ్రీమాతృదేవి ప్రసాదమని వారు చెప్పిరి. నేనుకూడ ఆ ప్రసాదమును భుజించితిని. తరువాత అమ్మగారితో, వారందరు మీ ప్రసాదమును సంతుష్టిగా భుజించిరి, కాని మీరుమాత్రము నాకెన్నడును దాని నీయలేదు,'' అని చెప్పితిని. ''నాయనా! నీవెన్నడును ఆ ప్రసాదమడిగియుండలేదు. అడుగనిదే, దాని నెట్లు తీసుకొనుమని చెప్పగలను?'' అని అమ్మగారు బదులుచెప్పిరి. ఎంత నమ్రత!

---

* శ్రీ రామకృష్ణ వచనామృత గ్రంథకర్త, శ్రీమహేంద్ర నాథగుప్త.

మరునాడు, రాధు తాతగారి యొద్దనుండి ఆమె నగలను తీసుకొనివచ్చుటకు లలితబాబును సవారీలో పంపిరి. లలితబాబు తా నొక ప్రభుత్వోద్యోగినని చెప్పుకొనుచు, కలకత్తాలోని యొక గొప్పపోలీసు ఉద్యోగస్థుడు వ్రాసినట్లు కనుపడు నొక యుత్తరమునుకూడ తనతో తీసుకొనివెళ్లెను. యువకుడైన లలితబాబు, వృద్ధబ్రాహ్మణుడగు రాధు తాతగారి నొకవేళతిట్టి అవమానించునేమో యనుభయముచే శ్రీమాతృదేవి 'మ'నుకూడ నతనితో బంపిరి. కాని, లలితబాబు మరునాటి మధ్యాహ్నమున నగలతో కూడ రాధు తాతను జయరాంబటికి తీసుకొని రాగలిగెను. ఈ లోపున రాత్రి ఇంచుమించుగా రెండుగంటలవేళ అమ్మగారికి నిద్రపట్టలేదని మాకు తెలియవచ్చెను. మ—యును, నేనును లోపలిగదులలోనికి వెళ్లితిమి. మిగిలిన వారందరును మందులకొరకు వెదకుచుండగా, బాధయేమని అమ్మగారి నడిగితిని. అందుపై నామె "నగలను తీసుకొనివచ్చుటకు వారువెళ్లిన తరువాత, పాపమా వృద్ధబ్రాహ్మణునకు వారేమి అవమానము చేసెదరో యను చింత నన్ను బాధింప మొదలుపెట్టెను. అందుచేతనే నాకీ ఆయాసము," అని చెప్పిరి. ఈచిక్కులన్నిటికిని కారణభూతుడైన యీ బ్రాహ్మణునియెడల అమ్మగారికిగల దయను చూచి, నేనాశ్చర్యపడితిని.

మరునాటి మధ్యాహ్నమున నేను కలకత్తాకు వెళ్లువారితో ప్రయాణమైతిని. నా విషయమై "ఇతడు భగవంతునకు బహు ప్రియమైనభక్తుడు. మీ రితనిని మీతోకూడ తీసికొని వెళ్లుడు," అని అమ్మగారు లలిత బాబుతో చెప్పిరి. మేమందరమును అమ్మగారికి ప్రణాముచేసితిమి. ఆమె కనుల నీరుబెట్టుకొని మాతో

కూడ ఇంటి వెలుపలి గుమ్మమువరకును ఏడ్చుచునే వచ్చిరి. కల కత్తాకు పోవుదారిలో విష్ణుపూర్ అనుగ్రామమున, మ-యును ప్రబోధ్ బాబును మరికొందరును మృణ్మయి యను పేరుగల ఆ యూరి అమ్మవారి విగ్రహమును చూచుటకు వెళ్ళిరి. కాని లలితబాబును నేనును అదివరకే రైలెక్కితిమి. 'మ' మమ్ముకూడ వచ్చి యా విగ్రహమును చూడుడని కోరుటకు ప్రబోధ్ బాబును పంపెను. కాని చిన్మయిని (సచేతనమైన శ్రీ శ్రీ శారదాదేవిని) చూచిన కళ్లతో మృణ్మయిని (మట్టితో చేయబడినదానిని) చూచుటకు మే మిష్టపడలేదు. నేను బేలూరుమఠమునకువచ్చి, శ్రీ రామకృష్ణవర్ధంత్యుత్సవమును చూచినతరువాత తిరిగి ఇంటికి చేరుకొంటిని.

ఉద్బోధన పత్రికా కార్యాలయము కలకత్తా: 1909 సం॥

శీతకాలములో నేను శ్రీ మాతృదేవిని కలకత్తాలో బలరామ్‌బోసుగారి యింటిలో చూచితిని. అమ్మగారిని తరువాతసారి నేను సందర్శింప వెళ్లినప్పటికే, యామె తమకొఱకు నూతనముగా కట్టిన ఇంటిలోనికి, అనగా ఉద్బోధనపత్రికా కార్యాలయము లోనికి మారిరి. ఆ యింటిలోపలకి నేను వెళ్ళినప్పుడు, డాక్టర్ కంజీలాల్ వార్తాపత్రికను చదువుచు కూర్చుండియుండెను. అమ్మగారికి ఆటలమ్మ వచ్చెను. ఇంకను పూర్తిగా నయముకాలేదు. "రెండువారములైన తరువాత మీరామెను చూడవచ్చును," అని యాయన నాకు బదులుచెప్పెను. అమ్మగారు జబ్బుపడిన సంగతియే నాకు తెలియలేదు. "రేపురా, ఆమెను చూచుటకు వీలగును. నీ విచ్చటనే ప్రసాదమునుకూడ తీసుకొనవలయును," అని శారదానందస్వాములవారు నాతో చెప్పిరి. మరునాడు నేను

వచ్చినప్పుడు నాకు శ్రీ మాతృదేవి పొంగుమచ్చలను చూపిరి. అవి చాలవరకు పోయినవి. అమ్మగారి ఆశీస్సులవలనను శారదానందస్వాములవారు చేసిన యేర్పాటువలనను నేను బేలూరు మఠములో నివసించుచుంటిని. ఈ విషయము తెలిసినప్పుడు, "బాగుబాగు! సన్న్యాసజీవిత సౌందర్యమహిమ కితడు పూర్తిగా వశుడయ్యెను. బేలూరు మఠములోనే యుండుము. శ్రీ గురుదేవునియందు నీకు ప్రేమకలుగును గాక! నా ఆశీస్సులు నీ కొసంగుచున్నాను," అని అమ్మగారు నాతో జెప్పిరి.

బేలూరుమఠమునుండి శ్రీ మాతృదేవికి నే నప్పుడప్పుడు పాలనుతీసుకొని వచ్చుచుండెడువాడను. ఇందువలన నాకు అమ్మగారి దర్శనభాగ్యముకూడ లభించుచుండెను. ఒకనాడు నేను పాలు తీసుకొని వచ్చినప్పుడు, అమ్మగారు తమలపాకుకిల్లీలు కట్టుచుండిరి. ఆమె మేనకోడలు నళిని యామెకు సాయము చేయుచుండెను. నన్నుచూచి, నళిని గదిలోనుండి బయటకు వెళ్లబోయెను. "వెళ్లవలదు. ఇతడు నా కుమారుడు," అని మేనకోడలను వారించి, నన్నుచూచి, "ఇక్కడ, కూర్చుండుము" అని చెప్పిరి. ప్రసంగవశమున, తమ యింకొక మేనకోడలగు 'మకు' అత్తింటి బంధువులనుగురించి ముచ్చటించుచు "వారి విషయమై నేను ప్రత్యేక శ్రద్ధతీసుకొనవలయును; లేనిచో వారు కోపగించుకొని బుసకొట్టుదురు. కాని, మీరు నా పిల్లలు. నేను మీకేమి చేసినను, దానితోనె తృప్తిపడెదరు. ఎప్పుడైన మీకు నేను మర్యాద కనుబరచనిచో మీరేమియు అనుకొనరు. కాని, ఆ బంధువులుమాత్రము బహుశ్రేష్ఠమైన వస్తువులెల్ల నేను వారికీయనిచో, వారికి తగినమర్యాదలు చేయు

లలో ఎంత స్వల్పలోపమైనను చేసినచో, మిక్కిలి ధుమధుమ లాడుదురు,'' అని అమ్మగారు చెప్పిరి. పిమ్మట ''అమ్మా, చిత్త శుద్ధియు, భగవంతునిగూర్చి వ్యాకులతయు మనుజులకెట్లు కలుగును?'' అని నామె నడిగితిని.

అమ్మగారు : ఓ! నీకివి తప్పక కలుగును! శ్రీ గురుదేవుని శరణుజొచ్చిన నీకు సర్వము లభించును. ఆయనను హృదయ పూర్వకముగ ప్రార్థింపుము.

శిష్యుడు : ప్రార్థించుటకు నాకు శక్తిలేదు. దయయుంచి నాకొఱకు మీరే ప్రార్థింపుడు.

అమ్మగారు : నీకు చిత్తశుద్ధి ననుగ్రహించుటకు శ్రీ రామ కృష్ణులను నేనెల్లప్పుడును ప్రార్థించుచునే యున్నాను.

శిష్యుడు : ఔను తల్లీ! నాకొఱకు మీరు ప్రార్థించిన యెడల, నాకు సర్వమును లభించును.

కొలది నెలలగుచు తరువాత నన్ను జయరాంబటికి సమీప మునగల ఘాటాల్ అను గ్రామమునకు వరదలవలన నష్టపడిన జను లకు సాయముచేయుటకై పంపిరి. నేను మూన్నాళ్లు సెలవుతీసికొని, జగద్ధాత్రీ పూజాసమయమునకు జయరాంబటిలో శ్రీ మాతృ దేవిని సందర్శించితిని. అతులుడు నాతోకూడ నుండెను. అమ్మ గారిని చూచుటకిదియే అతనికి మొదటిసారి. మేము జయరాంబటికి కమార్పుకూరు మీదుగాపోయి అమ్మగారి యింటికివెళ్లినతోడనే, ఆమె పరిచారకుడగు ఆశు మహరాజు ''మీరువచ్చుట చాలమంచిదైనదే. కొంతకాలమునుండి భక్తు లెవరినికూడ చూడకపోవుటచే, అమ్మగారు విచారముగ

నున్నారు,'' అని చెప్పెను. శ్రీ మాతృదేవి మమ్ము భోజనమున కుండుడని చెప్పి మాకు సంతృప్తిగా అన్నముపెట్టిరి. ఆ మరునాటి యుదయమున మేము శీఘ్రముగా ఘాటాల్ గ్రామమునకు తిరిగి వెళ్లవలసి వచ్చెను. అమ్మగారియొద్ద సెలవుదీసుకొని నప్పుడు ''నేనువెళ్లి మరల వచ్చెదను,'' అని నేనామెతో చెప్పితిని. పాఠశాలలోని బాలునివలె, ''దయయుంచి నన్ను జ్ఞప్తి యందుంచుకొనుడు,'' అని అతులుడు చెప్పెను.

ఘాటాల్‌లో పని పూర్తియైనతరువాత నేను జయరాంబటికి మరల వచ్చితిని. అప్పుడు శీతకాలము; సాయంకాలమున శ్రీ మాతృదేవి యింటికి నేను వెళ్లినప్పుడు, అమ్మగారు వసారలో కూర్చుని తమ కాలికి మందురాచుకొనుచుండిరి. అప్పటికింకను మోకాళ్లలో మహావాతపు నొప్పులతో బాధపడుచుండిరి.

శిష్యుడు : ఏమి మందిది?

అమ్మగారు : ఈ ఆకును యెవరో చెప్పిరి. నీవు దినమంతయు పస్తుపడియున్నావా?

శిష్యుడు : లేదు. దారిలోమాత్రము నే నాహారమేమియు తీసుకొనలేదు.

అమ్మగారు : తినుట కేమైన నీవేల కొనుక్కొనలేదు? దారిలో అంగడు లున్నవే.

నా యొద్ద ఒక రూపాయమాత్రమే యుండెను. దానిని బేలూరుమఠములో సమర్పింపవలెనని నిలువచేసి యుంచితిని. కాని, అమ్మగారికి విషయమునుమాత్రము నేను తెలుపలేదు. ఆమె వేడివేడి అన్నమును నాకుపెట్టిరి. సంతృప్తిగా నేను భోజ

నముచేసిన తరువాత అమ్మగారు తాము ప్రతిదినము వాడుకొను కంబళీని నాకిచ్చి దానిని రాత్రి కప్పుకొనుమనిరి. నా సోదరులలో నొకరి యొద్దనుండి అమ్మగారికి మరునాడొక యుత్తరమువచ్చెను. దానిలో చక్కని శైలిలో, సద్భావములతో తిరిగి ఇంటికి వచ్చునట్లు నన్ను ప్రోత్సహింపుడని అమ్మగారిని నా సోదరుడు క్లుప్తముగా కోరియుండెను. ఆ యుత్తరమునుగురించి "ఆహా! ఎంతచక్కని యుత్తరము," అని ప్రశంసించి, నన్ను సంబోధించి "నీవు తిరిగి ఇంటికెందుకు వెళ్లవు? సంసారములోనేయుండి, ధనమార్జించి కుటుంబమును పోషించుము." అని శ్రీమాతృదేవి నన్ను శోధించుటకై చెప్పిరి. "అమ్మా! దయయుంచి మీరా విధమున చెప్పవలదు," అని చెప్పి నే నేడువ నారంభించితిని. అమ్మగారు పిమ్మట బహు ప్రేమతో ఇట్లు చెప్పిరి: "నాయనా! ఏడువకుము! మానవరూపమునుదాల్చిన దేవతవునీవు, భగవంతునికొరకుసర్వము

త్యాగమును-పరమార్థ స్థితియును.

నెవరు త్యాగముచేయగలరు? భగవంతుని శరణుజొచ్చిన వారి విషయమున విధించిన యాజ్ఞలనే, విధిమాపుచేయును. భగవత్సాక్షాత్కారమైన మానవు లెట్లుందురు? వారికి తలపై కొమ్ములు మొలుచునా? అట్టి దేదియు జరుగదు. అట్టివారికి నిత్యానిత్యవివేచనాశక్తి వికసించి, అపరోక్షజ్ఞానముకలిగి, వారు జననమరణముల కతీతులగుదురు. పరతత్త్వానుభవము కలవారే భగవంతుని తెలిసికొనగలరు. మరియొకవిధమున నెవరైన భగవంతుని చూచిన వారున్నారా? అఖండ సచ్చిదానంద తన్మయతలేని దే భగవంతు డెవరితోనైన సంభాషించియున్నాడా? అట్టి మహోన్నత స్థితిలోమాత్రమే భగవంతుని సందర్శించి ఆయనతో

మాట్లాడి సన్నిహిత సంబంధ మేర్పరుచుకొనుటకు మానవులకు వీలగును.

శిష్యుడు : అమ్మా! కాదు, కాదు! దీనికంటెను వేఱైన స్థితికలదు. కొందరు భగవంతుని ముఖాముఖముగ జూడగలరు.

అమ్మగారు : అట్టి యనుభవము నరేంద్రునకు (వివేకానందస్వామికి) ఒక్కనికిమాత్రమే కలిగెను. నరేంద్రుని తరణోపాయ రహస్యమును శ్రీ గురుదేవుడు తనచేతిలోనే యుంచుకొనెను. పారమార్థిక జీవితమనిన శ్రీ గురుదేవుని ప్రార్థించుటకంటె, ఆయన దివ్యనామస్మరణము చేయుటకంటె, ఆ యఖండ జ్ఞానానంద తేజోమయమూర్తిని ధ్యానించుటకంటె వేఱేమైనను కలదా? (నవ్వుచు) శ్రీ గురుదేవుడా? ఆయనలోనైన ఏమున్నది? ఎప్పటికిని ఆయన మనసొంతమే.

శిష్యుడు: అమ్మా! శ్రీ రామకృష్ణులు నా సొంతమను సద్విషయమొకటియో నాకనుభవైక వేద్యమానట్లు కటాక్షింపుడు!

అమ్మగారు : నేను దానినితిరిగి చెప్పవలయునా? (ఉత్కంఠగా) నీకది తప్పక అనుభవైక వేద్యమగును. ముమ్మాటికినిజము!

*　　　*　　　*

యుక్తి: భగవత్సాక్షాత్కారము

మరునాటి సాయంకాలమున అమ్మగారితో నే నామె గదిలో మాట్లాడుచుంటిని. ఆమె పరుపుపై బరుండిరి. సంభాషణ వేదాంతముపైకిపోయెను. ''నామరూపములుతప్ప ఈ ప్రపంచములో వేఱేమియు లేదు. జడపదార్థమున్నదను విషయము ఋజువుచేయుటకు వీలులేనిది. కనుక, భగవంతుడు మున్నగున

వేవియు లేవను విషయమే చివరకు తేలు సారాంశము,'' అని అమ్మ గారితో జెప్పితిని.

శ్రీ గురు దేవుడు, శ్రీ మాతృ దేవి మున్నగు విషయములు కూడ భ్రమలే యని నా యూహ. అమ్మగారు నా భావమును వెంటనే గ్రహించి, ''అమ్మా! శ్రీ గురు దేవుని పాదపద్మములు వాస్తవముగా లేవని చెప్ప జూచు జ్ఞానము, అజ్ఞానమే కాని వేఱేమియు కాదు. గురు దేవుడు లేడని ఋజువు చేయు జ్ఞానమునకు ప్రమాణాధికారమేమి యుండును?'' అని నరేంద్రు డొకసారి నాతో జెప్పెను. ఈ శుష్కవాదమును, ఈ కలగలుపు వేదాంతమును విడనాడుము. యుక్తివలన భగవంతుని తెలిసికొనజాలిన వారెవరైన నున్నారా? శుకుడు, వ్యాసుడు, శివుడు మున్నగు ఋషులుకూడ చివరకు పెద్దచీమలవంటివారు,'' అని సెలవిచ్చిరి.

శిష్యుడు : నేను విషయములను తెలిసికొన గోరుచున్నాను ఏకొంచెమో నాకు బోధపడుచున్నది కూడ. ఎవరైన యుక్తిని, హేతువాదము నెట్లు మానగలరు.

అమ్మగారు : పరిపూర్ణజ్ఞానము కలుగనంతవరకు, హేతువాదమంతరింపదు. పిమ్మట సంభాషణ సృష్టిని గురించి జరిగెను.

శిష్యుడు : అమ్మా! ఈ లెక్కలేని జీవరాసుల నన్నిటిని భగవంతు డొక్కసారియే సృజించెనా లేక వేరు వేరు కాలములలో సృజించెనా?

సృష్టి, పరిణామము, యోగముల సిద్ధాంతమును

అమ్మగారు : చిత్రకారుడు తనకుంచెతో కనులు, మొగము, ముక్కు మొదలైనవానిని చిత్రించునట్లు, కుమ్మరివాడు ఒక్కొక్క అవయవమును ముందుచేసి చివరకు పూర్ణస్వరూపము

లతో బొమ్మలను నిర్మించునట్లు, భగవంతుడుకూడ ఒక జీవుని తరువాత మరియొక జీవుని సృష్టించెనని నీ యూహాయా? కాదు. ఆ రీతిగా సృష్టి జరుగలేదు. భగవంతునకు విశేషమైన శక్తి కలదు. ఇచ్ఛామాత్రమున భగవంతుడు కావలెననిన ప్రపంచము లుత్పన్నమగును, భగవంతుడు వలదనిన అవి యెల్ల నిర్మూలమగును. ఇప్పుడున్నది యెల్ల ఒకేసారి సంభవించెనేకాని, ఒకదాని తరువాత నొకటిరాలేదు.

అమ్మగారి గదిలో పెద్దచీమలు ఆహారమునకై తిరుగుచుండెను. వీనిలో నొకదానిని చేతితో జూపుచు "ఈ చీమ తక్కినవానికంటె ఏల వెనుకబడియున్నది? ఈ చీమ మానవజన్మ మెత్తుటకు కొన్నియుగములు పట్టును," అని చెప్పితిని. "ఔను, అది నిజము. ఒక యుగమైన తరువాత గాఢనిద్రలోనుండి మేల్కొనిన విధమున నెల్లరును మేల్కొందురు," అని అమ్మగారు చెప్పిరి.

జపమును, ఇంద్రియ నిగ్రహమును, భగవత్సాక్షాత్కారమును.

జపమును గురించియు, పారమార్థిక సాధనలను గుఱించియు నేను శ్రీ మాతృదేవి నడిగితిని. అమ్మగారిట్లు చెప్పిరి: "ఈ సాధనలవలన పురాకృత కర్మబంధములు తొలగిపోవును. భగవంతునియెడల ప్రేమభక్తి లేనియెడల భగవత్సాక్షాత్కారము లభింపదు. జపమును, పారమార్థిక సాధనలును ఎంతముఖ్యమో నీకు తెలియునా? వీనివలన ఇంద్రియనిగ్రహము కలుగును.

ధర్మము

ప్రాణాపాయకరమైన జబ్బులోనుండిన లలితచాటర్జీని గురించి ముచ్చటించుచు, అమ్మగారిట్లు చెప్పిరి:—"లలితుడు నాకు చాల ద్రవ్య

సహాయము చేయుచుండువాడు. అతడు నన్ను తన బండిలో తీసుకొని వెళ్లుచుండును. కమార్పకూరులోను, జయరామ్ బటిలోనుగల పూజామందిరములలో జరుగు సేవకుకూడ నాతడు చాలసాయము చేయును. నా లలితుని హృదయము కోటిరూప్యములకంటెను నెక్కువ విలువగైన పెన్నిధి. ఇంట కోట్లకొలది ధనము మూలుగుచున్నను, పిల్లికిగూడ బిచ్చముపెట్టని పీనాసులు కూడ గలరు. భగవంతునకును భగవద్భక్తులకును భాగ్యవంతులు ధనరూపమున సేవచేయవలెను. పేదలు భగవన్నామ స్మరణరూపమున భగవంతుని ఆరాధించవలయును.''

ప్రేమభక్తి-భగవత్సాక్షాత్కారము.

ప్రేమభక్తినిగూర్చి ముచ్చటించుచు, అమ్మగారిట్లు సెలవిచ్చిరి: ''జపమువలననా బృందావన గోపబాలురు శ్రీకృష్ణుని తమ సొంత పెన్నిధిగా వశపఱచుకొన గలిగిరి? తమ ప్రేమ భక్తిచేతనే వారు భగవంతునిదయను చూఱగొని, ముక్తులైరి. ''కృష్ణా! కృష్ణా! రా! ఇటురా! ఈ వెన్నతినుము! ఈ పూలు తీసుకొనుము!'' అని తమ ప్రాణస్నేహితునితోవలె ఆ జగన్నాథునితో వారు మాటలాడుచు, కడుచనువుగా గలసిమెలసి వర్తించిరి.''

శిష్యుడు : భగవంతునిప్రేమ నిదర్శనమును స్వయముగా చూడకుండ, భగవంతునికొరకు మనకార్తి యెట్లుకలుగును?

అమ్మగారు : నీవట్టిగాఢ వాంఛను బడయగలుగుదువు. అందే భగవంతుని దయకలదు.

* * *

జయరాంబటి, 1909 సం॥ డిశంబరు.

అప్పు డుదయమున సించుమించుగా తొమ్మిదిగంటలవేళ. నేను వెళ్లినప్పుడు శ్రీ మాతృదేవి తమలపాకుల కిల్లీలను కట్టు చుండిరి. త్వరలో నేను ప్రసంగమును మొదలుపెట్టితిని.

శిష్యుడు: అమ్మా! మి మ్మెన్నిసారులో సందర్శించితిని; మీ ప్రసంగముల నెంతయో వింటిని. కాని మిమ్ము నా సొంత తల్లిగా గ్రహింపలేకున్నాను.

అమ్మగారు: నాయనా! నేను నీ సొంతతల్లిని కానిచో తఱచుగా నిచ్చటికేల వచ్చుచున్నావు? సరియైన కాలమున నీ 'సొంతతల్లి'ని తెలిసికొనగలవు!

కొంత తడవైన తరువాత నా సొంత తల్లిదండ్రులను గూర్చియు, సోదరులనుగూర్చియు శ్రీ మాతృదేవితో నే నిట్లు చెప్పితిని: ''నా తల్లిదండ్రులు నన్ను పెంచిరి. (మరణానంతరమున) వా రిప్పు డెక్కడనున్నారో, ఎట్లు జీవించుచున్నారో నాకు తెలి యదు. నా సోదరులకు మంచి సంస్కారములు కలుగుగాక యని మీ రాశీర్వదింపుడు.

అమ్మగారు: సామాన్యముగా భగవంతు డెవరికి కావల యును? ఈ నా కుటుంబములోనే యెంతమందియో యున్నారు. కాని వా రందరకును భగవంతుడు కావలయునా? (కొలది నిము షము లాలోచించి) ఆందోళనపడకు. పెండ్లిచేసికొని, సంసారములో దిగవలదు. బ్రహ్మచారిగా నుందువేని, నీవు భయపడవలసిన యవ సరమేమి? నీ వెచ్చటనున్నను స్వతంత్రుడవుగ నుందువు.

శిష్యుడు: అమ్మా! నా కెందుచేతనో కాని భయమగు చున్నది.

అమ్మగారు : వలదు, వలదు! భయపడవలదు! సర్వము శ్రీ గురుదేవుని సంకల్పము పైననే ఆధారపడియున్నది.

శిష్యుడు : మనస్సే సర్వమును, మనసు నిర్మలముగా నున్నయెడల నే నెచ్చట నివసించినను ప్రమాదములేదు. అమ్మా! నా మనసెల్లప్పుడును నిర్మలముగా నుండునట్లు కటాక్షింపుడు.

అమ్మగారు : అట్లే యగుగాక! ఆనాడు శ్రీమాతృ దేవి పుట్టిన దినము. దీనికి కొలదినాళ్లముందే ప్రబోధబాబు జయరాంబటికి వచ్చి ఆ నాటిప్రత్యేక సేవకొరకై అయిదు రూప్యములను శ్రీ మాతృదేవి సోదరులకిచ్చెను. "నేడు విశేషముగా మీ రేమియు చేయనక్కరలేదు. నేనొక క్రొత్తచీరను కట్టుకొనెదను. శ్రీ గురుదేవునకొక మధురపదార్థము నైవేద్యము చేయబడును. పిమ్మట నేనా ప్రసాదమును భుజింతును. నేను చేయవలసిన దింతే." అని అమ్మగారు తమ తమ్ములతో చెప్పిరి.

పూజామందిరములో సేవయైన తరువాత శ్రీ మాతృదేవి క్రొత్తబట్టను కట్టుకొని, కాళ్లక్రిందకుజాపి మంచము మీద కూర్చుండిరి. ప్రబోధబాబువచ్చి కొన్నిపువ్వులను అమ్మగారి పాదములదగ్గరనుంచెను. నేను వసారలో గుమ్మముకడ నిలువబడి యుంటిని. అమ్మ నన్నుచూచి, "ఏమి? నీవుకూడ పువ్వులను సమర్పింపవా? పువ్వు లిచ్చటనున్నవి; తీసికొనుము." అని చెప్పిరి. పిమ్మట నేనుకూడ శ్రీ మాతృదేవి పాదాలకు పూలు సమర్పించితిని. మధ్యాహ్నమునను, అటుతరువాతను సంతుష్టిగా విందు నారగించితిమి. ప్రబోధబాబు కలకత్తాకు వెళ్లెను. కాని నా ఆరోగ్యము సరిగాలేనందున, నేను జయరాంబటిలోనే యుంటిని.

1909 వ సం॥ డిశంబరు నెల.

భగవంతుని బంధించుట

ప్రసంగవశమున అమ్మగారిట్లు చెప్పిరి. భగవంతుని బంధింపగలిగిన వారెవరైన నున్నారేమో నాకు చెప్పగలవా? యశోదా జననయిత్రి శ్రీ కృష్ణుని బంధింపకలిగెను. ఎందుచేత? ఆ జగన్నాధమూర్తి తాను కట్టువడుటకు ఒప్పుకొనెను గనుక. బృందావన గోపబాలురకును, గోపికలకును కూడ భగవత్సాక్షాత్కారము కలిగెను.

ఆశలు–పునర్జన్మము.

మానవుని కాశయున్నంత కాలము వాని జన్మలకంతమే లేదు. ఆశవలననే అతడొక శరీరమును విడిచి మఱియొక శరీరమును దాల్చుచున్నాడు. చివరకొక కలకండపలుకును తినవలయునను ఆశయైన ఉన్నయెడల, అతనికి పునర్జన్మ కలుగును. ఇందు చేతనే బేలూరు మఠమునకు పలురకములైన తినుబడి పదార్థములను తీసికొని వచ్చుచుందురు. ఆశను చిన్నవిత్తనముతో పోల్చవచ్చును. మఱ్ఱివిత్తనము మిక్కిలి చిన్నది. అందుండి శాఖోపశాఖలుగల పెద్దవృక్షము పెరుగును. ఒక ఒరలోనుండి తీసి మరియొక ఒరలో తలగడనుంచునట్లు, జీవాత్మ ఒక శరీరమును విడిచి మరియొక శరీరమును దాల్చును. ఆశలేవియు లేనివారు కోటికేయొకరో, యిద్దరో మాత్రముందురు. ఆశవలన నూతనశరీరము వచ్చినను, పూర్వజన్మములలో పుణ్యకార్యములను చేసియున్న యెడల మానవునకు పారమార్థిక జ్ఞానము పూర్తిగానశింపదు. బృందావనమందలి గోవింద దేవాలయములోని యర్చకుడొకడు తనయింపుడుకత్తెకు స్వామి ప్రసాదమును తీసికొని వెళ్లియిచ్చు

చుండెను. ఈ పాపఫలితముగా మరణానంతరమున వానికి ప్రేత శరీరము కలిగెను. కాని దేవాలయములో స్వామివారి యర్చన చేసిన పుణ్యవిశేషమువలన, వాడొకనాడు తన ఎప్పటి స్థూల శరీరముతో జనులందరియెదుట కనుపడెను. వాని పురాకృత సుకృతము వలననే, వానికిది సాధ్యమయ్యెను. అతడు తన అధమ జన్మకుగల కారణమును జనులకుచెప్పి "ఈయవస్థనుండి నా ఆత్మకు విమోచన కలుగుటకై మీరు దయయుంచి హరినామ సంకీర్తనముచేసి ఉత్సవమును జరిపింపుడు. అప్పుడు నాకు ముక్తి కలుగును" అనికూడ వారిని హెచ్చరించెను.

శిష్యుడు: హరినామ సంకీర్తనవలనను, ఉత్సవముల వలనను ఇట్టి అవస్థను దాపుకొనుటకు వీలున్నదా?

అమ్మగారు: ఔను. వైష్ణవుల కదిచాలును. వారు శ్రాద్ధము మొదలగు అపరక్రియలను చేయరు.

నేనొకసారి రథోత్సవసమయమున శ్రీ జగన్నాథములో జగన్నాథుని విగ్రహమును సందర్శించితిని. ఆ విగ్రహము నెంత మందియో సందర్శించుచుండగా చూచి, కేవలసంతోషాతి శయముచేనేడ్చి, 'ఆహా! బాగుబాగు! వీరందరికిని మోక్షము కలుగును,' అని నేను తలంచితిని, కాని తరువాత నాయూహ సరికాదని గ్రహించితిని. ఏవిధమైన ఆశయు నెంతమాత్రమును లేని, ఏయొకరిద్దరో ముక్తిని బడయగలిగిరి. నే నీవిషయమును చెప్పినప్పుడు, 'ఔనమ్మా! కోరిక లేవియు లేనివారు మాత్రమే ముక్తిని గాంతురు,' అని యోగినీ మాయి చెప్పెను.

* * *

ఒకనాటి యుదయమున శ్రీమాతృదేవిగది వసారాలో నేను భోజనముచేయుచు "అమ్మా! బేలూరు మఠములో నివసింతునేని, సన్న్యాసము పుచ్చుకొనవలయునా?

అమ్మగారు: ఔను, నాయనా.

శిష్యుడు: అమ్మా! సన్న్యాసినైనచో గర్వము దారుణముగా పెరుగును.

అమ్మగారు: ఔను. అది నిజమే సన్న్యాసి చాల గర్వియై 'ఏమిది! ఈ మనుష్యుడునన్ను గౌరవింపకున్నాడే! ఆమనుష్యుడు నాకు ప్రణామము చేయుటలేదే,' అని తలంచవచ్చును. (తమ తెల్లబట్టను*| వ్రేలితో చూపుచు) మనస్సులో త్యాగబుద్ధి కలిగి జనులిట్లు జీవించుట మంచిది. ముసలివాడై ఇంద్రియముల పటుత్వము తగ్గిన తరువాత నే, గౌర్ శిరోమణి † సన్న్యాసము పుచ్చుకొనెను. నాయనా! సౌందర్యము, పుణ్యము, జ్ఞానము, పవిత్రశీలము మొదలగునవి తమకుగలవను గర్వమును విడనాడుట సులభమా?

సన్న్యాసాశ్రమము: గర్వము.

త్యాగయుక్తమైన జీవితమునకు నన్ను సంసిద్ధునిగనుండుమని శ్రీ మాతృదేవి హెచ్చరించుచు, ఇట్లుచెప్పిరి: "నీవింటికివెళ్లి 'నేనే యుద్యోగమును చేయను. నాతల్లి చనిపోయినందున, నేనెవరికిని పరాధీనుడుగనుండను. అట్టిపని నే నెన్నడుచేయను. మీ

* గృహస్థాశ్రమ జీవనమునకు తెల్లబట్ట చిహ్నము, సన్న్యాసులు కాషాయవస్త్రములను ధరింతురు.

† సుప్రసిద్ధ వైష్ణవ సాధువగు నితడు బృందావనములో శ్రీమాతృదేవిని సందర్శించెను.

మీ గృహస్థధర్మములను నిర్వహించి మీరు సుఖముగనుండుడు,'
అని నీ సోదరులతో కడసారిగా చెప్పుము.''

పిమ్మట సన్న్యాస జీవితమునకుగల కఠిన నియమములను గురించి ప్రసంగించుచు అమ్మగారిట్లు చెప్పిరి: ''మఠము * లో నా బిడ్డలెంత కఠిన జీవనమును గడపుచున్నారు! రుచిగల భోజన పదార్థములను తినుటకు, మంచిబట్టలను కట్టుకొనుటకు, లోకము లో నేసౌఖ్యమునైన అనుభవించుటకు వారికి వీలులేదు. నా కిది యిష్టము లేదు. బహుకఠినములైన నియమములకులోబడి జీవించుటవలన, జోగిను (యోగానందస్వామి) మితిమీరిన శోషణచే చివరకు శరీరము చాలించెను.''

సాయంకాలమున నాకును అమ్మగారికిని యీ క్రిందివిధమున సంభాషణ జరిగెను.

శిష్యుడు : అమ్మా! భగవంతుని దయయున్నచో, మానవున కెప్పుడైనను పరమార్థసిద్ధి కలుగును. సరియైన కాలమునకై అతడు వేచి యుండనక్కరలేదు.

దైవానుగ్రహము—పరమార్థసిద్ధి

అమ్మగారు: నిజమేకాని, అకాలమున దొరుకు మామిడి పండ్లు జ్యేష్ఠమాసములో పండిన ఫలమంత తియ్యగా నుండునా? అకాలమున పండ్లకై జను లిప్పుడు ప్రయత్నము చేయుచున్నారు. ఆశ్వీయుజ మాసములోకూడ మన కిప్పుడు మామిడిపండ్లును, పనసపండ్లును దొరుకుచున్నవి. కాని యివి సరియైనకాలములో

---

* బేలూరులోను, ఇతరచోట్లనుగల మఠముల విషయమై అమ్మగారిచ్చుట చెప్పిరి.

దొరుకు పండ్లంత రుచిగా నుండవు. ఇది పరమార్థానుభూతి కొఱకైన ప్రయత్నముల విషయములోకూడ నిజము. ఈ జన్మలో జపమును కఠినసాధనలను చేసినయెడల, రాబోవు జన్మలో నీ వింకను నెక్కువగా నభివృద్ధి గాంతువు.

హఠాత్తుగాగలుగు జ్ఞానవికాసమునుగురించి అమ్మగారిట్లు చెప్పిరి: "భగవంతుడొక శిశువువంటివాడు. అడుగనివారికి ఆ పరమార్థ మాతడిచ్చును; మరియొక రెంత అడిగినను వారి కీయడు. అది యంతయు నాతని చిత్తవిలాసము!"

*   *   *

మరియొకనాడు శ్రీ మాతృదేవి వసారాలో కూర్చుండి తమలపాకుల కిల్లీలు కట్టుచుండగా "ఇటుతరువాత మిమ్ము సంతోషపఱచుటకై యెన్ని పారమార్థిక సాధనల నెంతమంది చేసెదరో కదా!" అని నేనంటిని. ఇందుపైని చిఱునవ్వు నవ్వుచు, "ఏమనుచున్నావు! 'హా! అమ్మ యెంతలావుగనుండి, ఎట్లు కుంటుచుండెడిది!' అని జనులందరు చెప్పుకొనెదరు!" అని సెలవిచ్చిరి.

శిష్యుడు: మీర ట్లనవచ్చును.

అమ్మగారు: మంచిది. ఇందుచేతనే కాశీపూర్ తోట యింటిలో అనారోగ్యస్థితిలో నుండినప్పుడు శ్రీ గురుదేవు లీ క్రింది విధమున చెప్పుచుండువారు: "ఏదియో యైహికలాభ మాశించి నాకడకు వచ్చినవారు 'ఆహా! ఈయన భగవదవతారమే! ఈయన జబ్బుగానుండుట యెట్లు తటస్థించును? ఇదంతయు మాయ!' అని చెప్పుచు మాయమైపోయిరి. కాని, నా 'సొంత' జను లీనాదుస్థితినిచూచి యెంతయో పరితపించుచున్నారు."

ఉద్బోధనపత్రికా కార్యాలయము, కలకత్తా 1910-వ సంవత్సరము.

నేను మంత్రోపదేశము నొందుటకు ముందటిదినమున "అమ్మా! నేను మంత్రోపదేశము నొందగోరుచున్నాను," అని నేను శ్రీ మాతృదేవితో చెప్పితిని. 'అందుపైని నీకు మంత్రోపదేశము కాలేదా?" అని అమ్మగారడిగినమీదట కాలేదని నేను బదులు చెప్పితిని. "నీకు మంత్రోపదేశమైనదేమో యనుకొంటిని," అని అమ్మగారు చెప్పిరి. నాకు మంత్రోపదేశము చేసిన తరువాత, శ్రీ మాతృదేవి, "నీ శరీరమును మనస్సును భగవన్నామస్మరణచే పరిశుద్ధము లగుగాక!" అని నన్నాశీర్వదించిరి.

వ్రేళ్లతో జపము చేయుట

శిష్యుడు: వ్రేళ్లతో మంత్రమును జపింపవలసిన అవసరమేమి? మనస్సులో మనమట్లు చేయవచ్చునే.

అమ్మగారు: భగవన్నామమును జపించి సార్థకము లగుటకే భగవంతుడు మనకు వ్రేళ్లు నిచ్చియున్నాడు.

* * *

ఉదయమున అమ్మగారు నాతో ప్రసంగము చేయుచుండిరి.

భగవంతుడు— లోకములో దుఃఖము.

శిష్యుడు: అమ్మా! భగవంతుడనువాడొక డున్నయెడల లోకములో నింత దుఃఖమును, కష్టము నెందు కున్నవి? వీనిని భగవంతుడు చూచుట లేదా? చూచుచున్నను వానిని తొలగించుటకు ఆయనకు శక్తిలేదా?

అమ్మగారు: సృష్టిలో సుఖదుఃఖములు రెండును కలవు.

దుఃఖమే లేనియెడల, సుఖము నెవరు మెచ్చుకొనగలరు. ఇంతే కాక, అందరును సుఖముగానుండుట కెట్లు సాధ్యపడును? "మీ ప్రజలందరి కష్టమును, అసౌఖ్యమును మీరేల పోగొట్టరు? దయయుంచి మీ రాజ్యములోని పౌరులకందరికిని సౌఖ్యమొనగూర్పుడు. మీరు తలచినచో, మీ కిదియొక కష్టములోనిది కాదు." అని సీతాదేవి రాములవారితో జెప్పెను. "ఒకేసారి జనులెల్లరు సుఖముగానుండుట యెన్నటికైన సాధ్యమగునా?" అని రాములవారు బదులు చెప్పిరి. "ఎందుకు కాదు? రాజ ధనాగారములోనుండి ధనమును వెచ్చించి, జనుల కెవరి కేమి కావలయునో సమకూర్పుడు." అని సీతాదేవి విన్నవించెను. "మంచిది, నీవు కోరినట్లే జరుగును," అని రాములవారు సెలవిచ్చి, లక్ష్మణుని పిలిపించి "నీవువెళ్ళి, నా సామ్రాజ్యమందలి జనుల కేదికావలసియున్నను రాజధనాగారమునుండి వారు తీసికొని వెళ్లవచ్చునని ప్రకటింపుము." అని సోదరు నాజ్ఞాపించిరి. ఇది విని రాములవారి రాజ్యములోని ప్రజలందరు రాజాంతఃపురము దగ్గరకువచ్చి, తమతమ కోరికలను వెల్లడించిరి. రాష్ట్ర కోశములోని ధన మడ్డులేక, యేకధారగా ప్రవహింప జొచ్చెను. ఈ విధముగా రాష్ట్రములోని ప్రజలందరు నానందసాగరమున నోలలాడుచుండ, రాములవారిమాయచే, సీతారాములు నివసించుచుండిన భవనమున వర్షకాలములో రంధ్రముఁలుపడి, లోనికి వాన కురియుచుండెను. ఆ యింటికప్పును సరిచేయుటకు పనివారలను తోడ్కొనివచ్చుటకు చారులను బంపిరి. కాని, పనివార లెక్కడ దొరుకుదురు? రాజ్యములో పనివా డెక్కడను లేడు. మేస్త్రులు, వడ్రంగులు మొదలైన వివిధ వృత్తులవా రెవరును

కలికమునకైన కానరాకపోవుటచే, దేశములోని యిండ్లన్నియు పాడయ్యెను. వానిని చక్కజేయుటకు పనివారెవరును దొరకక, ప్రజలు శ్రీ రామచంద్రప్రభునికడకు బోయి, తమ కష్టములను మనవిచేసుకొనిరి. గత్యంతరమేదియు లేక సీతాదేవి "ఇంటికప్పు చిల్లులుపడి లోనికి వాన కురియుచుండుటవలన, నిక నిచ్చట నివసింప సాధ్యముకాకున్నది. దయయుంచి పూర్వపురీతినే రాజ్య వ్యవహారములు జరుగునట్లేర్పరచుడు. అట్లైనచో ప్రజలందరికిని పనివారు దొరుకుదురు. ఒకేసారి మానవులెల్లరు సుఖముగా నుండుట అసాధ్యమని నాకిపుడు బోధపడుచున్నది." అని రాముల వారితో మనవిచేసెను. "అట్లే కానిమ్ము" అని రాములవా రానతిచ్చిరి. వెంటనే వ్యవహారములన్నియు నింతకుపూర్వముండి నట్లే మరల జరుగ నారంభించినవి. పనివారు మరల సమృద్ధిగా దొరుకుచుండిరి. "ప్రభూ! ఈ సృష్టియెల్ల మీ యద్భుతలీలయే కదా!" అని సీతాదేవి రాములవారి నుగ్గడించెను.

ఎల్లకాల మెవరును కష్టపడరు. ఈ భూలోకములో యావ జ్జీవమును కష్టమే యనుభవించువారెవరు నుండరు. ప్రతికర్మకు ఫలముండును. ఈ విధముగా అవకాశము లెల్లరకును లభించు చుండును.

శిష్యుడు: అట్లైనచో సర్వమునకును కర్మయే కారణమా?

అమ్మగారు: కర్మకాక, వేరేది కారణము? పాకీవాడు తలపైని బాల్చిని పెట్టుకొనిపోవుట నీవు చూచుచున్నావు కావా?

శిష్యుడు: జీవునకు సత్కర్మకుగాని, దుష్కర్మకుగాని మొట్టమొదటి ప్రేరణ యెచ్చటినుండి వచ్చుచున్నది? ఈ జన్మ

కర్మ - దైవ సంకల్పము - దురవగాహ రహస్యము.

లోని ప్రేరణలకు పూర్వపుజన్మలో చేసిన కర్మలే కారణమని, ఆ పూర్వపు జన్మలోని ప్రేరణలకు దానికిముం దుండిన జన్మలో చేసినకర్మలే కారణమని సమాధానరూపముగా మీరు చెప్పవచ్చును. కాని దీనికి మొదలెక్కడ?

అమ్మగారు: భగవంతుని సంకల్పములేనిదే యేమియు జరుగదు; గడ్డిపరకకూడ చలింపదు. మంచికాలము వచ్చినప్పుడు భగవంతుని ధ్యానించవలెనను కోరిక మానవునకు కలుగును; చెడ్డకాలము వచ్చినప్పుడు దుష్కర్మలను చేయుటకు తగిన సదుపాయములన్నియు నాతనికి లభించును. భగవత్సంకల్పమునుబట్టి యేది యెప్పుడు జరుగవలెనో అది అప్పుడు జరుగుచుండును. మనుష్యుల కర్మలలో దైవసంకల్పము ప్రతిబింబించుచుండును. నరేను (వివేకానందస్వామి) తనంతతానే అంత ఘనకార్యములను చేయఁగలిగియుండునా? భగవంతు డాతనియందుండి పని చేసెను కావుననే, అతడట్టి దిగ్విజయము నొందగలిగెను. ఆతడు చేయవలసిన పనులన్నిటిని శ్రీ గురుదేవుడు ముందుగనే నిర్ణయించెను. పరిపూర్ణముగా తనకాత్మ సమర్పణచేయువారికి, శ్రీ గురుదేవుడే సర్వమును సమకూర్చును. మన సదుపాయములన్నియు మనమనకర్మలచే నిర్ణీతములగుచున్నందున, మనము సర్వసహనభావము కలిగియుండవలయును. ఇదియటుండ, కర్మలను కర్మలే హరించును.

శిష్యుడు: కర్మ యెన్నడైన కర్మను పోగొట్టగలదా?

అమ్మగారు: ఎందుచేత పోగొట్టజాలదు? నీవు సత్కర్మ

పారమార్థిక సాధనవలన పాపములు పోవును.

చేయుదువేని అది నీ పురాకృత దుష్కర్మను పోనాడును. ధ్యాన, జప, పారమార్థికచింతనాదుల బలిమిచే పూర్వపాపములు నశించును.

మీర్‌జాపూరు వీథిలో నొక బాలునకు దయ్యము పట్టినదని వింటిని. ఉద్బోధనపత్రిక కార్యాలయోద్యోగులు కొందఱా బాలుని నిన్న వెళ్లిచూచిరి. ''పిశాచ శరీరములో మనుజులెంత కాలముందురు?'' అని అమ్మగారి నడిగితిని.

మరణానంతర జీవితము.

అమ్మగారు: ఆధ్యాత్మికోన్నతి నెక్కువగా గాంచిన జీవులు తప్ప, మిగిలిన జనులందరు ప్రేతశరీరములో నొక సంవత్సరమువరకునుందురు. పిమ్మట, ఆ గతించిన జీవుల సంతృప్తికొరకు గయలో పిండ ప్రదానముచేసి తర్పణము విడుతురు. దీనివలన, గతించినజీవులకు ప్రేతశరీరమునుండి విమోచన కలుగును. తరువాత, వారితర జీవలోకములకువెళ్లి, అచ్చట సుఖమో దుఃఖమో కొంతకాలమనుభవించి వారివారి కోరికలకు అనుగుణమైన మనుష్యజన్మ నెత్తుదురు. మఱికొందఱాలోకములలోనుండియే, మోక్షమును బడయుదురు. ఈ జన్మలో నేదోయొక పుణ్యకార్యమును చేసిన మనుష్యునకు, ప్రేతావస్థలో పారమార్థికజ్ఞానము పూర్తిగా నశింపదు.

ఈ సందర్భమున బృందావనమందలి గోవింద దేవాలయార్చకునిగురించి అమ్మగారు మరల ప్రస్తావించిరి.

శిష్యుడు: గయలో శ్రాద్ధము చేసినంత మాత్రమున నెవరికైన, నున్నతతరస్థితిని బడయుటకు వీలగునా?

అమ్మగారు : ఔను. అది నిజమే*.

శిష్యుడు : అట్లైనచో పారమార్థిక సాధనలను చేయవలసిన యవసరమేమి?

అమ్మగారు : గతించినజీవు లున్నతతరస్థితిని బడసి, అచ్చట కొంతకాల ముందురనుటకు సందేహములేదు కాని, తరువాత

---

* ఈ సందర్భమున మరొకవిషయము నాకు జ్ఞప్తికివచ్చుచున్నది. శ్రీ మాతృదేవి కాశీలోనుండిరి. అప్పటికి ఒకటిరెండు నాళ్లు ముందుగనే, నా కుటుంబసంబంధులగు పూర్వీకులలో మృతజీవులైనవారికి శ్రాద్ధము పెట్టుటకు గయకు వెళ్లుచు, "అమ్మా! నా పూర్వీకులకు స్వర్గము కలుగునట్లు దయయుంచి మీ యాశీర్వాదముల నొసంగుడు." అని నేను శ్రీ మాతృదేవిని ప్రార్థించితిని. నా పితృదేవతల సంతృప్తికై గయలో నేను పిండప్రదానము చేసి తర్పణమువిడిచిన నాటిరాత్రియే, (శ్రీమాతృదేవితోకూడ కాశికి వెళ్లిన యామె మేనల్లుడు) భూదేవుడు శ్రీ మాతృదేవి జపముచేయుచుండినట్లును, ఆమె చుట్టును కొంతమంది జనులుమూగి 'నాకు ముక్తినొసంగుడు' 'నాకుముక్తి నొసంగుడు!' అని ప్రాధేయపడి అడుగుచుండినట్లును కలకనెను. కలలో అమ్మగారొక పాత్రలోనుండి పవిత్రజలమును తీసి, వారిపైజల్లి, 'మీకిప్పుడు విమోచనయైనది. వెడలిపొండు!' అని చెప్పిరి. వారును బహు సంతుష్టాంతరంగులై వెడలిపోయిరి. పిమ్మట మరియొకమనుష్యుడు వచ్చెను. వానిని చూచి 'ఇంక నేనిట్లు చేయజాలను' అని అమ్మగారు చెప్పిరి. చాలకాలమువరకు వా డమ్మగారిని ప్రార్థించి, చిట్టచివరకు వారి యనుగ్రహమును బడసెను. మరునాడీ కలను భూదేవుడు శ్రీ మాతృదేవికి చెప్పినప్పుడు, "తన పితృదేవతలకు శ్రాద్ధము పెట్టుటకై, ర——గయకు వెళ్లియుండెను. కనుక ఈ జనులందరికిని విమోచన కలిగినది." అని యామె బదులుచెప్పిరి. బహు భక్తిశ్రద్ధలతో నా పితృదేవతలకు తర్పణములు విడుచుచు, నాకా సమయమున పేళ్లు జ్ఞప్తికిరాని వారందరికిగూడ విమోచన కలుగుటకై, నేను వాస్తవముగా పిండప్రదానము చేసి తర్పణము విడిచితిని. వారందరి విమోచనకొరకు ప్రార్థించితిని.

వారు తమతమ పూర్వవాంఛలకు అనుగుణముగా ఈ లోకమున మరల జన్మింతురు. నరజన్మ మెత్తినతరువాత వారిలో కొందరికీ జన్మలోనే ముక్తి లభించును; మరికొందరు వారివారి కర్మఫలముల ననుభవించుటకు హీనజన్మ లెత్తెదరు. ఈ ప్రపంచ మొక చక్రమువలె గిరగిర తిరుగుచుండును. ఆశలన్నియు ఏ జన్మలో పూర్తిగా తొలగిపోవునో, అదియే మనుష్యులకు తుదిపుట్టుక.

శిష్యుడు: మృతినొందిన జీవులు దివ్యస్థితికి పోయెదరని మీ రిప్పుడే చెప్పియుంటిరి. అచ్చటికి వారు తమంతట తామే పోవుదురా లేక ఎవరైనను వారిని తీసుకొని వెళ్లెదరా?

అమ్మగారు: ఎవరునువచ్చి వారిని తీసుకొనివెళ్లరు; వారంతట వారే వెళ్లెదరు. సూక్ష్మశరీరము గాలితో చేయబడిన శరీరమువంటిది.

శిష్యుడు: మరణించినవారికి గయలో శ్రాద్ధముపెట్టనిచో, ఆ జీవుల కేమి సంభవించును?

అమ్మగారు: తమతమ కుటుంబములలో పుణ్యాత్ము లెవరైన పుట్టి గయలో శ్రాద్ధము పెట్టువరకుగాని, వేతే అపరకర్మలను చేయువరకుగాని, వారా ప్రేత శరీరములోనే యుందురు.

శిష్యుడు: భూతములు మొదలగువానిని గురించి వినుచుందుము. అవి శివుని పరివారములోనివా? లేక పిశాచములా? చనిపోయిన జనుల దయ్యములా యవి?

అమ్మగారు: చనిపోయిన జనులదయ్యములే యవి. శివుని పరిచారకులగు భూతములువేఱు. జనులు చాలజాగ్రత్తగా జీవింపవలయును. ప్రతికర్మకు ఫలముతప్పక కలుగును. పరుషములాడి

ఇతరుల నవమానపరచుటకాని, వారిబాధకు కారణభూతు లగుటకాని యెవరికిని మంచిదికాదు.

శిష్యుడు: అమ్మా వేపచెట్టునకు మామిడిపండు పుట్టదు; మామిడిచెట్టునకు వేపపండును పుట్టదు. ఎవరి కర్మఫలమును వా రనుభవింతురు.

అద్వైతస్థితి

అమ్మగారు: నాయనా, నీవు చెప్పునది నిజము. కాలక్రమమున భగవంతుడున్నట్లుకూడ మనకు అనిపించదు. జ్ఞానవికాసము కలిగినవానికి దేవతలందరును మాయయని తోచును. సర్వమును కాలములో ఉత్పన్నమై, కాలములోనే అంతమొందును......నిజముగా భగవంతుడు మున్నగు విషయములు జ్ఞానోదయమైనతోడనే మాయమగును. అమ్మయే విశ్వమంతట నిండియున్నట్లు సాధకుడప్పుడు గ్రహించును. యథార్థమిదియే.

*   *

నిత్యారాధనకై శ్రీ మాతృదేవి బిల్వపత్రముల నెంచియుంచుచుండగా, వారి నూతన ఛాయాపటమును కనుబఱచి, అది తమ రూపమును సరిగా ప్రతిబింబించుచున్నదాయని యడిగితిని.

అమ్మగారు: ఔను. ఈ బొమ్మ బాగుగనే యున్నది. కాని దీనిని తీయకముందు నే నెక్కువ లావుగానుంటిని. ఆ సమయమున జోగినకు (యోగానందస్వామికి) చాల జబ్బుగానుండెను. అతని విషయమైన చింతవలన నేను చిక్కిపోతిని. అప్పుడు నాకు సౌఖ్య మెంతమాత్రమును లేదు. జోగిను జబ్బువిషమస్థితిలోనికి దిగినయెడల, నేడ్చుచుందును; అతనికి కొంచెము నయ

ముగానుండినచో, సంతోషించుచుండును. సారాబుల్ అను దొర
సాని యీ ఛాయాపటమును తీసెను. అందుకు మొట్టమొదట
నేను సమ్మతింపలేదు; కాని ఆమె పట్టుపట్టి, "అమ్మా ఈ బొమ్మను
నేనమెరికాదేశమునకు తీసుకొనివెళ్లి, పూజింతును." అని చెప్పి
నందున, తుట్టతుదకు నేనీ బొమ్మతీయుట కొప్పుకొంటిని.

శిష్యుడు: అమ్మా! మీ యొద్దనున్న శ్రీ రామకృష్ణుల
వారి ఛాయాపటము చాలబాగున్నది. ఆ బొమ్మనుచూచిన వారికి
నిజముగా శ్రీ గురుదేవుని చూచినట్లే తోచును. మంచిది, శ్రీ
గురుదేవు లిట్లేయుండెడివారా!

తన చిత్తరువును తానే శ్రీరామకృష్ణుడు పూజించుట

అమ్మగారు: ఔను, ఆ బొమ్మ మిక్కిలి చక్కగానున్నది.
మొట్టమొదట అది వంటవండు నొక
బ్రాహ్మణుని యధీనమందుండెను. శ్రీ
వారి ప్రథమ ఛాయాపటమునకు ముద్రిత
ప్రతులను చాలతీసిరి. వానిలో నొకప్రతిని ఈ బ్రాహ్మణుడు
తీసుకొనెను. కాళీవిగ్రహమువలెనే ఆ బొమ్మకూడ మొట్టమొదట
చాల నల్లగా నుండినందున, దాని నా బ్రాహ్మణునకిచ్చిరి. అతడు
దక్షిణేశ్వరమునువదలి మరియొకచోటునకు (ఎక్కడకో నేను
మఱచిపోతిని) వెళ్లినప్పుడు దాని నాతడు నా కిచ్చెను. ఇతర
దేవదేవీచిత్రములతోపాటు నేనా ఛాయాపటమునుకూడ
భద్రపరచుకొని, పూజించుచుంటిని. ఆ కాలములో నేను నౌబత్తు
గది యడుగుననుండు భాగములో నివసించుచుంటిని. ఒకనాడు
శ్రీ గురుదేవు లచ్చటకువచ్చి ఆ బొమ్మనుచూచి "ఓహో! ఇది
యేమి!" అని తమ ఆశ్చర్యమును వెల్లడించిరి. అప్పుడు నేనును,
లక్ష్మియు మేడమెట్ల క్రింద వంటచేయుచుంటిమి. పిమ్మట శ్రీ

రామకృష్ణు లచ్చట పూజకై యుండిన బిల్వదళములను, పూలను చేతితో తీసికొని ఆ ఛాయాపటమునకు సమర్పించి, పూజచేసిరి. అదే ఈ బొమ్మ. ఆ బ్రాహ్మణుడెన్నడును తిరిగి రాకపోవుటచే, బొమ్మ నా యొద్దనే యుండిపోయెను.

శిష్యుడు: అమ్మా! సమాధిస్థితిలో శ్రీ గురుదేవుని ముఖము వెలవెల బారియుండుట మీ రెన్నడైన చూచినారా?

అమ్మగారు: ఏల? చూచినట్లు నాకు జ్ఞప్తిలేదు. ఇంతే కాక, అట్టి దివ్యస్థితిలో వారి మోమున చిఱునవ్వు తాండవింప నే నెల్లప్పుడును చూచియుంటిని.

శిష్యుడు: భావసమాధిస్థితిలో చిఱునవ్వుండవచ్చును; కాని కూర్చుండినట్లుండు ఛాయాపటము విషయమున అది యెంతో మహోన్నతస్థితిలో తీసిన బొమ్మయని శ్రీ గురుదేవులు చెప్పిరి. ఆ స్థితిలోకూడ, మందహాసముండుటకు వీలగునా?

అమ్మగారు. శ్రీ గురుదేవుల సమాధిస్థితులన్నిటి యందును, నేనుమాత్రము శ్రీ వారి మోమున మందహాసమునే చూచితిని.

శిష్యుడు: ఆయన మేనిఛాయ యెట్లుండెడిది?

శ్రీ రామకృష్ణుల జీవితవిశేషములు

అమ్మగారు: హరిదళమువంటి బంగారుఛాయతో శ్రీ వారి శరీరము మిసమిసలాడుచుండెడిది. ఆయన మేని ఛాయకును, చేతిబంగారు కడియమునకును ప్రకాశమునం దెంతమాత్రము భేదము కానరాకుండెను. వారియొడలికి నూనె రాయునప్పుడు, నే నొక దివ్య తేజ మా శరీరమంతటను వెలువడి వచ్చుచుండుటను కన్నులార గాంచగలిగితిని. దేవాలయమునందలి తమ గదిలోనుండి శ్రీ

వారు బయటకు వచ్చునప్పుడు జనులు బారులుకట్టి నిలిచి "ఆహా! అదేవారు వచ్చుచున్నారు!" అని ఆశ్చర్య పరవశులై యొకరితోనొకరు చెప్పుకొనుచుండువారు. ఆయన కొంచెము స్థూలముగా నుండెడివారు, మధురబాబిచ్చిన పీట వారికి చాలకుండెను. నెమ్మదిగా, తొట్రుపాటులేని నడకతో స్నానమునకై వారు గంగానదికి పోవునప్పుడెల్ల, జనులాశ్చర్య పరవశులై యాయనను చూచుచుందురు.

శ్రీ రామకృష్ణులు కనూర్పుకూరులో నుండినప్పుడు, జనులాయన బయటకువచ్చునప్పుడెల్ల, నోళ్లు తెరచుకొని రెప్పవాల్పక వారివంక చూచుచుండెడువారు. ఒకనాడు శ్రీవారు "భూతీఖాల్" అని పిలువబడు కాలువవైపునకు విహారార్థము వెళ్లినప్పుడు, నీళ్లు తెచ్చుకొనుటకై యచ్చటకువచ్చిన స్త్రీలు నోళ్లు తెరచుకొని యాయన వంకచూచుచు "అదే! గురుదేవులు వచ్చుచున్నారు!" అని చెప్పుకొనిరి. ఈ దృశ్యమునుచూచి విసుగుకొని "హృదూ! వెంటనే నా తలపై బట్టను కప్పివేయుము; లేనిచో, నా కట్టుబట్ట నిప్పుడే తీసి పారవైచెదను." అని తమతో కూడ వచ్చుచుండిన హృదయునితో శ్రీ రామకృష్ణులు చెప్పిరి. "వలదు, బాబూ! కట్టుబట్టను నీవు తీసివైచి, దిగంబరుడవైనచో జనులేమనెదరు?" అని హృదయుడు బదులుచెప్పెను. తాను వివస్త్రుడై యుండచూచిరేని, ఆ స్త్రీలు పారిపోయెదరని యెరిగి యుండుటచే శ్రీ గురుదేవుడట్లు చెప్పెను. హృదయుడు త్వరితముగా శ్రీ రామకృష్ణుల మోముపై బట్టను కప్పెను.

శ్రీ గురుదేవులు విచారముతో నుండగా నే నెన్నడును చూడలేదు. అయిదేండ్ల బాలునితో నుండినను, శ్రీ వారెల్ల

ప్పుడు సంతోషముగ నుండువారు. అబ్బాయీ! ఆయన ధుమ ధుమలాడు ముఖముతోనుండగా నే నెన్నడును చూడలేను. ఆహా ఎంత సుదినములవి! కమార్పుకూరులో నుండినప్పుడు శ్రీరామ కృష్ణులు వేకువజామున నేలేచి "నేడు నేనీ ఆకుకూర తినెదను. నా కొరకు దానిని వండుము." అని నాతో చెప్పుచుండువారు. పిమ్మట నే నింటిలోని ఇతర స్త్రీలతో చెప్పి ఆ కూరనువండి శ్రీ వారికి భోజనము సిద్ధముచేయుదానను. కొలదినాళ్లయిన తరు వాత "ఏమి యీ మార్పునాలో? నిద్రలోనుండి మేల్కొనిన వెంటనే 'నేనేమి తినుదును, నేనేమి తినుదును?' అనియే గొడవ చేయుచున్నాను. విశేషమైన ఏ ఆహారముపైనను నాకిక వాంఛ యెంతమాత్రములేదు. నీవు నా కొరకేది వండిన నే నదియే తిన దను." అని శ్రీ గురుదేవులు తమకు తామేవచ్చి నాతో చెప్పిరి.

దక్షిణేశ్వరములో శ్రీ గురుదేవులతిసారముతో బాధపడి, నివారణకొరకు కమార్పుకూరునకు వచ్చుచుండుట పరిపాటి, అట్టి సమయములలో 'అయ్యో! దైవమా! నా కడుపునిండ మలముతప్ప వేరేమియులేదే. దీనికి అంతమే కనపడకున్నది!' అని విసుగుదలతో చెప్పుచుందురు. ఇట్లు బాధపడుచు, శరీ రము నెడల నొకవిధమైన అసహ్యము నలవరచుకొని, అటు తరు వాత దానినంతగా లక్ష్యముచేయుట మానివైచిరి.........

ఇప్పుడెక్కడ జూచినను శ్రీ రామకృష్ణుల భక్తులే! ఎంత యుద్రేకము! ఎంతహాహాహాలుడి! ఎంత గందరగోళము! కాని, శ్రీ వారు వ్యాధిగ్రస్తులై యుండినప్పు డొక భక్తుడిరువది రూప్యము లీయకుండ తప్పించుకొనుటకై పారిపోయెను. అప్పుడు చందాలు సేకరించి, శ్రీ గురుదేవుని చికిత్సకగు వ్యయమును భరించుచుండిరి.

ఈ భక్తుని ఆ పై కమిమ్మని యడిగిరి. ఇప్పుడు శ్రీ గురుదేవుని సేవించు టెంతమాత్రము కష్టముకాదు. ఆహారము శ్రీవారికి సమర్పితమగుచున్నను, నిజముగా దానిని భుజించువారు భక్తులే. శ్రీ గురుదేవుడు మీరుకూర్చుండుమనిన కూర్చుండును, పరుండు మనిన పరుండును. తుదకిప్పుడాయన యొకచిత్తరువే కదా!

తలపాగ చుట్టుకొని, చేతులుజోడించి కాళీవిగ్రహము ప్రక్కను నిలువబడి యుండినట్లు శ్రీ గురుదేవు డొక దివ్యదృశ్యమును గాంచెను. అటుతరువాత శ్రీ వారియెదుట బలరామెల్లప్పుడును చేతులుజోడించుకొనిగా యుండువాడు. ఆతడెన్నడును శ్రీ గురుదేవుని పాదములుతాకి ఆయనకు నమస్కరింపలేదు. ఆతని భావమును గ్రహించి యొకనాడు "బలరామా! నా పాదము దురదపెట్టుచున్నది. దయయుంచి అచ్చట మెల్లగ మర్దన చేయుము." అని శ్రీ రామకృష్ణు లాతనితో చెప్పిరి. వెంటనే బలరాము నరేనునో, రఖల్‌నో, శ్రీ గురుదేవునకు పరిచర్య చేయు యువకులలో మఱియొకరినో పిలుచుకొని రమ్మని మనుష్యునిబంపి, ఆ వచ్చినవారిని శ్రీ గురుదేవుని పాదములను మర్దన చేయగోరెను.

శిష్యుడు: ఒకసారి శ్రీ రామకృష్ణుల మేనిచాయనుగూర్చి నేను బ్రహ్మానందస్వాములవారి నడుగగా, "శ్రీ గురుదేవులు నావలెనే (అనగా నల్లగా) నుండెడువారు." అని యాయన చెప్పెను.

అమ్మగారు: ఔను. రాఖల్ మొదలగు శిష్యు లాయన దగ్గరకు వచ్చినప్పుడు శ్రీ గురుదేవు లా విధముగనే యుండెడివారు. అప్పటికి శ్రీ వారి పూర్వపుటారోగ్యమును, రూపవిలాసమును చెడిపోయినవి. ఇంత యెందుకు? నా విషయమే ఆలోచింపుడు.

నా ప్రస్తుత శరీరారోగ్యమును, రూపమును చూడుడు. నేను పూర్వ మిట్లే కనుపడెడి దాననా? లేదు లేదు. నేనాకాలమున మిక్కిలి యందముగనే యుంటిని. ఇటీవల నా శరీరము స్థూలమయ్యెను గాని, పూర్వమిట్లుండెడిదిగాదు.......

పూజాసమయమైనది. అమ్మగారు పూజామందిరములోనికి వెళ్లుటకు సంసిద్ధులగు చుండిరి. నేను క్రిందికిదిగి వచ్చితిని. పూజ యైన తరువాత, భక్తులకు ప్రసాదమును తీసుకొని వచ్చుటకై నేను మరల మేడమీాదకు వెళ్లితిని. మధురభక్ష్యములును, పండ్లును గల యాకులను తీయుచుండగా నా మోచేయి శ్రీమాతృదేవి పాదములకు తగిలెను. "హా!" యని కేక వేసి అమ్మగారు చేతులుజోడించి నాకు నమస్కరించిరి. "ఇది అంతిపాటింప దగినదే కాదు." అని నేను విన్నవించినను, అమ్మగారు నా యెదుటవంగి నమస్కరించుటతో తృప్తినొందక, "నాయనా! రా! నిన్ను ముద్దుపెట్టుకొననిమ్ము." అని చెప్పుచు తమచేతితో నా గడ్డమును నిమిరి, ముద్దాడిరి. అప్పటికాయెకు మనస్సు కుదుటబడినది. ఈ విధముగా శ్రీమాతృదేవి తమశిష్యులను భగవత్స్వరూపులుగ గౌరవించుచు, తల్లి తన బిడ్డలనువోలె వారిని ప్రేమతో జూచు చుండువారు.

1910వ-సం॥ అక్టోబరు 29-వ తేది.

అప్పుడే తెల్లవారుచుండెను. అమ్మగారి శయ్యదగ్గరనే నేను కూర్చుండియుంటిని. ఆమె శ్రీగురుదేవుని గురించి నాతో ప్రసంగింప నారంభించిరి.

శిష్యుడు : శ్రీగురుదేవులు చిత్రరువులో నిజముగా సజీవులై యున్నారా!

శ్రీ గురుదేవుని యునికి

అమ్మగారు : ఉన్నారు, సందేహములేదు. శరీరమును, ఛాయయు నొకటే * శ్రీ వారి చిత్రపటము ఛాయయేకదా?

శిష్యుడు : ఆయన అన్ని చిత్తరువులలోగూడ నున్నారా?

అమ్మగారు : ఔను. శ్రీ వారి చిత్రపటము సమక్షమున నీవెల్లప్పుడు నాయనను ప్రార్థింతువేని, ఆ చిత్రపట ముఖముననే నీకు వారు ప్రత్యక్షమగుదురు. ఆ చిత్రపటమున్నచోటు పూజా మందిరమగును. (ఉద్బోధన పత్రికాకార్యాలయమున కుత్తరమున నున్నప్రదేశమును చేతితో చూపుచు) అచ్చట శ్రీ గురుదేవు నెవరైన నారాధించుచున్నా రనుకొనుము. శ్రీ వారి యునికిచే ఆ స్థలము పావనమగును.

శిష్యుడు : దానికేమి? ప్రతిస్థలము విషయమునను జనులు మంచిచెడ్డలను చెప్పుకొనుచుందురు.

అమ్మగారు : ఈ విషయము కేవల మటువంటిదికాదు. అట్టి స్థలము శ్రీ గురుదేవుని విశేషకటాక్షమునకు పాత్రమగును.

శిష్యుడు : మీరు నైవేద్యముచేయు భోజనపదార్థములను శ్రీ గురుదేవులు నిజముగా తినుదురా?

---

* ఈ కారణమును బట్టియే తమకంటె పెద్దలగువారి నీడపై నెవరును నడువరు. జయరాంబటిలోనే నొకనాడు స్నానముచేసి, యింటికి తిరిగి వచ్చుచుంటిని. అమ్మగారుకూడ స్నానము పూర్తిచేసికొని తిరిగి వచ్చుచుండిరి. నేను వారిప్రక్కనే నడుచుచు, వారినీడ నప్పుడప్పుడు త్రొక్కుచుంటిని. ఇదిచూచి అమ్మగారు నన్ను తమ రెండవప్రక్కకువచ్చి, నడువుమనిరి. వారి నీడపై నడుచుచుంటినని మొదట నేను గ్రహింపలేదు.

అమ్మగారు. ఔను. తినుదురు.

దేవుడు నైవేద్యమును భుజించును.

శిష్యుడు: కాని అందుకు తగిన నిదర్శన మేదియు మాకు కనుపడకున్నదే.

అమ్మగారు: శ్రీ వారికన్నులలోనుండి యొక తేజస్సు బయటకువచ్చి ఆహారపదార్థము లన్నిటిని నాకుచున్నట్లు కనుబడును. ఇదంతయు నెందుకు? శ్రీ గురుదేవుల కేదైన ఆహారము కావలయునా? అక్కరలేదు. భక్తుల సంతృప్తికొరకే వారు నైవేద్యమారగింతురు. ఆ పవిత్ర ప్రసాదమువలన చిత్తశుద్ధి కలుగును. మొట్టమొదట భగవంతునకు నైవేద్యము చేయకుండ నెవరైన భోజనము చేసినయెడల,* వారి అంతఃకరణ అపవిత్రమగును.

శిష్యుడు: శ్రీ గురుదేవులు నిజముగా నైవేద్యము తినుచురా?

అమ్మగారు: ఔను. శ్రీ వారు నైవేద్యమును తినుచున్నారో లేదో నేను చూచుటలేదా? పళ్లెరము ముందుకూర్చుని నైవేద్యమును భుజింతురు.

శిష్యుడు: తినునప్పుడు మీరు వాస్తవముగా చూచుచున్నారా?

* ఒక భక్తుడొకసారి శ్రీ మాతృదేవియొద్దనుండి సన్న్యాసులకు యోగ్యమైన కాషాయవస్త్రములను పుచ్చుకొనెను. పిమ్మట కొన్నిసంవత్సరములవరకు వ్యాధిగ్రస్తుడై ఆరోగ్యము కొఅకత డెచ్చటచ్చటకో వెళ్లి తుదకు మఠములోనికవచ్చి నివసింపక, తనయింటికిబోయి అచ్చట కొంతకాలమును గడపి యొకనాడు జయరాంబటికివచ్చి కాషాయవస్త్రములను శ్రీ మాతృదేవికి మరల నిచ్చివేసెను. ఈ విషయమునుగురించి ముచ్చటించుచు, "పాపము! లౌకిక విషయలోలుర అన్నమును తినుటవలన, నాతని మానస మపవిత్రమైపోయెను." అని అమ్మగారు సెలవిచ్చిరి.

అమ్మగారు : ఔను. కొన్ని పదార్థములను శ్రీ గురుదేవులు నిజముగా తినెదరు. మఱికొన్నిటి నూరకెచూచి విడిచివేసెదరు. నీ స్వవిషయమునే యోచింపుము. ఈ వేళ ఆ వేళ అను నియమము లేక, అన్నివస్తువులను తినుటకు నీవుమాత్ర మిష్టపడుదువా? ఇంతే కాదు, ముక్కుమొగ మెఱుగని వారెవరో పెట్టిన భోజనముకూడ నీకు రుచింపదు. అటువంటిదే యీ విషయముకూడ, భగవంతుని మన మెంతవరకు ప్రేమించుచున్నామను విషయము కేవలము మన ఆంతరంగిక భావతీవ్రతపై నాధారపడి యుండును. అన్నిటికిని భగవత్ప్రేమయే ముఖ్యము.

శిష్యుడు : భగవంతునియందు ప్రేమ మనకెట్లు కలుగును?

భగవత్ప్రేమ-భగవంతుడు మన సొంతము.

ఒకరి సొంతకుమారుడైనను మఱియొకరిచే పెంచబడిన యెడల, తన సొంతతల్లినే యతడు తన తల్లిగా గుర్తింపడు.

అమ్మగారు : ఔను; అది నిజమే. కావలసినది భగవంతుని దయయే. కనుక జనులు భగవంతుని దయకొఱకు ప్రార్థింపవలెను.

శిష్యుడు: భగవంతుని దయకు పాత్రులైనవారని, పాత్రులుకానివారని మన మెట్లు చెప్పగలము? దయ అందరకు నొకటియేకదా.

అమ్మగారు : సాధకులు నదీతీరమున గూర్చుని భగవంతుని ప్రార్థింపవలయును. సముచితకాలమున వారు తరింతురు.

శిష్యుడు : ప్రాప్తకాలమున సర్వము జరుగుచుండునప్పుడు, భగవంతుని దయతో పనియేమి?

అమ్మగారు : నీవు చేపలను బట్టగోరెదవేని, యోటిగట్టున కూర్చుని గాలమువేసి కనిపెట్టుకొనియుండ నక్కరలేదా?

శిష్యుడు : భగవంతుడు మన సొంతమైనప్పుడు, మనము కూర్చుని వేచియుండనేల?

అమ్మగారు : అది నిజము. అకాలమునకూడ భగవంతుని దయ కలుగవచ్చును. మామిడి, పనస మొదలగు పండ్లు నేడకాలముననైన జనులకెట్లు దొరుకుచున్నవో నీవు చూచుటలేదా? ఇప్పుడు భాద్రపద మాసములో మామిడిచెట్లెంత విస్తారముగా కాపు కాయుచున్నవి!

శిష్యుడు : మనము కోరినదానినిచ్చి భగవంతుడు మనలను పంపివేయునా? ఇదియే మనహద్దా? లేక పరమేశ్వరుని మన సొంతముక్రింద మనము భుక్తపరచుకొనవచ్చునా? భగవంతుడు నా సొంత పెన్నిధి యగునా?

అమ్మగారు : ఔను. భగవంతుడు కేవలము మనసొంతిమే. ఇదియే శాశ్వత సంబంధము. మనకు భగవంతునియందుగల భక్తి తీవ్రతనుబట్టి, మనకాయన సాక్షాత్కారము కలుగుచుండును.

శిష్యుడు : భావోద్రేక మొక స్వప్నము వంటిది. మన తలంపులనుబట్టియే మనకు కలలు వచ్చుచుండును.

అమ్మగారు : అది స్వప్నమే. ఈ ప్రపంచమంతయుకూడ స్వప్నమే. ఈ జాగ్రదవస్థకూడ స్వప్నమే.

శిష్యుడు : కాదు. జాగ్రదవస్థ స్వప్నమే యైనచో రెప్ప పాటులోనే అది అంతమై యుండవలసినది. అట్లుకాక ఈ స్థితి చాల జన్మలవరకట్లే యుండును.

అమ్మగారు: అట్లయ్యో నిది స్వప్నమే. నిన్నరాత్రి నీకు వచ్చినకల యిప్పుడుండదు. (నిజముగాకూడ కడచినరాత్రి యీ శిష్యునకొక యద్భుత స్వప్నము వచ్చెను.) ఒక కుమారుని గోల్పోయిన వ్యవసాయదారునకు, రాత్రి తా నొకరాజుగా నుండినట్లును తన కెనమండ్రు కొడుకులుండినట్లును కలవచ్చెను. ఆ కల అయినతర్వాత "నా యెనమండ్రు బిడ్డలకొరకేడ్తునా. ఈ యొకని కొరకేడ్తునా?" అని అతడు తన భార్య నడిగెను.

ఈ విధముగా అమ్మగారితో వాదించి "అమ్మా ఇప్పుడు నేను మీకు విన్నవించిన విషయమై నిజముగా నా కెంతమాత్రము చింతలేదు. నా 'సొంతము' అని నేను చెప్పకొనదగినవా రెవరైన నున్నారేమో యనియే నేను తెలిసికొనగోరినదెల్ల." అని శిష్యుడు చెప్పెను.

అమ్మగారు: అట్టివాడున్నాడు.

శిష్యుడు: నిజముగా?

అమ్మగారు: ఔను.

శిష్యుడు: అట్టివాడు నిజముగా మన 'సొంతమే' యైనచో, అతనిని చూచుటకై మనమేల యాతనిని ప్రార్థింపవలయును? వాస్తవముగా నా సొంతమైనవాడు, నే నాతనిని పిలువకపోయినను నా కడకువచ్చును. మన తల్లిదండ్రులవలె భగవంతుడు కూడ మనకు కావలసినవాని నెల్ల సమకూర్చుచున్నాడా?

అమ్మగారు: ఔను, నాయనా. అది నిజము. వాడే మనకు తల్లియు, తండ్రియు నయ్యెను. మన తల్లిదండ్రులవలె మనలను పెంచినవాడు వాడే. వాడే మనకేమి కావలయునో కనిపెట్టి మన యోగక్షేమమును చూచుచున్నాడు. లేనిచో, ఇంతకు

పూర్వము నీ వెక్కడుంటివి, ఇప్పు డెక్కడనున్నావు? నీ తల్లి దండ్రులు నిన్ను పెంచిరి కాని, నీవు వారివాడవు కావని కట్టకడకు గ్రహించిరి. కాకిగూటిలో పెరుగు కోయిలను నీవు చూచుట లేదా?

శిష్యుడు : భగవంతుడు నిజముగా నా 'సొంతము' అని నేను గ్రహింతునా?

అమ్మగారు : ఔను. నిజముగా నీవు వానిని గ్రహింతువు. నీవు తలచినదెల్ల నీకు దొరకును. స్వామీజీ (వివేకానందస్వామి) భగవంతుని తెలిసికొనలేదా? స్వామీజీ తెలుసుకొనినట్లే, నీవును భగవంతుని తెలిసికొనెదవు.

శిష్యుడు : అమ్మా నేను భయమువలనగాని, విశ్వాస శూన్యతవలనగాని చెడిపోకుండ నను గ్రహింపుడు.

అమ్మగారు : అటువంటి ప్రమాదమేమియు నీకు లేదు. ఏలన, నేనే చేపను గాలము వేసి పట్టితిని.

శిష్యుడు : మంచిది, మేమందరముకూడ ఆ పరమసుఖము ననుభవింతుము.

అమ్మగారు : ఔను. అచ్చుదిమ్మ నొకరు చేసిపెట్టినదాని సాయమువలన నితరులెందరో తమతమ బొమ్మలను చేసికొనెదరు.

శిష్యుడు : ఔను. మా కొరకు మీరుమాత్రము కృషి చేసినయెడల, మాకు సర్వము లభించును. మమ్ము మీరు త్రోసి వేయజాలరు.

అమ్మగారు : ఔను, నాయనా. నీకొరకు నేను కృషిచేసి నచో, నీకు సర్వము దొరుకును.

* * *

ఉదయమున 'షిల్లాంగు' నుండి యొక భక్తుడు వచ్చెను. అమ్మగారి దివ్యస్వభావము విషయమై సందేహించి, తా నేడు సారులు శ్రీ మాతృదేవిని కలలో చూచిననేతప్ప, తా నామెను పోయి సందర్శింపనని ప్రతిజ్ఞపట్టెను. ఆతనికి కావలసిన స్వప్నములు వచ్చినతరువాత శ్రీ మాతృదేవిని సందర్శింప జయరాంబటికి అరుదెంచి, మధ్యాహ్నమున దేవివారియొద్ద సెలవుతీసికొనునప్పుడు "అమ్మా! నే నిపుడు వెళ్లవలెను. నా కింక కోరదగిన దేదైననున్నదా!" అని యాత డడిగెను.

అమ్మగారు: ఔను. నీ వవశ్య మపేక్షింపదగిన దొకటి యున్నది. నీవు మంత్రోపదేశము నొందవలయును.

భక్తుడు: నేను కలకత్తాలో బాగ్ బజారుకు వచ్చి మంత్రోపదేశము నొందవచ్చునుగదా.

అమ్మగారు: నాయనా! ఆ పనిని నీ విప్పుడే ముగించుట మంచిది. నేడే మంత్రోపదేశము నొందుము.

భక్తుడు: నేను ప్రసాదమును తినియుంటినే.

అమ్మగారు: అయిననేమి? అందువలన ప్రమాదమేమియు లేదు.

మంత్రోపదేశమునొంది, ఆ భక్తుడు బయలుదేరి వెళ్లెను.

ఉదయమున నింతకంటె ముందుగనే, విపరీతస్వభావుడగు నొక యువ-భక్తుడువచ్చి తనకుసన్న్యాస మిప్పింపుడని అమ్మగారిని వేధించెను; అమ్మగారు తనను 'పిచ్చి' వానినిగాజేసి, శ్రీ గురుదేవుడు వెంటనే తనకు ప్రత్యక్షమగునట్లు చూడవలయుననికూడ

పట్టుపట్టెను. అమ్మగారెట్లో వాని నప్పటికి సమాధానపరచి యింటికి పంపిరి. ఈ విచిత్ర భక్తుని మానసికస్థితి జయరాంబటి నుండి యింటికి తిరిగివచ్చిన తరువాత మఱింత చెడిపోయి, అతడు శ్రీ గురుదేవుని సందర్శనమునకై తత్తరపడజొచ్చెను. తమ సంకల్పమాత్రమున శ్రీ రామకృష్ణుల దర్శనప్రాప్తి నొసంగగల శ్రీ మాతృదేవి అట్లు చేయనందున మనస్సున నొచ్చుకొని తీవ్ర కోపాయత్తచిత్తుడై "అమ్మా నేను శ్రీ గురుదేవుని చూచునట్లు కటాక్షింపరా?" అని యాతడడిగెను. "ఔను. నీవాయనను చూచెదవు. ఇట్లు తొట్రుపాటు పడకుము." అని అమ్మగారు ప్రేమతో చెప్పిరి. తన యాగ్రహమింక పట్టజాలక "మీరు నన్ను మోసముచేయుచున్నారు. మీరు నాకిచ్చిన జపమాల నిదే, మరల తీసుకొనుడు. దీనిని నేనింక లక్ష్యముచేయను." అనిచెప్పి అతడా జపమాలను అమ్మగారిమీద విసరివేసెను. "మంచిది. ఎప్పటికిని శ్రీ రామకృష్ణుల బిడ్డడవై యుండుము!" అని అమ్మగారు చెప్పిరి. అతడు వెంటనే అచ్చటినుండి వెడలి పోయెను.

కొంతకాలమైన తరువాత ఈ భక్తుడు నిజముగా వెఱ్ఱివాడై రామకృష్ణ ధర్మసంస్థలోని స్వాముల(వారల)ను తిట్టుచు ఉత్తరములు వ్రాయ నారంభించెను. అతడీ విషయమున శ్రీ మాతృదేవినిగూడ విడువలేదు.

ఒకనాడీభక్తునిగురించి మాట్లాడుచు "అతడు మంత్రమునుగూడ తిరిగి ఇచ్చివేసెనా? అతడు తన జపమాలను పారవేసెనే. ఎవరైనను మంత్రమునుగూడ తిరిగి ఇచ్చివేయగలరా?" అని అమ్మగారి నడిగితిని.

అమ్మగారు: అట్టి దెన్నడైన సాధ్యమగునా? మంత్రములో జీవమున్నది. దానిని గైకొనువారెవరైనను తిరిగి యిచ్చివేయగలరా? ఒకసారి గురువుచే ఆకృష్టుడైనవాడు తన గురుని విడనాడ గలడా? ఇతడుకూడ బుద్ధితెచ్చుకొని తా నిపుడు దూషించుచున్నవారికి పాదాక్రాంతుడగు దినము తప్పకవచ్చును.

భక్తుడు: ఇట్టిసంఘటన యేల జరుగవలయును?

అమ్మగారు: ఇట్టి విషయములు జరుగుచుండుట యెల్లరకును విదితమే. ఒకగురువు పెక్కు శిష్యులకు మంత్రోపదేశము చేయవచ్చును. కాని వారందరి స్వభావము నొకేరీతిగ నెట్లుండగలదు. భక్తుని స్వభావమునుబట్టి యాతని యాధ్యాత్మిక జీవిత ప్రభావము వ్యక్తమగుచుండును. "అమ్మా, నన్ను పిచ్చివానిగా చేయుడు." అని యితడొకసారి నన్నడిగెను. "నాయనా! ఏల? నీవేల పిచ్చివాడవై యుండవలయును. ఎంతో పాపము చేసిననే తప్ప, ఎవరికైన ఉన్మాదావస్థ యెన్నటికైన కలుగునా?" అని నేను బదులుచెప్పితిని. అందుపై "నా తమ్ముడు శ్రీ గురుదేవుని చూచియున్నాడు. నాకుగూడ శ్రీవారి దర్శనమగునట్లు కటాక్షింపుడు." అని యతడడుగగా "ఆయనను స్థూలనేత్రములతో నెన్నడైన నెవరైన చూడగలరా? కండ్లుమూసికొని యెవరైన శ్రీ గురుదేవుని చూచిన చూడవచ్చును. నీ తమ్ముడు పసిబిడ్డడు. ఒకవేళ తనకండ్లను మూసికొని శ్రీ గురుదేవు నాతడు చూచియుండి, స్థూలనేత్రములతో శ్రీవారిని చూచితినని అతడు తలంచుచుండవచ్చును," అని హితవుచెప్పి, పారమార్థిక సాధనలను చేయుచు శ్రీ గురుదేవు నాతడు ప్రార్థించుచుండు నెడల తనకుగూడ శ్రీవారిదర్శనము కలుగునని హెచ్చరించితిని. ఆధ్యాత్మికముగా

తానెంత యభివృద్ధినిగాంచెనో, తనకేపాటి జ్ఞానమును, భగవత్స్మృతియు కలిగెనో యే మనుష్యునకైనను వానియంతరాత్మయే చెప్పును. ఇంతేకాక, స్థూలనేత్రములతో భగవంతుని చూడగలిగినవా రెవరున్నారు?

ఉద్బోధన పత్రికా కార్యాలయములోనివా రీ భక్తుని తీవ్రముగా మందలించిరి. అటుతరువాత నితడు గంగానదీతీరమున నివసించుచుండెడివాడు. ఒకొక్కప్పు డితడు ఉద్బోధనపత్రికా భవనము గుమ్మముపై కూర్చుండి, అక్కడనే భోజనము చేయుచుండును. కొంతకాలమైన తరువాత శ్రీ మాతృదేవి అనుమతితో నితని వారికడకు తోడ్కొనివచ్చిరి. అమ్మగా రితని నెన్నివిధములనో సమాధానపరుప ప్రయత్నించి, ఇట్లు చెప్పిరి: 'నా భక్తుల అవసానకాలమందు వారికి నే నండనై నిలువవలెను.' అని శ్రీ గురుదేవులు చెప్పుచుండువారు. ఇవి వాస్తవముగా శ్రీవారి నోటినుండి వెలువడినమాటలు. నీవు నా బిడ్డడవు. దేనిని జూచి నీవు భయపడవలయును? పిచ్చివానివలె నేల ప్రవర్తించెదవు? అట్టి ప్రవర్తన శ్రీ గురుదేవునకు అవమానకరము కాదా? శ్రీ రామకృష్ణుల భక్తుడు వెఱ్ఱివాడైనాడని లోకు లనెదరు. శ్రీ గురుదేవున కపకీర్తికరమగు విధమున నీవు ప్రవర్తింపవచ్చునా? ఇంటికిపోయి యితరులందరివలెనే జీవింపుము. వారివలెనే భోజనముచేయుచు జీవింపుము. నీ మరణకాలమున శ్రీ రామకృష్ణులు నీకు ప్రత్యక్షమై, నిన్ను తమ సన్నిధికి గొనిపోయెదరు. ఆయనను స్థూలనేత్రములతో నెవరైన నెన్నడైన చూచినారేమో నాకు చెప్పగలవా? నరేను (వివేకానందస్వామి) మాత్రమే శ్రీ గురుదేవునట్లు చూచెను. ఇది శ్రీవారి సందర్శనమునకై స్వాములవా రెంతో పరితపించుచుండినప్పుడు, అమెరికాలో జరిగెను. శ్రీ గురు

దేవుడు తనచేతిని పట్టుకొనినట్లు నరేనునకు తోచుచుండెడిది. ఈ దివ్యదర్శనముకూడ కొలదినాళ్లవరకు మాత్రమే కలిగెను. ఇక నీ వింటికిపోయి సుఖముగా నుండుము. లౌక్యుల జీవితమెంత దుఃఖభాజనము! మొన్ననే రామునికుమారుడు మరణించెను. అధమమట్టి విచార మేదియు లేక నీవు సుఖముగా నిద్రింపవచ్చునే!''

శ్రీ మాతృదేవి చెప్పిన ఈ హితోపదేశమును విని యా భక్తుడు చాల శాంతినొంది, ఉద్బోధనా భవనములో భోజనము చేసి, పిమ్మట తన స్వగ్రామమునకు తిరిగివచ్చి క్రమక్రమముగా తన యెప్పటి మనస్స్వాస్థ్యమును బడసెను.

*　　　*　　　*

జయరాంబటి 1911-వ సం॥ మే 26-వ తేది.

రామేశ్వర యాత్ర పూర్తిచేసికొని శ్రీ మాతృదేవి కలకత్తాకు తిరిగివచ్చి, కొలదినాళ్లైన తరువాత జయరాంబటికి వెళ్లినారు. తమ ప్రాత యింటిముంగిటి వసారాలో నొకనాటి సాయంకాలమున గూర్చునియుండి యొక సన్న్యాసభక్తునిగురించి, అమ్మగారు నన్నడిగిరి.

అమ్మగారు : అత డేమనెను.

శిష్యుడు : మూడు నాలుగు నెలలవరకు మీకొఱకు తలను బెంగపెట్టుకొనెను.

అమ్మగారు : ఎంత విపరీతము! మాయాబంధముల నన్నిటిని, సన్న్యాసి త్రెంచికొనవలయును. ఇనుపగొలుసువలె, బంగారు గొలుసుకూడ సంకెలయే. సన్న్యాసి యేవిధమైన మాయలోగాని చిక్కుకొనకూడదు. ''అయ్యో! అమ్మప్రేమ! అమ్మప్రేమ! దానిని కోల్పోయితిని.'' అని అతడెల్లప్పుడు

విలపింపనేల? ఏమి భావము లివి! పురుషులు నన్నెల్లెడల నాశ్రయించుచుండుట నా కిష్టములేదు. ఎంతటివాడైనను యితడు పురుష స్వరూపుడు. నేను భగవంతునిగూర్చి చెప్పుచుండుటలేదు. నేను ఆడువారితో మెలగవలసినదాననను. ఆఖుకూడ మంచిగంధ మరగదీయుట కనియో, మఱియే యితర వంకనో పెట్టుకొని చీటికిమాటికి నా దగ్గరకు వచ్చుచుండెడువాడు. ఒకనాడతనిని మందలించితిని.

శిష్యుడు: వేదాంతాదర్శముల నవలంబించు సన్న్యాసులు నిర్వాణమును బడయుదురా?

అమ్మగారు: తప్పక క్రమక్రమముగా మాయాబంధము లను త్రెంచివైచుకొని, నిర్వాణమును చూఱగొని వారు భగవం తునిలో నైక్యమగుదురు. ఈ శరీరమునకు ఆశలే కారణము. ఇందుకు సందేహమేమియులేదు. ఆశాలేశములేనిదే, శరీరము జీవించియుండజాలదు. ఆశలు పూర్తిగా నశించిన మానవునకు సర్వము సమాప్తము కానున్నదని అర్థము.

ఇచ్చటకు పిల్లలు (అనగా భక్తులు) వచ్చి భోజనముచేసి సంతోషపడి వెళ్లుచుందురు. వారియందు నాకు మమకారమేల యుండవలయును? "మీ రేల యెల్లప్పుడును నరేంద్రునికొఱ కును, ఇతర యువకులకొఱకును తహతహ లాడెదరు? యథేచ్ఛగా తినుచు, తిరుగుచు, ఆటలాడుకొనుచు వారెంతో సుఖముగా నున్నారు. మీ మనస్సును భగవంతునిపై నిలుపుట శ్రేయ స్కరము. వారియందు మీకేల యీ మమకారము?" అని యొకనాడు హజ్రా శ్రీ గురుదేవునితో జెప్పెను. ఈ మాటలువిని శ్రీ గురుదేవుడు తనమనస్సును నరేంద్రుడు మున్నగు బాలశిష్యుల

నుండి తీసివైచి పూర్తిగా భగవద్ధ్యాన నిమగ్నము గావించి, నిర్వికల్ప సమాధిలోనికి బోయెను. శ్రీవారి గడ్డమును, శిరోజములును కదంబ పుష్పమువలె నిక్కపొడుచుకొనెను. శ్రీ గురుదేవుడెటువంటి మానవుడో నీవే యూహించుకొనుము. ఆయన శరీరము కొయ్యబారెను. శ్రీవారికి పరిచర్య చేయుచుండిన రామలాల్ "దయచేసి మరల మీ సహజస్వరూపము దాల్చుడు." అని చాలసారులు చెప్పెను. చిట్టచివరకు శ్రీ గురుదేవుని మనస్సు శరీరస్మారకమును కలిగియుండు స్థితికి వచ్చెను. మానవకోటియందు తమకుగల దయావిశేషముచేతనే, శ్రీ రామకృష్ణులు తమ మనస్సును భౌతికప్రపంచముపై నిలిపియుంచిరి.

నిర్వాణమును, తదితర ముక్తి స్థితులనుసరించి

మరణకాలమున యోగిను (యోగానందస్వామి) నిర్వాణమును కోరెను. "యోగినూ! ఇటు చూడుము నిర్వాణమునకు ఒప్పుకొనకు; సూర్యచంద్రులే తన నేత్రములుగాగల విశ్వరూపునిగ శ్రీ గురుదేవుని భావింపకుము. శ్రీ గురుదేవుడు మనతో నెట్లు కలసిమెలసి యుండెడివాడో అట్లే ఆయనను ధ్యానింపుము. ఆ భావముతోనే ఆయనను సమీపింపుము" అని గిరీశబాబు అతనితో చెప్పెను. దేవతలును అమరులును, ఎంతటివారైనను యీ భూమిపై మరల జన్మించుచున్నారు; సూక్ష్మశరీరములతో వారాహారమును తినలేరు, మాటలాడులేరు. కనుక ఆ స్థితిలో వారు చాలకాలము జీవింపజాలరు.

శిష్యుడు: వారన్నము తినలేనియెడల మాటలాడ లేనియెడల వారు తమకాలమెట్లు గడిపెదరు?

అమ్మగారు: యుగములవరకు కొయ్యబొమ్మలవలె తామున్నచోటనే వారుందురు. రామేశ్వరమందలి రామలింగేశ్వర

స్వామి వారి దేవాలయములో నేనుచూచిన రాజవస్త్రాలంకృతులై నిలువబడియుండిన రాజులబొమ్మలవలెనే, వారుకూడ నుందురు! భగవంతునకు వారి అక్కర కలిగినప్పుడు, వారినాయన వారివారి స్థానములలోనుండి క్రిందకు తీసుకొనివచ్చును. యమలోకము, సత్యలోకము, ధృవలోకముమున్నగు వేత్వేఱు పరలోకములు కలవు. నరేంద్రుని (వివేకానందస్వామిని) సప్తర్షిమండలములో నుండి క్రిందికి భూలోకమునకు తాము తీసికొనివచ్చితిమని శ్రీ గురుదేవులు చెప్పిరి. నిజముగా వారిమాటలు వేదవాక్యములే. అవి యెన్నటికిని అసత్యములు కాజాలవు.

శిష్యుడు: అట్లైన మేముకూడ కొయ్యబొమ్మలవలెనో మట్టిబొమ్మలవలెనో జీవింపవలెనా?

అమ్మగారు: అక్కరలేదు. మీరు శ్రీ గురుదేవుని సేవ చేయవలయును. రెండు తరగతుల భక్తులున్నారు. ఈ భూలోకములోవలెనే, యొక తరగతివారు భగవంతుని సేవచేయుచుందురు. రెండవతరగతివారు యుగములకొలది ధ్యానని మగ్నులై యుందురు.

శిష్యుడు: నిర్వాణసిద్ధియైన తరువాతకూడ ఈశ్వరకోటులు మాత్రము సామాన్యభేద ప్రపంచజ్ఞాన స్థితికి రాగలరని, ఇతరులకది సాధ్యము కాదని శ్రీ గురుదేవులు చెప్పుచుండు వారు. దీని యర్థమేమి?

ఈశ్వరకోటులు నిర్వాణస్థితి నుండివెనుకకు రాగలరు.

అమ్మగారు: నిర్వాణసిద్ధియైన తర్వాతకూడ ఈశ్వరకోటి తన మనస్సును ఆ యనిర్వచనీయస్థితినుండి తిరిగి క్రిందకు తీసికొని వచ్చి సామాన్య ప్రపంచజ్ఞానావస్థకు మరలింపగలడు.

శిష్యుడు : భగవంతునిలో లీనమైన మనస్సును మరల మన ప్రపంచములోని కెట్లు తీసికొనిరాగలరు? ఒకపాత్రలోని నీటిని చెరువులోనికి పారపోసిన తరువాత, ఆ పాత్రలోని నీటిని ఆ చెరువునీటినుండి యెవరైన నెన్నటికైన విడదీయగలరా?

అమ్మగారు : ఇది అందరికిని సాధ్యముకాదు. పరమహంసలుమాత్రమే యిట్లు చేయగలరు. క్షీరనీరముల మిశ్రమమునుండి హంసక్షీరమును వేఱుపఱచి త్రాగగలరు.

శిష్యుడు : అందరును ఆశలను విడువగలరా?

అమ్మగారు : విడువగలిగినచో ఈ సృష్టియే అంతమొంది యుండును. ఆశలనందరును విడువలేరు కనుకనే, సృష్టిజరుగుచున్నది. ఆశలుకలవారు మరల, మరల జన్మమెత్తుచుందురు.

ఆశలును, ముక్తియు

శిష్యుడు: గంగానదీ జలములో నిలువబడియుండిన మనుష్యుడట్లే నిలువబడియుండి ప్రాణమును విడిచిపెట్టు ననుకొనుడు.

అమ్మగారు : జననమరణములనుండి ముక్తి, ఆశాలేశము కూడ లేనప్పుడుమాత్రమే, సుసాధ్యము. ఆశయిసుమంతైన నున్నచో, దేనివలనను లాభములేదు. ఎవరికైనను భూమిపై నేటిదే కడసారి పుట్టుకయైనను, అట్టి మానవవ్యక్తి ఆశలను విడనాడనియెడల, నేమిలాభము?

శిష్యుడు : అమ్మా! ఈ సృష్టి అనంతము? చాలదూరములోనున్న మండలములలో నేమి జరుగుచున్నదో యెవరు చెప్పగలరు? లెక్కలేని యా నక్షత్రములలోను, మండలముల లోను వేనియందైన ప్రాణముగల జీవులున్నవో లేవో యెవరు చెప్పగలరు?

అమ్మగారు: ఈ మాయాప్రపంచమున సర్వజ్ఞుడై యుండ గలవాడొక్క భగవంతుడే. బహుశః ఆ మండలములలోను నక్షత్రములలోను, జీవముగల జంతువేదియు లేదు.

ఈ సంవత్సరమందే వర్షకాలములో నొకనాడు శారదా నందస్వామియు యోగీనీమాయియు, గోలప్‌మాయియు మఱి కొందరు భక్తులును జయరాంబటినుండి కమార్పుకూరుకు వెళ్లిరి. యోగినీమాయి కాలుజారి రోడ్డుమీదపడి యామెశరీరమున కొన్నిచోట్ల చీరుకుపోయి రక్తము ప్రవహించెను. అందరికంటె ముందుగా జయరాంబటికి నేను తిరిగివచ్చి, శ్రీ మాతృదేవితో యోగినీమాయికి సంభవించిన ప్రమాదమునుగురించి చెప్పితిని. అందుపై అమ్మగారిట్లు తమ విచారమును వెలిబుచ్చిరి: "వారు బయలుదేరక ముందు 'యోగిని మనతో వచ్చుచున్నది. ఆమె రోడ్డుమీద నెన్నిసారులు జారిపడునో చూచెదముగాక' యని గోలప్ చెప్పెను. గోలప్‌మాటలను ఋజువుచేయుటకే యోగిని పడిపోయెను. నిజముగా ఆ మాట యొక సాధ్వి నోటి నుండి వెడలివచ్చినవి. ఆమె తపస్విని. కనుక ఆమెమాటలు జరిగి తీరును. ఇందుచేతనే, సాధువు లెన్నడు నెవరినిగురించియు నేమియు చెప్పకూడదు."

ఉద్బోధనా పత్రికాకార్యస్థానము, కలకత్తా 1912-వసం॥ జనవరి 16-వ తేది.

ఆధ్యాత్మికాభ్యుదయమును శీఘ్రముగ కలుగజేయుట.

నేటియుదయముననే అమ్మగారితోకూడ నామెగదిలో నుంటిని. "అమ్మా! ఒకనాడు శ్రీ చైతన్య మహాప్రభువు 'నీకు కృష్ణునియందు భక్తి కలుగుగాక!' అని నారాయణిని ఆశీర్వ దించిరి. ఈ మాటలందెంతటి మహిమయుండెనోకాని మూడు

నాలుగేండ్ల ప్రాయముగల ఆ బాలిక వానిని వినినతోడనే 'హా! కృష్ణా! ఓ కృష్ణా!' అని శ్రీ కృష్ణనామమును స్మరించుచు నేలపై బడి ప్రాణమొదలెను. నారదునిగురించి మేమొక కథను చదివియున్నాము. భగవత్సాక్షాత్కారము నొందినతరువాత నొకనాడా మహనీయు డొక చీమయెడల కనికరముపహించి తనలో తానిట్లను కొనియెను: 'ఎన్నియో మానవజన్మలెత్తి చేసిన తపఃఫలముగా నేను పరమార్థమును సాధించితిని. మానవజన్మ మెత్తుటకుకూడ పాపమీ చీమ అనంతకాలము వేచియుండవలెను గదా. ఇట్లు జాలిపడి 'నీకు ముక్తికలుగుగాక!' అని యా చీమ నాశీర్వదించెను. వెంటనే చీమ పక్షులు జంతువులు మున్నగు మానవేతర రూపములనుధరించి క్రమముగా నొక మనుష్య శరీరమును గైకొనెను. పిమ్మట మానవజన్మ లెన్నియో యెత్తి, సుఖదుఃఖము లనుభవించి క్రమక్రమముగా పారమార్థికసాధనలను శ్రద్ధతో జేసి, భగవంతు నారాధించి ముక్తిని బడసెను. బహుజన్మలలో జరిగిన యీ సంఘటల నన్నిటిని నారదుడు రెప్పపాటులో జూచెను. కనుక మహాత్ముల దయావిశేషమున మానవులకు వెంటనే ముక్తి లభింపవచ్చును.'' అని చెప్పితిని.

అమ్మగారు: అది నిజమే.

శిష్యుడు: దీనితోపాటు నేనింకొక విషయముకూడ విని యున్నాను. ఇతరులపాపముల ఫలమును తానే యనుభవింప సమ్మతించు మానవు డెక్కువకాలము జీవింపజాల డందురు. ఎందరికో ముక్తిని సమకూర్చి యుండగల శరీర మొక్కరెకొరకు కృశించిపోవును.

అమ్మగారు: అదికూడ నిజమే. ఇంతేకాదు. ఈ విధముగా

మహాత్ములును, పాపుల సముద్ధరణమును

మహాత్ములు తమశక్తిని గోప్యపుదురు. ఎందరో జీవులముక్తికి వినియోగపడి యుండగల ప్రచండ తపోమహిమ, యొకే యొక మానవవ్యక్తి శ్రేయమునకై వ్యయమగుచున్నది. "గిరీశుని పాపఫలము లెల్ల నేనే భరింప బూనుకొని యుండుటచేతనే, నాకీ శరీరబాధ లెల్ల కలుగుచున్నవి." అని శ్రీ గురుదేవులు సెల విచ్చుచుండువారు. ఇప్పుడు గిరీశుడుకూడ బాధపడుచున్నాడు.

శిష్యుడు: అమ్మా ఒకనాడు నాకొక కలవచ్చెను. చింపిరి జుట్టుగల మనుష్యుడొకడు మీ దగ్గరకువచ్చి మీ రతని కేదైన మేలు వెంటనే చేయవలయునని పట్టుపట్టుచుండెను. అతడింతకుమున్నే మీ యొద్ద మంత్రోపదేశమైనవాడే. కాని, తాను మాత్ర మే యాధ్యాత్మిక సాధనను కూడ చేయడట. 'నేనతని కేమైనను వుపకారము చేసినయెడల, నేను జీవింపను; నా శరీరము వెంటనే పడిపోవును.' అని మీరు చెప్పితిరట. నేనత్యంత మనః పూర్వకముగా నిమ్మా మనుష్యునిపట్ల నెంతమాత్రము దయ చూపవలదని ప్రార్థించుచు, "మీరేల యితనికి సాయము చేయ వలయును? ఇతడు తనముక్తిని తానే సంపాదించుకొనును. అతనినే సాధన చేయనిండు." అని విన్నవించితిని. అతడొకే పట్టు పట్టినందున, మీ రాతని నేవగించుకొనుచు, "నే నితని కేమైన సాయము చేసినచో నేనిక జీవింపజాలను; నా శరీరము వెంటనే పడిపోవును." అని పలుసారులు చెప్పుచు నాతనిరొమ్మును మెడను చేతితోదాకి మీ రాతని కేదోసాయముచేసితిరి. అంత నాకల అంతరించెను. భౌతికశరీరము దాల్చినచో నెవరైన తమ మహిమను కొంత గోప్యపుదురందురు. ఇది నిజమా?

అమ్మగారు : ఔను. నిజమే. కొంతమంది యెడతెంపు లేకుండ కోరినమీదట విసుగుపుట్టి, "ఈ శరీర మేనాఁడో యొక నాఁడు మరణించును. ఈతనికి ముక్తి నొసగెదను. ఈ క్షణమే యీ శరీరము పడిపోయిన పడనిమ్ము." అని పలుసారులు తలంతును.

భగవత్సాక్షాత్కారము అను మాటకు అర్థము

శిష్యుఁడు : అమ్మా! భగవత్సాక్షాత్కారమనగా జ్ఞాన, చైతన్యముల సిద్ధి యని అర్థమా? లేక మఱియొకటేదైనను అని అర్థమా?

అమ్మగారు : ఈ పైన చెప్పినవి సిద్ధించుటకాక ఆ మాటకు వేఱే అర్థమేమున్నది? భగవత్సాక్షాత్కారము కలిగిన మనుష్యునకు రెండుకొమ్ములు మొలచునని యెవరైన చెప్పుదురా?

శిష్యుఁడు : మీ భక్తకోటిలో చాలమంది భగవత్సాక్షాత్కారమునకు వేఱే విధముగా వ్యాఖ్యానము చేసెదరు. మానవుఁడు స్థూలనేత్రములతో భగవంతునిచూచి ఆయనతో సంభాషించునని వారి నమ్మకము.

అమ్మగారు : ఔను; "దయయుంచి నాయనను మాకు కనబఱచుఁడు." అని వారడుగుచుందురు. కాని, శ్రీ రామకృష్ణు లెవరి తండ్రియునుగారు. గురువు, కర్త, తండ్రి—ఈ మూఁడు మాటలే యాయనను, శూలములవలె గ్రుచ్చుకొని బాధించెడివి. ఋషు లెంతమంది యుగములకొలది తపస్సుచేసిరి! అయినను వారు భగవత్సాక్షాత్కారము బడయజాలక పోయిరి. ఇప్పు డన్ననో జనులెట్టి సాధనలను చేయరు, నియమములేవియు పాటింపరు. కాని, వారికి వెంటనే భగవంతుని కనుబఱచవలెనట! ఆ

పని నే చేయజాలను. శ్రీ రామకృష్ణు లెవరికైనను భగవంతుని గనుబఱచిరేమో నీవు నాకు చెప్పగలవా?

శిష్యుడు: అమ్మా! సరేకాని, ఎంత ప్రయత్నించినను కొంతమందికి సిద్ధికలుగదని, ప్రయత్నింపకపోయినను కొంతమందికి పరమార్థము లభించునని చెప్పెదరు. దీని అర్థమేమి?

అమ్మగారు: భగవంతునిది శిశుస్వభావము. కొంతమంది అడిగినను వారికీయడు. మరికొందరడుగక పోయినను తీసుకొనుడని వారి కిచ్చును. ఇట్లిచ్చినవారు బహుశః వారివారి పూర్వ జన్మలలో పుణ్యకార్యము లెన్నియో చేసియుందురు. అందుచేత భగవదనుగ్రహమునకు వారు పాత్రులైరి.

భగవంతుడు శిశు స్వభావుడు

శిష్యుడు: అప్పుడు భగవత్కటాక్ష విషయమునగూడ యోగ్యాయోగ్యత విచక్షణ యున్నదన్నమాట.

అమ్మగారు: ఔను. అది నిజము. సర్వము మానవుల పురాకృత కర్మపై నాధారపడియున్నది. కర్మ అంతమొందిన వారికి భగవత్సాక్షాత్కారము కలుగును. అదియే వారి కడపటి జన్మము

శిష్యుడు: పారమార్థికజ్ఞానము, అఖండ చైతన్యానుభూతి కలుగుటకు కర్మక్షయమును, ధార్మికసాధనలును, ప్రాప్తకాలమును ముఖ్యకారణములని ఒప్పుకొందును. కాని భగవంతుడు మన 'సొంతము' అయినయెడల సంకల్పమాత్రమున తన భక్తున కాయన ప్రత్యక్షము కాజాలడా?

. అమ్మగారు: నిజమే. కాని, భగవంతుడు తన 'సొంతము' అను నమ్మక మెవరికున్నది? జనులు తమ విధాయక ధర్మమని

భావించి యేదో యొకసాధనను చేయుచురే కాని, భగవంతుని కొఱకెందరు ప్రయత్నింతురు?

శిష్యుడు: తన సొంతతల్లి పోషణ ప్రేమలకు దూరము చేయబడిన శిశువు తన సొంతతల్లినే గుర్తింపడని నేను మీ కొకసారి చెప్పితిని.

అమ్మగారు: ఔను, నీవు నిజము చెప్పితివి. ఒక మనుష్యుడింకొకని చూడనిదే యెట్లు ప్రేమింపగలడు? నన్ను నీవు చూచుచున్నావు; ఇదివరకు చూచియున్నావు. నేను నీ తల్లిని, నీవు నా బిడ్డవు.

1912 సం॥ ఫిబ్రవరి 1-వ తేదీ.

నేను శ్రీమాతృదేవి దగ్గరకు నేను వెళ్లునప్పటికి రాత్రి సుమారు తొమ్మిదిన్నర గంటలైనది. పగటివేళ నేనామెను చూడనేలేదు.

అమ్మగారు: పగలంతయు నీ వెక్కడనుంటివి?

శిష్యుడు: క్రిందను లెక్కల పుస్తకములను చూచుచున్నాను.

శ్రీ గురుదేవుల మహోజ్జ్వల త్యాగము

అమ్మగారు: ఔను. ప్రకాశ్ కూడ నాతో అట్లే చెప్పినాడు. సంసారమును త్యజించిన వారికెవరికైన నిట్టివిషయములు రుచించునా? ఒకసారి శ్రీగురుదేవుని జీతము విషయమై లెక్కలలో పొరపాటువచ్చెను. దేవాలయ కార్యనిర్వాహకుని కడకు వెళ్లి ఆ విషయమై మాటలాడుమని శ్రీవారిని గోరితిని. "ఎంత సిగ్గుచేటు! లెక్కల విషయమై చింతింతునా?" అని ఆయన చెప్పిరి. "భగవన్నామమును స్మరించువారెన్నడును

బాధపడరు. నీ విషయమై వేఱుగ చెప్పనేల!'' అని వా రొకసారి నాతో చెప్పిరి. త్యాగమే వారి భూషణము.

1912-వ సం. ఫిబ్రవరి 9-వ తేది.

శరీరస్మృతిపోయిన తరువాత మరణించువారి ఆధ్యాత్మికస్థితి.

నిన్నరాత్రి గిరీశ చంద్రఘోషు స్వర్గస్థుడయ్యెను. అతనిని గురించి, ''అమ్మా! శరీర స్మారకము లేని స్థితిలో మరణించువారికి తరువాత నున్నతతరమైన ఆధ్యాత్మికపదము కలుగునా?'' అని శ్రీమాతృదేవి నడిగితిని.

అమ్మగారు: శరీరస్మారకము పోవుటకుమున్ను మనస్సున గల ప్రధానభావమునుబట్టి జీవుని మరణానంతరస్థితి యేర్పడును.

శిష్యుడు: ఔను. అది నిజము. సాయంకాల మూడుగంటలైనతరువాత ''జయ్ రామకృష్ణా!'' యని యుత్కంఠగా బలికి గిరీశుడు శరీరస్మృతిని గోల్పోయెను. అటుతరువాత నాతనికి మరల శరీర స్మృతి కలుగనే లేదు. శరీరస్మృతి పోవుటకు కొలది నిముషములముందు ''మనము పోవుదము, మనము పోవుదము! నాయనా! నన్ను కొంచెము పట్టుకొనుము,'' అని యీ తీరున నతడెల్లప్పుడును చెప్పుచుండెను. ''మాటిమాటికి 'మనము పోవుదము, మనము పోవుదము, పద!' * అనియే యేల చెప్పుచుందువు. శ్రీరామకృష్ణుల దివ్యనామస్మరణ చేయుము. అదియే నీకు నిజముగా మేలుచేయును,'' అని నే నాతనితో చెప్పితిని. ఈ

* మరణ సమయమున తన్నెవరైన గంగానదీ తీరమునకు గొనిపోవలయునని గిరీశబాబునకు తీవ్రవాంఛయుండెను. ఇందుచేతనే ఆతడీమాటలనుచుండెను. ''తన ఆత్మశ్రేయస్సునకు నా సోదరునకు గంగానది అవసరమా?'' అని యాతని సోదరు డడిగెను.

విధముగా నేను రెండుసారులు చెప్పినపిమ్మట "అది నాకు తెలియదా?" అని గిరీశబాబు ప్రత్యుత్తరమిచ్చెను. "మంచిది. లోలోన నితనికి తెలివిపూర్తిగానున్నది." అని తలంచితిని.

అమ్మగారు : శరీరస్మారకముపోవుటకు మున్ను తన మనస్సున ప్రబలియుండిన భావమందే యాతడు పూర్తిగా నిమగ్నుడై యుండెను. వారందరు (శ్రీ రామకృష్ణుని శిష్యులందరు) శ్రీ గురుదేవుని యందుండియే వచ్చిరి, తిరిగి వారికడకే వెళ్లెదరు. వారాయన శరీరభాగములని, కరచరణాద్యవయవములని చెప్పనగును.

1912-వ సం. ఫిబ్రవరి 21-వ తేది.

ఉదయ మేడుగంటలయ్యెను. శ్రీ మాతృదేవి తమ మంచముదగ్గర నేలపై గూర్చుండిరి. ద్వారకకు తీర్థయాత్ర వెళ్లిన నిర్భయానందస్వాములవారు గిర్నార్ పర్వతములలోని దత్తాత్రేయ దేవాలయమునుండి అమ్మగారికి ప్రసాదము పంపిరి. "దత్తాత్రేయుడన నెవరు?" అని అమ్మగారడిగిరి.

శిష్యుడు : జడభరతుడు మొదలగు వారివలె ఆయన కూడ మహాముని, ఈశ్వరకోటి.

అమ్మగారు : శ్రీ గురుదేవుని పిల్లలలో కొందరివలెనా?

శిష్యుడు : మంచిది. శ్రీ గురుదేవుని శిష్యులలోని యీశ్వరకోటులు కొందరు భార్యాపుత్త్రాదులతో సంసార నిమగ్నులై యున్నారే! ఇది యెట్లు సంభవించెను?

అమ్మగారు : ఔను. వారచ్చట క్షమించుచున్నారు. "నీ వాతని (శ్రీ రామకృష్ణుని) కడకు వెళ్లెదవేని, మే మాతడు

కలకత్తాకు వచ్చునప్పు డాతని బండిపై రాళ్లువిసరి దానిని ముక్కలు ముక్కలుగా చేసెదము.'' అని భయపెట్టి, పూర్ణునకు వాని బంధువులు బలవంతముగా పెండ్లిచేసిరి.

శిష్యుడు: సరే, వారు పెండ్లిచేసుకొని యుండవచ్చును. నాగమహాశయునకు మాత్రము కాలేదా? కాని పిల్లలనుకని, సంసారము చేయుటయా!

అమ్మగారు: బహుశః వారికట్టి కోరికలుండి యుండును. అయినను ఒకసంగతిని నేను నీకు చెప్పవలసియున్నది. ఈలోకము మహాక్లిష్టము, బహుదురవగాహము. శ్రీగురుదేవుడొకరి ద్వారమున నొక పనిచేయును, మరియొకరి ద్వారమున మరియొక పనిచేయును.

ఓహో! భగవంతుని లీలలెంత దుర్గ్రాహ్యములు! అయిన నేమి? గృహస్థుడైనను యీశ్వరకోటియై యుండగలడు. ప్రమాద మేమున్నది ?

రాధుకు అనారోగ్యముగానుండెను. ఆమెకు నొప్పియు, జ్వరమును. ఆమె విషయమై అమ్మగారికి ఆందోళనగానుండి ''నేను బ్రతికి యున్నంతవరకు దానికి ఆరోగ్యముకలుగదు. నేను పోయినతరువాత దాని క్షేమమును చూచువారెవరు? అప్పుడది బ్రతుకునా ?'' అని ఆమె చెప్పిరి.

శిష్యుడు: నేడంతయు భక్తులు తండోపతండములుగా నెట్లు వచ్చుచుండిరి! మీకొకక్షణమైనను విశ్రాంతిలేకుండెను.

అమ్మగారు: ''దయయుంచి యీ జనసమ్మర్ధమును తగ్గించి నాకు కొంచెము విశ్రాంతికలుగనిండు.'' అని నేనహోరాత్రములు శ్రీగురుదేవులను ప్రార్థించుచున్నాను. కాని అది నాకు

నొరుకుటలేదు. శ్రీగురుదేవుని సందేశమెల్లెడల వ్యాప్తినొందెను. అందుచేతనే యింతమంది జను లిచ్చటికి వచ్చుచున్నారు.... శ్రీ గురుదేవుని జీవితావసానదినములలోకూడ జనులిట్లె ఆయనకడకు వచ్చుచుండిరి. నాకడకువచ్చువారితో "మీ కులగురువు నొద్ద మంత్రోపదేశము నొందుడు. మీ యొద్దనుండి వారేదైన నపేక్షింతురు. నేనేమియు కోరను." అని మనఃపూర్వకముగా చెప్పి వారిని పంపివేయ ప్రయత్నింతును, కాని వారు నన్ను విడువక నేడ్చుచుందురు. దానితో నా హృదయము కరిగిపోవును. మంచిది. నా జీవితాంతముకూడ సమీపించుచున్నది. నేనిక బ్రతుకబోవు కొలదిదినము లీతీరుననే కడచిపోవును.

శిష్యుడు: అయ్యో! వలదు. అమ్మా! మీరట్లేల చెప్పెదరు. మీరిప్పు డారోగ్యముగనే యున్నారు. మీకేదియు విశేషమైన బాధలేదు. అట్టిచో మీరీ ప్రపంచమును విడిచి వెడలి పోగోర నేల? అమ్మా! మీరట్లెన్నటికిని మరల చెప్పవలదు.

ఆ కాలమున అమ్మగారు బహువిచారముగను, లౌకిక విషయములపట్ల నిర్లక్ష్యముగను గనుపడుచుండిరి.

మధ్యాహ్నమున నొక ముక్కోపి శ్రీమాతృదేవికడకు వచ్చి గందరగోళము చేసెను. ఈ విషయమై అమ్మగారిట్లు చెప్పిరి. శ్రీ గురుదేవులు నేనున్నట్లే యెవరికిని తెలియనీయలేదు. అత్యంతశ్రద్ధతో శ్రీవారు నన్నెల్లప్పుడు కాపాడిరి. నేడన్ననో దీనికి వ్యతిరేకమే పూర్తిగా జరుగుచున్నది. బజారులో డప్పువేసి చాటించినట్లు, నన్ను వీరు ప్రకటించుచున్నారు. దీనికంతకును కారణభూతుడు మ—. కథామృతముచదివి, జనులు మైమరచుచున్నారు. గిరీశబాబు శ్రీ గురుదేవుని బలాత్కరించి, తన యీప్సి

తములను బడసి ఆయనను చూపించెను. నేడు జనులు నా విషయ మున గూడ నిట్లే ప్రవర్తించుచున్నారు. ''మంత్రోపదేశమునకై వీరెల్లప్పుడును నన్నేల వేధింపవలయును? బేలూరుమఠములో నా పిల్లలు (శ్రీ గురుదేవుని శిష్యులు) కలరే. వారికేమియు శక్తి లేదా? ఇక్కడకే జనులందరిని పంపుచున్నారు. తమ కులగురువును విడనాడిన యెడల వారికెంతో పాపము వచ్చుననికూడ చివరకు నేను జనులతో చెప్పితిని. కాని, అప్పటికిని వారు నన్ను విడువ కున్నారు.''

శిష్యుడు: భక్తులకు మంత్రోపదేశము చేయవలెనను కోరిక మీకున్నది కనుకనే, మీరు వారికి మంత్రోపదేశము చేయు చున్నారు.

నిజమైనగురువు, దయ వలననే మంత్రోపదేశము చేయును.

అమ్మగారు: లేదు. జాలిచే నే నీ పనిచేయుచున్నాను వారు నన్ను విడువరు. ఏడ్చెదరు. వారిని చూచి జాలిపడుదును. దయ తలచి, వారికి మంత్రోపదేశము చేయుదును. ఇంతేకాక, దీనివలన నాకేమి లాభము కలుగుచున్నది? భక్తులకు నేను మంత్రోపదేశము చేయునప్పుడు వారి పాపముల నేను భరింతును. అట్టి సమయమున ''ఈ శరీరమెట్లై నను పోవలసినదే; వారు సత్యమును గ్రహింతురుగాక!'' అని తలచుచుందును.

1912-వ సం॥ మే 2-వ తేది.

శిష్యుడు: ముఖాముఖముగా భగవంతుని చూడనిదే మన కేమి లాభము కలుగగలదు? ''ఎవడైనను చేపలనుపట్టుకొను నాశతో నొక చెరువుగట్టుననో, నదియొడ్డుననో కూర్చుండునుగాని,

మురికిగుంటదగ్గర కూర్చుండడు. నీవే ప్రయోజనమునకై సన్న్యాసి వైతివో ఆ ప్రయోజనము చూచాయగానైన నీకు కనుపడెనా?'' అని యొకసారి నేనొక ఫకీరును ప్రసంగవశమున నడిగితిని.

అమ్మగారు: వాడేమి చెప్పెను?

శిష్యుడు: వాడేమి చెప్పజాలును?

అమ్మగారు: (ఇంచుక ఆలోచనా నిమగ్నులై) నీవు సరియైన మాటచెప్పితివి. ఏదోవిధమైన దివ్యానుభవము మానవునకు కలుగనిచో, వాని కెన్నియున్నను, లాభమేమి? అయినను పారమార్థిక విషయములలో నతడు విశ్వాసము కలిగియుండవలెను.

శిష్యుడు: ''ప్రక్కగదిలో బంగారు కాసులరాసి యున్నదని, దాని నొకదొంగ యీవలిగదిలో నుండి చూచుచున్నాడని భావింపుడు. ఈ రెండు గదులకు నడుమనున్నగోడయే యీ బంగారమంతయు వాని స్వాధీనముకాకుండ నాటంక పెట్టుచున్నది. ఇట్టి స్థితిలో వానికెన్నటికైన నిద్రపట్టునా? ఆ కాసులరాసినితాను చేజిక్కించుకొనుటెట్లనియే వాడెల్లప్పుడును తలంచుచుండును.

భగవంతునికొఱకు తీవ్రవాంచ

ఇదే విధమున దైవమను వస్తువొకటి యున్నదను దృఢ విశ్వాసము మానవునకున్నచో, అతడెన్నడైన సంసారములోనుండ గలడా?'' అని స్వామిజీ (వివేకానందస్వాములవారు) కూడ సెలవిచ్చెనని శరత్ మహారాజు మొన్న చెప్పెను.

అమ్మగారు: అందెంతయు నిజము.

శిష్యుడు: అమ్మా! మీరేమి చెప్పినను, త్యాగమును,

విరక్తియు ముఖ్యముగా నుండవలయును. అవి యెన్నడైన మాకు కలుగునా?

అమ్మగారు: తప్పక కలుగును. శ్రీగురుదేవుని శరణు జొచ్చినచో, మీకు సర్వమును లభించును. త్యాగమే ఆయనవైభవము. ఆయనసర్వమును త్యజించినందుననే మనమాయన పేరును స్మరించుచు తిని, సౌఖ్యమననుభవించుచున్నాము. శ్రీగురుదేవు డఖండత్యాగ మహోజ్వల స్వరూపుడగుటచే శ్రీవారి భక్తులుకూడ చాల గొప్పవారని జనులు తలంచుచుందురు.

శ్రీరామకృష్ణుల త్యాగప్రశంస

ఏమి చెప్పుదును! ఒకనాడు శ్రీవారు నౌబత్తునందలి నా గదిలోనికి వచ్చిరి. వారి చిక్కములో లవంగములు మున్నగు సుగంధ ద్రవ్యములేవియు లేవు. అప్పుడప్పుడు వారు వానిని నమలుచుందురు. అక్కడనే తినుటకు కొన్నిటిని వారికిచ్చి, మరి కొన్నిటి నొక కాకితములో కట్టి ఆ పొట్లమును తమ గదిలోనికి తీసికొని వెళ్లుడని వారిని కోరితిని. వారును తమ గదివైపునకే పోవుచుండిరి. కాని అచ్చటకు వెళ్లుటకుమారుగా, శ్రీవారు సరిగా గంగానది యొడ్డునకుపోయి నిలిచిరి. వారికి దారి కనుపడ లేదు. అది వారు గమనించనేలేదు. ''అమ్మా! నే నిందులో పడి మునిగిపోనా!'' అని మరలమరల చెప్పుచుండిరి. అపరిమిత వేదనతో నా మనస్సు కొట్టుకొనుచుండెను. అప్పుడు నది బాగుగా నిండియుండెను. నేనును చిన్నదాననగుటచే గదిలోనుండి బయటకు పోలేదు. ఆ సమీపమున నా కెవరును కనుపడలేదు. శ్రీవారికడకు నే నెవరిని పంపగలుగుదును! చివరకు కాళీ దేవాలయములో నుండి యొక బ్రాహ్మణుడు నా గదివైపునకు

వచ్చుచుండగా చూచి, హృదయుని తోడ్కొనిరమ్మని అతనిని బంపితిని. అప్పుడు భోజనము చేయుచుండిన హృదయుడు తన విస్తరిని విడిచిపెట్టి శ్రీ గురుదేవునికడకు బరుగిడివెళ్లి, ఆయనను పట్టుకొని మరల వారి గదిలోనికి తీసుకొనివచ్చెను. ఇంకొక క్షణ మాలస్యమై యుండినచో ఆయన గంగానదిలో పడిపోయియే యుందురు.''

శిష్యుడు: ఆయన నదికి దక్షిణముగా నెందుకు వెళ్లిరి?

అమ్మగారు: కొలదిగా సుగంధ ద్రవ్యములను శ్రీవారి చేతిలో నే నుంచినందున, వారు దారిని కనుగొనలేకపోయిరి. సాధువు లెన్నడును వస్తువులను నిలువచేసుకొనగూడదు. శ్రీవారి త్యాగము పరిపూర్ణమైనది.

ఒక వైష్ణవసాధు వొకసారి పంచవటికి వచ్చెను. అతడు మొట్టమొదట మహాత్యాగివలె నటించెనుగాని, చివరకు కుండలు, గిన్నెలు, చెంబులు, కాయ ధాన్యములు, బియ్యము మొదలైన వివిధ వస్తువులను తీసుకొని నిలువచేయ నారంభించెను. శ్రీ గురుదేవు లిది కనిపెట్టి, 'పాపమిత డీసారి నాశనము కానున్నాడు!' అని యొకనాడు చెప్పిరి. అతడు మాయాపాశములో చిక్కుకొని యుండెను. శ్రీ గురుదేవులు త్యాగమును గురించి వానిని తీవ్రముగా హెచ్చరించి, చివరకు మఱియొకచోటునకు పొమ్మనిరి. పిమ్మట వా డాస్థలమును విడిచి వెళ్లిపోయెను.

అమ్మగారికి సాష్టాంగ దండ ప్రణామము చేయుట కొక భక్తుడు వచ్చెను. అతడు సెలవుతీసికొని యింటికి వెళ్లనుండినప్పుడు ''హరీశునిపట్ల నా వాత్సల్యమును వెల్లడించి నేనొకసారి మోస పోతిని కనుక, నే నిప్పుడెవరికిని నా భావములను గనుబరచను.'' అని అమ్మగారు చెప్పిరి.

1912-వ సం॥ మే.

శ్రీ మాతృదేవికి ఉత్తరములను చదివి వినిపించుటకై నేను మేడమీదకు వెళ్లితిని.

శిష్యుడు : ఒక భక్తునికుమార్తె తన మామగారి యూరిలో నుండి నన్నిక్కడకు వచ్చి చూచుటకు తాను కుతూహలపడు చుంటినని వ్రాసి, తన ప్రణామములను మీకు నేను తెలుపవలెనని కోరెను. ఇంతేకాక, తాను మీ కుత్తరము వ్రాసినట్లు తన భర్త బంధువులకు తెలియకుండునట్లు జాగరూకులై వర్తింపవలెనని కూడ మిమ్ము కోరుచున్నది.

అమ్మగారు : అట్లైనచో నీ వామెకు ప్రత్యుత్తరమేదియు వ్రాయవలదు. దానిని తన బంధువులకు తెలియకుండ దాచి యుంచుమని నన్నామె మరల కోరును. జయరాంబటిలో జోగీంద్రుడను తపాలాబంట్రౌతు నాకొరకు త్తరములు వ్రాయు చుండువాడు. "తపాలాబంట్రౌతు మా యుత్తరములను చూచు చున్నాడా?" అని చాలమంది తమ యసంతృప్తిని వెల్లడించిరి. అట్టిమనుష్యునిచే నేను వారి కుత్తరములను వ్రాయించుట వారి కిష్టములేదు. ఎందుచేత? నాకు కపటములేదు. ఇష్టమున్నచో నా యుత్తరము లెవరైనను చూడవచ్చును.

మరియొక భక్తుడు, శ్రీ మాతృదేవి జయరాంబటికి యెప్పుడు తిరిగి వచ్చెదరని యడిగెను. "ఫాల్గుణ మాసములో జగద్ధాత్రీ పూజాసమయమునకు అచ్చటికి మీరు తిరిగి వచ్చెదరని యీ భక్తునకు మీ సెలవైనచో, ప్రత్యుత్తరము వ్రాసెదను." అని అమ్మగారితో చెప్పితిని.

అమ్మగారు : ఓహో! వలదు, వలదు! మన మా విష

యమైన నిశ్చయముతో నెట్లుండగలము? నే నిక్కడ నుండునది, కేవలము దైవసంకల్పముపై ఆధారపడియుండును. నే నున్నవాడు లేకపుండడుగదా!

శిష్యుడు : అమ్మా! మీరట్లేల మాటలాడవలయును? మీరు బ్రతికియుండుటచేతనే, ఇంతమంది జనులు మిమ్ము సందర్శించి, మనశ్శాంతిని బడయగలుగుచున్నారు.

అమ్మగారు : ఔను. అదినిజమే.

శిష్యుడు : దయయుంచి నాకోఱకు సజీవులై యుండుడు.

బహు ప్రేమపూరితమైన కంఠస్వరముతో , "అయ్యో! నేనసిన వీరికెంత యభిమానము! వీరియందు నాకుగూడ అంత అభిమానము." అని కన్నుల నీరు నించుచు అమ్మగారు సెలవిచ్చిరి. శిష్యుడామెకు వీవనతో విసరుచుండెను. "నాయనా! నీవు చిరంజీవివై భక్తికలిగి శాంతిని చూఱగొనెదవుగాక" యని హృదయపూర్వకముగా నిన్నాశీర్వదించుచున్నాను. శాంతియే ముఖ్యమైన ప్రాప్యము. ఎవరికైనను కావలసినది శాంతియొక్కటియే." అని అపరిమిత దయార్ద్రస్వరముతో అమ్మగారాతనితో జెప్పిరి.

శిష్యుడు : అమ్మా, ఒకయూహ యెల్లప్పుడు నామనస్సును కలవరపఱచుచుండును. అది యేమందురా? శ్రీ గురుదేవుని దర్శనము నాకేల దొరుకుటలేదు? ఆయన మా 'సొంతము.' అయినను మాకేల ప్రత్యక్షముకారు? తమ సంకల్పమాత్రమున శ్రీవారు ప్రత్యక్షము కాజాలరా?

అమ్మగారు : అది నిజము. నీ విన్నికష్టములను క్లేశములను అనుభవించుచుండగా శ్రీవారేల ప్రత్యక్షమగుటలేదో

యెవరు చెప్పగలరు? ఒకసారి బలరాముని భార్యకు జబ్బుగా నుండెను. "నీవు కలకత్తాకు వెళ్లి యామెను చూడవలయును." అని శ్రీ గురుదేవులు నా కానతిచ్చిరి. "నే నెట్లుపోగలను? ఇక్కడ బండియేదియు కనుపడుటలేదే," అని నేను బదులు చెప్పితిని. అందుపైని "ఏమి! బలరామునిభార్య యెంతో బాధ పడుచుండగా నీవు వెళ్లుటకు సందేహించుచున్నావా! నీవు కలకత్తాకు నడిచివెళ్లుము." అని యుద్రేకముతో శ్రీ గురుదేవులు చెప్పిరి. చివరకొక పల్లకిని తీసుకొనివచ్చిరి. నేను దక్షిణేశ్వరము నుండి బయలుదేరితిని. ఆమె అనారోగ్యముగా నుండినప్పుడు నే నామెను రెండుసారులు వెళ్లిచూచితిని. మఱియొకసమయమున శ్యామ్‌పుకూర్ నుండి రాత్రి నడిచియే వెళ్లితిని. ఆపత్సమయమున భగవంతుని రక్షణయే లేకున్న, నిజముగా మానవుని గతి యేమగును?

శిష్యుడు: శరీర మున్నంతకాలము మానవులకు విచారములును, కష్టములును తప్పవు. ఈ కష్టములను తొలగింపుమని నేను శ్రీ గురుదేవు నడుగుటలేదు. కాని, మేము విచారములలోను, కష్టములలో నున్నప్పుడు మా కాయన ప్రత్యక్షమై ధైర్యమును కలుగచేయలేరా?

పరమార్థానుభూతి దైవసంకల్పముపైని ఆధారపడును

అమ్మగారు: నాయనా! నీవు చెప్పినది సమంజసమే. బలరాముని మనుమడు కొలదినాళ్ల క్రిందట చనిపోయెను. ఆ బాలుని తల్లియు, నాయనమ్మయు మనశ్శాంతికొఱకు నా కడకు వచ్చిరి. వారి విచారముకూడ కొంతవరకుపశమిల్లినది. ఇట్టి విషయములనుగురించి నేను శ్రీగురుదేవునితో

మాటలాడుచుండెడు దానను. అట్టి సమయములందాయన "అట్టి వారు నాకు లక్షోపలక్షలున్నారు. నా-గొత్రైను త్రోకమొద్దనో వీపునవ్రోసి దానిని చంపెదను. ఇది కేవలము నా యిష్టమును బట్టి జరుగుచున్నది." అని చెప్పుచుండును.

శిష్యుడు : ఆయన మా బాధను చూచుట లేదా ?

అమ్మగారు : కాని, ఆయనకు నీవంటి వారెందరో యున్నారు. "అఖండ సచ్చిదానంద సాగరము! ఎన్ని తరంగము లందుండి పైకిలేచి, మరల మాయమగుచున్నవి! దీని కంతము లేదు, పరిమితిలేదు." అని శ్రీ గురుదేవులు నుడివెడువారు.

శిష్యుడు : అధ్యాత్మిక జ్ఞానోదయ మెంతమాత్రము కలుగని సామాన్య మనుష్యుడెంతో సుఖముగా నున్నాడు; కాని అసంపూర్ణమగు జ్ఞానోదయముకలిగి భగవత్సాక్షాత్కారమును బడయగోరువారికి వారికోరిక నెరవేరనిచో, అపరిమితమగు బాధకలుగును. వారెంత బాధపడుదురో వారికే తెలియును.

అమ్మగారు : నీవు చెప్పిన దెంతనిజము! సామాన్యజను లెంతో సుఖముగా నున్నారు. వారు భోజనాది వ్యాపారములను చేయుచు, సంతోషముగా కాలము గడుపుచున్నారు. భక్తులు పడు బాధకు మాత్రమే అంతులేకున్నది.

శిష్యుడు : భక్తులు బాధపడుచుండుట చూచి మీరు బాధ పడరా ?

అమ్మగారు : నే నెందుకు బాధపడవలయును? ఈవరకు ప్రపంచకర్త సాక్షిభూతుడే కదా!

శిష్యుడు : భక్తరక్షణముకొఱకు మానవరూపమున మీరీ భూలోకమునకు తిరిగి రా గోరరా ?

అమ్మగారు : ఓహో! మానవ శరీరమున ఎంత దారుణ బాధ! ఇంకవలదు! ఇంకవలదు! నేనీ భూలోకమున మరల జన్మింపకుందును గాక!

శ్రీగురుదేవుని శరీరబాధ: దానిఅర్థము

తాము జబ్బుగా నుండినప్పుడు శ్రీ గురుదేవులకు ఆమలక ఫలమును తినవలెనను కోరిక గలిగెను. దుర్గాచరణుడీ కోరికనువిని మూడునాళ్లు నిద్రాహారములు లేకుండ వెదకి వెదకి కొన్ని యుసిరిగపండ్లను తెచ్చెను. శ్రీ గురుదేవులాతని భోజనము చేయుమనియడిగి, ఆయాహారమును ప్రసాదముగ జేయుటకు తాముగూడ కొంచె మన్నము తినిరి. అందుపైని ''మీ రన్నమును బాగుగా తినుచున్నారే. ఇక మీరు జావ నెందుకు త్రాగవలయును. మీరు జావనుమాని అన్నమే తినవలయును.'' అని నేనంటిని. ''వలదు, వలదు. ఈ నాజీవితావసాన దినములలో జావనే పుచ్చుకొనుట నా కెక్కువ యిష్టము.'' అని శ్రీవారనిరి. జావగూడ పుచ్చుకొనుటకు శ్రీ వారికి భరింపరానంత కష్టముగ నుండెడిది! తఱచుగా దానిని వారు ముక్కువెంబడి కక్కుచుండెడివారు...

''మీ అందరికొరకు నేను బాధపడుచున్నాను. లోకులందరి బాధల నాపై వేసికొంటిని.'' అని శ్రీ గురుదేవులు చెప్పుచుండెడువారు. గిరీశుని పాపఫలములనెల్ల తమపై వేసికొనుటచేతనే శ్రీ గురుదేవులు బాధపడిరి.

మన కష్టములెల్ల యీ భూలోకముననే. ఈ భూలోకమునకాక వేరొకచోట యేమికలదు? తమ అహంకార ఫలితముగా జనులపరిమితముగా దుఃఖము లనుభవించుచు చిట్టచివరకు ''నా లెక్కయేమి, జమయేమి? ఓదైవమా! సర్వశక్తిమంతుడవు నీవే! శాశ్వతుడవు నీవే!'' అని చెప్పుదురు.

శిష్యుడు : ఇటుతరువాత మమ్ము మీరు జ్ఞప్తియందుంచు కొందురా ?

అమ్మగారు : నా నిర్యాణానంతరమున దివ్యానంద స్థితిలో నుండు నేను బహుశః మిమ్ము జ్ఞప్తియందుంచుకొనక పోవచ్చును. నాయనా, కాలమే ముఖ్యమైనది. ఎప్పుడేది జరుగునో యెవరికి తెలియును ?

శిష్యుడు : అమ్మా! నిజమే. సర్వమును కాలవశమున జరుగు చున్నదనుటకు సందేహము లేదు. కాని, కాలమునకు అతీతమైనది, కాలమును శాసించు శక్తిగూడగలదు.

అమ్మగారు : ఔను, అది నిజమే.

శిష్యుడు : దయయుంచి మీ ఆరోగ్యమును కాపాడు కొనుడు. అప్పుడన్నియు సరిగానుండును.

ఎనిమిదిగంటలైనది. "ఎనిమిదిగంటలా? బహుశః అయి యుండును. పూజా మందిరములో ఆరాధనకు వేళమైనది. నేనిక వెళ్లెదను." అని అమ్మగారు చెప్పిరి.

నే నామె యుత్తరములను తీసికొని మేడమీదకు వెళ్లితిని. ఆమె శిష్యులలో నొకరు కాశిలో చనిపోయిరను వార్తనువిని, "ఏనో యొకనాడు అందరును చనిపోవలసినదే. గుంటలోనో, చెరువుగట్టుననో మరణించుటకు బదులుగా నతడు కాశీలో మర ణించెను!" అని అమ్మగారు చెప్పిరి.

తమ కుటుంబ కలహములను గురించి తెలుపుచు, తమ కేమైన పైకము పంపుడని కోరుచు అమ్మగారి సోదరులు జాబు వ్రాసిరి. "వారికి పుష్కలముగా ధనము దొరుకునట్లు కటాక్షిం పుడు. అందు విషయమై శ్రీ గురుదేవునితో చెప్పి, మీ సోదరు

లను శరీర సుఖములను తనివితీర మొగము మొత్తునట్లనుభవింప నిందు.'' అని నేను విన్నవించితిని.

అమ్మగారు : ఆ సుఖములతో వారికెన్నటికైన మొగము మొత్తునా? ఎంతయున్నను వారికి తృప్తికలుగనే కలుగదు. లౌక్యులకెన్నటికైన భోగములతో మొగము మొత్తునా? ఎప్పటి కప్పుడు వారు తమ విచారకథను చెప్పుచునే యుందురు. నా సోదరులలో నొకరగు కాళియే యెల్లప్పుడును పైకమడుగుచుం డును. ఇప్పుడు ప్రసన్నుడను మఱియొక తమ్ముడుకూడ వానిని చూచి, డబ్బుకొఱకు నన్ను వేధించుచుండును. నా మూడవ తమ్ముడగు వరదా యెన్నడును పైకమడుగడు. ''అక్కకు పైక మెక్కడినుండి వచ్చును?'' అని వాడనుచుండును.

శిష్యుడు : ఆ పిచ్చియమ్మయో? ఆమె కూడ పైక మడుగునా ?

అమ్మగారు : పైక మిచ్చిననుకూడ ఆమె పుచ్చుకొనదు.

శిష్యుడు : ఆ కుటుంబములో మీరెందుకు జన్మించినారు?

అమ్మగారు : నాతల్లిదండ్రులు బహుపుణ్యాత్ములగుటచేత.

1912-వ సం॥ జూన్ 25-వ తేది.

ఆ సమయ ముదయము. అమ్మగారు పూజా మందిరమునకు ప్రక్కనుండిన గదిలో, మంచముదగ్గర కూర్చుండిరి. మేము మాటలాడుకొనుచుంటిమి.

ఆధ్యాత్మికజీవితములో కర్మకుగల ప్రాముఖ్యము

శిష్యుడు: రామకృష్ణ పరంపరలోని సన్న్యాసులు సేవాశ్రమ ములలోను, ధర్మ వైద్యశాలలలోను పని చేయుట, పుస్తకములను విక్రయించుట, లెక్కలను వ్రాయుట మొదలగు వివిధకర్మ

కలాపములలో పాల్గొనుట మంచిదికాదని కొందరందురు. శ్రీగురుదేవు లెన్నడైననిట్టి వ్యాపారములకు బూనుకొనిరా? భగవత్సాక్షాత్కారమునకై ఆత్రపడి యీ పరంపరలోచేరిన సాధకులకిట్టి పనులను బలవంతముగా విధించుచున్నారు. సాధకుడేదియో పనియే చేయవలసియున్నచో, పూజామందిరములో అర్చన, ధ్యానము, జపము, భగవన్నామ సంకీర్తనము మొదలగు పనులు చేయవలయును. తదితర వ్యాపారములలో పాల్గొనిన యెడల సాధకుడాశాపాశములలో జిక్కువడి భగవంతునకు దూరుడైపోవును.

అమ్మగారు : ఆ విధముగా ప్రసంగించువారి మాటలనెన్నడును నీవు వినకూడదు. పనిచేయనిచో, రేయుంబవళ్లు నీ వేమి చేసెదవు? దిన మిరువదినాలుగుగంటలును ధ్యాన, జపముల నెవరైన చేయుచుండగలరా? శ్రీ గురుదేవుని విషయ ముదాహరించితివి. కాని, వారి సందర్భమే వేఱు. శ్రీ వారికి తగిన అన్నపానాదులను మధురుడు సమకూర్చుచుండువాడు. నీవేదో పనిచేయుచుండుటచేతనే ఆహారమును సంపాదించుకొనగలుగుచున్నావు. లేనిచో, ఒకకబళ మన్నమునకై యింటింటికిపోయి నీవు బిచ్చమెత్తుకొనవలసి వచ్చును. బహుశః నీవందుచే జబ్బుపడవచ్చును. ఇంతేకాక, యీ కాలమున సాధువులకు బిచ్చము పెట్టువారెక్కడనున్నారు? నీ వట్టిమాటల నెన్నడును పాటిచేయకుము. శ్రీ గురుదేవుల ఆజ్ఞప్రకారము వ్యవహారములు సాగుచుండును. ఈ పద్ధతుల మీదనే మఠనిర్వహణము జరుగును. ఈ పద్ధతుల ప్రకారము నడుచుకొనలేని వారు మఠమును విడిచి వెళ్లెదరు.

ఒకనాడు మణిమల్లిక్ ఒక సాధువును చూచివచ్చి ఆ సంగతిని శ్రీ గురుదేవునితో విన్నవింప ''మంచిది. అతడు నీకునచ్చెనా?' అని శ్రీవారడిగిరి. అందులకు, ''ఔను. ఆసాధువును చూచితిని

కాని—'' అని మణిచెప్పెను. ''కాని—నీ ఆక్షేపణయేమి?'' అని శ్రీవారడిగిరి. అందుపై ''అందరికిని ధనము కావలెను.'' అని మణిమల్లిక్ బదులుచెప్పెను. ''సాధువున కెంతకావలయును? బహుశః పొగాకునకో, గంజాయికో ఒకకాని. అంతే, గిన్నెల కొలది నేయియు, పాలును, పరుండుటకు పరుపు మొదలగు సామగ్రు లెన్నియో మీకు కావలెనుకాని, పొగత్రాగుటకు సాధువులకు కావలసిన దొకకానియే వారికది లభింపకూడదా?'' అని శ్రీగురుదేవులు సెలవిచ్చిరి.

నిజముగా కోరిక లేవియు లేకపోవుటయే విరక్తి

శిష్యుడు: కోరికవలననే భోగములు కలుగుచుండును. ఒకనికి నాలుగంతస్థుల మేడ యుండవచ్చును. కాని, యేభోగము కొఱకైనను వానికి కోరిక లేనియెడల, నిజముగా వాడను భవించు భోగమేదియు లేదు. మఱియొకడు చెట్టుక్రింద నివసించుచున్నను వానికి కోరికయున్నయెడల, దానివలననే వానికి భోగమంతయు లభించును. ''ఒక మనుష్యున కెచ్చటను బంధువు లెవరును లేకపోవచ్చును. అయినను వాడొకపిల్లిని పెంచునట్లు చేసి, సంసారములోనికి మహామాయ వానిని లాగవచ్చును. ఇదియే యామెలీల!'' అని శ్రీ గురుదేవులు చెప్పుచుండెడి వారు.

అమ్మగారు: అది నిజము. కోరికయే సర్వమునకును కారణము. ఏకోరికయు లేని మనుష్యునకింక బంధమేమికలదు? ఇన్ని వస్తువులుకలిగి నేను జీవించుచుండుట మీరు చూచుచున్నారు. కాని, నాకు దేనియందును మమకారములేదు; ఎంత మాత్రమును లేదు.

శిష్యుడు : మీ కేమికోరిక యుండగలదు? ఇక మామాట అడిగెదరా! మా మనస్సులలో పనికిమాలిన కోరికలు లెక్కలేకుండ నెన్నిపుట్టుచుండును! వాని నెట్లు విడనాడగలము?

కోరికలు-నిజమైనవి: నామమాత్రమైనవి

అమ్మగారు : నీ విషయములో ఇవి నిజమగు కోరికలే కావు. అవియొక లెక్కలోనివి కావు. నీ మనస్సున నిప్పుడుపుట్టి, యుత్తర క్షణముననే మాయమగుచుండు వింతతలంపు మబ్బులే కేవలమవి. అవి యెంత యెక్కువగా పొడచూపి అణగారుచుండిన నీకు అంత మంచిది.*

శిష్యుడు : తాను రక్షించెదనని భగవంతుడు నాకభయ మిచ్చినగాని, నేను నా మనస్సు నెట్లు నిగ్రహింపగలుగుదు నాయని నిన్న తలంచితిని. ఒకకోరిక పోయిన వెంటనే మఱియొకటి తలచూపుచున్నది.

సాధకునకు దైవము రక్షణ నొసంగును

అమ్మగారు : అహంభావ మున్నంతకాలము కోరికలుకూడ తప్పకయుండును. కాని, ఆ కోరికలేమియు 'నిన్ను బాధింపవు. శ్రీ గురుదేవుడే నీ రక్షకుడు. సర్వమును పరిత్యజించి తన పాదార

---

* ''ఎంతదీక్షతో నేను మతసాధన లెన్నిచేయుచున్నను, నామనస్సునందలి మాలిన్యము తగ్గుటయే లేదు.'' అని భక్తుడగు నొకసన్న్యాసి శ్రీ మాతృదేవికి విన్నవించెను. అందుపైని అమ్మగారిట్లు బదులుచెప్పిరి. ''ఎఱుపు, నలుపు, తెలుపు మొదలగు వేర్వేరురంగుల దారములను నీవు కదురుపై చుట్టితివి. విడదీయునప్పుడుకూడ నీవు వానిని సరిగా ఆదేవరుసలో చూడగలవు.'' కోరికలలో రెండు రకములుకలవు. కొన్ని కోరికలు భోగవాంఛను తీవ్రపఱచును; మఱికొన్ని విరక్తిని త్వరితపఱచును. పైకొకవిధముగ కనుపడినను, గుణములో ఈ రెండురకముల కోరికలకును భేదముకలదు.

విందముల నాశ్రయించిన శరణాగతులను, ధర్మజీవనాభిలాషులను రక్షింపనిచో శ్రీ గురుదేవునకు నిర్దయుడనుపేరు వాటిల్లును. నీ పైన నాధారపడి జీవింపవలయును. నిన్ను పాలముంచినను, నీట ముంచినను నీవా భారమునంతయు శ్రీ గురుదేవుల సంకల్పము నకే వదలివేయవలయును. కాని నీవుమాత్రము ధర్మమగు దానినే, ఆయనయిచ్చిన శక్తికొలదిని చేయుచుండవలయును.

శిష్యుడు : అమ్మా! శ్రీ గురుదేవునకు నేనంత పరి పూర్ణాత్మ సమర్పణము గావించితినా? శ్రీ వారిపై నేనే కొంచె ముగనో ఆధారపడగల ననుభావము నా మానసికాకాశమున నొకొక్కప్పుడు మెఱపువలె మెఱసి, ఆ వెనువెంటనే మాయ మగుచుండును. శ్రీ గురుదేవుడే మమ్ము రక్షింపనిచో, మా కిక దారియేమున్నది? ఒకొక్కప్పుడు నేనట్లు తలంచుచుందును. అమ్మా! ఇట్టి తలంపునకు కారణము, మీరు జీవించియున్న, మా కష్టములను భయములను మీకు విన్నవించి, సత్యజ్ఞాన దయామృత సదనమగు మీ వదనమునుగాంచి మేము శాంతి నొందగలమను నమ్మకమే. ఈ దర్శనభాగ్యము లేనినాడు, మమ్మెవరు రక్షింతురు? మాకు మీ అభయప్రదానము కలు గుచో, మేము సురక్షితులమను భావముతో నుందుము.

అమ్మగారు : నాయనా! భయపడకుము, నీ వెందుకును భీతిల్లవలసిన పనియేలేదు. ఆలుబిడ్డలతో సంసారసాగరమందు నీవు మునుగవు. ఇట్టి ప్రమాదము నీ కెన్నడును కలుగదు. ఇక నీవు భయపడవలసినది దేనికి? ఈ లోపున, నేనీ శరీరమును చాలించుటకుముందే, నీ ఆధ్యాత్మిక జీవనసౌధమునకు భద్రమగు పునాదిని నిర్మించుకొనగలుగుదువు.

శిష్యుడు: భగవంతుడు దయారస భరితములైన తన చల్లనిచూపులను మాపై ప్రసరింపనిచో, జపతపములు మున్నగు వానివలన మాకేమి లాభము కలుగును? ఆ జగన్నాథుని రక్షణయే మా కవచము.

అమ్మగారు: నీవు దేనికిని భయపడవలసిన పనిలేదు. శ్రీ గురుదేవులు నిన్నుతప్పక రక్షించుచుందురు. చింతింపకుము.

1912-వ సం. జూలై 7-వ తేది.

శిష్యుడు: అమ్మా! రథోత్సవము చూచుటకై మీరు జగన్నాథమునకుబోవ నేర్పాటైనది కాదా?

అమ్మగారు: జనసమ్మర్ద మమితముగానుండు రథోత్సవ సమయమున జగన్నాథమునకు పోవుట మంచిదియా? అప్పుడచ్చట కలరావ్యాధి ప్రబలవచ్చును. ఇప్పటికే అచ్చటిగదులను, గృహముల నన్నిటిని యాత్రికులు బాడుగకు దీసికొని ఆక్రమించి యుండుటచే, నివసించుటకు స్థలమే లేదనియు, చిన్నగదులుకూడ పదిరూపాయల బాడుగకు జనులు తీసుకొనిరనియు, శీతకాలమున వచ్చి, దేవుని సేవించుట మంచిదియనియు పూజారి లక్ష్మీకాంతము చెప్పెను.

శిష్యుడు: మహమ్మదీయు లెన్ని దేవాలయములను, దేవ దేవీవిగ్రహములను నాశనముచేసిరి! కొన్ని విగ్రహములకు ముక్కులను, మఱికొన్నిటికి చెవులను కోసివేసిరి....గుజరాతులో సోమనాథస్వామి దేవాలయమున్నది. పూర్వకాలమున గంగోత్రియందలి జలములో అచ్చటి స్వామికి పూజారులు నిత్యాభిషేకము చేయుచుండువారు. ప్రతిదినము హిమాలయపర్వతములనుండి జనులు కుండలలో నీటిని తమ తలలపై నిడుకొని తెచ్చెడువారు.

ఈ విగ్రహమును మహమ్మదు సుల్తాను పడగొట్టి, దేవాలయ ద్వారములందలి మంచి గంధపుతలుపుల నెత్తుకొని పోయెను. అట్లేల జరుగవలయును?

అమ్మగారు : దేవతా ప్రతిమలలోనుండు భగవంతుని మూర్తి దుష్టులకు గోచరింపదు. అనగా అట్టి జనుల సమక్షమున దేవత మాయమగునని చెప్పవచ్చును. సంకల్ప మాత్రమున భగవంతుడేమి కావలసిన, తనకేమి యిష్టమున్న, దాని నెల్ల చేయగలడు. ఇదికూడ ఆతని లీలయే.

శిష్యుడు : కర్మఫల మనుభవింపకుండ తప్పించుకొనుటకు వీలగునా? జ్ఞానమువలన తప్ప మఱిదేనివలనను కర్మనాశనము కాదని వేదములు చెప్పుచున్నవి. అయినను ప్రారబ్ధకర్మఫలమును తప్పించుకొన నెవరికిని సాధ్యముకాదు.

కర్మఫలము లనివార్యములేయైనను, పారమార్థిక సాధనలవలన వానియనర్థమును తగ్గించుకొనుటకు వీలగును

అమ్మగారు : మన మనుభవించు సుఖదుఃఖములకు కర్మయే కారణము. శ్రీగురుదేవులుకూడ కర్మఫల మనుభవింపక తప్పినదికాదు. ఒకసారి వారి అన్నగారు తీవ్రజ్వరములో సంధియెత్తిన స్థితియందు, మంచినీటిని త్రాగుచుండగా చూచి, మిక్కిలి కొంచెముగా త్రాగిన తరువాత అన్నగారి చేతిలోనుండి యాయన మంచినీటి పాత్రను లాగుకొనిరి. అందుమీదట అన్నగారికి కోపము వచ్చి ''మంచినీటిని త్రాగకుండ నీవు నన్ను ఆటంకపఱచినావు. ఇట్లే నీవుకూడ బాధపడెదవు. నీవుకూడ నీ గొంతులో నిట్టిబాధ ననుభవింతువు,'' అని చెప్పిరి. ''అన్నా! నీ కపకారముచేయ నేను తలపెట్టలేదు. నీవు జబ్బుగా నుండుటచే, నీరు నీకు

చెలువు చేయును. మంచినీటిపాత్రను నేను లాగుకొనుట కదియే కారణము. అన్నా! సందర్భ మిట్లుండ నీవేల నన్ను శపించితివి?'' అని శ్రీ గురుదేవులు విన్నవించిరి. పిమ్మట అన్నగారు రేడ్చుచు ''తమ్ముడా! నాకు తెలియకయే యీ మాటలు నానోట వచ్చినవి. ఇవి జరిగి తీరవలసినదే.'' అని తమ పశ్చాత్తాపమును వెలిబుచ్చిరి. తాము వ్యాధిగ్రస్థులై యుండినప్పుడు ''ఆ శాపము వలననే యిప్పుడు గొంతులో నాకీ పుండుకలిగినది.'' అని శ్రీ గురుదేవులు నాతో జెప్పిరి. ''ఇట్టి స్థితి మీకే సంభవింప గలుగు నెడల, మానవమాత్రులు బ్రతుకుట కింకెట్లు సాధ్యమగును?'' అని శ్రీవారి నడిగితిని. ఈ ప్రశ్నకు ప్రత్యుత్తరముగా ''నా అన్నగారు ధర్మవర్తనుడు, ఆయనమాటలు జరిగి తీరవలసినదే. సామాన్యులగు వారిమాట లెల్ల యీ రీతిని జరుగునా?'' అని శ్రీ గురుదేవులు సెలవిచ్చిరి.

కర్మఫల మనుభవింపక తప్పదు. కాని భగవన్నామస్మరణవలన దాని తీవ్రతను నీవు తగ్గించుకొనవచ్చును. నాగలి చాలంత పెద్దపుండు నీకు కలుగవలసి యుండినయెడల, అధమ మొకసూది గ్రుచ్చుకొని బాధపడెదవు. జపతపములచే కర్మఫలమును చాలవరకు నిరోధించవచ్చును. సురధరాజు విషయమిట్టిది. లక్షమేకలను బలియిచ్చి అతడు దేవీపూజ చేసెను. ఈ లక్ష మేకలును కొంతకాలమైన తరువాత నొకే కత్తిదెబ్బతో రాజును చంపినవి. అందుచే లక్షసారులు జన్మింపవలసిన ఆవశ్యకత అతనికి తప్పినది. జగన్మాత నతడు పూజించియుండుటే అందుకు కారణము. పావన భగవన్నామ స్మరణ కర్మఫలముల తీవ్రతను తగ్గించును.

శిష్యుడు : అట్లైనచో కర్మవిధికే యీ లోకమున అత్యధిక ప్రాముఖ్యము కలుగును. అప్పుడు మనమేల భగవంతుని నమ్మవలయును? బౌద్ధులు భగవంతు డున్నాడని అంగీకరింపరు, కాని కర్మవిధి నంగీకరింతురు.

అమ్మగారు : కాళి, కృష్ణుడు, దుర్గ మొదలగు దేవత లెవరును లేరనియా నీవు చెప్పదలచుకొనినది ?

శిష్యుడు : జపతపములవలన కర్మఫలము నశించునా ?

అమ్మగారు : ఎందుకు నశింపదు ? సత్కర్మ చేయుట మంచిది. ఎవరికైనను మంచిచేసిన సుఖము కలుగును, చెడుగు చేసిన కష్టము సంభవించును.

శిష్యుడు : శ్రీ గురుదేవుని దర్శనార్థము చాలమంది భక్తులు వచ్చుచుండెడివారు. వారిప్పు డెక్కడనున్నారు ? మిమ్ము చూచుటకు వా రెవరును వచ్చుటలేదు.

అమ్మగారు : వారందరును సుఖజీవనములను గడుపుచున్నారు.

శిష్యుడు : ఏమి ? సుఖజీవనములా ?

అమ్మగారు : నీ మాటయే సరియైనది. ఆలు బిడ్డలతో మానవు డీలోకమున నెట్లు సుఖముగా నుండగలడు ? కామ కాంచనాసక్తులై జనులు మైమరచుచున్నారు. ఈ లోకమున సర్వమును తుదకు కష్టకారణమగును.

శిష్యుడు : అంతేకాదు; మనస్సు బాహ్యవిషయముల పైననే పోవుచుండును.

·అమ్మగారు : విశ్వజననియగు కాళియే జీవులందరికిని తల్లి. మంచి చెడ్డలు రెండునుకూడ ఆమెనుండి పుట్టినవే. సర్వ మామె

గర్భమునుండి జనించుచున్నది. పలురకముల పరిపూర్ణజీవులు కలరు. పుట్టుకతోనే పరిపూర్ణులైనవారు కొందరు, పారమార్థిక సాధనలనుచేసి పరిపూర్ణులైనవారు కొందరు. గురుకటాక్షమున పరిపూర్ణులైనవారు కొందరు. ఆకస్మికముగా పరిపూర్ణులైనవారు కొందరు.

శిష్యుడు : ఆకస్మికముగా పరిపూర్ణులగుట యనగా అర్థమేమి?

అమ్మగారు : అది మఱియొకరి ధనమునకు వారసులగుట మూలముగ అకస్మాత్తుగా భాగ్యవంతులగుట వంటిది.

ఇంతలో అమ్మగారి మేనకోడలు నళిని గంగానదిలో స్నానముచేసి గదిలోనికి వచ్చెను. నీటితో శుభ్రపఱుపనగు మరుగుదొడ్డి అపరిశుద్ధముగా నుండినదని కనిపెట్టి కొన్నికుండల నీళ్లుపోసి దానిని కడిగినందున, నామె శుద్ధినిమిత్తము గంగలో స్నానము చేసినది. ఆమె కుళాయినీటిలో స్నానముచేసిన చాలి యుండెడిదని అమ్మగారును శిష్యుడునుకూడ నభిప్రాయపడిరి.

నళిని : అది యెట్లు చాలును? మరుగుదొడ్డిని శుభ్రపఱచితినే!

అమ్మగారు : అంతమాత్రమున మనమింత వ్యత్యాసమును పాటింపనేల? నిజమునకు నీవు మలమును చేతితో తాకలేదే. తాకితివనుకొన్నను, దానిలో ప్రమాద మేమున్నది? మన ప్రేగులలో మలములేదా? "అన్నము, పులుసు, కూర, వెన్న మొదలగు ఆహార పదార్థములను కొన్నినాళ్లవరకు మనమొక కుండలో నుంచితిమేని, అవియన్నియు మురిగిపోయి కంపుకొట్టును. మానవ మలమన్న నంతకంటే వేఱేదియు కాదు." అని శ్రీ గురుదేవులు చెప్పుచుండువారు.

అమ్మగారు: ఎండిన మలమును మా గ్రామములో నే నెన్నిసారులో త్రొక్కితిని. కొలదిసారులు గోవిందనామస్మరణ చేసినతోడనే నేను మరల శుచిగ నుండినట్లు నాకు తోచెడిది. మనస్సే బహు ముఖ్యము. శుచిగ నున్నట్లుకాని, అశుచిగ నున్నట్లుకాని యెవరికైనను మనస్సునందే తోచుచుండును. దోష పూరితమైన మనస్సుకలవాడే యితరుల దోషములను చూడ గలుగును. ఇతరులదోషము లెన్నుటవలన వారికెన్నడైన నేమైన సంభవించునా? అందువలన నీకే హానికలుగును. ఇది నా మనో వైఖరి. ఈ కారణముచే నా కెవరిదోషములుకాని కనుపడవు. ఏ మనుష్యుడైనను నాకెంత చిన్నమేలుచేసినను, వానిని జ్ఞప్తియం దుంచుకొనుటకు ప్రయత్నింతును. ఇతరుల తప్పులను కనిపెట్టుటా! ఇది యెవరుకాని యెన్నడును చేయకూడని పని. నే నట్లెన్నడును చేయను. క్షమయే తపస్సు.

మనస్సునుబట్టి పరిశుభ్రత యుండును

శిష్యుడు: "ఇంటిలో దొంగ చొరబడి, యేమైన దొంగిలించె ననుకొనుము. నీ మనస్సున దొంగనుగురించిన యూహ స్ఫురించును. కాని అట్టియూహ యేదియు చంటిపిల్లకు కలుగదు. అందుచే నెవరుగాని ఆ బిడ్డకంటికి దొంగగా కనుపడరు." అని స్వామిజీ (వివేకానందస్వాములవారు) చెప్పుచుండువారు.

అమ్మగారు: అది నిజమే, నిర్మలమైన మనస్సుగలవారికి సర్వమును నిర్మలముగనే కనుపడును. పూర్వజన్మమందు పారమార్థిక సాధనలను, చాల కఠిన నియమముల నాచరించినవారికి మాత్రమే పుట్టుకతో పవిత్రమైన అంతఃకరణ కలుగును.

శిష్యుడు: అమ్మా జపమునుగాని ఆధ్యాత్మిక సాధనలను గాని చేయునపుడు, నా మనస్సున కానందము కలుగదు.

అమ్మగారు: (చిరునవ్వు నవ్వుచు) ఎందుచేత ? కొంచెము కూడ కలుగదా ?

శిష్యుడు: నేను ఆ సాధనలను అంత నిండుమనసుతో చేయుటలేదు. ఏకొలది నిముషములో చేసి, విసుగుపుట్టి "గోణుగు కొనుటవలన లాభమేమి? భగవంతుడను వాడున్నయెడల, వాడుండియే యున్నాడు. ఇంతకంటె ధ్యానమొనర్ప నేను ప్రయత్నించుటయే మేలు." అని తలపోయుచుందును.

అమ్మగారు: నీవు ధ్యానముచేయగలవా ?

శిష్యుడు: చేయలేను. అదికూడ చేయలేను. విషయము లెల్ల గ్రహింతునుగాని, వాని నాచరించి శాంతిని బడయలేకున్నాను. ఎవరైన దక్షిణేశ్వరమునకు దారిని చక్కగా తెలుసుకొనవచ్చునుగాని, అందరికిని ఆ దారియంతయు నడువ సాధ్యమగునా ?

ఈ సమయమున లలితబాబు గదిలోనికి ప్రవేశించి, అమ్మగారికి ప్రణామము చేసినపిమ్మట వారిరువురును సంభాషింపసాగిరి. శిష్యుడుగూడ అప్పుడప్పుడా సంభాషణలో పాల్గొనుచుండెను.

అమ్మగారు: "పదునైన కత్తివాదరవలె, దారి బహు కష్టమైనది. బ్రహ్మవిద్య కత్తిపై సామువంటిది." అని శ్రీ గురుదేవులు సెలవిచ్చుచుందువారు. (కొంచెముసేపూరకుండి) కాని, శ్రీవారు మిమ్ము తమచేతులనిడుకొని మీ యోగక్షేమములను వేయికన్నులతో నెల్లప్పుడును కనిపెట్టుచున్నారు.

లలిత: మా మరణానంతరము మమ్ము తమచేతులలోనికి దీసికొందురు; అందులో గొప్ప యేమున్నది ? మేమీ శరీరమున

సజీవులమై యుండునపుడు శ్రీవారట్లు చేసినయెడలగదా చెప్పకొన దగినది!

అమ్మగారు: మీకీ శరీరమందుండగనే యిప్పుడే శ్రీవారు మిమ్ము తమచేతులతో పట్టుకొనియే కాపాడుచున్నారు. మీతలపై శ్రీవారున్నారు. నిజముగా మిమ్మాయన తమచేతులతో పట్టు కొనియే యున్నాడు.

శిష్యుడు: నిజముగా శ్రీగురుదేవులు మమ్ము తమచేతులతో పట్టుకొని కాపాడుచున్నారా? మీరు నిజము చెప్పచున్నారా?

అమ్మగారు: (గంభీర స్వరముతో) ఔను. నిజముగా, ముమ్మాటికి నిజముగా.

అమ్మగారు ప్రాతఃకాలపూజను పూర్తిజేసి భక్తులకు ప్రసాదమును పంచిపెట్టి, గదిని తుడిచి చేతితో మట్టిని తీయు చుండగా గుండుసూదియొకటి యామెచేతి చిటికెనవ్రేలిలో గ్రుచ్చు కొనెను. వ్రేలిలోనుండి రక్తముకారి నొప్పిచే అమ్మగారు దారు ణముగా బాధపడుచుండిరి. ఈ సంగతి తెలియగనే, శిష్యుడు మేడమీదకు పరుగెత్తుకొని వచ్చెను. వేడిసున్నమును వ్రేలికి వేయుమని యెవరో నాతనితో జెప్పిరి. దానివలన బాధచాల తగ్గినది. ''నాయనా. నీవు నా సొంతబిడ్డవు. నిజముగా సొంత బిడ్డవు.'' అని ఆతనియందు తమకుగల ప్రేమాతిశయమును అమ్మగారు వెలిబుచ్చిరి.

కాశి 1912-వ సం॥ నవంబరు

కాశీ పుణ్యక్షేత్రమునకు శ్రీమాతృదేవి వచ్చియుండిరి. ఈ క్రింది ప్రసంగ మచ్చట జరిగెను:

శిష్యుడు: యాత్రికులందరు విశ్వనాథస్వామి విగ్రహమును తాకుదురు గావున, సాయంకాలమర్చకులు విగ్రహమున కభిషేకమును పూజనుచేసి, పిమ్మట నైవేద్యమును సమర్పింతురు.

అమ్మగారు: డబ్బున కాశపడి అర్చకులు జనులందరిని విగ్రహమును ముట్టుకొనని చ్చుచున్నారు. వారల్లెల చేయవలయును? దూరమునుండి ప్రతిమను చూచినచాలును, లేనిచో అవినీతిన ర్తనులు ప్రతిమను తాకుదురు. కొందరి హస్తస్పర్శచే శరీరమునుండును; మిక్కుటమైన బాధకలుగును. వారు నన్ను తాకినతరువాత నేను కాలుసేతులు కడుగుకొనుచుందును. అదృష్టవశమున కలకత్తాలోవలె నిచ్చట నన్నుచూచుటకై జనులు తండోపతండములుగా వచ్చుటలేదు.

శిష్యుడు: పెద్దస్వాముల వారల అనుమతిలేనిదే ఇచ్చట మిమ్మెవరును చూచుటకే వీలులేదు. జనసమ్మర్దమును తగ్గించుటకే యీ యేర్పాటు చేసిరి.

అమ్మగారు: వెళ్లినచోటనెల్ల కచ్చేరిచేసినట్లుగా, గొడవ జరుగుట కెవరిష్టపడుదురు?

కాశిలోకూడ నెట్టివదిన అమ్మగారిని బాధపెట్టుచునే యుండెను.

అమ్మగారు: బహుశః ముండ్లుగలబిల్వ పత్రములతో నేను శివుని పూజించితిని. అందుచే నా జీవితములో నిటువంటి కంటకప్రాయమైనస్థితి నాకు దాపురించెను.

శిష్యుడు: అదియెట్లు? తెలియక శివునకు ముళ్లమారేడాకులను సమర్పించినందున ప్రమాద మేమి?

అమ్మగారు: కాదు, కాదు. అట్లుకాదు. శివపూజ బహు కష్టము. అజ్ఞానముచే నైన ఆరాధకుడు తప్పుచేసిన యెడల, వానికి హానికలుగును. నిజమేమనగా, ఈ జన్మయే తమ కడసారి జన్మగాకలవారు, పూర్వజన్మలో చేసిన కర్మఫలములను యీ జన్మలోనే యనుభవింతురు.

పుట్టినప్పటినుంటి నేనే పాపముగాని చేసినట్లు నాకు జ్ఞాపకములేదు. అయిదేండ్ల ప్రాయమున నేను శ్రీగురుదేవులను స్పృశించితిని. అప్పటికి శ్రీ వారిని నేను గ్రహించుకొని యుండక పోయినను, నిస్సంశయముగా తమ దివ్యహస్తస్పర్శచే నన్నాయన ధన్యురాలిని జేసిరి. అయినను నేనింత దారుణముగా బాధపడుట కేమికారణము? శ్రీవారిని స్పృశించిన వారందరును మాయాబంధ విముక్తులైరి; నాకు మాత్రమింత ప్రబలసంసార జంజాటము తలపై నుండనేల? అహోరాత్రములు ద్వంద్వాతీతమగు మహోన్నతి బ్రహ్మనంద ప్రపంచమున కెగురనా మనస్సుప్రయత్నించును. జనులయందుగల దయచే నేను దానిని బలవంతముగా ఈ జీవ ప్రపంచమునకు దింపియుంచుచున్నాను. అయినను నాకేదారుణ మైనబాధతప్పకున్నది!

శిష్యుడు: అమ్మా మీ బంధువులేమి చేసినను చేయనిండు, దయయుంచి మమ్మందరిని సహింపుడు. ఆత్మసాక్షాత్కారముగల వా డెన్నడును కోపోద్రేకమునకు వశుడు కాజాలడు.

అమ్మగారు: నీవు చెప్పినది నిజము. క్షమకంటె యెక్కువ మైన సుగుణము వేరేదియులేదు. ఇది రక్తమాంసాదులతో కూడిన శరీరమగుటచే నేనొక్కొకప్పుడు కోపోద్రేకమున నేమైన అనవచ్చును. పిమ్మట అమ్మగారు తమలోతా మిట్లనుకొనిరి:

'తరుణమున హెచ్చరిక చేయువాడే నిజమగు స్నేహితుడు. తరుణముమించిన తరువాత, 'అయ్యో!' యని యెంత విలపించిన నేమి లాభము?'

1912-వ స॥ డిశంబరు.

కాశీలో నుండినప్పుడు శ్రీమాతృదేవి కాశీఖండపురాణమును వినుచుండువారు. ఒక నాటి సాయంకాలమున పురాణమైన తరువాత, శిష్యునితో ప్రసంగించిరి.

శిష్యుడు: కాశీనగరములో మరణించువారందరికిని ముక్తి వచ్చుచున్నదా?

అమ్మగారు: ముక్తి కలుగునని శాస్త్రము చెప్పుచున్నది.

శిష్యుడు: ఈ విషయమున మీ స్వానుభవమేమి? మరణించినవారి చెవులలో మహాదేవుడే తారక మంత్ర ముపదేశించుటను శ్రీగురుదేవులు చూచిరి.

అమ్మగారు: నాయనా! నా కావిషయ మేమియు తెలియదు. అట్టిదృశ్యము నే నెన్నడు చూచియుండలేదు.

శిష్యుడు: ఈ విషయమును, మీరేదైన చెప్పిబలపరచిన గాని, నేను నమ్మజాలను.

అమ్మగారు: ''రా—నమ్మననుచున్నాడు. దయయుంచి మీరా విషయమున నాకేదైన నిదర్శనమును గనుబరపుడు.'' అని శ్రీ గురుదేవులకు విన్నవింతును.

మహమ్మదీయ పరిపాలనలో హిందూదేశమున పలుతావులందు జరిగిన దేవాలయ వినాశమును గురించి ప్రసంగించుచు,

"ప్రజాపీడనమంత మిక్కుటముగా ప్రబలియుండెను. ఆ విషయమున భగవంతుడేమి చేసెను?" అని చెప్పితిని.

అమ్మగారు: భగవంతు డనంతక్షమాసమన్వితుడు. అహోరాత్రములు బిందెలకొలది నీళ్లని తలపై ద్రిమ్మరించి జనులు శివుని పూజించుచున్నను, మరియొకప్పుడు పొడిబట్టలతో కప్పి యా పరమేశ్వరు నారాధించుచున్నను, అందువలన స్వామికేమైన బాధగాని శ్రమగాని కలుగుచున్నదా? భగవంతుని సహన మపరిమితమైనది.

కాశిలో మరణించినచో, ముక్తికలుగును.

మరునటి యుదయమున శ్రీ మహాత్మా దేవిక–మహారాజుతో నిట్లు చెప్పిరి: "నిన్న రాత్రి మేల్కొనియే నేను కాశయ్యాలో బసుండియుండగా, బృందావన మందలి సేట్ దేవాలయములోని నారాయణ ప్రతిమ తటాలున నాకు కనుపడి నాప్రక్కనువచ్చి నిలుచుండెను. స్వామి మెడలోని పూలహారము పాదములవరకు వ్రేలాడుచుండెను. ఆ విగ్రహము నెదుట శ్రీ గురుదేవులు చేతులను జోడించి నిలువబడి యుండిరి. 'శ్రీ గురుదేవులిచ్చటికెట్లు వచ్చిరి?' అని ఆశ్చర్యపడుచు 'ర—సమ్మననుచున్నాడు.' అని చెప్పితిని. 'అతడు నమ్మితీరవలెను. ఇది అంతయు నిజము.' అని శ్రీ గురుదేవులు సెలవిచ్చిరి. కాశిలో చనిపోవువారికి ముక్తిలభించుననివారి యభిప్రాయము. ఆ నారాయణ విగ్రహము నాతో రెండు సంగతులు చెప్పెను. ఇందొకటి యీ ప్రశ్న, 'భగవంతుని విషయమై యథార్థమును తెలిసికొనిననేతప్ప, పరమసత్యమును గురించిన జ్ఞానమును పడయుట కెవరికైన సాధ్యమగునా?' రెండవ సంగతిని జ్ఞాపకము చేసుకొనలేకున్నాను.

క—మహారాజు: నారాయణ విగ్రహము నెదుట శ్రీ గురుదేవులేల చేతులు జోడించుకొని నిలువబడిరి?

అమ్మగారు: అది వారి స్వాభావికస్థితి. అందరి సమక్షము నను వారు నమ్రులై యుండువారు.

మరునాటి యుదయమున శ్రీ మాతృదేవిని దర్శించి, ముందటి దినమున జరిగిన సంభాషణ నందుకొని యిట్లడిగితిని: కాశీలో చనిపోవువారికి ముక్తిలభించు నేమో దయయుంచి చెప్పుడు. మీ రేమైన నిదర్శనము చూచితిరా?

అమ్మగారు: శాస్త్రములట్లు చెప్పుచున్నవి. ఇంతేకాక, యీ విశ్వాసముతో జనులిచ్చటకు వేనవేలుగ వచ్చుచున్నారు. పరమేశ్వరుని శరణు జొచ్చినవారికి వేఱెగతి యేది సంప్రాప్తమగును?

శిష్యుడు: భగవంతుని పాదపద్మములకు శరణాగతులైన వారికి ముక్తిలభించునను మాట నిజమే. కాని జగదీశ్వరునకు ఆత్మార్పణము చేసుకొననివారి విషయమును, భగవద్భక్తులు కానివారి విషయమును, మతాంతరుల విషయమును దీసుకొనుడు. కాశిలో మరణించుటవలన వారికిగూడ ముక్తిలభించునా?

అమ్మగారు: ఔను. వారికిగూడ లభించును. కాశీనగర మంతయు పరంజ్యోతిర్మయము. ఇచ్చట జీవించు సమస్తజంతువులకును, తుదకు కీటకములకు, పురుగులకుకూడ దివ్యప్రజ్ఞ పూర్తిగాకలదు. భక్తుడైనను, నాస్తికుడైనను, మతాంతరుడైనను చివరకు కీటకమైనను సరే, ఇచ్చట మరణించిన ప్రతి జీవికి తప్పక ముక్తికలుగును.

శిష్యుడు: మీరు నిజము చెప్పుచున్నారా?

అమ్మగారు: ఔను. ఇది ముమ్మాటికి నిజము. కానిచో, ఈ దివ్యస్థలమున కింతటి వైభవమెట్లు కలిగెనో నీవు చెప్పగలవా?

నా సమీపముననే భగవంతునకు నివేదనకాబడిన మధుర భక్ష్యములు కొన్నియుండెను. జుమ్మని రొదచేయుచు నా చేతిపై నొక యీగ వ్రాలెను. దానిని నా వ్రేలితో జూపుచు, "ఈ యీగకుగూడ ముక్తిచేకూరునా?" యని నే నడిగితిని.

అమ్మగారు: ఔను. ఈ యీగకూడ పరమపదము నొందును. ఇచ్చట జీవించు సమస్తజంతువులును పరంజ్యోతిర్మయములు. ఈ మేడమెట్లుమూలలను చిక్కువడిన రెండు చిన్నపిచ్చుకలను భూదేవుడింటికి గొంపోవగోరెను, కాని, "వలదు, వలదు. అవి కాశీనగర నివాసులు. నీవు వానిని దీసుకొని పోకూడదు!" అని నేనా బాలుని వారించితిని. తూర్పు బంగాళమునుండి వచ్చు స్త్రీలు 'బంగాలీతలా'లో నివసింతురు; తమతమ యిండ్లపట్లను, ఆస్తులపట్లను స్నేహితులపట్లను బంధువులపట్లను వారికి ప్రేమ యేమియు లేదా? అయినను కాశీలో మరణించుటకై వా రిచ్చట నివాస మేర్పరచుకొనిరి. వారి బుద్ధి యిట్టిది. వారికి మమకారము లేదు.

శిష్యుడు: అమ్మా చూచితిరా, తూర్పు బంగాళమందలి జనులకెంత పారమార్థిక చింతకలదో!

అమ్మగారు: ఔను. అది నిజము. మాజిల్లాప్రజలకు పారమార్థిక చింత లేదు. రాధు మామగారి విషయ మాలోచింపుము. అతని కుటుంబమునకు కాశిలో నొక సొంతయిల్లు కలదు. అయినను కాశిపేరు చెప్పినంతమాత్రమున వారు భయపడుదురు. తమ స్వగ్రామముననంటి పెట్టుకొనియున్నచో, తాము మరణింపమని

వారి భ్రమ. కాని మనమెచ్చటకు వెళ్లినను మన నీడవలె మృత్యువు మన వెనువెంట వచ్చుచుండును.

శిష్యుడు : ఇచ్చట మరణించువారికి ముక్తిలభించునని చెప్పినప్పుడు, మీరు నిజముగా సత్యము పలుకుచున్నారా?

అమ్మగారు : (తీవ్రస్వరముతో) నేను నీ యెదుట మువ్మారు ప్రమాణము చేయజాలను. ఒకసారి ప్రమాణము చేయుటయే తప్పు. ఇక మూడుసార్లు ప్రమాణము చేయుటా! అందును కాశిలోనా!

శిష్యుడు : (నవ్వుచు) అట్లైన, నేను కాశిలో మరణింపకుండున ట్లనుగ్రహింపుడు. అట్లు జరిగెనేని నే నెక్కడ నుందునో, మీ రెక్కడ నుందురో! మన మొకరినొకరు చూడముగదా!

అమ్మగారు (నవ్వుచు) : ఎంత అవివేకము! ఇతడు కాశిలో మరణింప నిష్టపడడట!

శిష్యుడు : అమ్మా! కంటితో చూచినప్పుడుగదా నమ్మకము కలుగును. ఏ వార్తనైన కన్నులార చూచినప్పుడే నమ్ముదుము.

అమ్మగారు : మహాత్ముల మాటలందు నీకు నమ్మకము లేకున్నచో, నీ విక చేయగల దేమున్నది? మహర్షులును, సాధుసత్తములును నడచిన మార్గముకాక వేఱెమార్గ మింకేమి కలదు?

శిష్యుడు : నిజమే. వేఱొకమార్గ మేదియులేదు. అపరోక్షజ్ఞానులగు మహనీయుల వాక్యములను వినుట తప్ప నేనేమి చేయగలను? అందుచేతనే, మిమ్మో ప్రశ్ననడిగితిని. సూటిగా ప్రత్యుత్తర మిచ్చినగాని, మిమ్ము విడువను.

అమ్మగారు : నీవు నమ్మినను నమ్మకపోయినను, భగవంతునకేమి లెక్క? శుకమహర్షి కూడ పరమేశ్వరుని దృష్టియందొక గండుచీమతో సమానము. భగవంతు డనంతుడు. వానిని నీ వెంత మాత్రము గ్రహింపగలవు? మన గురుదేవుడు అపరోక్షజ్ఞాని. ఆయన సర్వమును చూచిన సర్వజ్ఞమూర్తి. వారిమాటలు వేద వాక్యములు. ఆయన మాటలయందు నీకు నమ్మకము లేనిచో, నీ విక చేయగల దేమున్నది?

శిష్యుడు : శాస్త్రములు భేదాభిప్రాయములను దెలుపుచుండును. కొన్ని శాస్త్రము లొకరీతిని జెప్పును. మఱికొన్ని శాస్త్రములు మరొకరీతిని జెప్పును. మనము దేని నంగీకరింపవలెను. ఇందు చేతనే, మిమ్ము నేనిట్లు బాధపెట్టుచున్నాను.

ఒక్కొకప్పుడు శాస్త్రములు నమ్ముటకు వీలులేనివిగా నుండును

అమ్మగారు : అది నిజమే. రాబోవు నెలలో నింతవర్షము కురియునని పంచాంగము చెప్పును. కాని, పంచాంగమును పిండుటవలన మనకొక నీటిబొట్టుకూడ రాదు. ఇంతేకాక, శాస్త్రములలో పనికిమాలిన విషయము లెన్నియో యుండును. 'తు' 'చ' తప్పకుండ శాస్త్రాదేశముల ప్రకారమెవరును నడచుకొనజాలరు. ''శాస్త్రాదేశ బంధములచే బిగింపబడిన భక్తి, ఆ పేరునకు తగదు...'' అని శ్రీగురుదేవులు చెప్పుచుండువారు.

సత్యము-ముక్తి

ఈ కలియుగమున కేవలము సత్యము నాశ్రయించిన వారికి భగవత్సాక్షాత్కారము లభించును. ''సత్యమునుతప్ప నితర మెన్నడును పలుకని మానవుడు భగవంతుని ఒడిలో పరుండియున్నాడు.'' అని శ్రీ

గురుదేవులు చెప్పెడివారు. దక్షిణేశ్వరమం దాయన వ్యాధి గ్రస్తులై యుండినప్పుడు, నేను వారికొరకు పాలుచిక్కగా మరగ కాచి, రెండు శేర్ల పాలను దీసుకొనివెళ్లి అవి యొక శేరేయని చెప్పుచుండుదానను. అంతేకాని అవి నిజముగా నెంతయుండెనో నే నాయనకు చెప్పుచుండుట లేదు. ఒకనాడీ విషయమును శ్రీ వారు గ్రహించి, "ఇదిగోమి? సత్యము తప్పకు, చూచితివా? విస్తారముగా పాలుతీసుకొనుటవలన నాకు కడుపులో బాధ కలుగు చున్నది." అని యానతిచ్చిరి. అదిగోమి చిత్రమోకాని ఆనాడే వారు శరీరము సుస్థగాలేక బాధపడిరి. వారు సర్వశక్తి సంప న్నులు. మన విషయ మట్లుకాదు.

శిష్యుడు : నిజముగా నా కొఱకై యీ విధముగా మిమ్మీ ప్రశ్నల నే నడుగుట లేదు. నన్నుగురించి నాకు చింత లేదు. ఈ విషమై నా భావమే వేఱు. నేను తెలిసికొనగోరున దేదనగా : మిమ్ము నా తల్లిగా సంబోధించుచున్నాను. మీరు నిజముగా నా తల్లియా?

అమ్మగారు : తల్లిని కానిచో నే నింకెవరను? ఔను. నేను నీ సొంతతల్లిని.

శిష్యుడు : మీర ట్లనవచ్చును. కాని, నా కిది స్పష్టముగా గోచరమగుట లేదు. నన్ను కన్నతల్లిని సహజముగను, అప్రయ త్నముగను నా సొంతతల్లిగా గ్రహించుచున్నాను. కాని, మిమ్మా విధముగా భావింప నాకు సాధ్యమగునా?

అమ్మగారు : అయ్యో! అది యెంతయు నిజము! కొలది క్షణములైన తరువాత శ్రీ మాతృదేవి యిట్లు నుడివిరి:

నాయనా! భగవంతుడే మన తల్లియును, తండ్రియును. భగవంతుడే మన తల్లియు తండ్రియు నగుచున్నాడు.

1912-వ సం. డిసెంబరు

శిష్యుడు: తపస్సునకుగల ఆవశ్యకతయేమి?

అమ్మగారు: తపస్సు మిక్కిలి యవసరము. యోగినీ మాయిని చూడుము, ఇప్పటికిని నామె యెట్లుపవాసము చేయుచున్నదో చూడుము! గోలప్ మాయి జపమునకు పెట్టినదిపేరు. ఒకనాడు నరేను తల్లి నన్ను చూడవచ్చినప్పుడు, నరేనామెతో నిట్లనెను: "బహుశః నీవు తపస్సు చేసియుంటివి. అందుచేతనే, వివేకానందుని నీ కుమారునిగా కంటివి. మరల తపస్సు చేయుము. అప్పుడు నీకు మఱొక వివేకానందుడు కలుగును."

తపస్సునకుగల ఆవశ్యకత

శ్రీ గురుదేవు లన్నిరకముల సాధనలను చేసినారు. "అచ్చుదిమ్మను తయారుచేసితిని; మీరిక విగ్రహమును కొట్టవచ్చును." అని ఆయన చెప్పెడువారు.

శిష్యుడు: విగ్రహమును అచ్చుకొట్టవచ్చుననగా అర్థమేమి?

భూదేవుడు: శ్రీగురుదేవుని ధ్యానించవలయునని యర్థము.

అమ్మగారు: ఔను. ఇతడు దాని యర్థమును గ్రహించినాడు. విగ్రహమును అచ్చుకొట్టుటయనగా శ్రీ గురుదేవుని మూర్తిని ధ్యానముచేసి, వారిజీవితములోని వివిధ విషయములను తలపోయుట. ఆయనను ధ్యానించువారికి సర్వదివ్యానుభూతులు కలుగును. "నన్ను స్మరించువారికి అన్నవస్త్రముల లోటెన్నడు

శ్రీ గురుదేవుని మూర్తి మంత్రము

నుండదు. వారికెట్టి లేమిడిగాని కలుగదు.'' అని ఆయన చెప్పు చుండువారు.

మకు: ఆయనన్నో యిట్లు చెప్పినారా?

అమ్మగారు: ఔను. ఈ మాటలు ఆయన నోటినుండి వెలువడినవే. వారిని స్మరించుచుండువారికి సమస్త కష్టములును తొలగిపోవును. శ్రీవారి భక్తులందరు నెంత సుఖముగానున్నారో నీవు చూచుచుండుటలేదా? శ్రీ గురుదేవుని భక్తులవంటి భక్తు లింకొకచోట నీకు కనుపడరు. ఇచ్చట కాశీలో నే నెందరినో సాధువులను చూచుచున్నాను. కాని, ఆయన భక్తులవంటి మఱి యొక భక్తుని నీవు నాకు కనుబఱచగలవా?

శిష్యుడు: అమ్మా! దానికొక కారణము కలదు. శ్రీ గురు దేవుని విషయము మా కిప్పుడిప్పుడే కట్టివేయబడిన బజారువలె తోచుచుండును. బజారులక్షణములలో నొక్కటికూడ లోపింపదు. జనులింకను తిరుగులాడుచునే యుందురు. శ్రీ గురుదేవుని భక్తులును, ఆప్తశిష్యులును ఇంకను సజీవులై యున్నారు. శ్రీ గురుదేవుడు మాకెంతో సన్నిహితుడైనట్లే తోచుచుండును. మేము మనసార నాయనను ప్రార్థించుచో మాకోరిక ఫలించును.

అమ్మగారు: ఔను. చాలమందికోరిక లట్లే ఫలించుచున్నవి.

శిష్యుడు: కృష్ణుడును, రాముడును, తదితరులును నే యుగమునాటివారో! ప్రార్థించి పిలిచినవెంటనే 'ఓ' యని పలు కుటకు చాలినంత సన్నిహితులుకారు.

అమ్మగారు: అది నిజము.

కాశీపూర్‌తోట యింటినిగురించి, ''అది పవిత్రస్థలము.

ఇప్పు డచ్చట నొక ఐరోపీయ గృహస్థుడు నివసించుచున్నాడు.” అని శిష్యుడు చెప్పెను.

అమ్మగారు : కాశీపూర్ తోట యింటిలోనే శ్రీ గురుదేవులు తమ జీవితావసాన దినములను గడిపిరి. బహు తీవ్ర ధ్యానాది కఠిన తపస్సాధనోజ్వల మహిమాన్విత మా దివ్యస్థలము! అచ్చటనే శ్రీ గురుదేవులు మహాసమాధి విలీనులైరి. ఆ స్థలమంతయు దివ్యమహిమాన్వితము. అచ్చట ధ్యానముచేయువారికి బ్రహ్మజ్ఞానము కలుగును. దాని యజమానికి శ్రీ గురుదేవులు కలలో కనుపడి, దానిని బేలూరు మఠమున కిచ్చివేయమని ఆనతిచ్చుచో, మఠాధికారులు దానిని సంపాదింపవచ్చును.

పిమ్మట శ్రీ మాతృదేవి శ్రీ గురుదేవుని శిష్యులనుగూర్చి ప్రసంగించిరి. “శ్రీగురుదేవుని యీ శిష్యులెవరో నాకు దయయుంచి చెప్పుడు. వారి నిజస్వరూపమును గుర్తించుట మా తెలకు మీరిన పని,” అని శిష్యుడు విన్నవించెను.

అమ్మగారు : నాకేమి తెలియును? పూర్వావతారములందు శ్రీ గురుదేవునితోపాటు భూలోకమున జన్మించినవారు తిరిగి యీ యవతారమునగూడ వారితో వచ్చిరి.

శిష్యుడు : నాలుగుచేతులు మొదలైన యసాధారణ శరీర లక్షణములుగల దేవతను చూడవలెనను కోరిక యేదియు నాకు లేదు. మనకున్న రూపముతోడ నే నెంతయు సంతుష్టిపడియుందును.

అమ్మగారు : అదియే నా స్వభావముకూడ. ఇట్టి దివ్య దర్శనములవలన మన కేమి లాభము కలుగును? మనకు శ్రీగురుదేవుడున్నాడు—అతడే సర్వమును.

జయరామ్‌బటి 1913-వ సం. మార్చి.

శ్యామ్‌బజారులో నివసించు డాక్టర్-లలితుడును, ప్రబోధ బాబును వచ్చిరి. సాయంకాల మించుమించుగా నాలుగు గంటలకు, వారు శ్రీ మాతృదేవికడకువచ్చి నమస్కరించిరి. పిమ్మట ఈ క్రింది సంభాషణ జరిగెను :

లలితబాబు : అమ్మా! ఆహారవిషయమై, యేయే నియమములను మేము పాటింపవలెను?

పవిత్రాహారము—అపవిత్రాహారము

అమ్మగారు : శ్రాద్ధకర్మ సమయమున పెట్టబడు అన్నమును తినుటతగదు. పారమార్థిక జీవితమున కది హానికరము. శ్రీరామకృష్ణులు దానిని నిషేధించుచుండువారు. ఇంతేకాక, నీవు తినునదెల్ల మొట్టమొదట భగవంతునకు నివేదన కావలెను. ఇట్లు నైవేద్యముకాని యన్నము నెవరును భుజింపకూడదు. మనము తిను అన్నమునుబట్టియే, మన రక్తముకూడ నుండును. నిర్మలమైన యాహారమునుండి నిర్మలమైన రక్తము, మనస్సు, బలమును కలుగును. చిత్తశుద్ధియున్నచో ప్రేమభక్తి లభించును.

లలితబాబు : అమ్మా మేము గృహస్థులము, మా బంధువుల శ్రాద్ధకర్మలు జరుగునప్పుడు మేమేమి చేయవలయును?

అమ్మగారు : మీ బంధువులకు కోపము కలుగకుండ, మీ రట్టి సమయములందు పైపెత్తనము వహించి సాయముచేసి, యెట్లైన భోజనమునుమాత్ర మానాడు చేయకుండ తప్పించుకొనుడు. మీ రట్లు చేయజాలరేని, శ్రాద్ధకర్మ జరుగుచుండినప్పుడు విష్ణువునకుగాని, యితర దేవతలకుగాని సమర్పితమైన ఆహార

మును భుజింపుడు. భగవదర్పితమైన శ్రాద్ధాహారమును భక్తులు భుజింపవచ్చును.

లలితబాబు: చాలసమయములందు శ్రాద్ధకర్మకై సేకరింపబడిన ఆహారపదార్థములలో నెక్కువభాగము మిగిలిపోవును. మేము దానిని తినవచ్చునా ?

అమ్మగారు: ఔను, తినవచ్చును, నాయనా! అది మిమ్ము బాధింపదు. గృహస్థులైనప్పుడు మీ రట్టి యాహారమును భుజింపకుండ నెట్లుండగలరు?

ప్రబోధబాబు: అమ్మా! శ్రీ గురుదేవుడు త్యాగప్రియుడు. మేము దాని నెంత స్వల్పముగా నాచరించుచున్నాము!

పారమార్థికాభివృద్ధి క్రమక్రమముగా లభించును.

అమ్మగారు: ఔను. మెల్ల మెల్లగా మీ కది అలవడును. ఈ జన్మలో కొంచెముగను, రాబోవు జన్మలో కొంచె మెక్కువగను—ఈ రీతిని మీ రభివృద్ధిగాంతురు. శరీరముమాత్రమే మార్పునొందును; ఆత్మయన్ననో, యెల్లప్పుడు నొకేరీతి నుండును. 'కామినీ కాంచన' త్యాగము! "నా కిష్టమున్నచో మధురబాబు సాయముగైకొని కమార్పుకూరు నెల్ల బంగారముగా మార్చివేయగలను. కాని, అందువల్ల కలుగు లాభ మేమి? అది యంతయు నశాశ్వతము." అని శ్రీ గురుదేవులు చెప్పుచుండువారు. ఒక్కొక భక్తునిజూచి "చూచితిరా! దేని కొఱకును నీతనికి కోరిక లేదు. ఇది యీతని కడసారి జన్మ." అని ఆయన నుడువుచుండువారు. భక్తులు శ్రీ మాతృదేవికి ప్రణమిల్లి సెలవుతీసికొని వెళ్లిరి.

శ్రీ రామకృష్ణుని సన్న్యాస శిష్యులలో కొందరు శూద్రులగుటచే, పూర్వాచార విధులను బట్టి వారు సన్న్యాసమున కర్హులుకారను నాక్షేపణను గురించి అమ్మగారిట్లు చెప్పిరి: ''శ్రీ రామకృష్ణుల శిష్యులు జ్ఞానులు కనుక, సన్న్యాసులు జ్ఞాని సన్న్యాసికానచ్చును, గౌరీదేవి విషయమును దీసికొనుడు. స్త్రీకి సన్న్యాస మియ్యకూడదను. కాని, గౌరీదేవి స్త్రీయా? ఏ పురుషుడు నామెకు సమానుడు కాడు. ఆమెవంటి పురుషు లెందరున్నారు? ఆమె చేసినపనులను చూడుము—పాఠశాల కట్టించెను, బండి, గుఱ్ఱములు మొదలగువాని నెన్నియో సంపాదించెను. ''సన్న్యాసమును స్వీకరించిన స్త్రీ నిజముగా స్త్రీకాదు. ఆమె పురుష వ్యక్తియే.'' అని శ్రీ గురుదేవులు చెప్పుచుండువారు. 'నేను నీరుపోయుచున్నాను, నీవు బంకమట్టిని చేయుము.' అని ఆయన గౌరీదేవితో జెప్పుచుండువారు.

శూద్రులును, స్త్రీలును సన్న్యాసమున కర్హులా?

1913-వ సం. మార్చి 28-వ తేది.

ఉదయమున శిష్యుడు శ్రీ మాతృదేవి యింటిలోనికి వచ్చినప్పు డామె చామకాడలను తరుగుచుండిరి. ''చామకాడలతో కూడ మీరేమి తరుగుచున్నారు?'' అని అతడడిగెను. ''ఇది గడ్డి. ఇదికూడ ఆ కూరలలో నొకరకము. శ్రీ కృష్ణుని మేనిచాయ యీ గడ్డివలె నుండును.'' అని అమ్మగారు బదులుచెప్పిరి. శిష్యుడు మధ్యాహ్న భోజనమునకై కూర్చుండెను. తన యింటివరండాలో మఱియొక అతిథికి, బహుశః తన బంధువులలో నొకరికి, రాధు తల్లి విస్తరివేసి మంచినీళ్ల చెంబుపెట్టెను. ఒక పిల్లివచ్చి ఆ చెంబులోని నీటిని కొంచెము త్రాగెను. రాధుతల్లి యా నీటిని పాఱ

బోసి, మరల దానిలో మంచినీటి నుంచెను. పిల్లి మరలవచ్చి కొంచెము నీటిని త్రాగెను. రాధుతల్లి ఆ నీటిని తీసివేసి చెంబులో మరల నీటిని బోసెను. మూడవసారికూడ పిల్లివచ్చి ఆ నీటిని త్రాగెను. "ఓసి దొంగముండకానా! నూడుమొగము పిల్లీ! నిన్ను చంపెద! నిన్ను చంపెదనుచూడు!" అని కోపోద్దీపితురాలై అరచుచు రాధుతల్లి ఆ పిల్లిని వెంటదఱిమెను. శ్రీమాతృదేవి అప్పుడచ్చట నుండిరి. "పలకు వలదు. దాహముగొన్న జంతువును నీ వాపకూడదు. ఇదిగాక, ఆ పిల్లి యింతకుమున్నే యా నీటిని త్రాగెను." అని అమ్మగారు చెప్పిరి. ఈ మాటలతో రాధు తల్లికి కోపము మఱింత యెక్కువయ్యె, పిల్లియెడల నీవు కనికరము వహింప నక్కరలేదు. ఇంతవరకు మానవునిపట్ల నీ దయ పూర్తియైనది కాబోలు! మనుష్యులకు నీ దయ నేల నిలువ చేసుకొనవు?" అని యామె కేకలిడెను.

"నా దయను సంపాదింపని మానవుడు నిజముగా నిర్భాగ్యుడు. నేను కనికరింపని వా రెవరినిగాని, చివరకొక కీటకమునుగాని నే నెఱుగను." అని తీవ్రస్వరముతో అమ్మగారు పలికిరి.

శిష్యుడు సాయంకాల భోజనమునకు గూర్చుండెను. అమ్మగారే యొక కూరను, బంగాళాదుంపలను, మఱికొన్ని పదార్థములను సిద్ధముచేసి, శిష్యునకు వడ్డించి, "ఇవి తిని, ఎట్లున్నవో నీవు నాకు జెప్పవలెను." అని నుడివిరి.

శిష్యుడు : ఇది వ్యాధిగ్రస్తుని పథ్యాహారమువలె నున్నది. దీనిని వండినవా రెవరు?

అమ్మగారు : నేనే.

శిష్యుడు : మీరే?

అమ్మగారు : ఔను.

శిష్యుడు : ఇంతకంటె దీనిని బాగుగా వండవచ్చును. ఈ వంట మా ప్రాంతము వారికి అంతగా రుచించునట్టిదిగా లేదు.

అమ్మగారు : వీనిలో చారు, పులుసు మొదలగు ద్రవపదార్థముల నించుక రుచి చూడుము.

నళిని : ఓ అత్తా! నీవు కూరలలో నెయ్యి మిరపకాయలు వేయనే వేయవు. అది యెవరికైన రుచించునా?

అమ్మగారు : (నళినితో) వానిమాట పాటింపకుము. (శిష్యుని సంబోధించుచు) నీ వది తినిచూచిన యెడల, దాని రుచి నీకు తెలియును.

శిష్యుడు : కొన్నాళ్లనుండి మీరువండిన కూరలను గురించి అడుగుచు వానిలో గొన్నిటిని రుచి చూచితిని. అవి యన్నియు నాకే ప్రీతిగ నుండెను.

అమ్మగారు : మంచిది నేనొకనాడు మీ యూరిలో వండి నట్లు వండెదను. నీవు నాకాపద్ధతిని చెప్పవలెను. మీరు మిరప కాయల నెక్కువగా వాడెదరని నే ననుకొందును. అంతేకాదా?

శిష్యుడు : అంత యెక్కువగా వేయము. కార మెక్కువగా వేయనంతమాత్రమున రుచికి కూర బాగుగా నుండదని చెప్ప వలను పడదు.

అమ్మగారు: (నళినితో) రేపు కొంచెము పప్పు తెమ్ము. నే నొక పులుసును జేసెదను. నేను మిక్కిలి చక్కగా వంటచేసెడి దానను. ఇప్పుడు నా కలవాటు తప్పినది. కమార్పుకూరులో, లక్ష్మి తల్లియు నేనును వంటచేసెడివారము. ఆమె చాల బాగుగా చేసెడిది.

1913-వ సం॥ మేయి, 12-వ తేది.

రాధు జ్వరముతోను ఒడలు నొప్పులతోనుపండుకొని యుండెను. "నీవునాకూతురిని మందుతో చంపివేయునట్లున్నావు." అని నోటికి వచ్చినట్లెల్ల ఆమె పిచ్చితల్లి శ్రీ మాతృదేవిని తిట్ట నారంభించెను. ఆసమయమున బరోదాను బిలిచిరి. అతడామె నింటిలో నుండి బయటకు తఱిమెను. అమ్మగారుకూడ నింక సహింపలేక రాధుతల్లిని తీవ్రముగా మందలించి, శిష్యునితో నిట్లు చెప్పిరి: "(తక్కువ వారిపట్ల) ప్రయోగింపబడు 'తూయి (ఓసీ,)' అను మాటనుగూడ నెన్నడు నా పట్ల వాడి యెఱుగని భర్తకిచ్చి నన్ను వివాహముచేసిరి. ఈ రాధు తల్లిని జూడుము! రేయుంబవల్లీమె నన్నెట్లు తిట్టిపోయుచున్నదో చూడుము! దీని నెల్ల అనుభవించుటకు నేనేమిపాపము చేసితినో నాకు తెలియదు. బహుశః ముల్లుగల మారేడుదళముతో శివుని పూజించియుందును. అందుకే ఆ ముల్లిప్పుడు రాధుతల్లియై నన్ను బాధించుచున్నది."

వ్యాధినివారణకై తపస్సు చేయకుండ ఆ వ్యాధివలన మరణించుట మంచిదికాదు.

రాధువ్యాధిని గురించి శ్రీ మాతృదేవి యిట్లు చెప్పిరి: రాధుపై నామన సెంతమాత్రము నిలుచుటలేదు. దాని అనారోగ్యము విషయమున నాకు విసుగు పుట్టినది. బలవంతముపైనగాని నామనస్సు దాని వైపునకు మరలుటలేదు. "నా ప్రభూ! నా మనస్సు నించుక రాధు వైపునకు మరల్పుడు. లేకున్న దానిని జూచువారెవరు?" అని శ్రీ గురుదేవులను ప్రార్థించుదానను. ఇటువంటి జబ్బు నేనెన్నడు జూడనేలేదు. బహుశః దీని పూర్వజన్మలో నెదియో వ్యాధికి ప్రాయశ్చిత్తము చేసికొనకుండ మరణించియుండును. ఒకానొక

వ్యాధికి అవసరమైన ప్రాయశ్చిత్తము చేసికొనకుండ దానివలన నే మానవుడైనను మరణించునెడల, వానికి రాబోవు జన్మలో అదేవ్యాధి సంప్రాప్తమగును. కాని, యీ సూత్రము సన్న్యాసులకు వర్తింపదు.

కేదారుని తల్లి: చనిపోవునప్పుడు సన్న్యాసి భగవన్నామమును స్మరించును గనుక, నతనికి మోక్షము లభించును.

అమ్మగారు: ఔను. అది నిజము. మొన్న కోల్పారాలో చనిపోయిన కుర్రవానికి మరల జన్మమున్నదా? లేదు. ఇదె వానికి అంత్యజన్మ.

కాశీపూర్‌లో వ్యాధిగ్రస్తులై యుండినప్పు డొకసారి శ్రీ గురుదేవులు, "నేను జబ్బుగానున్నాను. ప్రాయశ్చిత్తమేదియు చేయనందుకు కాళీ దేవాలయాధికారులు నన్ను విమర్శించ వచ్చును. ఈ పది రూప్యములు దక్షిణేశ్వరమునకు దీసికొనివెళ్లి శ్రీ కాళీమాతకు సమర్పించి, ఆ పైకమును పిమ్మట బ్రాహ్మణులకును, ఇతరులకును పంచిపెట్టుము," అని రామలాలుతో చెప్పిరి. ఏ కర్మనుగాని చేయుటకు సన్న్యాసికి హక్కు లేదు. అందుచేతనే, శ్రీ గురుదేవులు తమ యిష్టదైవమునకు మొట్ట మొదట సమర్పించి పిమ్మట బ్రాహ్మణులకును ఇతరులకును పంచిపెట్టుటకై రామలాలునుకోరి, అతనిచేతికి పైకమిచ్చిరి. పూర్వకాలమున సన్న్యాసులును, ఋషులును అడవులలో నివసించు చుండువారు. వారు చాంద్రాయణవ్రతమువంటి తపస్సు చేయ గలిగిరా? తమతమ యిష్టదైవములకు పండ్లను కందమూలాదు లనుమాత్రము సమర్పించి, బీదజనులకు యిచ్చివేయుచుండువారు. వారి కది చాలును.

రాధుతల్లి: మామేనత్త జబ్బుపడి చనిపోయెను. ఆ జబ్బుతోనే ఆమె మరల జన్మించినదనియా మీ యభిప్రాయము?

అమ్మగారు: మీ మేనత్త మరల జన్మింపలేదని నీవు తలంచుచున్నావా? ఆమె ఆ జబ్బుతోనే తప్పక మరల జన్మించినది. ఒక మనుష్యుడొక కుటుంబములో తన కర్మఫల విశేషము వలన మరల మరల పుట్టి చచ్చుచుండును.

1913-వ సం॥ జూన్ 8-వ తేది.

సురేంద్రనాథ భౌమికుడును డాక్టర్ దుర్గాప్రసాదును శ్రీ మాతృదేవియింట నతిథులుగ నివసించుచుండిరి. వారా మధ్యాహ్నము తమ యూరికి వెళ్లెదరు.

శ్రీ గురుదేవునకును, భక్తుల యిష్టదేవతలకునుగల సంబంధము

ప్రొద్దుట స్నానముచేసి, వారిరువురును శ్రీ మాతృదేవికడకువచ్చి ప్రణమిల్లిరి. అమ్మగారు తమ హస్తముతో వారి శీర్షములను దాకి వారిని దీవించి కూర్చుండబనిచిరి. కుశలప్రశ్నలైనతరువాత సురేంద్రుడు శ్రీ మాతృదేవితో నిట్లు చెప్పెను: "అమ్మా శ్రీ గురుదేవు నారాధించుటలో నాకొక చిక్కు కలుగుచున్నది. ఒక భక్తుడు తన యిష్టదైవమునకును శ్రీ గురుదేవునకు నెట్టి భేదములేదని నమ్మునను కొనుడు. శ్రీ గురుదేవుని పటమును శక్తిగా భావించి అతడు పూజించును. తరువాత "ఓ మహేశ్వరీ! నీ దయావిశేషముచే" అని యీ రీతిగా దేవిని సంబోధించుచు, జపఫలమును శ్రీ గురుదేవునకు సమర్పించును. దీనివలన నా మనస్సు సందేహపీడితమగుచున్నది." "నాయనా! అట్లే కానిమ్ము. మహేశ్వరుడును, మహేశ్వరియుగూడ మన గురుదేవుడే. ఆయనయే సర్వదేవ (దేవీ) స్వరూపుడు. ఆయనయే సర్వబీజాకుర

మూర్తి. ఆయన రూపమున జనులు సర్వదేవతల నారాధింపవచ్చును. ఆయనను నీవు మహేశ్వరునిగను, మాహేశ్వరిగను కూడ సంబోధింపవచ్చును.'' అని అమ్మగారు మందహాసముతో బదులు చెప్పిరి.

సురేంద్రుడు: అమ్మా! ధ్యానసమయమున నామనస్సు స్థిరముగా భగవంతుని పాదపద్మములయందు నిలువజాలకున్నది.

అమ్మగారు: అయిన నేమి? నీవు శ్రీగురుదేవుని పటమును జూచుచుండిన చాలును. కాశీపూర్‌లో శ్రీగురుదేవులు వ్యాధిగ్రస్తులై యుండినపుడు, వంతుల ప్రకారము బాలశిష్యులాయనకు పరిచర్య చేయుచుండువారు. గోపాలుడుకూడ వారిలో నొకడు. ఒకనాడా యువకుడు శ్రీవారికి సేవచేయుటకు పోవుటకుగా ధ్యానమునకు బోయెను; చాలసేపటివరకు రాలేదు. ఈ సంగతిని గిరీశబాబు విని, ''ఎవరి నాతడు కన్నులుమూసికొని ధ్యానించుచుండెనో ఆయన జబ్బుతో, మంచముపై బరుండి బాధపడుచున్నారు. అట్టిస్థితిలో నున్నవారి నతడు ధ్యానించుటలోగల వివేకమును యోచింపుడు.'' అని చెప్పెను. పిమ్మట గోపాలుని తోడ్కొనిరమ్మని మనుష్యుని బంపిరి. అతడు వచ్చినతరువాత శ్రీగురుదేవులాతనిని తమకాళ్లను మెల్లగా నొత్తుమనిరి. అతడు పాదము లొత్తుచుండగా, ''నొప్పి హెచ్చుచుండుటచే నిన్ను నా కాళ్ల నొత్తుమని యడుగుచున్నానని తలంచుచున్నావా? లేదు, లేదు! నీ పూర్వజన్మలలో నెన్నియో పుణ్యకార్యములు చేసితివి; అందుచేతనే, నీసేవ నేను స్వీకరించుచున్నాను.'' అని ఆయన సెలవిచ్చిరి. శ్రీరామకృష్ణుల చిత్తరువును జూచుచుండుము. అదియే చాలును.

మనస్సు నేకాగ్రముగా నీవు నిలుపలేకున్న, శ్రీగురుదేవుని పటమును జూచుచుండుము.

సురేంద్రుడు: అమ్మా! ప్రతిదినము యథావిధిగ మూడు సారులు జపము చేయజాలకున్నాను.

అమ్మగారు: అట్లే కానిమ్ము. శ్రీ గురుదేవులను తలచుకొనుచుండుము. చేయగలిగినప్పుడెల్ల జపము చేయుచుండుము. కనీసము నీ వాయనకు మనస్సులో నమస్కారము చేయగలవు కాదా?

దుర్గబాబు: అమ్మా! ఆహార విషయమున మేమేమి నియమములను పాటింపవలయునో మాకు తెలియదు.

ఆహారవిషయమున మనము శుచినియమముల నెంత వరకు పాటింపవలయును?

అమ్మగారు: ఆహారవిషయమున శ్రీ గురుదేవు లౌక నియమమును శ్రద్ధగా మనము పాటింపవలయునని చెప్పుచుండువారు; శ్రాద్ధకర్మలలో వండబడు అన్నమును తినకూడదని తమ భక్తులనందరిని శాసించెడువారు. అది పారమార్థికాభివృద్ధికి హాని కరమని వారియభిప్రాయము. దీనినితప్ప, మీ యిష్టముచొప్పున దేనినైన మీరు తినవచ్చును. కాని మీ రట్లు చేయునప్పుడు, శ్రీ గురుదేవులను స్మరింపుడు.

దుర్గబాబు: అమ్మా! ఆసుపత్రిలో పనిచేయుచుండునప్పుడు చాలసారులు మాకు దాహమగును. అట్టితరి స్థలమునుగాని, మనుష్యులనుగాని పాటింపకుండ నేను నీళ్లు త్రాగవలసివచ్చుచుండును. వాస్తవముగా నేనట్లు త్రాగుచున్నాను. అమ్మా! ఈ విషయమున మీ యభిప్రాయ మేమి?

అమ్మగారు: త్రాగక నీకు గత్యంతర మేమున్నది? నీ విధాయకధర్మమును నిర్వహించుచుండునపుడు, నీవట్లు త్రాగు

చున్నావు. నీళ్లు త్రాగునప్పుడు శ్రీ గురుదేవులను నీవు స్మరింతు వేని, నీకు హానికలుగదు. వేర్వేఱు చిల్లరపనులు చేయవలసిన వారికి, ఆహారవిషయమునగల మతనియమముల నన్నిటిని పాటింప సాధ్యమగునా ?

సురేంద్రుడు: అమ్మా! మీరు చూచుచున్నారుగదా. గృహస్థులమగు మేము చాలమంది బంధువులతో కుటుంబములుగా జీవింతుము. ఒక్కొక్కప్పుడు వంటచేయుచుండగనే, కుటుంబము లోని కొంతమంది భోజనముచేయు చుందురు. ఆ యన్నమునే కొంతతడవైన తరువాత నాకును వడ్డించెదరు. నేనా యాహార మును భగవంతునకు సమర్పింప సందేహింతును.

అమ్మగారు: గృహస్థుల విషయములో నిట్టిది తప్పదు. మేముకూడ నట్టి సన్నివేశముల నెదుర్కొనవలసిన వారమే. కుటుంబములో వ్యాధిగ్రస్తుడగు మనుష్యుడున్నచో, వానికై అన్నమును వేఱుగా దీసియుంతుము. అయినను నీకు విస్తరిలో నన్నము వడ్డించిన తర్వాత, శ్రీ గురుదేవులను స్మరించి, వారే నీ కాయన్నమొసంగిరని భావించి, దానిని నీవు భుజించుచో, నీపారమార్థికాభ్యుదయమున కందువలన నెట్టిహానియు కలుగదు.

సురేంద్రుడు: అమ్మా! నా మానసికస్థితిని మీకు నే నెట్లు వర్ణింపగలను? అంతర్యాములై సర్వజీవులను నడుపువారు మీరే. మీకు సర్వము తెలియును. కొన్ని సంవత్సరములనుండి నేనీ కష్టములనెల్ల బడుచున్నాను. మీ యాశీస్సులే లేనిచో, నేనీ నాటికి బహుశః మరణించియే యుందును.

అమ్మగారు: ఔను నాయనా! ఈ లోకములోని జీవిత కష్టములనుగూర్చి నీవు నాకు చెప్పబనిలేదు. ఆ కష్టముల కంతేమే

లేదు. నీ విషయమున బాధ తప్పనిసరియగుచున్నది. బాబూ! నన్నుచూడుము. శ్రీ గురుదేవుని సంకల్పమువలన నేనెంత దుఃఖ భాజనమగు జీవితమును గడపుచున్నాను! (రాధును చూపుచు) ఈ పిల్లనిమిత్తము నేనెంతకష్టపడుచున్నాను!

సురేంద్రుడు : అమ్మా! ఔను! మీస్థితివలననే మా కించుక ధైర్యమును, దుఃఖోపశమనమును గలుగుచున్నవి. ఈ లోకకష్టములను స్వానుభవముచే మీ రెఱిగినవారౌటచే, మీ దయకు పాత్రులము కాగలమని మాయాశ.

అమ్మగారు : తండ్రీ! భయపడకుము. శ్రీ గురుదేవు లున్నారు. ఇహపరముల రెండింటను నిన్నాయనయే రక్షించును.

సురేంద్రుడు : అమ్మా! మేమెంతో దూరగ్రామమున నివసించుచున్నాము. కలలు నిజమా ?

అమ్మగారు : ఔను! శ్రీ గురుదేవులను గురించిన స్వప్న ములు నిజమైనవే. కాని, తమ్ముగురించిన స్వప్నములను తొరగకు తమకుకూడ తెలుపవలదని వారియాజ్ఞ.

సురేంద్రుడు : అమ్మా! శ్రీ గురుదేవులెట్లుండెడి వారో మే మాయనను చూడలేదు. కనుక, నాకు గురువును, సర్వమును మీరే.

అమ్మగారు : నాయనా! భయపడకుము. శ్రీగురుదేవులు నిన్ను రక్షింతురు; ఇహమునను పరమునను గూడ నీక్షేమమును కనిపెట్టుచుందురు. ఆయన నీ కెల్లప్పుడును తోడునీడై నిన్ను కాపాడుచుండును.

ఆ భక్తులిరువురును భోజనము చేసిన తరువాత, శ్రీమాతృ దేవికడ సెలవుదీసికొని వెళ్లిరి. కలకత్తాకు వెళ్లుచుండిన వరదా

మామ వారితోఁగూడ పయనమయ్యెను. అమ్మగారు వారితోఁగూడ కొంతదూరము నడచి, కంటికగపడువరకు వారిని చూచి వెనుకకు మరలెను.

సురేంద్రుడు, బల్లారతన్ గంజులో నొక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడు. అచ్చటి కసాయివాండ్రు కొందరు, ఆవులను బ్రతికియుండగనే చర్మము నొలిచి చంపుచుండిరి. ఒకనాడా దుర్మార్గులా పాఠశాలయెదుటనే యిట్లుచేసిరి. అందుపైని సురేంద్రుడు, మిగిలిన యుపాధ్యాయులును, హైందవమహమ్మదీయ విద్యార్థులందరును తీవ్రముగా ప్రతిఘటించి, ఆ దుండగీండ్రను కొట్టిరి. దీనివలన కొంతచిక్కు కలిగెను. కటికవాండ్రు సురేంద్రుని పై పగతీర్చుకొనెదమని బెదరించిరి. ఈ సమయముననే ఆ పాఠశాలయందలి విద్యార్థులు చాలమంది, మంత్రోపదేశమునకై జయరాంబటికి వెళ్లిరి. సురేంద్రుడు శ్రీమాతృదేవి కొకయుత్తరమువ్రాసి, వారిచేతికిచ్చిపంపెను. ఆ బాలురుకూడ జరిగిన యుదంతమునెల్ల విన్నవింప, అమ్మగారు మిక్కిలి పరితాపపడి, అట్టి ఘోరకృత్యములను మీరే ప్రతిఘటింపనిచో, నిక వా! కసమ్మతిని దెలుపువారెవరు?'' అని చెప్పిరి. ఆమె సురేంద్రునకు అభయోత్సాహము లొసంగుచు నొకయుత్తరము వ్రాయించి, అట్టిక్రూరకార్యములు మరల జరుగకుండునట్లు చూడుమని యాతని కానతిచ్చిరి. కొన్నాళ్లైన తరువాత శ్రీమాతృదేవి సురేంద్రునకు మరల నుత్తరమువ్రాసి, అందులో ''భగవంతుడే నిజముగా నున్నయెడల, నతడీ పాపమును తప్పకపరిహరించును.'' అని సెలవిచ్చిరి. కొంతకాలమైన తర్వాత ప్రజలు తీసికొని వచ్చిన వ్యాజ్యఫలితముగా, బహుసోయమగు నిట్టి కసాయితనము అంతరించెను.

1913-వ సం॥ జూలై 14-వ తేది.

శిష్యుడును, ముకుందుడును శ్రీమాతృదేవియింటి నడవలో తమ మధ్యాహ్నభోజనమునకై కూర్చుండిరి. ప్రక్కయింటి నడవలో అమ్మగారు కూర్చుండిరి. తనపై కాకి రెట్టవేసినందున, అప్పుడే స్నానముచేసి తెల్లని చీరకట్టుకొని నళిని వచ్చెను.

అమ్మగారు: నేను ముసిలిదాననే కాని, ఆవిధముగా కాకిరెట్ట వేసినదని నేనెన్నడును వినలేదు. నీ మనస్సు కల్మషపూరితమైనది. దారుణ పాపములు చేయనిచో, మనస్సు తన నిర్మల స్వభావమునెట్లు కోల్పోవగలదు. కృష్ణబోసు సోదరికిట్టి విపరీతాచారములు కలవు. గంగలో స్నానము చేయుచు, తనతల పూర్తిగా నీటిలోమునిగినదా యని యామె జనుల నడుగుచుండును. అది మూఢాచారము. ఇందువలన మనస్సెన్నటికిని నిర్మలముకాదు. అపరిశుద్ధమైన మనస్సు, సులభముగా నిర్మలముకాదు. నీ ఆచారము నెంతవ్యగ్రముగా కనుబఱచుచుందువో, నీ మూఢత్వమంత యెక్కువయగును. అన్ని విషయములం దిది నిజము.

శుబవిషయమున విపరీతాచారము. అపరిశుద్ధచిత్తమును సూచించును.

శిష్యుడు: మహాపురుషులవారు (శ్రీ శివానందస్వామి) చేతులతో కుక్కలను బుజ్జగించి పిమ్మట శ్రీ గురుదేవు నారాధించుటకు పూజామందిరమునకు వెళ్లుట నేను చూచుచుందును. ఎవరో యొకరువచ్చి, యాయన చేతిలో కొంచెమునీటిని పోసెడివారు. ఆయన దానిని తనమోముపై జల్లుకొనెదరు. ఆకాలమున గంగా జలమునే అన్నిటికిని వాడుచుండెడు వారు.

అమ్మగారు: వారి విషయమే వేఱు. వారందరును సాధు

వులు. వారియంతఃకరణ మెంతనిర్మలముగా నుండును! గంగానదీ తీరమున నివసించువారు నిజముగా దేవతలే. దేవతలు తప్ప వేఱెవరైన గంగాతీరమున నివసింపగలరా? మానవులు ప్రతిదిన మొనర్చుచుండు పాపములు, గంగాస్నానము వలన నశించు చున్నవి.

నళిని: ఉద్బోధనా పత్రికా కార్యాలయమందలి నీళ్లగదిని కడిగి, సిమ్మెంటు కట్టుబట్టను మార్చుకొని పూజామందిరములో నైవేద్యమునకై గోలప్‌మాయి యొకనాడు పండ్లను సిద్ధముచేయు చుండగా జూచి నేను "గోలప్‌దీదీ! ఇదేమి? వెళ్లి గంగలో స్నానము చేయుము," అని అంటిని. "నీకంతయిష్టమున్నచో ఆ పని నీవేల చేయవు?" అని గోలప్‌మాయి నాకు బదులు చెప్పెను.

అమ్మగారు: ఎంత నిర్మలమైనది గోలప్ మనస్సు! ఆమె యెంత మహోన్నతాత్మురాలు! అందుచేతనే యామె పరిశుద్ధాపరిశుద్ధ వస్తువులకంతగా వ్యత్యాసమును పాటింపదు. మడిపేరిట పామరులు ప్రదర్శించునట్టి మూఢాచారముల నామె యెంత మాత్రము పాటింపదు. ఆమె కిది కడపటి జన్మ. అటువంటి మానసికస్థితిని బడయవలెననిన నీవు వేలాకజన్మ మెత్తవలెను. గంగాతీరములందు యెనిమిదిమైళ్లవరకు నిర్మలవాయువు వీచు చుండును. ఈ వాయువే నారాయణుని శరీరము. కఠిన నియమాచరణమునవలన మనస్సు నిర్మలమగును. 'పవిత్రతా స్వరూపమని చెప్పదగిన భగవంతుని సాక్షాత్కారము, నియమము నిష్ఠలేనిదే సిద్ధింపజాలదు.'

భగవత్సాక్షాత్కారమువలన నెవరికైన నితర లాభమేమి కలుగును? అట్టివారికి తలపై రెండుకొమ్ములు మొల

చునా? వారిమనస్సు నిర్మలమగును. చిత్తశుద్ధి యున్నచో జ్ఞానము కలుగును, పరమార్థానుభూతి లభించును.

శిష్యుడు: భగవంతున కాత్మార్పణము గావించుకొనుటయే కాని, నియమముగాని నిష్ఠగాని ఆచరించినవారికీస్థితి యెట్లు లభించును?

అమ్మగారు: భగవంతునకు పరిపూర్ణాత్మార్పణము గావించుకొని, సంశయమునకు తావులేని అచంచల విశ్వాసమును వానియందుంచుటయే వారి పారమార్థిక సాధన. హా! "కోటిజన్మలెత్తినను నాకేమి భయము?" అని నరేను చెప్పెను. నిజమే; జ్ఞాని పునర్జన్మ కెన్నడైన భయపడునా? అతడే పాపమును చేయడు. నిరంతరము భయగ్రస్తుడగువాడు అజ్ఞాని. వాడే బంధములలో చిక్కుపడి పాపకళంకము నొందును; కోట్లకొలది జన్మలవరకు అనంతములైన దుఃఖములను, బాధలను అనుభవించి, తుట్టతుదకు భగవంతునే కాంక్షించును.

ఆత్మార్పణమును, పారమార్థిక సాధనయును.

శిష్యుడు: ఔను. అతడు స్వానుభవమువలన గుణపాఠములను నేర్చుకొని పిమ్మట జ్ఞానము నొందును.

అమ్మగారు: ఔను, దూడ 'హంబా, హంబా' (నేను, నేను) అని అరచుచుండును. దానిచర్మముతోను ప్రేగులతోను డోళ్లు మొదలగు పనిముట్లు జనులు చేసినతరువాతకూడ అది ఆ ధ్వనినే చేయుచుండును. చిట్టచివరకు దూదేకులవానిచేతిలో బడినప్పుడు, 'తుహుం, తుహుం' (నీవు, నీవు) అని అది రొద చేయును.

1913-వ సం॥ సెప్టెంబరు 18-వ తేది.

జీవితములో భగవంతుని యందే మనసు శాంతి సౌఖ్యములు లభించును

ఒక భక్తునకు వ్రాసిన లేఖలో శ్రీమాతృదేవి యిట్లు నుడివిరి: "మానవజన్మలో నెట్టి సుఖమును లేదు. ఈ లోకమంతయు నిజముగా దుఃఖమయము. ఇచ్చట సుఖమనునది నామమాత్రమే. శ్రీ గురుదేవుని దయావిశేషము లభించిన ధన్యాత్ములుమాత్రమే, ఆయన భగవంతుడే యని గ్రహింతురు. వారి సౌఖ్యమదియే యని జ్ఞప్తియందుంచుకొనుము.

సన్న్యాసాశ్రమధర్మము

సన్న్యాసి శిష్యుడొకడు జయరాంబటికివచ్చి, శ్రీమాతృదేవిని సందర్శించి, పిమ్మట ఋషీకేశము వెళ్లెను. కొలదినాళ్లైన తరువాత, నతడమ్మగారికి వ్రాసిన యుత్తరములో నిట్లు విన్నవించెను. "అమ్మా! కాలక్రమమున నాకు శ్రీ గురుదేవుల దర్శనభాగ్యము లభించునని మీరు చెప్పితిరి. కాని, ఇంతవరకట్లు జరుగలేదు." అది విని అమ్మగారు, "శ్రీ రామకృష్ణులు ఋషీకేశమునకు నీ కొరకై కాని, నీవచ్చుటనున్నావని కాని వెళ్లియుండలేదు." అని అతనికి బదులు వ్రాయుము. అతడు సన్న్యాసాశ్రమము స్వీకరించెను. భగవంతుని ప్రార్థించుటతప్ప నతనికి వేఱేపని యేమున్నది? ఆయన తమ దయవచ్చినప్పుడు భక్తునకు ప్రత్యక్షమయ్యెదరు." అని శిష్యునితో చెప్పిరి.

భగవత్ప్రార్థన

ఒక స్త్రీ అమ్మగారి కిట్లువ్రాసెను: "అమ్మా! వయస్సున నేను చిన్నదానను. నా అత్తమామలు నన్ను మీ యొద్దకు రానీయకున్నారు. వారి యభీష్టమునకు నేను వ్యతిరేకముగా నెట్లు నడుగవలెను? మీ యాశీస్సు

లను బడయవలయునని నా కోరిక.'' ''అమ్మాయీ! నీ విచ్చటకు రానక్కర లేదు. సర్వవిశ్వాంతర్యామియగు భగవంతుని ప్రార్థింపుము. తన యమోఘాశీర్వాదము లాతడే నీ కనుగ్రహించును.'' అని యామెకు బదులు వ్రాయుమని అమ్మగారు శిష్యున కాన తిచ్చిరి.

1918-వ సం॥ సెప్టెంబరు 30-వ తేది.

భగవంతునిపై అలిగిన భక్తుడు

ఉదయమున శ్రీ మాతృదేవి పూజకై పండ్లనాయ త్త పఱచుచుండిరి. శిష్యుడొక భక్తుడు వ్రాసిన యుత్తరమామెకు చదివివినిపించుచుండెను. ఆ భక్తుడు భగవంతునిపై తాను అలుక వహించిన ధోరణిలో వ్రాసెను. ఇందుకు అమ్మగారిట్లు బదులు చెప్పిరి: 'శుకుడు, వ్యాసుడు మొదలగు ఋషులే పెద్దచీమల వంటివారు.' అని శ్రీ గురుదేవులు చెప్పెడివారు. అనంతమగు ఈ సృష్టియంతయు భగవంతునిది. నీవు భగవంతుని ప్రార్థించనిచో వాని కేమిలెక్క? భగవంతుని తలపెట్టనైన తలపెట్టని వారెందరో యున్నారు. నీ వాతనిని స్మరింపనిచో నీవే దురదృష్టవంతుడవు. వాని మాయచేజనులు వానిని మఱచియున్నారు, 'వీరు బాగుగనే యున్నారు; వీరినిట్లే యుండనిమ్ము.' అని వారినిజూచి భగవంతు డనుకొను చుండును.''

శిష్యుడు: అమ్మా, ఈ విలేఖరివలె జనులు భగవంతుని దర్శింప నిష్టములేనివారుకారు. అట్లయ్యును, వారి మనస్సులలో నిట్టి ప్రశ్నయే యేల కుదయించవలయును? వాస్తవమేమనగా, తమ 'సొంతముగా భావింపగోరు భగవంతుడు తమకు దూరుడగు చుండుటజూచి మనస్సున వారు చాల బాధపడుదురు. చైతన్యుడు,

బుద్ధుడు. యేసుక్రీస్తు మున్నగువారు తమ భక్తుల శ్రేయస్సునకై యెంతో కష్టించి పనిచేసిరి.

అమ్మగారు : అదియే శ్రీ గురుదేవుల దృక్పథముకూడ. భక్తులనందరిని జ్ఞప్తికి దెచ్చుకొనుట నాకెల్లప్పుడును సాధ్యము కాదు. "ఓ ప్రభూ! వారెచ్చటనున్నను అందరిని అనుగ్రహింపుడు. వారి నందరిని నేను జ్ఞప్తికి దెచ్చుకొన లేకున్నాను." అని శ్రీ వారికి నేను విన్నవించుచుందును. ఆయనయే సర్వము చేయుచున్నారు. లేనిచో, యింతమంది జనులేల రావలయును?

శిష్యుడు : అదితప్పక నిజము. జనులు కాళికను దుర్గను, ఇతర దేవతలను భగవంతునిగా నమ్ముట సులభము; కాని, ఒక మనుష్యుని భగవంతునిగా నమ్ముట సులభమా?

అమ్మగారు : అది వారి దయావిశేషముపైననే ఆధారపడి యున్నది.

భగవదనుగ్రహ మునకును, సూర్యునికిరణములకును గల సామ్యము

మరియొకనాడొక భక్తుడు వచ్చెను, "అమ్మా! మీకా యుత్తరమును వ్రాసినదీ భక్తుడే." అని శిష్యుడమ్మగారితో జెప్పెను. "అటులనా? మంచి కుఱ్ఱవాడుగనే కనుపడుచున్నాడు," అని చెప్పి, ఆ భక్తుని, సంబోధించి అమ్మగారిట్లు సెలవిచ్చిరి : "చూడుము. దిగువకు ప్రవహించుట నీటి స్వభావము; కాని, సూర్యుని కిరణములు నీటి నాకసము వైపునకు పైకి లేవనెత్తుకొనిపోవును. ఇట్లే మనస్సు సహజముగా తుచ్ఛవిషయములపై, భోగ్యపదార్థములపై బోవుచుండును; కాని, భగవంతుని దయయున్నచో మనస్సు మహోన్నత విషయములపై బోగలుగుచుండును."

అప్పటి కుదయమున పదిగంటల ముప్పది నిముషము లయ్యెను. గృహస్థుడగు నొక భక్తుడు వచ్చి, అమ్మగారికి ప్రణమిల్లి, ''అమ్మా! శ్రీ గురుదేవులు నాకేల కనుపడరు?'' అని అడిగెను. ''ధైర్యము విడనాడక ప్రార్థించుచుండుము. కాలక్రమమున సర్వమును ప్రాప్తించును. పూర్వకాలపు మునులును, ఋషులు నెన్నియుగములు భగవంతునికొఱకు తపస్సు చేసినను, కృతార్థులు కాలేదే! ఒక క్షణములో భగవంతుడు నీకు ప్రత్యక్షమగు ననుకొనుచున్నావా? ఈ జన్మలో కాకున్న రాబోవు జన్మలోనో, ఆ జన్మలో కాకున్న దాని తరువాతి జన్మలోనో నీ మనోరథము ఫలించును. భగవంతుడు ప్రత్యక్షమగు టంతసులభమా? కాని, యీసారి శ్రీ గురుదేవులు సులభమార్గమును కనుబఱచి యుండుటచే, భగవత్సాక్షాత్కారము బడయుటకు అందరకును సాధ్యమగును,'' అని అమ్మగారు బదులుచెప్పిరి.

భగవంతుడు మనుష్యుల కెందుకు కనుపడడు

ఆ భక్తుడు వెళ్లినతరువాత అమ్మగారిట్లు చెప్పిరి : ''అతడు ప్రాపంచిక విషయసాగరమున పూర్తిగా మునిగి యున్నాడు. డజనులకొలది పిల్లలుగలతండ్రి. అట్లయ్యును, ''శ్రీ గురుదేవుడు నా కెందుచేత కనుపడడు?'' అని అతడడుగుచుండును. స్త్రీలు చాలమంది శ్రీ గురుదేవుని కడకువచ్చి 'భగవంతునిపై మేమేల మా మనస్సు నేకాగ్రముగ నిలుపలేకున్నారము? ఎందుచేత మా మనస్సును స్థిరముగా నిలుపజాలకున్నాము?' అని బహువిధముల మొఱబెట్టుచుండెడువారు. శ్రీ రామకృష్ణులు వారి కిట్లు బదులు చెప్పుచుందురు : 'మీ కింకను పురిటిగది వాసనపోలేదు. ఆ వాసనను మొట్టమొదట వదుల్చుకొనుడు. భగవత్సాక్షాత్కారముకొఱకై మీ కింత తొందరయేల? సర్వము కాలక్రమమున

జరుగగలదు. ఈ విధముగా మనమీ జన్మలో నొండొరులము కలిసికొనినాము. రాబోవు జన్మలో మరల కలిసికొనెదము. అప్పుడు మీరు కడతేరుదురు.' సజీవుడైన మనుష్యుని చూచుట సులభము. నేనిచట నివసించుచున్నాను కనుక, నిచ్చట కెవరైన వచ్చినంతమాత్రమున నన్ను చూడగలరు. స్థూలనేత్రములతో నిపుడు శ్రీ గురుదేవులనుచూచు మహాభాగ్యమే కొలదిమంది పుణ్యాత్ములకో కలదు, విజయగోస్వామి ఢక్కాలో శ్రీ గురుదేవులనుజూచి వారి శరీరమునుగూడ స్పృశించెనట. శ్రీ గురుదేవులది విని 'నా యాత్మ బయటకుపోవుట మంచిదికాదు. బహుశః ఈ శరీరమింక చాలనాళ్లు జీవింపదు,' అని చెప్పిరి.

''భగవంతు నెవరైన చూచిరేమో నీవు నాకు చెప్ప గలవా? నరేనునకు శ్రీ గురుదేవులు భగవత్సాక్షాత్కార మనుగ్రహించిరి. ఎంత గొప్పవారైనను, శుకుడు, వ్యాసుడు, శివుడు మొదలగువారు పెద్ద చీమలవంటివారే. అప్పుడప్పుడు మాత్రమే, మెఱుపువలె భగవంతుడు వారికి గోచరించుచుండును. ఎవరికో కొందరికి భగవంతుడు కలలో కనుపడవచ్చును. కాని భగవంతుని స్థూలశరీరరూపమున జూచుట నిజముగా మహాభాగ్యము.

(ఉద్రేకముతో) ''నిర్మలాంతః కరణులకు ధ్యానమేల సాధ్యముకాదు? వారేల భగవంతుని చూడజాలరు? పరిశుద్ధాత్ములు జపముచేయునప్పుడు, భగవంతుని పావననామము తమ లోపలినుండి దానంతటది పాతాళగంగవలె పొంగివచ్చుచున్నట్లు వారికి తోచును. నామస్మరణకొఱకు వారెట్టి ప్రయాసగానిపడరు. నియమితకాలములందు బద్ధకమును వదలిపెట్టి, మెల్లరును ధ్యాన

జపములను చేయవలయును. నేను దక్షిణేశ్వరములో నుండినప్పు-డొకనాడు శరీర మస్వస్థతగా నుండినందున, కేవలము బద్ధకముచే నిద్రనుండి కొంచె మాలస్యముగా మేల్కొంటిని. ఆ కాలమున నేను తెల్లవారుజామున మూడుగంటలకే నిద్రనుండి లేచుచుండు దానను. ఆ మరునాడంతకంటె నాలస్యముగా మేలుకొంటిని. చివరకు రానురాను శీఘ్రముగా నిద్రనుండిలేచుటకే మనస్క-రింపనిస్థితికి వచ్చుచుంటినని కనుగొని 'ఆహా! తుట్టతుదకు సోమరి నైతిని,' అని నాలో నేననుకొంటిని. పిమ్మట నన్ను నేనే బలవంత పఱచుకొని, వేకువజామున లేవ నారంభించితిని. క్రమక్రమముగా నాతొల్లిటి యలవాటు మరల నాకు కలిగెను. ఇట్టివిషయములలో, మన మచంచలదీక్షతో మన యభ్యాసమును కొనసాగించుచుండ వలయును.

"తపోనిష్ఠ, భగవత్సేవ, తీర్థయాత్ర, ధనసంపాదన— వీని నెల్ల యౌవనమందే జనులు సాధింపవలయును. చూడుము.

పారమార్థిక సాధనలకు యౌవనమే సరియైన కాలము

కాశిలోను, బృందావనములోను నే నెన్ని చోట్లకో నడిచి వెళ్లుచుంటిని; కాని, యిప్పుడు కొలది యడుగుల దూరమునకైనను నాకు పల్లకి కావలసివచ్చుచున్నది. ఇతరుల నానుకొనుచున్నాను. వార్ధకములో శరీరము బలహీనమగును. మనస్సునకు పటుత్వము తగ్గును. అట్టి సమయమున నేమైన చేయుటకు సాధ్యపడునా? మన మఠములోని బాల సన్న్యాసులు చిన్నతనమందే తమ మనస్సును భగవంతుని వైపునకు మరల్చుచుండుటెంతయు సమంజసము. అందు కిదియే వారికి సరియైనకాలము. (శిష్యునితో) నాయనా! తపోనిష్ఠపూజ మొదలగువాని నిప్పుడే యభ్యసింపుము. కొంతకాలమైనతరువాత నివి సాధ్యమగునా?

సాధింపవలసినదెల్ల ఇప్పుడే సాధింపుము. ఇదియే సరియైన కాలము.''

శిష్యుడు: ఇప్పుడు మీ ఆశీర్వాదములను బడయువారు నిజముగా నెంతో ధన్యులు. ఇటుతరువాత వచ్చువారికి యీ సదవకాశము లభింపజాలదు.

అమ్మగారు: ఏమి నీ యూహ? వారు కృతార్థులు కారనియా నీ యభిప్రాయము? భగవంతు డెల్లప్పుడును, అంతటను నున్నాడు. శ్రీ గురుదేవు లెల్లప్పుడు నున్నారు. ఆయన దయవలన వారు కృతార్థులుకాగలరు. విదేశీయులు పారమార్థికాభ్యుదయమును బడయుట లేదా?

శిష్యుడు: తాను ప్రేమింపబడుచున్నట్లు మనస్సు గ్రహించె నేని, మనస్సున కాసక్తికలుగును; మీరు మమ్ము నిజముగా ప్రేమించుచున్నారా?

అమ్మగారు: నేను మిమ్ము ప్రేమించుచుండుట లేదా? నాకు బహు స్వల్పపరిచర్య చేసినవారినిగూడ నేను ప్రేమింతును. నీవు నాకెంతో సేవచేయుచున్నావు. నే నింటిలో నే వస్తువు తాకినను నీవు నాకు జ్ఞాపకము వచ్చెదవు. మీలో నాయొద్దనున్న వారిని నేను తలచుగా తలచుచుందును. దూరముగా నున్నవారి విషయమున ''ఓ ప్రభూ! వారి యోగక్షేమములను దయయుంచి కనిపెట్టుచుండుడు. నే నెల్లప్పుడును వారిని జ్ఞాపకముంచుకొనజాలను.'' అని శ్రీ గురుదేవునకు విన్నవించుచుందును.

1918-వ సం॥ అక్టోబరు.

అమ్మగారు మంచముపై గూర్చుండిరి. భక్తులు వ్రాసిన

యుత్తరములను శిష్యుడు శ్రీ దేవివారికి చదివి వినుపించుచుండెను.

జపము మనస్సును కుదురుగా నిలిపి భగవంతుని వైపునకు మరల్చును.

కృష్ణలాల్ మహారాజుకూడ నచ్చట నుండెను. 'మనస్సు నేకాగ్రముగా నిలుపజాలకున్నాము.' ఇట్టిభావము లా యుత్తరములలో నుండెను. శ్రీ మాతృదేవి వీనిని విని తీవ్రస్వరమున నిట్లు సెలవిచ్చిరి. "ప్రతిదినము భగవన్నామము పదునైదు లేక యిరువదివేలసారు లుచ్చరించినయెడల మనస్సు స్థిరముగా నిలుచును. ఇది నిజము. ఓ కృష్ణలాల్! ఇది నా స్వానుభవమువలన గ్రహించితిని. మొట్టమొదట జనులు దీని నభ్యసించి, తాము కృతార్థులుకానిచో లాభము కనుపడలేదని చెప్పకొనవచ్చును. కొంత భక్తితో వారు జపము నభ్యసింపవలయును. కాని వారేమియు చేయక 'మేమేల కృతార్థులమగుటలేదు?' అని మొఱపెట్టుచుందురు."

ఒకభక్తుడు గదిలోనికివచ్చి జపమును గురించియు, ధ్యానమును గురించియు నడుగగా అమ్మగారిట్లు చెప్పిరి: "భగవన్నామమును నియమితమగు లెక్కగా జపమాలతోనో, వ్రేళ్లపైననో, మానసికముగనో యుచ్చరించుటవలన మనస్సు భగవంతుని వైపునకు మరలును. సహజముగా మనస్సు పలుత్రోవల పరుగులెత్తుచుండును. అది యీ సాధనవలన భగవంతునివైపునకు తిరుగును. భగవన్నామ ముచ్చరించుచుండగా సాధకుడు తన యిష్టదైవస్వరూపమునుజూచి తన్మయుడగుచో, నతని జప మాగిపోవును. ధ్యానమునందు కృతార్థుడగువానికి సర్వము లభించును. "స్వతస్సిద్ధముగా మనస్సు నిలుకడలేని వస్తువు. అందుచే మనస్సును స్థిరముగా నిలుపుటకై, ఆరంభమందు కొంచెముగా శ్వాసను నిగ్రహించుచు సాధకుడు ధ్యాన మభ్యసింపనగును. ఇది

మనస్సు నిశ్చలముగా నుండుటకు తోడ్పడును. కాని, దీని నెవరైన మితముతప్పి చేసినయెడల, మెదడునకు వేడెక్కును. భగవద్దర్శనమునుగూర్చి కాని, ధ్యానమునుగూర్చికాని నీవు సంభాషింపవచ్చునుగాని, మనస్సే సర్వమునను విషయమును మఱువకుము. మనస్సు స్థిరముగా నిలుచుచో, సాధకునకు సర్వము లభించును.

"మానవులు భగవంతుని మఱచుటెంతయు సహజము కనుక, అవసరము కలిగినప్పుడెల్ల భగవంతుడే భూమిపై నవతరించి, తానే సాధనచేసి ముక్తిమార్గమును కనుబఱచును. భగవంతుడీసారి త్యాగాదర్శమును లోకమునకు బ్రదర్శించెను.

(తృతీయ భాగము *)

పారమార్థిక సాధన.

పారమార్థిక సాధనగూర్చి సన్యాసియగు నొక శిష్యునితో శ్రీ మాతృదేవి చేసిన ప్రసంగములే, సంగ్రహముగా ఈదిగువ నుదాహరింపబడుచున్నవి:

ప్రాణాయామము—తీర్థయాత్ర—కుండలిని

శిష్యుడు: అమ్మా! యోగాసనములను, ప్రాణాయామమును అభ్యసించుట మంచిదియా?

అమ్మగారు: ఈ సాధనలవలన అమానుషమహిమలు కలుగును. వీనివలన సాధకుని పారమార్థికాభివృద్ధికి అంతరాయము కలుగును.

శిష్యుడు: ఒక పుణ్యస్థలమునుండి మఱియొక పుణ్యస్థలమునకు బోవుచుండుట మంచిదియా?

---

* సన్న్యాసులును, గృహస్థులునగు పలువురు శిష్యులు లిఖించినవి.

అమ్మగారు: ఏదైన నొకానొకచోట మనస్సునకు నిలుకడ కలిగినేని, తీర్థయాత్ర కవసరమే లేదు.

శిష్యుడు : ధ్యానము నా కసాధ్యముగానున్నది. దయ యుంచి నా కుండలినీ శక్తిని ప్రబోధింపుడు.

అమ్మగారు : కాలక్రమమున అదియే మేల్కొనును. జపమును ధ్యానమును చేయుచుండుము. కుండలినీ శక్తికి స్వయం వికాసము లేదు. ఎడతెగకుండ ధ్యానము సాగిన కొలది, మనస్సు చాల నిశ్చలమగును గనుక, ధ్యానమును విడిచిపెట్టుటకు నీవే యిష్టపడవు. ధ్యానము చేయుటకు మనస్సు సుముఖముగా లేనిచో ధ్యానమునకు దానిని నిర్బంధపఱుపకుము. అట్టిస్థితిలో ప్రణామము లొనర్చి, ధ్యానాసనమునుండి లేచిరమ్ము. నిజమగు ధ్యానము దానంతటదియే కలుగవలెను.

చిత్తవిక్షేపము–జపము

శిష్యుడు : అమ్మా! ఎందుచే మనస్సు స్థిరముగా నిలువదు? నేను భగవంతుని దలంప బ్రయత్నించునపుడు, మనస్సు తదితర విషయముల పైకి బోవుచుండును.

అమ్మగారు: మనస్సు ఐహిక విషయములపైకి బోవుటతప్పు. 'ఐహిక విషయములు' అనగా ధనము, కుటుంబము మొదలగునవి. కాని మనస్సు సహజముగా, మనముచేయుచుండు పనిని గూర్చి తలపోయుచుండును. ధ్యానము సాధ్యముకాని యెడల, జపము చేయుము. జపమువలన పరమార్థముసిద్ధించును. మనస్సు ధ్యానమునకు సుముఖముగానున్నసరే. కాని బలవంతముగా దానిని ధ్యానమునకు నియమింపకుము.

పారమార్థిక సాధనకు తగిన స్థలము

శిష్యుడు : ఏకాంతస్థలమునగాక మఠము లోనో కాశీనగరములోనోయుండి పారమార్థిక సాధనలను చేయుట యెక్కువ ప్రశస్తమా?

అమ్మగారు : ఋషీకేశమువంటి యేకాంతస్థలమున పారమార్థిక సాధనలను చేయుచో నీమనస్సు బలీయమై, అటుపిమ్మట నీ వెచ్చట నున్నను, నెట్టిసమాజములోనున్నను అణుమాత్రమును చలింపవు. మొక్కలేతగా నున్నప్పుడు దానికి కంచెయో దడియో రక్షణకై యుండవలయును. కాని పెరిగి పెద్దచెట్టైనతరువాత, పశువులవలన దాని కెట్టిహానియు కలుగజాలదు. ఏకాంతస్థలమున పారమార్థిక సాధన బహు ముఖ్యము. ఆత్మవికాసమునకై కోరిక కలిగినప్పుడెల్ల, యేదైన సందేహముగాని చిక్కుగాని బయలు దేరినప్పుడెల్ల కన్నులనీరునించి భగవంతుని ప్రార్థింపుము. పరమేశ్వరుడు నీ హృదయ మాలిన్యమునంతయు కడిగివైచి, నీ మనోవేదనను నివారించి నీ కాత్మవికాస మొసంగును.

కర్మయోగము – పారమార్థిక సాధన

శిష్యుడు : పారమార్థిక సాధనలను చేయజాలని నీరసుడను. మీ పాదపద్మములే శరణముగా నైకొంటిని. నా యుద్ధరణమునకు అవసరమగుదాని నెల్ల మీరే యొనర్పుడు.

చేతులు జోడించి "శ్రీ గురుదేవుడు నీత్యాగశక్తిని కాపాడునుగాక!" అని ప్రార్థించి, అమ్మగారిట్లు చెప్పిరి: "ఆయన నిన్ను జాగరూకులై రక్షించుచున్నారు. నీవు భయపడనక్కర లేదు. శ్రీ గురుదేవుల కార్యమును నిర్వహించుచు, పారమార్థిక సాధనలనుకూడ చేయుచుండుము. పనిచేయుచున్నచో వ్యర్థాలో

చన లేవియు కలుగవు. ఏ పనియు లేనివానికి అట్టి ఆలోచనలు కుప్పలు తిప్పలుగా బయలు దేరుచుండును.''

శిష్యుడు: నా యారోగ్యరక్షణకై కొన్నాళ్లనుండి నేను యోగాసనము లభ్యసించు చున్నాను. ఆహారమును జీర్ణించుకొనుటకును, బ్రహ్మచర్య వ్రతావలంబనకును యోగాసనములు తోడ్పడును.

యోగాభ్యాసమును, ప్రాణాయామ సాధనయును.

అమ్మగారు: ఆ విషయమున నీవించుక జాగరూకుడవై యుండుము. నీవట్టి పనులను చాలకాలము చేయుచుండుచో, నీ మనస్సునకు శరీరమునందు సక్తత కలుగవచ్చును. ఇట్లని, నీవీ యభ్యాసములను విడచిపెట్టినచో నీ యారోగ్యమునకు భంగము కలుగవచ్చును. కనుక నీ వీ విషయమున వివేకముతో ప్రవర్తింప వలెను.

శిష్యుడు: అమ్మా! నే నీ సాధనను దినమున కైదు లేక పది నిముషముల వరకుమాత్రమే జీర్ణశక్తికొరకు చేయుచున్నాను.

అమ్మగారు: మంచిది. యోగాభ్యాసమును కొంతకాలము చేసి పిమ్మట విడనాడుచో, చివరకు నీ యారోగ్యము చెడవచ్చునని హెచ్చరిక చేసితిని. నాయనా! నీకు బ్రహ్మజ్ఞానము కలుగుగాక యని ఆశీర్వదించుచున్నాను.

శిష్యుడు: నేను ప్రాణాయామముకూడ కొంచెము చేయుచున్నాను. నే నా సాధనను చేయుచుండ వచ్చునా?

అమ్మగారు: ఔను, కొంచెముగా జేయవచ్చును. కాని,

ఎక్కువగా చేసినచో, నీ మెదడును నరములును తాపోద్రిక్తము లగును. మనస్సు దానంతటదియే స్థిమితపడుచో, నిక ప్రాణాయామ మెందుకు ?

శిష్యుడు : అమ్మా! కుండలినీ శక్తి మేల్కొనకపోయినచో, లాభమేమియు లేదు.

కుండలినీ వికాసమును, జపమును.

అమ్మగారు : నాయనా ! అది యెంతయు నిజము. కుండలినీ శక్తి క్రమక్రమముగా మేల్కొనును. భగవన్నామోచ్చారణమువలన నీకు సర్వమును లభించును. మనస్సు స్థిరముగానిలువకున్నను కూడ, నీ వొకచోట గూర్చుండి భగవన్నామమును పదిలక్షల సారులు జపింపవచ్చును. కుండలిని మేల్కొనుటకు పూర్వము అనాహత నాదము వినబడును ; కాని, శ్రీ విశ్వేశ్వరీ కటాక్షము లేని దే యేదియు సిద్ధింపదు. నేటి వేకువజామున బహుశా శివదర్శన ప్రాప్తి నాకు కలుగదని తలంచుచుంటిని. కాశీ* దేవాలయములో శివ విగ్రహము చాల చిన్నదికదా. పూవులతోను బిల్వపత్రములతోను కప్పబడి అది నీటియడుగున నుండును. ప్రాయికముగా విగ్రహ మెవరికిని కనుపడదు. ఈ యూహ నా మనస్సున బుట్టినవెంటనే, మిక్కిలి నల్లనిరాతి శివవిగ్రహమును స్పష్టముగా జూచితిని. అది మనము దేవాలయములో సేవించు విశ్వనాథుడేయని గ్రహించితిని. ఒక భక్తురాలు ఆ విగ్రహశిరోభాగమును తనచేతితో స్పృశించెను. నేనుకూడ వెంటనే ఆ విగ్రహముపై నా చేతి నుంచితిని.

* ఈ ప్రసంగము కాశిలో జరిగెను.

శిష్యుడు: అమ్మా! శిలావిగ్రహముతో మాకు తృప్తికలుగదు.

అమ్మగారు: నాయనా! అట్లనెదవేల? ఎంతమంది మహాపాపులు కాశీకివచ్చి, ఆ శివవిగ్రహమును దాకి ముక్తులగుచుండుటలేదు? ఆ మహాదేవుడు కొంచెమేని గొణుగుకొనకుండ అందరి పాపములను తన మూపున మోయుచున్నాడు.

భక్తుడు: పారమార్థిక సాధనల కెట్టిస్థలము తగినది? సాధకుడా సాధనల నెట్లు చేయవలయును?

అమ్మగారు: నీకు తగినస్థలము కాశి. మనస్సును భగవంతుని పాదారవిందములయందు స్థిరముగానిలుపుటయే, భగవద్విషయికములగు యోచనలయందు మనస్సుతగిలియుండునట్లు చేయుటయే పారమార్థిక సాధనల ప్రయోజనము. ఆ పావన నామస్మరణను చేయుచుండుము.

భక్తుడు: జీవితలక్ష్యమేమి?

అమ్మగారు: భగవత్సాక్షాత్కారము బడసి, తదేక

జీవిత లక్ష్యము

ధ్యాన నిమగ్నులై యుండుటయే మానవులకు జీవితలక్ష్యము. మీరు సన్న్యాసులు, భగవంతునిసొంతమని చెప్పదగినవారు. ఇహమందును పరమందునుకూడ మీ ఆధ్యాత్మిక శ్రేయస్సును పరమేశ్వరుడు కాపాడుచుండును. మీరిక దేనినిగూర్చి ఆందోళన పడవలయును? నిరంతరము భగవంతుని ధ్యానముచేయుట సాధ్యమగునా? కొంతకాలము పని చేయుడు. తక్కిన వేళల భగవంతుని ధ్యానింపుడు.

శిష్యుడు: అమ్మా! గాఢధ్యాన నిమగ్నుడనై, భగవదా

నంద సాగరమున నోలలాడుచుండ గలుగునట్లు దయయుంచి నన్నాశీర్వదింపుడు.

శ్రీ మాతృదేవి తమ పావన హస్తమును నాతలపైనుంచి, "ఎల్లప్పుడును నిత్యానిత్యవస్తు వివేచన చేయుచుండుము." అని నన్నాశీర్వదించిరి.

శిష్యుడు: అమ్మా! మాటలలో నిత్యానిత్య వస్తు వివేచన చేయుట సులభము. కాని, నిజముగా ఆచరణలో వివేచనచేయ వలసిన సమయమువచ్చినప్పుడు, మాకది జ్ఞప్తికిరాదు. అట్టి విషమసమయములందు ధర్మమార్గమును విడనాడకుండు శక్తిని నా కనుగ్రహింపుడు.

అమ్మగారు: నాయనా! నిరంతరము శ్రీ రామకృష్ణులు నీకు తోడునీడై రక్షించుచుందురుగాక! నీకు జ్ఞానము కలుగుగాక!

శిష్యుడు: అమ్మా! ఎన్నో దినములీరీతిని గతించిపోవు చున్నవి. కాని నా కేమియు సిద్ధింపలేదు.

అమ్మగారు: ఈ ప్రపంచ కోలాహలమునుండి విడివడి పరమేశ్వరుని పాదారవిందములందు నీ మనస్సు కుదురుగా నిలుచునట్లు వాని దయను బడసితివి. ఇది స్వల్పవిషయమా? "మా మనస్సునకు తృప్తిగా మేము ధ్యానప్రార్థనల చేయలేక పోవచ్చును. కాని ఈలోక వ్యసనములు మాకేవియు లేవు." అని యోగానందస్వామి చెప్పుచుండును. నా విషయము చూడుము. ఈ రాధునిమిత్తము నేనెంతయో కష్టపడుచున్నాను.

శిష్యుడు: ఒకతోటలో నేకాంతముగా పారమార్థిక సాధనలందు కొంతకాలము గడపవలెనని నాకోరిక.

అమ్మగారు : మంచిది. అందుకు తగిన కాలమిదియే. ఇట్టి సాధనలను చేయుటకుకూడ నిదియే తగినవయస్సు. కాని, నీ యాహారవిషయమై యెల్లప్పుడును జాగ్రత్తగానుండుము. యోగానందస్వామి కఠిననియమముల నాచరించి, తత్ఫలితముగా చాల కష్టపడి అకాలమరణము నొందెను.

గురువును, భగవంతుడును

ఒకనాడు ప్రసంగవశమున నొక శిష్యురాలు తమ యెడల తానే భావముతో ప్రవర్తింప వలయునని అమ్మగారి నడిగెను. "నన్ను రాధగనో, నీకు నచ్చిన యే యితరవిధముగనో నీవు భావింపవచ్చును. నన్ను నీ తల్లిగాతలంచిననుకూడ చాలు," అని అమ్మగారు బదులు చెప్పిరి.

దివ్యదర్శనములును, ఆధ్యాత్మిక వికాసమును

"చాలమంది భక్తులు దివ్యదర్శనములను గాంచిరి. కాని నే నేదియు చూడలేదు," అని శిష్యురాలు అమ్మగారితో విన్నవించెను. "ఇవి చాల స్వల్పవిషయములు" అని అమ్మగారు బదులు చెప్పినప్పుడు, శిష్యురాలి మనస్సు ఆశాపూరిత మయ్యెను. తన కాధ్యాత్మిక వికాసము కలుగునాయని యామె యడుగగా, కాలక్రమమున తప్పక కలుగునని అమ్మగారు నొక్కి చెప్పిరి.

ఆరాధనయును, విధాయకకృత్యములును.

శ్రీ గురుదేవుని ఆరాధన విషయమై శిష్యురాలడుగగా "నీవు గృహకృత్యములను చేయవలసిన దానవు; ఆరాధన చేయజాలవు. శ్రీ గురుదేవుని ప్రార్థింపుము. ఆయనయే నీకు సర్వము సిద్ధింపజేయును. చంద్రుడు పిల్లలందరకు నెట్లు మామయో, అట్లే శ్రీ గురుదేవుడు నీ సొంతము," అని అమ్మగారు చెప్పిరి.

"అమ్మా! మా జీవితపద్ధతి యెట్లుండవలెను?" అని యొక భక్తుడొకసారి అమ్మగారి నడిగెను.

అమ్మగారు : ఇప్పటివలెనే నీ జీవితమును గడుపుము. మనః పూర్వకముగా శ్రీ గురుదేవుని ప్రార్థింపుము. ఆయన నెల్లప్పుడును తలంచుచుండుము.

ఆధ్యాత్మికపతనమును, అహంకారమును, దైవసంకల్పమును

భక్తుడు : అమ్మా! ఆధ్యాత్మికముగా విశేషోన్నత్యమును గాంచిన మహానుభావులు కూడ పతితులగుటచూడ, నాకు భయమగుచున్నది.

అమ్మగారు : నీ వెల్లప్పుడును భోగవిషయములచెంత నుండుచో, వానికి వశుడవు కావచ్చును.

భక్తుడు : మానవుడు తన స్వయంకృషిచే నేమియు చేయజాలడు. ఆతని ముఖమున భగవంతుడే సర్వమును చేయుచున్నాడు.

అమ్మగారు: ఔను. అది నిజమే. కాని, నీకా జ్ఞానము నిరంతరమున్నదా? దురహంకారాంధులై జనులు తామే స్వతంత్రులుగ సర్వము చేయుచున్నట్లు తలంతురు. భగవంతునిపై వారాధార పడనే పడరు. పరాత్పరుడు తనపై నాధారపడువారిని రక్షించును.

* * *

"అమ్మా! మిమ్మే గురువుగానమ్మి, మీ యాశీస్సులను బడసినవానికి పారమార్థిక సాధన చేయవలసిన యావశ్యకత యున్నదా?" యని సన్న్యాసియగు నొకశిష్యుడు శ్రీ మాతృదేవి నడిగెను.

పారమార్థిక సాధనల యావశ్యకత

అమ్మగారు : అది నిజమే. కాని యీ విషయ మెటువంటి దనగా: గదిలో వివిధములైన ఆహార పదార్థము లుండవచ్చును. కాని భోజనము చేయవలెననిన, నెవరుకాని వానిని వండ వలయును. ముందుగా వంటను ముగించువారు ముందుగనే భోజనము చేయుదురు. ఈ రీతిగా కొందరుదయముననే భుజింతురు; మరికొందరు సాయంకాలమునకుగాని భుజింపలేరు. మిక్కిలి సోమరులైనవారు భోజనమేచేయక యుపవాసముందురు.

శిష్యుడు : అమ్మా! మీ మాటలు నాకు బోధపడుట లేదు.

అమ్మగారు : సాధకుడెంత పారమార్థిక సాధనలను చేసిన నంత త్వరితముగా భగవత్సాక్షాత్కారమును బడయును. అతడెట్టి యాధ్యాత్మిక సాధననుకూడ చేయకపోయినను, చిట్టచివరకు ముక్తినొందును—ఇది నిజము. కాని ధ్యానప్రార్థనలను చేయక కాలమును వృధాచేయువారికి, పరమార్థానుభూతి కలుగుటకు ఆలస్యమగును. పారమార్థికసాధనలను చేయుటకే నీవు సంసారమును పరిత్యజించితివి. కాని నీవీ సాధనల నెల్లప్పుడు చేయజాలవు గనుక, సత్కర్మ నీవొనర్చుట యావశ్యకము. ఆ కర్మను శ్రీ గురుదేవుడే నీకు నిర్ణయించెనని నీవు భావింపవలయును. కఠిన నియమబద్ధమైన జీవితము నీకు మంచిదికాదు. కడుపునొప్పిచే బాధపడుచుందువు. నీ యాహారము విషయమై జాగ్రత్తగా నుండుము. ఇది ప్రాణాంతకమగు వ్యాధికాదు గాని, బాధకరముగా నుండును.

* * *

"అమ్మా! ఎవరికైన బ్రహ్మజ్ఞాన మెట్లుకలుగును? క్రమక్రమముగా సాధనచేయుటవలననో లేక తానంతటదియే సిద్ధిం

చునా?'' అని యొకనాఁ డొక శిష్యుడు శ్రీ మాతృదేవి నడిగెను. "బ్రహ్మవిద్య మిక్కిలి కష్టము. శ్రీ గురుదేవులను ప్రార్థింపుము. వారు సముచిత కాలమున నీకు బ్రహ్మజ్ఞాన మొసంగెదరు.'' అని అమ్మగారు బదులుచెప్పిరి.

*　　　　*　　　　*

మనోనిగ్రహము

''అమ్మా నా మనస్సు బహు చంచలముగా నున్నది. ఏ విధముగా ప్రయత్నించినను, నేను దానిని స్థిరముగా నిలుపలేకున్నాను.'' అని అమ్మగారి సమక్షమున కోల్హాపూరులో నొకశిష్యు డడిగెను. ''గాలి మేఘముల నెగురఁగొట్టునట్లు, భగవన్నామము సంసారవిషయ లౌల్యమను మబ్బును పటాపంచలు చేయును.'' అని శ్రీ మాతృదేవి చెప్పిరి.

ఆనాఁడే తన మనోదౌర్బల్యమునుగురించి మరియొకశిష్యుడు మొఱపెట్టుకొనఁగా, ''కామమును పూర్తిగా జంపివేయుట కెవరికైన సాధ్యమగునా? శరీర మున్నంతకాల మెవరికైనను, కామమే లవలేశమొ యుండకతప్పదు. కాని మాంత్రికుని విభూతికి పాము లొంగియుండునట్లు, పరిశుద్ధాత్ముల మనోబలమునకు అది లొంగియుండవచ్చును,'' అని అమ్మగారు సెలవిచ్చిరి.

*　　　　*　　　　*

ఆస్తికవిశ్వాసమును, పాండిత్యమును

భగవంతునియెడల నుండవలసిన నమ్మకమునుగురించి ఒకసారి శ్రీ మాతృదేవి యిట్లు ఆనతిచ్చిరి: ''కేవలము పుస్తకములను చదువుటవలన నెవరికైన భగవంతునియందు నమ్మకము కలుగునా? అమితమగు గ్రంథపఠనమువలన, చిత్త విభ్రమణము

కలుగును. బ్రహ్మమే సత్యము, సంసార మనిత్యమను విషయమును గ్రహించుటకుమాత్రమే మానవులు మతగ్రంథములను చదువవలయునని శ్రీ గురుదేవులు చెప్పుచుండెడివారు. కొన్ని వస్తువులను నాకొరకు తీసికొని రమ్మని నీకొక యుత్తరము వ్రాసితి ననుకొనుము. ఆ యుత్తరము నీ కెంతకాల మవసరము? దానిలోని సంగతులు నీకు తెలియునంతవరకే కదా! అందలి విషయములు నీకు తెలిసిన తరువాత, నీకా యుత్తరమెందుకింక? అప్పుడు నీవా వస్తువులను సేకరించి నాకడకు వత్తువు. అట్లు కానిచో, నా యుత్తరమును రేయుంబవళ్లు చదువుటవలన లాభమేమి?''

ముక్తిమార్గము

''సంసారజీవిత సాగరమున మునిగియుండువారు దేనిని సాధించుటకును వీలుపడదు,'' అని యొకనాడొక శిష్యుడు ప్రసంగవశమున విన్నవింపగా, అమ్మగారిట్లు బదులు చెప్పిరి: ''నాయనా! ఈ సంసారము అగాధమైన బురదమడుగు వంటిది. అందొకసారి చిక్కువడినవారు మరల బయటకువచ్చుట బహు కష్టము; బ్రహ్మ, విష్ణు లంతటివారికిగూడ మతులు పోవును. ఇక మానవులను గూర్చి చెప్పుటకేమున్నది! భగవన్నామస్మరణ చేయుచుండుము. నీ వట్లుచేయుచో, ఆపరమేశ్వరుడెప్పుడో యొకనాడు నిన్ను బంధవిముక్తుని గావించును. నాయనా! పరాత్పరుడే యా బంధములను తొలగింపకున్న, నెవరికైన ముక్తి లభించునా? భగవంతుని యందు పరిపూర్ణమైన నమ్మకమును కలిగియుండుము. పసిబిడ్డలెట్లు తమ తల్లిదండ్రులే తమకు దిక్కని భావింతురో, శ్రీ గురుదేవునట్లే భావింపుము.''

* * *

"అమ్మా! కల్పవృక్షముక్రింద నున్నప్పుడేదో యొక కోరికను మనము కోరవలయునందుకు! కాని మేము మీబిడ్డలము. బిడ్డలు ప్రత్యేకించి తల్లియెదుటబడి యేమి కోరవలయును? తనబిడ్డల కేది శ్రేయస్కరమో తల్లి గ్రహించి, వారికి దానినే యెల్లప్పు డిచ్చుచుండును. శ్రీ గురుదేవుడు చెప్పుచుండినట్లు వారివారి జీర్ణశక్తికి తగినట్లుగా తల్లి తనబిడ్డలకు వేర్వేఱు భోజన పదార్థములను వండును,' అమ్మా! ఇక నాకు బహు శ్రేయస్కరమైన దేదో సెలవిండు!"

ఆత్మార్పణమును, ఆధ్యాత్మికాభివృద్ధియును

అమ్మగారు: మానవునిబుద్ధి అత్యల్పము. తనకు కావలసిన దొకటియైయుండ, వేఱొకటి కోరును. వినాయకుని చేయబోయి చివరకు కోతిబొమ్మను చేయును. కనుక కోరిక లన్నిటిని భగవంతుని పాదారవిందములకడ సమర్పించుటయే యుత్తమము. మనకు బహు శ్రేయస్కరమైన దేదియో ఆ పరమేశ్వరుడే మన కొసగును. కాని మానవులు భక్తివైరాగ్యములకొఱకు భగవంతుని ప్రార్థింపవచ్చును. ఇవి, కోరికలలో చేరజాలవు.

*　*　*

పారమార్థికజీవితము-శ్రద్ధ

ఒకనాడు భక్తులయొద్దనుండి శ్రీ మాతృదేవికి చాల ఉత్తరములు వచ్చినవి. సాయంకాలమున శిష్యుడాయుత్తరములా మెకు చదివి వినుపించుచుండెను. అందలి విషయములను విని అమ్మగారిట్లు సెలవిచ్చిరి: "ఈ పిల్ల లెన్నిరకముల కోరికలను తెలుపుచున్నారో చూచుచున్నావా? 'మేము జపధ్యాన ప్రార్థనలు చేయుచున్నను, మాకేమియు సిద్ధికలుగుటలేదు,' అని కొందరు వ్రాయుచున్నారు. మఱికొందరు తమ కీలోకమున కలుగుచున్న కష్టములను, దుఃఖ

ములనుగూర్చియు, తమ మనోవ్యాకులములనుగూర్చియు మొర పెట్టుచున్నారు. నే నిట్టివింక వినజాలను. 'ప్రభూ! ఇహపరములందు వీరి నెల్లప్పుడును రక్షింపుము' అని నేను శ్రీ గురుదేవుని నిత్యము ప్రార్థించుచున్నాను. వీరి తల్లినగు నే నింతకంటె దేనికొరకు ప్రార్థింపగలను? కాని నిజముగా భగవత్సాక్షాత్కారమును కోరువారెందరు కలరు? అందుకు కావలసిన శ్రద్ధ యెక్కడున్నది? తమకెంతో భక్తి, పరాకాంక్షలున్నట్లు వీరు చెప్పుకొందురేకాని, యేదోయొక భోగ మెంత లవలేశము కలిగినను, దానితో తృప్తిపడి 'ఆహా! భగవంతుడెంత దయామయుడు!' అని తమ సంతోషాతిశయమును వెలిబుచ్చుచుందురు. కొంతమంది భక్తులు రాధు యోగక్షేమమును విచారించుచు నాకు జాబులు వ్రాయుచుందురు. నన్ను కేవలము మెప్పించుటకై, మరే విషయమునైన తడవుటకుముందు రాధునుగురించి అడుగుచుందురు. నేనీ లోకమునువీడి వెళ్లినతరువాత, దానివైపు చూచువారైన నుండరు.''

ముక్తి - భక్తి

ఒకనాడొక శిష్యుడు భక్తిముక్తులను గురించి యడుగగా శ్రీ మాతృదేవి యిట్లానతిచ్చిరి: ''భగవంతు డేక్షణమందైనను ముక్తి నియ్యవచ్చునుగాని, భక్తి నంత సులభముగా నిచ్చుట కిష్టపడడు.'' సంకల్పమాత్రమున నెవరికైన ప్రసాదించుటకు ముక్తి ధనమును తమ గుప్పిటనుబట్టి యుంచినట్లుగా శ్రీమాతృదేవి యీమాటల నుచ్చరించిరి. కాని వెంటనే అమ్మగారీ ప్రసంగమును మార్చివైచిరి.

* * *

ఒకసారి జయరాంబటిలో శ్రీ మాతృదేవిగారి యింటి పెరటిలో, వేకువజామున లేగదూడ అరచుచుండెను. పాలు

భగవంతునికొఱకు ఆత్రత

పితుకుటకై దానితల్లిని దానియొద్దనుండి విడదీసిరి. దూడ అర్పులను విని, అమ్మగారు దానికడకు పరుగు పరుగునవెళ్లి, ''ఉండు ముండుము! నిన్ను నీతల్లియొద్దవిడిచి వైచెదను,'' అని చెప్పుచు దూడను దానితల్లికడ జేర్చిరి. ఆసమయమున అమ్మగారిమోమున ప్రసరించుచున్న దయార్ద్ర దృక్కులనుజూచి శిష్యుడు విస్మయమొంది, మూర్తీభవించిన విశ్వమాతృప్రేమయే యామె యని గ్రహించెను. ఆహా! ఆ లేగవలె మనముకూడ భగవంతుని కొఱకు విలపించుచో, నాతడు మనలను సకల సంసార బంధముల నుండి విముక్తుల గావించునుగదా!

* * *

చాలరాత్రి యగువరకును ప్రసంగము జరిగెను. 'మీమీ విధాయక కార్యములను కష్టపడిచేయుచో, భగవత్సంకల్పము ప్రకారము సర్వమును మీకు సిద్ధించును.' అని క——తమతో చెప్పుచుండునని అమ్మగారికి శిష్యుడు విన్నవించెను. ''నిజమే. మీమీ విధాయకకృత్యములను మీకు చేయవలసినదే యుండును. కాని ధ్యాన, జప, ప్రార్థనలనుగూడ చేయుట మిక్కిలి యావశ్యకము. అధమ ముదయమునను, సాయంకాలమునను ఈసాధనలను చేయవలయును. పడవకు చుక్కానివలె, ఈ సాధన మానవ జీవితమునకు మిక్కిలి యుపకరించును. సాయంకాల ప్రార్థనకై కూర్చుండునప్పుడు, సాధకుడా పగలంతయు తాను సత్కర్మలను చేసెనో, పాపకర్మలనాచరించెనో వివేచన చేయవచ్చును. పిమ్మట నాతడానాటి తన మానసికస్థితిని, మున్నాటి తన మానసికస్థితితో పోల్చి చూచుకొనవలయును. ఇంతేకాక, అతడు జపమొనర్చు

కర్మ ధ్యానములను రెండిటిని చేయవలయును

నప్పుడు తన యిష్టదైవమూర్తిని ధ్యానింపవలెను. ధ్యానమునందు మనకు మొట్టమొదట కనుపడునది మన యిష్టదేవత ముఖము. అంతతో తృప్తిపడక మనమామూర్తి నాపాదమస్తకము ధ్యానింప వలయును. మీమీ పనులతోపాటుగా నుదయమునను సాయంకాలమునను మీరు ధ్యానముచేసిననేతప్ప, మీరు చేయునది సత్కర్మయో, పాపకర్మయో మీ కెట్లు తెలియగలదు?'' అని శ్రీ మాతృదేవి సెలవిచ్చిరి.

''పారమార్థిక జీవితమున ధ్యాన జపములవలననే కృతార్థులము కాగలముకాని, కర్మవలన మనకేదియు సిద్ధింపదని కొందరందురు.'' అని శిష్యుడు మనవిచేయగా

కేవల ధ్యాన సాధనలో గల ప్రమాదములు

అమ్మగారిట్లు బదులు చెప్పిరి: ఏది ఫలప్రదమో యేది కాదో, వారెట్లు తెలిసికొనిరి? ఏ కొలదినాళ్లో ధ్యాన జపము లభ్యసించు సాధకునకు సర్వము లభించునా? మహామాయ దయయుంచి, పరమార్థసిద్ధికి గల అడ్డంకులను తొలగించిననేతప్ప, నెవరికి నేమియు లభింపదు. బలవంతముగా మితిమీరి ధ్యాన ప్రార్థనలను చేయుటచే నొకనికి మతి చెడిపోవుటను మీరు మొన్న చూడలేదా? మతిచెడిన తర్వాత, మనుష్యుని జీవితమే నిరర్థకమగును. మానవునిమనస్సు బహు సూక్ష్మమైనది. ఏ మాత్రము లోపము జరిగినను నెంతవానినైన నున్మాదుని జేయును. భగవంతు నెల్లప్పుడును స్మరించుచు సరియైన జ్ఞానముకొరకెల్లరును వానిని ప్రార్థించుచుండవలయును. నిరంతరము ధ్యాన జపములను చేయగలవారెందరున్నారు. కొందరారంభమందు పట్టుదలతో ఈ సాధనలను జేయుదురుకాని, ఎల్లప్పుడును చిత్రాసనములపై గూర్చుండుటవలన, న—విషయములో జరిగినట్లు, వారితలలు వేడెక్కి, గర్వాంధులై వివిధ

విషయములపైకి మనస్సుపోయి యెన్నో చింతలతో బాధపడు చుందురు. యథేచ్ఛగా మనస్సును తిరుగనిచ్చుటకంటె పనిచేయు చుండుటయే చాలమంచిది. ఆ రీతిగా నిలుకడలేక తిరుగుటకు అవకాశ మబ్బిన మనస్సువలన, కలవరము కలుగును. ఈ విష యములన్నిటి నాలోచించియే, నా నరేను జనులకు నిష్కామ కర్మచేయుటకు వీలగు సంస్థలను నిర్మించెను. న—ను గూర్చి మరల నిట్లు శ్రీ మాతృదేవి ప్రసంగించిరి: "ఒకచోటుననే యెల్లప్పుడు కూర్చుండుటచే నతడు తనమనస్సు నెట్లు మలినపరచు కొనుచున్నాడో నీవు చూచుచునే యున్నావు. అతని ఛాందస భావములును, మూఢ విశ్వాసములును నానాటికి పెచ్చుమీరు చున్నవి. అతడెల్లప్పుడును తన మనోవ్యథలనుగూర్చి మొరపెట్టు చుండును. అంతె చింత యెందుకుండవలయును? ఈ యనుభవము లన్నిటివలన నతనికి జ్ఞానోదయము కలుగజాలదా?"

*　　　*　　　*

తపస్సెంత పవిత్రమో కర్మకూడ అంత పవిత్రము

శ్రీ మాతృదేవి కోరికపై నొకశిష్యుడామె సన్నిధిని నివసించుచుండెను. అతడెల్లప్పుడును పూజామందిరములో ఆరాధన యందును తదితర కార్యములయందును నిమగ్నుడై యుండువాడు. బేలూరుమఠము లోని కొంతమంది సన్న్యాసులు తపోనిష్ఠ నభ్యసింప వివిధప్రదేశములకు వెడలుచుండి రని విని, "నేనీ పనులన్నిటియందు నిమగ్నుడనై యుండుట నాకు శ్రేయస్కరముగా తోచుటలేదు. నాకుగూడ తపస్సు చేయవలె నని కోరిక యున్నది. దయయుంచి మీ యనుజ్ఞ నొసంగుడు," అని అతడు విన్నవించెను. "నాయనా! నీ వెందుకట్లు తలంప వలయును? నీ విప్పుడు నాపనిని చేయుచున్నావు, శ్రీ గురుదేవుని

కార్యభారమును భక్తిశ్రద్ధలతో నిర్వహించుచున్నావు. ఏవిధముగ నైన నివి తపోనిష్ఠకంటె నాధ్యాత్మికముగా తక్కువ విలువ కలవియా? ఈ పనుల నీవేల విడనాడవలయును? తపస్సుచేయ వలయునను తీవ్రవాంఛ నీకెప్పుడైన కలుగునెడల, ఒకటి, రెండు నెలలు నీవెచ్చటికైన వెళ్లవచ్చును,'' అని అమ్మగారు సెలవిచ్చిరి.

*　　　*　　　*

ఆరాధన – జపము

శ్రీగురుదేవు నారాధనను తనకు బోధింప నొక భక్తురాలు ప్రార్థింపగా, ''సంసార లంపటమున దగులొన్న నీవు ఆరాధనను చేయజాలవు. శ్రీగురు దేవుని పావననామమంత్రము నీకుపదేశించితిని. ఆ మంత్రమును జపించుచో నీకు సర్వము లభించును,'' అని అమ్మగారు సెలవిచ్చిరి.

*　　　*　　　*

తీవ్రమైన భక్తిలేకుండ శ్రీ భగవానుని నామస్మరణ చేసినంతమాత్రమున నేమైన లాభము కలదాయని యొక భక్తుడు శ్రీ మాతృదేవి నడిగెను.

జపము చేయవలసిన పద్ధతి.

అమ్మగారు: నీవు నీటిలోనురికినను, నిన్నితరులు నీటిలో త్రోసినను, నొకేవిధమున నీ బట్టలు తడసిపోవును. అంతేకాదా? నీ మనస్సింకను బలహీనముగా నుండుటచే, ప్రతిదినము ధ్యానముచేయుచుండుము. నిరంతర ధ్యానమువలన మనస్సున కేకాగ్రతకలుగును. ఎల్లప్పుడును నిత్యానిత్య వస్తువివేచన చేయుచుండుము. ఎప్పుడైన నేవిషయముపైనను నీమనస్సుపోవు చున్నట్లు తోచెనేని, ఆ విషయానిత్యతనుగూర్చి తలపోసి, నీ మనస్సును దానినుండి భగవంతుని వైపునకు మరలింప ప్రయ

త్నింపుము. ఒక మనుష్యుడు గాలము వేసి చేపలుపట్టుచుండెను. ఆ మార్గముననే యొక పెండ్లి యూరేగింపు తాళమేళములతో బోవుచుండిననుకూడ, వాని దృష్టియంతయు గాలము ముల్లుపైననే నిలిచియుండెను. ఊరేగింపును క్రేగంటితోనైన నతడు చూడడయ్యెను.

ఆధ్యాత్మిక సాధనలజేయుటకు తగినచోటు నేర్పరచుకొనవలెనను కోరిక తనకున్నను, తన దేహారోగ్యము బాగులేదని సన్న్యాసియగు నొక శిష్యుడు శ్రీ మాతృదేవికి విన్నవించెను.

*　　　*　　　*

అమ్మగారు: ప్రస్తుతము కొంతకాల మించుక పనిచేయుచుండుము. పిమ్మట తపోనిష్ఠ నవలంబింపవలెనను తీవ్రవాంఛ కలిగినప్పుడు, నీవా పనిని విడిచిపెట్టవచ్చును.

శిష్యుడు: నేను జపముచేయుచున్నానేకాని మనస్సునేకాగ్రముగా నిలుపలేకున్నాను.

అమ్మగారు: ఏకాగ్రముగ నీమనస్సు నిలిచినను సరే, నిలువకున్నను సరే, భగవన్నామస్మరణ చేయుచుండుము. ప్రతిదినము నిర్ణీత సంఖ్య ప్రకారం నామజపము చేయుచుండుట నీకు శ్రేయస్కరము.

ప్రతిదినము నిర్ణీతసంఖ్య ప్రకారము జపము చేయుము

*　　　*　　　*

శిష్యుడు: అమ్మా! నిర్ణీతసంఖ్యనే జ్ఞప్తియందుంచుకొని పవిత్ర మంత్రజప సాధనను జేయుదునా?

అమ్మగారు: సంఖ్యయందే దృష్టియుంచి జపముచేయుచో నీ మనస్సు సంఖ్యపైననే నిలువవచ్చును. కనుక సంఖ్యను ప్రధానముగ పాటింపక, నీవు భగవన్నామ జపముచేయుట మంచిది.

శిష్యుడు : జపముచేయునప్పుడు మా మనస్సేల భగవంతుని యందు లీనముకాకున్నది?

అమ్మగారు : క్రమముగా లీనమగును. ఏకాగ్రముగా మనస్సు నిలువకున్నను, నామస్మరణ మాన వలదు. విధాయకముగా నీవు చేయవలసిన పని చేయుచుండుము. నామస్మరణ చేయునపుడు మనస్సుదానంతటదియే, గాలి తగులకుండ నొకచోటనుంచిన క్రొవ్వువత్తి దీపము వలె, భగవంతునిపై స్థిరముగా నిలుచును. దీపము గాలికే చలించి కొట్టుకొనును. ఇట్లే మనభ్రమలును కోరికలును మనస్సును చెదరగొట్టును. మంత్రోచ్చారణ సరిగా లేనియెడల కూడ చిత్తమున కేకాగ్రత చేకూరుట ఆలస్యమగును. వెనుక టొకొక స్త్రీకి, 'రుక్మిణీ నాథాయ'అను పవిత్రనామ ముచ్చరింప గురువు బోధించెను. కాని యామె అంత పెద్దమాట నుచ్చరింపలేక 'రుక్కు, రుక్కు' అని స్మరణచేయు చుండెను. అందువలన నామెకు కొలదినాళ్లవరకు అభివృద్ధి కలుగలేదు. కాని కొంతకాలమైన తరువాత భగవదనుగ్రహమువలన నామెకు సరియైనమాట స్ఫురించి, జపము ఫలించెను.

ఏకాగ్రత - జపము

* * *

అమ్మగారు కోల్పారాలోని జగదంబాశ్రమమందు నివసించు చుండినప్పుడు, వారొక భక్తునితో నిట్లు ప్రసంగించిరి.

భక్తుడు : భగవన్నామ జపమును చేయుటకుముందు సాధకుడు శాస్త్రోక్తముగా తన మోమును కడుగుకొన వలెనా?

అమ్మగారు: ఔను. స్వగృహమందున్నప్పుడు, సాధకుడీ నియమముల ననుసరింపవలయును; కాని పరస్థలమున నుండుచో జపమును మానసికముగా చేయవచ్చును.

భక్తుడు: పరస్థలమున నున్నప్పు డతడు భగవన్నామమును మాత్రమే యుచ్చరింప వలయునా, లేక గురువు తనకుపదేశించిన మంత్రముచ్చరింప వలయునా?

ఏకాగ్రచిత్తముతో, చేయు జపము చాల ఫలప్రదము

అమ్మగారు: ఔను. మంత్రమునుకూడ నుచ్చరింపవలయును. మనోనిగ్రహముతో భగవన్నామము నొకసారి జపించుట, భగవత్పరము కాని మనస్సుతో లక్షసారులు జపించుట కంటె చాలమేలు, అన్యవిషయములపై మనస్సునుంచి నీవు దినమంతయు నామజపము చేసినను దానివలన విశేషలాభము కలుగదు. మనస్సు నేకాగ్రముగానిలిపి జపము చేసినప్పుడే, మనకు భగవదనుగ్రహము కల్గును.

భక్తుడు: నేనిప్పుడు చేయుచున్నది చాలునా, లేకయేదైన, నెక్కువగా చేయవలయునా?

అమ్మగారు: నీవిప్పుడు చేయుచున్నట్లే యిటుతరువాత కూడ చేయుచుండుము. శ్రీరామకృష్ణులు నిన్నిదివరకే తమ సొంతముగా స్వీకరించి యున్నారు.

భక్తుడు: రెండుమూడు నాళ్లైనను శ్రద్ధతో తనను ప్రార్థించు వారికి భగవంతుడు సాక్షాత్కరించునందురు. నేనెంత కాలమునుండియో ప్రార్థించుచున్నను, నాకెట్టి సాక్షాత్కారము గాని కలుగకున్నదేమి?

అమ్మగారు: నాయనా! సర్వమును కాలక్రమమున లభించును. శ్రీరామకృష్ణుల వాక్యములు శివుని వాక్యములవలె అమోఘములు; వ్యర్థము లెన్నటికిని కాజాలవు. వారి యందు

భక్తికలిగి వారి పాదారవిందములకు శరణు జొచ్చుము. నిన్ను నిరంతరము రక్షించుచున్న తల్లిగాని తండ్రిగాని యెవరో యొకరున్నారని జ్ఞప్తియందుంచుకొనిన చాలును.

భక్తుడు: మీ మాటలయందు నాకు పరిపూర్ణ విశ్వాసము కలదు.

* * *

ఒకసారి యొకశిష్యుడు శ్రీ మాతృదేవికిట్లు విన్నవించెను: "అమ్మా! జపమాలతో జపముచేయుచున్నప్పుడు సంఖ్యలను నేను లెక్కపెట్టలేకున్నాను. వ్రేళ్లు కదలుచున్నయెడల, నాలుక నిశ్శబ్దముగా నిలిచిపోవును. చేతులును నాలుకయును పనిచేయునెడల, మనస్సు స్థిరముగా నిలువదు."

అమ్మగారు: కొంతకాలమైనతరువాత నీవ్రేళ్లును నాలుకయును వానిపనిని చేయకపోయినను, మనస్సుమాత్రము భగవంతుని ధ్యానించుచున్నట్లు నీవు గ్రహింతువు.

* * *

వ్రేళ్లపై జపము

ఒకసారి యొకభక్తుడు తనవ్రేళ్లపై మంత్రోచ్చారణలనెట్లు లెక్కపెట్టవలెనో మఱచిపోయి, అమ్మగారి నావిషయమై నడుగుమని శిష్యునిపేర వ్రాసెను. అమ్మగారిదివిని "మరచిపోయిననేమి? ఏ విధముగనైనను లెక్కపెట్టవచ్చును. దీని ప్రయోజనమంతయు భగవంతునివైపునకు మనస్సును మరలించుటయే" అని చెప్పిరి.

* * *

ధ్యాన జపములనుగురించి శ్రీ మాతృదేవి శిష్యునితోనిట్లు ప్రసంగించిరి: "జ్ఞానోదయ శుభసమయ మెప్పుడువచ్చునో

పారమార్థిక సాధనలను నియమిత కాలములందు తప్పక చేయుచుండవలయును

చెప్ప వీలులేదు కావున, ఈ పనులకొక నియతకాలము నేర్పాటుచేసికొనుట మిక్కిలి యావశ్యకము. ఆసమయమంత యాకస్మికముగావచ్చును. అందునుగురించి యెవరికిని, ముందుగా నేదియు తెలియదు. కనుక నెన్నిపనులున్నను నిర్ణీత కాలములందు జనులు తప్పక సాధన చేయుచుండవలయును.''

శిష్యుడు : ఒకొక్కప్పుడు శరీర మనారోగ్యముగా నుండును, మరికొన్ని వేళలందు పనియొత్తిడి యెక్కువగా నుండవచ్చును. ఇందువలన నాయా నియతకాలములందు సాధన చేయుట యెల్లప్పుడును సాధ్యము కాదు.

అమ్మగారు : శరీర మనారోగ్యముగా నున్నప్పుడు మన మేమియు చేయలేము. కాని, పనిలో నెంత మునిగి తేలుచున్నను, మనమధమము భగవంతునిస్మరించి నమస్కరించుచుండవలెను.

శిష్యుడు : సాధన కుత్తమకాల మేది?

అమ్మగారు : రేయుంబవళ్ల సంధ్యాకాలము భగవత్ప్రార్థనకు మిక్కిలి యనుకూలము. రాత్రి యంతరించి పగలు ప్రారంభమగును; దిన మస్తమించి రాత్రి ప్రారంభమగును—ఇదియే దివారాత్రముల సంధి. ఈ సమయములందు మనస్సు నిర్మలముగా నుండును.

మనోదార్బల్యమును గురించి శ్రీ మాతృదేవి శిష్యునితో నిట్లు చెప్పిరి: ''నాయనా! ఇది ప్రకృతి నియమము. పూర్ణిమ, అమావాస్యలను నీవు చూచుచున్నావు కావా? ఇట్లే మనస్సు కొన్ని వేళలందు మంచి సంస్కారములకును మరికొన్ని వేళలందు చెడు సంస్కారములకును లోనగుచుండును.''

తాను రైలుబండిలోగాని పొగయోడలోగాని ప్రయాణము చేయుచుండునప్పుడు జపమెట్లు చేయవలయునని యొకశిష్యుడడుగగా, "మానసికముగా మంత్ర ముచ్చరింపుము. నీ వ్రేళ్లును నాలుకయును క్రమక్రమముగా పనిచేయుట మానివేయును. మనస్సుమాత్రమే, పనిచేయుచుండును. చివరకు మనస్సే గురువగును," అని అమ్మగారు సెలవిచ్చిరి.

ప్రయాణము చేయుచుండునప్పుడు జపము

* * *

ఒకానొక యుత్సవ సమయమున దొమ్మరివాడొకడు వేర్వేరు రకముల విద్దెలను బ్రదర్శించుచుండెను. తన రొమ్ముపై నొక పెద్దరాయి పెట్టించుకొని దానిని పగులగొట్టించుకొనుట ఆ విద్దెలలో నొకటి. దానిని పగులగొట్టుచుండినప్పుడు, "హా! పరమేశ్వరా! పరమేశ్వరా! వీనిని రక్షింపుము, రక్షింపుము!" అని అమ్మగారు భగవంతుని బ్రార్థించుట చెంతనున్నవారు వినిరి. ఈయాట ముగిసినతరువాత, "నాయనా! వీండ్లకేమైన మంత్రము తెలియునా లేక యిందేదైన నితర రహస్యమున్నదా?" అని అమ్మగారు నన్నడిగిరి.

శిష్యుడు: అమ్మా, లేదు. దీనిలో అట్టిదేదియు లేదు. విడువక సాధనము చేయుటవలన కలిగిన ఫలితమిది. ప్రతిదినము తనచేతులలో నొక దూడ నెత్తుకొని పొలమునకు బోవుచుండిన మనుష్యుని కథను నేనమెరికాదేశములో వింటిని. అదియొక పెద్దయెద్దగువరకు నతడీ యభ్యాసమును చేయుచునే యుండెను. అది పెరిగి పెద్దదైనతరువాతకూడ దానిని లేగదూడవలెనే అవలీలగా

జపము – ఆధ్యాత్మికాభివృద్ధి

నతడు మోసికొనిపోగలుగు చుండెను. ఈవిద్దె నత డందరియెదుట ప్రదర్శించుచుండెను. ఇవన్నియు అభ్యాస ఫలితములు.

అమ్మగారు: ఔనౌను. అది నిజమే. చూచితివా యభ్యాస మహిమను? ఇట్లే విడువకుండ జప మభ్యసించువారికి, భగవత్సాక్షాత్కారము కలుగును.

* * *

తపోనియతి – భగవత్కటాక్షము

రామకృష్ణపరంపరకు చెందిన యొకసన్న్యాసి కాశీయందలి మణికర్ణికాఘట్టములో తపోనిష్ఠయందుండెను. అతడు భగవత్కటాక్షముతనపై నెప్పుడు ప్రసరించునో అమ్మగారి నడుగుమని కలకత్తాకు వచ్చుచుండిన శ్రీమాత్రుదేవి శిష్యునితో జెప్పెను. శిష్యుడీ సంగతిని విన్నవించినప్పుడు, అమ్మగారు తీవ్రస్వరమున నిట్లు సెలవిచ్చిరి: "తపోనిష్ఠ నభ్యసించుచున్నంతమాత్రమున నెవరికైన భగవత్కటాక్షము తప్పక కలుగవలెనను నియమమేదియు లేదని అతనికి వ్రాయుము. పూర్వకాలమున ఋషులు వేలకొలదియేండ్లు తలక్రిందుగా, నడుగున నగ్నిజ్వాల నుంచికొని ఘోరతపము చేసిరి. అట్లయ్యునుగూడ వారిలో నేకొందరికి మాత్రమో భగవత్కటాక్షము కలిగెను."

* * *

భగవంతుడు వెలకు దొరకు వస్తువుకాదు

"అమ్మా! నేనెంతో తపస్సును జపమును చేయుచున్నను, నాకే సిద్ధియు కలుగలేదు," అని యొక శిష్యుడు విన్నవింప, "వెలయిచ్చి కొనుటకు భగవంతుడు కూరకాయలవంటివాడు కాదు," అని అమ్మగారు బదులు చెప్పిరి.

భగవత్కటాక్షము మెల్లగ పనిచేయును

“అమ్మా! నేను మీ కడకు చాల తఱచుగా వచ్చుచు మీ యనుగ్రహమును బడసియున్నను, నాకు పారమార్థికసిద్ధి యేల కలుగలేదు? పూర్వ మే స్థితిలో నుంటినో యిప్పుడుకూడ నదేస్థితిలోనున్నట్లు తోచుచున్నది,” అని యొకనాడు శిష్యుడు మిక్కిలి ఆత్రతతో విన్నవింప, “నాయనా! నీవు శయ్యలో నిద్రించుచుండగా, నిన్నాశయ్యతోకూడ నెవరో మరియొక చోటునకు తీసికొనిపోయి రనుకొనుము. అట్టిసందర్భములో మెలకువ వచ్చినవెంటనే, నీవొక క్రొత్తస్థలమునకు వచ్చినట్లు గ్రహింపగలుగుదువా? ఎంతమాత్రము గ్రహింపలేవు. నీమమత పూర్తిగా పోయినతరువాతనే, నీవొక క్రొత్తస్థలమునకు వచ్చినట్లు తెలిసికొనగలవు,” అని అమ్మగారు సెలవిచ్చిరి.

* * *

“అమ్మా! భగవత్సాక్షాత్కారమెట్లు కలుగును? జపము, ధ్యానము, పూజయునిందుకు తోడ్పడునా?” అని జయరాంబటిలో శిష్యుడొకనా డమ్మగారి నడిగెను.

అమ్మగారు: ఇవేవియు తోడ్పడజాలవు.

శిష్యుడు: అట్లైనచో భగవద్దర్శనమెట్లు కలుగును?

దైవానుగ్రహము — ఆధ్యాత్మిక సాధన

అమ్మగారు: కేవలము వానిదయవలననే. కాని, సాధకుడు ధ్యానమును జపమును చేయుచుండవలెను. అందువలన చిత్తశుద్ధి కలుగును. ఆరాధనాది పారమార్థిక సాధనలను ముముక్షువులు చేయుచుండవలెను. పువ్వును చేతబట్టుకొని ఆఘ్రాణించువారికి దాని పరిమళమెట్లు తెలియునో, సానపై గంధపుచెక్క నరగ

దీయువారికి మంచిగంధపు వాసన యెట్లనుభవైకవేద్యమగునో అట్లే నిరంతరము భగవంతుని దలంచుచుండువారికి ఆధ్యాత్మిక వికాసము కలుగును. కోరికలన్నియు విడనాడుదువేని, నీవీ క్షణముననే భగవత్సాక్షాత్కారము బడయగలవు.''

*   *   *

ధ్యానము, కర్మ, భగవత్కటాక్షము

ఆధ్యాత్మిక సాధనలనుగూర్చి ముచ్చటించుచు, 1901–వ సంవత్సరములో నొకనాడు శ్రీమాతృదేవి సన్న్యాసియగు నొక శిష్యున కిట్లు హితవొసంగిరి: ''ఉదయమునను సాయంకాలమునను ధ్యానమునకు గూర్చుండుము. ఉద్రేకమేమియులేని చల్లని మనస్సుతో, ధ్యానప్రార్థనల నభ్యసింపుము. ఇట్లుచేయుట బహు కష్టము. దీనికంటె నొకపార పుచ్చుకొని మట్టిని త్రవ్వుట యెక్కువ సులభము. (శ్రీ గురుదేవుని చిత్రపటముపై చూచుచు) వీరి దయలేక నీకేమియు లభింపదు.'' ఆశ్రమకార్యముల నిర్వహించుచుండుటవలన, యథావిధిగా తాను ధ్యానప్రార్థనల నభ్యసింప లేకుంటినని శిష్యుడు తెలుపగా, ''ఈ కార్యము లెవరివి? ఇవన్నియు నాయనవే. కొంతకాలమైనతరువాత నీమనస్సే నీకు గురువై, జ్ఞానవికాసము కలుగజేయునని గ్రహింపగలవు.'' అని అమ్మగారు బదులు చెప్పిరి.

ఒకనాడు శ్రీ మాతృదేవి యిట్లానతిచ్చిరి: ''మేమెంతో జపము చేసితిమి, ఎన్నో ఆధ్యాత్మికసాధన లాచరించితిమి. కాని, వానివలన నిసుమంతయు ప్రయోజనములేదు. మహామాయ కనికరించి దారిలోని యడ్డంకులను దీసివైచిననేతప్ప నెవరికైన ముక్తి యెట్లు లభించును? ఓ మానవులారా! భగవంతుని శరణుజొచ్చుడు! సర్వము వానికి సమర్పించి వాని శరణుజొచ్చుడు!

అప్పుడే, మహామాయ కనికరించి ముక్తికి దారిచూపును.'' పిమ్మట శ్రీ గురుదేవుని చరిత్రలోని యీ క్రింది విషయమును అమ్మగారు తెలిపిరి: ''అది జ్యేష్ఠమాసము. కమార్పుకూరులో నొకనాటి సాయంకాలము బాగుగా వర్షము కురిసి, చేలన్నియు నీళ్లతో నిండియుండెను. శ్రీ గురుదేవులు నీటిని ద్రోసికొనుచు అడవుల వైపునకు వెళ్లుచుండిరి. ఆ నీటిలో వాలుగచేపలు చాల కనుపడినవి. జనులు వానిని రాళ్లతో గొట్టి చంపుచుండిరి. అందొకటి శ్రీ గురుదేవుల పాదములచుట్టును తిరుగ నారంభించెను. ఇదిచూచి, 'దీనినిమాత్రము చంపకుడు. ఇది యెట్లు నా పాదముల శరణు జొచ్చియున్నదో చూడుడు. మీలో నెవరికైన సాధ్యమైనయెడల దీనిని తీసికొనివెళ్లి, హాల్దార్పుకూరు కోనేటిలో విడిచిపెట్టుడు.' అని సెలవిచ్చిరి. పిమ్మట శ్రీ వారే యాచేపను గుంటకుదీసికొని పోయి దానిలో విడిచిపెట్టిరి. ఇంటికి తిరిగివచ్చినతరువాత మాకీ యుదంతమంతయు దెలిపి, 'ఆవిధముగ భగవంతుని శరణుజొచ్చు వారికి మాత్రమే ముక్తికలుగును,' అని చెప్పిరి.''

* * *

సన్న్యాసియగు నొక శిష్యుడువ్రాసిన నిరాశాపూరితమగు నుత్తరములోని విషయములనువిని, తీవ్రస్వరమున శ్రీ మాతృదేవి

మరణకాలమున భగవత్కటాక్షము

యిట్లు నొక్కి వక్కాణించిరి: ''అది యెట్లు పోసగును? శ్రీ గురుదేవుని దివ్యనామమునిన నంత తృణప్రాయమా? ఇచ్చటకు వచ్చుచు శ్రీ గురుదేవుని తలంచుచుండువారి కేనాడో యొకనాడు, తమ యిష్టదైవ దర్శనప్రాప్తి తప్పక కలుగును. తుదకు వారిప్రాణావసాన సమయముననైన శ్రీ గురుదేవుని దర్శనము కలిగితీరును.''

* * *

మానసయను నొకయువకుడు తనకు మంత్రోపదేశము చేసి సన్న్యాసాశ్రమ మొసంగుడని శ్రీ మాతృదేవిని ప్రార్థింప, నాతనికోరిక నామె సంతోషపూర్వకముగా నీడేర్చిరి. అతడును మిగుల నానందించెను.

త్యాగవైభవము

సాయంకాలమున నాతడు కాళీమామ యింటిలో దేవీకీర్తనలను పాడుచుండెను. శ్రీ మాతృదేవి యాపాటల నెంతయు మెచ్చుకొనెను. అప్పుడచ్చట రాధు, మకు, నళిని, అమ్మగారివదినలొకరిద్దరు, మరికొందరు భక్తులునుకూడ నుండిరి. "ఈ చిన్నవాని నీమె సన్న్యాసిగ జేసినది." అని యామె వదినెలలో నొకరనిరి. ఆ ముక్క వినుకొని యీ క్రిందివిధమున మకు వ్యాఖ్యానించెను: "అది నిజము. మా అత్త యేమిచేయుచున్నదో చూడుము. ఈ ప్రశస్తయువకుల కీమె సన్న్యాసమిచ్చుచున్నది. వీరి తల్లిదండ్రులెన్నో కష్టములకులోనై వీరిని పెంచి, తమయాశల నెల్ల వీరిపైననే పెట్టుకొనియుండిరి. అవియన్నియు నేడు బూడిదలోపోసిన పన్నీటివలె పరిణమించెను గదా! ఇక నీ యువకుడేమిచేయును? ఋషీకేశమునకు పోయి బిచ్చమెత్తుకొనును; లేకున్న నే చికిత్సాలయములోనో రోగుల మలమూత్రముల నెత్తుచుండును. ఎందుకిది? పెండ్లిచేసికొని యొక యింటివాడై జీవనము గడపుటకూడ ధర్మపద్ధతియే. సరేకాని, అత్తా, నీవీ యువకుల నిట్లు సన్న్యాసుల జేయుచో, మహామాయకు నీపై కోపము వచ్చును. వారు సన్న్యాసులు కాగోరుదురేని, వారంతట వారే సన్న్యాసులగుదురు గాక. ఆ విషయమున నీవేల బాధ్యత వహింపవలెను?" ఇందుకు ప్రత్యుత్తరముగా శ్రీ మాతృదేవి యిట్లు సెలవిచ్చిరి: "మకూ, ఈ బిడ్డలందరు దివ్యాంశ సంభూతులు. వీరీ ప్రపంచమున అనాఘ్రాత పుష్పములవలె నిష్కల్మష

జీవనులై యుందురు. ఇంతకంటె కోరదగిన దేమున్నది. సంసారమం దేమిసుఖమున్నదో స్వానుభవమువలన నీవు గ్రహించిన విషయమేకదా! ఇన్నాళ్లనుండి నీవు నాయొద్ద నేమి నేర్చుకొంటివి? సంసారమందేల యింత వ్యామోహము? ఇంత పశుప్రవృత్తియేల? దీనివలన నీకు కలుగుచున్న సుఖమెట్టిది? ఆదర్శనీయమైన పవిత్రజీవనమును నీవు కలలోనైన నూహింపలేవా? నీవును నీ భర్తయు నిప్పటికైన సోదరీసోదరులవలె జీవింపలేరా? పందులకు తగినజీవనముపై నింత భ్రమయేల? ఈ ప్రపంచదుస్థితి జూడ నాకు మరణవేదనవలె నున్నది.'' శ్రీ మాతృదేవి చేయుచుండిన యీ గంభీర ప్రసంగమునువిని, అచ్చట నున్నవారి హృదయములెల్ల కరగిపోయెను. ఇంకను అమ్మగారిట్లు సెలవిచ్చిరి: ''బ్రహ్మచర్య మవలంబించి పవిత్రజీవనము గడుపువారికి, వారు భగవంతుని ప్రార్థించినను సరే, ప్రార్థింపకపోయినను సరే భగవత్సాక్షాత్కారము చాల త్వరితముగా కలుగును. ఇతరులు సంసార పాశబద్ధులగుటచే, భగవంతుని ధ్యానింప బ్రయత్నించినను, వారి కాపని కష్టమనిపించును.''

* * *

ఒకసన్న్యాసి తల్లికి హితోపదేశము

ఒకసన్న్యాసి తల్లి తనకుమారుని నెట్లైన మరల సంసార జీవన మవలంబింప బ్రోత్సహింప గోరినపిమ్మట, శ్రీ మాతృదేవి ఆమెకిట్లు హితవు గఱపిరి: ''సన్న్యాసికి తల్లిగానుండుట అనన్య సామాన్యమగు మహాభాగ్యము. చూచిచూచి జనులొక యిత్తడిగిన్నెనుకూడ విడిచిపెట్టలేరే! దానిపై వారికి మమకారము పోదే! ఇట్టిస్థితిలో సంసారమును విడిచిపెట్టుట సులభమా? అటువంటి సుపుత్రునితల్లివి నీవు. నీవెందుకు

చింతపడవలయును? అతడు సాధువైనను, నీ యోగక్షేమము కనిపెట్టుచుండును.''

* * *

సంశయాత్ముడగు నొక సాధకునకు హెచ్చరిక

అమ్మగారి శిష్యుడగు నొక యువకున కొకసారి తలవని తలంపుగా నొక సంపన్నకుటుంబమువారు పెండ్లికి పిల్లనిచ్చెదమని మాట లారంభించిరి. అతని దారిద్ర్యమును శాశ్వతముగ బారద్రోలజాలినంత ధనమును కట్నముగా నిచ్చెదమనిరి. ఎం. ఏ పరీక్ష ప్యాసైన తరువాత ఆ యువకుడొక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడయ్యెను. అతనికింకను సుఖాపేక్ష పూర్తిగా పోలేదు. కనుక తన పెండ్లివిషయమై శ్రీ మాతృదేవి యభిప్రాయము తెలిసికొనగోరి, అందునుగూర్చి యామెనడిగెను. సర్వమునువిని అమ్మగారిట్లు సెలవిచ్చిరి: ''నాయనా! నీ కిప్పుడే కొఱతయు లేదు. సంసారాగ్నిలోబడి దగ్ధుడవగుట కేల అపేక్షించెదవు? నీ విప్పుడు సత్కర్మ చేయుచున్నావు. నీ సాయమువలన బాలు రెందరో విద్యావంతులగు చున్నారు. నీ విద్యార్థులు సత్పురుషులయ్యెదరు. అది నీకుగూడ శ్రేయస్కరము.'' ''అమ్మా! అప్పుడప్పుడు నామనస్సు సుఖముల నపేక్షించి కలత పడుచుండును. అందువలన నేను భయపడుచుండును,'' అని యా యువకుడు ప్రత్యుత్తరమిచ్చెను. పిమ్మట అమ్మగారిట్లానతిచ్చిరి: ''భయపడకుము. ఈ కలియుగములో మానసికపాపము పాపమే కాదు. ఈ విషయమున నీ చింతలనెల్ల విడనాడుము. నీవు భయపడనక్కరలేదు.'' శ్రీమాతృదేవి యొసంగిన యీ యభయప్రదానమును విన్నతరువాత ఆ భక్తుడు వివాహ విషయమును

మరల నెన్నడును తలపెట్టలేదు. తాత్కాలిక భావోద్రేకము వలన తన మనశ్శాంతి నెన్నడును గోల్పోలేదు.

*   *   *

"అమ్మా! మీరు మీ బిడ్డల నందరిని సమభావముతో చూడవలసియుందురు గదా! అట్లయ్యును, ఒకడు తన వివాహ విషయమై మీ యభిప్రాయమును తెలిసికొనగోరి జాబువ్రాయుచో, వివాహమాడుటకు వానికి మీ యనుమతినిచ్చెదరు; మరియొకడు సంసారమును పరిత్యజింపగోరునెడల, త్యాగజీవనమును గొనియాడుచు వానికి వేఱువిధమున బోధచేయుదురు. అందరి నుత్తమమార్గమున నడపుట మీ విధాయక ధర్మముకాదా?" అని యొకభక్తురా లడుగగా శ్రీ మాతృదేవి యిట్లానతిచ్చిరి:

సన్న్యాస, గృహస్థాశ్రమములు

"ఒకనికి సుఖాపేక్ష తీవ్రముగా నున్నదనుకొనుము. ఆ కోరికను విడనాడుమని నేనెంత బోధించినను అతడు నామాట వినునని తలంతువా? మరియొకడు బహుజన్మార్జిత పుణ్యఫల విశేషముచే, ఈసుఖములన్నియు మాయావిలాసములేయని గ్రహించి భగవంతు డొక్కడే సత్యమని భావించుననుకొనుము. ఇట్టివానికి నే నించుక సాయము చేయవలదా? ఈ సంసార దుఃఖమునకు అంతమేమైన నున్నదా?"

*   *   *

ఒక శిష్యురాలికుమారుడు వివాహమాడుట కంగీకరించుట లేదని విని శ్రీ మాతృదేవి యా శిష్యురాలితో నిట్లనిరి: "ఆహా! ఈ కాలమున బాలురందరు పెండ్లియాడమనుచున్నారు. కాని, మహోన్నత జీవితమునకు గావలసిన సంస్కారసంపత్తి గల సుజనులు మాత్రమే సన్న్యాసాశ్రమమును స్వీకరించి, సర్వబంధ

విముక్తులగుటకు అర్హులు. ఇక సంసార జీవితము నించుక రుచి చూడ జన్మించినవారు కొందరున్నారు. సామాన్యముగా జనులీ లోకసుఖము లనుభవింపవలెననియే నా మతము. కాని శ్రీ గురుదేవుని శిష్యులయు, మిత్రులయుమాట వేరు.

శిష్యురాలు: అమ్మా! వాడు మీ బిడ్డడే. వాని భావి సుఖముగాని, కష్టముగాని కేవలము మీ యధీనము. వాని విషయమున మీ యిష్టమెట్లో యట్లే చేయుడు.

వివాహమా? త్యాగమా?

అమ్మగారు: ఈ జన్మలో వివాహమాడి వానిని భోగము లన్నియు ననుభవింపనీ; లేకున్న, నీడేరక లోన నణగియున్న వాంఛలెన్నడైన తీవ్ర రూపముదాల్చి వాని పతనమునకు దారితీయ వచ్చును. కాని, శ్రీ గురుదేవుని రక్షణ యతని కుండునంతకాల మతడెన్నటికిని జారిపడడు. ఈ విషయమును నీవు గట్టిగా నమ్మవచ్చును. శ్రీ గురుదేవులు నాకు చెప్పిన యొకమంత్ర మతని కుపదేశించితిని. దాని సాయమున నెవరైన పరిపూర్ణులు కాగలరు. అతడెన్నడైన దురవస్థపాలై దుఃఖించునా?

* * *

మానసిక త్యాగప్రశంస

"తనను తమయిష్టదైవముగా స్వీకరించు వారికి పునర్జన్మ యుండదని శ్రీ గురుదేవుడానతిచ్చెను. ఇక శ్రీ వివేకానందస్వాముల వారన్ననో సన్న్యాసాశ్రమము స్వీకరించినగాని యెవరికిని ముక్తిలభింపదని సెల విచ్చిరి. ఇట్టి సందర్భములో గృహస్థులకు తరణోపాయ మేది?" అని అమ్మగారి నొక శిష్యుడడిగెను. శ్రీమాతృదేవి దీనికిట్లు ప్రత్యుత్తరమిచ్చిరి: "ఔను. శ్రీ గురుదేవు లానతిచ్చిన విషయ

మెంతనిజమో శ్రీ స్వాములవారి ప్రవచనముకూడ అంతనిజము. గృహస్థులకు బహిరంగ త్యాగమక్కరలేదు. ఆంతరంగికత్యాగము వారికి దానంతటదియే లభించును. కాని, కొందరివిషయములో బహిరంగత్యాగ మావశ్యకము. నీవు శ్రీ గురుదేవున కాత్మార్పణముచేసికొనినచో, వారెల్లప్పుడు నీకు తోడునీడై నిల్చియుందురను విషయమును జ్ఞప్తియందుంచుకొనుము.''

అమ్మగారొకసారి యొకసాధువున కిట్లు హితవొసంగిరి:

సన్న్యాసాశ్రమపు గట్టుబాట్లు

'ఓసాధూ! జాగ్రత్త!' అని శ్రీ రామకృష్ణులు హెచ్చరించుచుండువారు. సాధువులెల్లప్పుడును చాలమెలకువగానుండవలెను. వారి జీవితము జారుడునేలపై నడకవంటిది. అట్టినేలపై నడచువారు బహుజాగ్రత్తగా నడుగువేయవలయును. సన్న్యాసియగుట సులభమా? ఇష్టమున్నచో నెవరైన పెండ్లిచేసికొని గృహస్థజీవనమును గడుపవచ్చును. కాని, నీవుమాత్ర మట్టియుద్దేశముల నెల్లవిడిచిపెట్టినందున నీవా విషయములపై మనస్సును పోనీయకూడదు. కక్కినకూటికి తిరిగి ఆశపడకూడదు. కుక్కకు మెడపటకా అపాయము కలుగకుండ రక్షించునట్లే, కాషాయవస్త్రములుకూడ సన్న్యాసిని రక్షించును. మెడకు పట్టీయున్న కుక్కకు యజమాని యెవరో యొకరుండి తీరవలయునని యెంచి దాని జోలికెవ్వరును పోరు. ఒక సాధువునుకూడ తమతమయిండ్లలోని కందరును రానిత్తురు. మనస్సు సహజముగ పాపకార్యముల జేయగోరుచుండును. సత్కార్యాచరణయం దది సోమరి. నేను పూర్వము తెల్లవారు జామున నిద్రనుండి లేచి ధ్యానమునకు కూర్చుండుదానను. ఇంచుక శరీరాస్వస్థతవలన ఒకనాడట్లు లేచుటకు నిచ్ఛగింపనైతిని. ఈ యొకనాటి క్రమభంగమువలన చాలనాళ్లు

వరకు నానిత్యచర్య తారుమారయ్యేను. ఇందుచేతనే సత్కార్మ లను జయప్రదముగ నాచరింపవలయుననిన, నోరిమియు పట్టు దలయు నావశ్యకములని నేను చెప్పుచుందును. దక్షిణేశ్వరమున నాబత్తుగదిలో నివసించుచుండినప్పుడు, 'పరమేశ్వరా! చంద్రు నకుగూడ కళంకమున్నది. నా మనస్సునందెట్టి కళంకముగాని లేకుండునట్లనుగ్రహింపుము,' అని వెన్నెలలో ప్రార్థించుచుండు దానను.

* * *

మాత్సర్య, మమకార రాహిత్యము

సన్న్యాసికి మమకారము, ఈర్ష్యయు నుండకూడదు. సర్వా వస్థలయందు నతడు సమభావుడై ప్రశాంతముగ నుండవలెను. "మనమిరువురము పరస్పరసహనముతో మెలగునెడల, సర్వము చక్కగా జరుగును. లేనిచో, మన వివాదములను బరిష్క రించుటకు దేవాలయ నిర్వహణాధికారిని మనము వేడుకొన వలసి యుండును." అని శ్రీరామకృష్ణులు హృదయునకు హితోప దేశము చేయుచుండువారు.

* * *

పాండిత్యము-సన్న్యాస జీవనము

అమ్మగారితో ప్రసంగవశమున క-ఇట్లు విన్నవించెను: "అమ్మా! నీ పిల్లలందరును విద్యావంతులు. వీరు (కోల్పారా ఆశ్రమనివాసులు) విద్యా విహీనులగు మీ బిడ్డలు. శరత్ మహరాజు శ్రీగురుదేవుని గురించి గ్రంథములను రచించి వారి సందేశమును, ఉపదేశములను లోకమందంతట వ్యాపింపజేయుచున్నారు. ఇంకను మీ బిడ్డలలో నితరు లుపన్యాసములిచ్చుచున్నారు. శ్రీరామ కృష్ణులభావముల నీరీతిగా ప్రచారములోనికి దీసికొనివచ్చుట

కెంతో కృషిజరుగుచున్నది.'' ఇందుపై శ్రీమాతృదేవి యిట్లు ప్రత్యుత్తరమిచ్చిరి: ''ఏమి నీ యూహ? మనగురుదేవునకే చదువుటయు వ్రాయుటయు నంతగా తెలియకుండెనుగదా! భగవద్భక్తియే ముఖ్యము. ఈప్రాంతమున నీవలన నెంతో పని జరుగగలదు. ఈ సారి పండితపామరులను, బీదసాదలను సర్వజనులను ముక్తులజేయుటకే శ్రీగురుదేవుడు భూమిపై నవతరించెను. ఇచ్చట మలయమారుతము వీచుచున్నది. తమ తెరచాపలనువిప్పి శ్రీగురుదేవుని శరణుజొచ్చువారు నిజముగా ధన్యులు. ఈ సారి వెదుళ్లును, గడ్డియుతప్ప జవసత్వములే మాత్రమున్న చెట్లు, మొక్కలన్నియును ఈ మలయమారుతాహతికి చందనతరువులుగా మారును. నీవేల చింతించెదవు. మీరు నా స్వజనము. కాని, యొకసంగతిని మాత్రము జ్ఞప్తియందుంచుకొనుము. బంగారుతో పొదిగినదంతముగల యేనుగువంటివాడు, విద్యావంతుడగు సాధువు.'' అమ్మగారి మాటలనుచు పూజా మందిరములోనికి వెళ్లిరి.

* * *

''భగవంతుడే మనకందరికిని తల్లియుతండ్రియునైన యెడల,మనచే పాపమేల చేయించుచున్నాడు?'' అని యొక శిష్యుడు శ్రీమాతృదేవి నడిగెను.

భగవంతుడు: కర్మ: దుఃఖము.

అమ్మగారు: నిజమే. ఈ చరాచరజీవులెల్ల భగవంతుడే. కాని, భేదాత్మక ప్రపంచములో జీవులు తమతమ పురాకృతకర్మకును, ఆంతరంగిక సంస్కారములకును అనుగుణముగా వ్యవహరించుచు సుఖదుఃఖము లనుభవించుచున్నారు. ఒకే సూర్యు

డాయావస్తు, స్థలములనుబట్టి వేర్వేఱు విధములుగా ప్రకాశించుచున్నాడు.

శిష్యుడు : సర్వమును భగవత్సంకల్పము ప్రకారమే జరుగుచున్నయెడల, కర్మసూత్రమును తప్పించుకొనుటకు భగవంతుడు మనకేల సాయముచేయకున్నాడు?

అమ్మగారు : ఔను. భగవత్సంకల్ప మట్లున్నయెడల, మన యాధ్యాత్మికవికాసము త్వరలో చేకూరును. కాని, మనకు వాని సంకల్పము తెలియదు. ఈ కర్మసూత్ర ఫలితముగా తుదకు శ్రీ రామకృష్ణులుకూడ బాధపడవలసిన వారైరి. ఒకనాడు వారి అన్నగారు తీవ్రజ్వరములో, సంధివలన బాధపడుచు, వైద్యులు నిషేధించిన చల్లనినీటిని త్రాగుటకు ప్రయత్నించిరి. అప్పుడచ్చట నుండిన శ్రీ గురుదేవులు తమ అన్నగారిచేతిలోని నీటిపాత్రను బలవంతముగా లాగివైచిరి. అందుపై వారియన్నగారు కోపోద్దీప్తులై 'నీవునన్ను నీరుత్రాగ నీయలేదుకనుక, నీ యవసాన దినములలో నీవుకూడ నేదియు తినలేని స్థితిలోనుందువుగాక!' యని శపించిరి. 'అన్నా! నీ మేలు కోరి నేనట్లు చేసినందుకు ఫలముగా, నాకు నీ శాపము లభించెను'. అని శ్రీ రామకృష్ణులు విన్నవింప వారి యన్నగారు కన్నుల నీరుగార 'అయ్యో! నే నెందుకట్లంటినో! నా నోట నటువంటిమాటలేల రావలయునో నాకే తెలియకున్నది,' అని తమ పశ్చాత్తాపమును వెలిబుచ్చిరి. నాయనా! చూచితివా! తమ కడసారి జబ్బులో శ్రీ గురుదేవులకుగూడ వారి పూర్వకర్మఫల మనుభవింపక తప్పినదికాదు. ఆ కాలమున వా రేమియు తినలేకపోయిరి.

*　　　　*　　　　*

భగవన్నామ జపమువలన ప్రారబ్ధకర్మఫలమును తప్పించు

జపము-కర్మోపశమనము

కొంత వీలగునాయని యొకభక్తుడు శ్రీ మాతృదేవి నడిగెను.

అమ్మగారు: ఎవరైనను ప్రారబ్ధ కర్మఫల మనుభవింపక తప్పదు. దాని నెవరును తప్పించుకొనజాలరు. కాని భగవంతుని పవిత్రనామ జపమువలన, స్మరణవలన దాని తీవ్రత తగ్గును. ప్రారబ్ధమునుబట్టి కాలుపోవలసినవానికి, భగవద్ధ్యాన ఫలితముగా పాదములో నొకముల్లు గ్రుచ్చుకొనుటతో సరిపోవును.

* * *

శ్రీ గురుదేవుని సత్యవ్రత దీక్ష

ఒకసారి అమ్మగారిట్లు సెలవిచ్చిరి: ''శ్రీ గురుదేవుని సత్యవ్రతదీక్ష యెంతనిశ్చలమైనది! అయ్యో! వారి యున్నతా దర్శనీయ వర్తనమును మన మనుసరింపలేము కదా. ఈ కలియుగమున సత్యవ్రతమునకు మించిన తపస్సు వేఱేదియు లేదని యాయన చెప్పుచుండువారు. సత్యవ్రత భంగములేకుండ నడచుకొనువారు, భగవత్సాక్షాత్కారము బడసెదరు.''

* * *

శ్రీ గురుదేవుని దివ్యత్వము

''శ్రీ గురుదేవుడు నిజముగా ముమ్మాటికిని భగవంతుడే. ఇతరుల దుఃఖములను, కష్టములను తొలగించుటకై యాదయానిధి, ఈ లోకమున ప్రజలబాగోగులను స్వయముగా తెలిసికొనుటకై మారువేషముతో తన నగరమందు తిరుగు రాజువలె వ్యవహరించెను; తన నిజస్వరూప మాలోకమునకు దెలియుటతోడనే, అందుండి యంతర్ధానమయ్యెను,'' అని శ్రీ మాతృదేవి యొక భక్తునితో జెప్పిరి.

ఒకప్పుడు రాధు చికిత్సకై అమ్మగారు బాగ్‌బజారునందలి

బోసుపరాలో నొకయింటిలో అద్దెకుండిరి.

శ్రీ గురుదేవునకు నైవేద్య మొనర్చు పద్ధతి

పరిచర్యచేయుట కామెతో శిష్యురాలు కూడ నుండెను. అమ్మగారొకనా డామెను శ్రీ గురుదేవునకు నైవేద్య మొనర్చుమని అడిగిరి. నైవేద్య మారగింపు చేయుపద్ధతి తనకు తెలియదని యామె విన్నవింప, శ్రీ మాతృదేవి యిట్లానతిచ్చిరి : ''ఇటుచూడుము. శ్రీ గురుదేవుని నీ సొంతముగా భావించి, 'ఇటువచ్చి యీ పీటపై గూర్చుండి భోజనము చేయుడు,' అని వారిని ప్రార్థించి, వారువచ్చి యుచితాసనముపై గూర్చుండి భోజనముచేయుచున్నట్లే భావింపుము. మన స్వజనులను భోజనమునకై పిలుచుటకు మనకు మంత్రము కావలెనా? ఇది నిజముగా మనబంధువుల కాతిథ్యమిచ్చుట వంటిదే. ఏ విధమున నీవు వారిని సేవించినను శ్రీ గురుదేవుడు నీ సేవను స్వీకరించును.'' పిమ్మట, శ్రీ గురుదేవునకు నైవేద్య మారగింపు చేయుటకై యొకమంత్రమును అమ్మగారు శిష్యురాలికి బోధించిరి.

* * *

తన యేకైక పుత్రికను గోల్పోయిన యొకయువతి నోదార్చుచు శ్రీ మాతృదేవి యిట్లు చెప్పిరి :

శ్రీ గురుదేవుని ప్రార్థించువిధము

''అమ్మాయీ! నీకు నేనేమి చెప్పగలను? నాకేమియు తెలియదు. శ్రీ గురుదేవుని చిత్రపటము నీ యెదుట నుంచుకొనుము. వారెల్లప్పుడు నీకు తోడు నీడై యున్నారని గ్రహింపుము. దుఃఖపూరితమైన నీ హృదయమందలి వేదనను ఆయనకు విన్నవింపుము. కన్నుల నీరునించి 'ఓ ప్రభూ! నన్ను నీయొద్ద కాకర్షించి, నా మనస్సునకు శాంతి ననుగ్రహింపుము,' అని త్రికరణ శుద్ధిగా ప్రార్థింపుము. నిరంతర మట్లు చేయుటవలన నీ మనస్సునకు క్రమముగా శాంతి కలుగును. శ్రీ

గురుదేవునియందు భక్తికలిగి, నీకు కష్టమువచ్చినప్పుడెల్ల వారితో చెప్పుకొనుము.

*　　*　　*

శ్రీ గురుదేవుని ప్రార్థన వలన ప్రేమభక్తి కలుగును

ఒకనాటి సాయంకాలమువ సోదరీసుధీరయు, నొక బాలికా శిష్యురాలును శ్రీమాతృదేవి చెంతనుండిరి. అమ్మగారు వారికిట్లు హితోపదేశము చేసిరి: "తుదకొక్కసారియైనను నిజముగా శ్రీ గురుదేవుని ప్రార్థించినవారేవిషయమునగాని భయపడనక్కర లేదు. శ్రీ వారి నెల్లప్పుడును ప్రార్థించువారికి శ్రీ భగవానుని దయవలన ప్రేమభక్తి కలుగును. అమ్మాయీ! ఈ ప్రేమయే పారమార్థిక జీవితరహస్యము. శ్రీ బృందావన గోపస్త్రీలకిది సిద్ధించెను. వారికీ లోకమున శ్రీ కృష్ణుడుతప్ప వేఱేదియు తెలియదయ్యెను. 'అమూల్యమైన ఈ ప్రేమ భూషణమును జనులు బహు జాగ్రత్తతో కాపాడుకొనవలయును,' అని నీలకంఠుని కీర్తనలలో నొకచరణమున కర్థము." అమ్మగారా పాటనుపాడి, యిట్లు సెలవిచ్చిరి : "ఆహా! నీలకంఠుని కీర్తన లెంతమధురములు! ఆ కీర్తనలనిన శ్రీ గురుదేవునకు బహుప్రీతి. ఆయన దక్షిణేశ్వరములో నివసించుచుండిన కాలమున నీలకంఠు డప్పుడచ్చటకువచ్చి యా కీర్తనలనుపాడి, వారికి వినుపించుచుండువాడు. మే మచ్చట నెంత సుఖముగా నుండెడివారము! వేర్వేఱు మనోవైఖరులుగల జను లెందరో ఆయనకడకు వచ్చుచుండువారు. ఆ కాలమున దక్షిణేశ్వరము మహానంద నిలయముగా మాకు కనుపడెడిది."

*　　*　　*

మంత్రము—పూజ.

"అమ్మా! చాలమంది విధ్యుక్తముగా శివపూజ చేయుచున్నారు. మేమునట్లు చేయవచ్చునా?" యని యొకభక్తురాలడుగగా శ్రీ మాతృదేవి యిట్లు

బదులుచెప్పిరి : ''నేను మీ కుపదేశించిన మంత్రములో సమస్త మున్నది. దానితో దుర్గను, కాళిని సర్వదేవతలను మీరు పూజింపవచ్చును. ఇష్టమున్నవారు శివపూజా విధానమును నేర్చుకొనవచ్చును. కాని మీ కది యనావశ్యకము. దానివలన మన చిత్తక్షోభ లెక్కువగుటతప్ప, వేఱే లాభమేమియు లేదు.''

శ్రీ గురుదేవునకు నైవేద్యమును సమర్పించునపు డనుసరించవలసిన పద్ధతినిగురించి యొకరడుగగా శ్రీ మాతృదేవి యా విషయమున ప్రత్యేక కర్మకాండ ననుసరింప నక్కర లేదనియు, గురువుపదేశించిన మంత్రమే యన్నిటికిని చాలుననియును సెలవిచ్చిరి.

ఆధ్యాత్మిక సంస్కారములు గల యొక యువకునకు హితబోధ

శ్రీ మాతృదేవి కడసారి జబ్బులో నామెను సందర్శింపవచ్చిన యొక యువకుని కుశల ప్రశ్న లడిగినతరువాత, నిక చాల కాలము తాము జీవింపక పోవచ్చునని యామె చెప్పిరి. ఆ యువకుడీ వార్తవిని మిక్కిలి దిగులుపడి, యామె లేనిచో తన జీవితము దిక్కుమాలిన దగు ననుభయమును వెలిబుచ్చగా, అమ్మగా రతని నిట్లు హెచ్చరించిరి : శ్రీ రామకృష్ణుడే మనరక్షకుడను విషయమెన్నడును మరువకుము. నీవీ సంగతిని విస్మరింతువేని చిక్కులపాలయ్యెదవు. నీ తల్లినిగురించియు, నితర కుటుంబీకులను గురించియు నేను నిన్ను నే డెందుకడిగితినో నీకు తెలియునా? నీ తండ్రి మరణమునుగురించి కొంతకాలము క్రిందట గ—వలన వింటిని. అప్పుడు నీ తల్లి కితర బంధువు లెవరైన నుండిరోలేరో యనియు, యామె జీవితపోషణకు చాలిన స్థితికలదాయనియు నతని నడిగితిని. అంతతో నాగక, యామె నీపై జీవనమున కాధారపడియుండెనాయనికూడ ప్రశ్నించితిని. నీ సాయములేకయే యామె జీవింపగల స్థితిలో

నుండెనని తెలిసికొని, 'మంచిది. ఈ బాలునకు పవిత్రోద్దేశ్యము లున్నవి. ఇక శ్రీ రామకృష్ణుల దయవలన నితడు పారమార్థిక జీవితమును నిరాటంకముగా గడుపగలడు' అని తలంచితిని. అందరును మాతృసేవ చేయవలయును. ఇతరుల సేవయందు మీ జీవితమును ధారవోయుటకై నా కడకువచ్చిన మీ కందరికిని ముఖ్యముగా నిది విధాయకధర్మము. నీ తండ్రి నీ తల్లికేమియు పైకమిచ్చియుండనియెడల, ధనమార్జించి యెట్టిలోటు లేకుండ నామెను పోషించుచుండుమని నిన్నడిగియుండెడుదానను. శ్రీ రామకృష్ణుల దయావిశేషమువలన నీకా యభ్యంతరము లేకుండ పోయెను. ఆమెవశము చేయబడిన పైకము వ్యర్థము చేయబడకుండునట్లు మాత్రము చూడుము. ఆ విషయమై యేదో యొక యేర్పాటుచేసి, నీ శక్తికొలది నామె యోగక్షేమమును కనిపెట్టుచుండుము. ఇదిమాత్రము నీకొక చిన్నలాభమా? కేవల న్యాయమార్గముల నెవరును ధనమార్జింపజాలరు. ధనమెల్లప్పుడును మనస్సును కళంకపరచును. ఈ కారణమునుబట్టియే, నీ తల్లి యార్థికవ్యవహారములను సాధ్యమైనంత త్వరలో పరిష్కరింపుమని నిన్నడుగుచున్నాను. ఎక్కువగా నీవాపనిలో నిమగ్నుడవయిన యెడల ధనమునందు నీకాసక్తి గల్గును. ధనమున కింత సమ్మోహన శక్తియున్నది. దాని కతీతుడనని, దానియందెన్నటికిని మరులు గొననని నీవనుకొనవచ్చును. ఏ క్షణముననైన దానియందలి యాసక్తిని విడిచిపెట్టగలనని నీ వింకను తలంచవచ్చును. నాయనా! వలదు; ఇట్లెన్నటికిని తలంపవలదు. సూదిబెజ్జమంత రంధ్రముద్వారమున ధనాసక్తి నీ మనస్సున బ్రవేశించి, నీకు తెలియకుండగనే క్రమక్రమముగ నిన్నణచివేయును. అది నీ వెన్నటికిని తెలిసికొనజాలవు. ముఖ్యముగా నీవు కలకత్తాలో

నివసించుచుండుటచే, ధనము జనుల నెంతదుర్మార్గులను చేయునో నీకు తెలిసినవిషయమే. సాధ్యమైనంత శీఘ్రముగా నీ తల్లి వ్యవహారములను పరిష్కారముచేసి, కలకత్తానుండి పారిపొమ్ము. ఇంతేకాక, నీ తల్లి నొక పుణ్యక్షేత్రమున నివసింప ప్రోత్సహింపగలుగుదువేని, మీ రిరువురును మీ యైహిక సంబంధమునుమరచి, పారమార్థిక జీవనమును గడుపవచ్చును. ప్రస్తుతము నీ తల్లి విచారగ్రస్తయై యున్నది. ఇది యత్యుత్తమమైన యేర్పాటని తలంతును. ఇంతేకాక నీ తల్లికూడ చాలపెద్దదియైనది. ఆమెతో నెల్లప్పుడును భగవంతునిగురించి ప్రసంగించుచుండుము. ఆమె తరణోపాయమునకు తగిన సాయమును నీ వామెకు చేయగలుగుదువేని, నిజముగా పుత్రధర్మమును నెరవేర్చినవాడవగుదువు. ఆమె పాలుద్రాగికదా నీవు పెరిగితివి! నిన్ను పెద్దవానిజేయుట కామె యెంతకష్టపడినది! ఆమెకు సేవచేయుటయే నీ యత్యున్నత ధర్మము. కాని నీ పారమార్థికాభ్యుదయమున కామె యాటంకము కలిగించుచో నీ వన్యథా తలంపవచ్చును. నీ వామెను నా కడకెందుకు తీసుకొనిరావు? ఆమె స్వభావమెట్టిదో చూచి, యుక్తమని తోచినయెడల నామె కేమైన హితబోధ చేసెదను. కాని, జాగ్రత్త! నీ తల్లికి సేవచేయు నెపమున సంసారలంపటమున దగులుకొనకుము! ఇదియొక పెద్దవిషయముకాదు, ఒక వితంతువు పోషణమునకు గావలసిన ధనమతి స్వల్పము. కొంచెము నష్టము వచ్చినను గూడ నీ వామె వ్యవహారములను సాధ్యమైనంత త్వరలో బరిష్కరించుటకు బ్రయత్నింపుము. శ్రీ రామకృష్ణు లెన్నడును ధనమును చేతితో స్పృశింపజాలకుండిరి. అట్టి మహనీయుని పేరు చెప్పుకొని మీరీ ప్రపంచరంగమున కరుగుచున్నారు. వారిమాట లెన్నడును మరువవలదు. ఈ లోకమున మీరుజూచు దురవస్థ

లన్నిటికిని మూలకారణము ధనమే. ధనము మీ మనస్సును నితర భ్రమలకు గురిచేయ వచ్చును. జాగ్రత్త!''

* * *

గృహస్థుడగు నొక యువభక్తునకు హితోపదేశము

గృహస్థుడగు నొక భక్తుడొకసారి యొక సన్న్యాసితో నగౌరవముగా మాట్లాడెను. అమ్మగా రాయువకునకిట్లు హితవు గరపిరి: ''నీవనిన శ్రీ గురుదేవున కపరిమిత దయ. అందుచేతనే నీ బాల్యమునుండియు నీ కాయనయం దవ్యాజానురాగము కుదిరెను. అయినను, నీవీ కొలదిపాటి విషయములను జ్ఞప్తియందుంచుకొని నీ జీవితమం దనుసరింపవలయును. ఈ మూడు విషయములందును నీవు జాగరూకుడవై యుండవలయును. మొదటిది, నదీతీరముననుండు గృహము; ఎప్పుడైనను నది పొంగి నీ యింటిని నాశనముచేసి వరదలో తుడిచివేయ వచ్చును; రెండవది, పాము నీ కంటబడినప్పుడు నీవు బహు జాగ్రత్తగా నుండవలెను; అది యెప్పుడువచ్చి నిన్ను కరచునో యెవరును చెప్పలేరు; మూడు, సాధువు: అతనిమాటవలన, తలంపువలన గృహస్థునకు కీడు కలుగవచ్చునన్న సంగతి నీ వెరుగవు. సాధువును చూచినప్పుడెల్ల నీ వతనికి గౌరవము కనుబరుపవలయును. ప్రతివచనములచేగాని, న్యూనత కలుగజేయు సంభాషణలచేగాని నీ వాతనిని నిరాదరణ చేయగూడదు.'' తన జీవితాంతమువర కాశిష్యుడు శ్రీ మాతృదేవి సెలవిచ్చిన యీ యుపదేశ వాక్యములను గౌరవముతో బాటించెను.

* * *

మంత్రోపదేశము చేసినతరువాత శ్రీ మాతృదేవి యొక శిష్యురాలికిట్లు హితవుచెప్పిరి: ''అమ్మాయీ! సావధానముగా

వితంతువగు నొక శిష్యురాలికి హితబోధ

వినుము. నూతనముగా వితంతువైన స్త్రీకి నేను సామాన్యముగ మంత్రోపదేశము చేయను. కాని, నీకు పారమార్థికచింత యుండుటచే నీవిషయమున నా యలవాటును త్రోసిపుచ్చి, నీకు మంత్రోపదేశము చేసితిని. ఈపనికి నేను పశ్చాత్తాపపడ నక్కఱ లేకుండ చూడవలసినభారము నీది. శిష్యులుచేయు పాపమువలన గురువు బాధపడును. ఈ మంత్రమును ప్రతిదినము నిర్ణీతకాలము లందు తప్పక జపించుచుండుము.''

ఈ శిష్యురాలొకసారి తన యత్తవారింటికి వెడలుచుండి నప్పుడు, శ్రీ మాతృదేవి యిట్లు సెలవిచ్చిరి : ''ఎవరితోడను నీవు చనవుగా నుండకూడదు. కుటుంబమున జరుగు శుభకార్యములు మొదలగు సంతోష సమయములందు నీవెక్కువగా పాల్గొన వలదు. నీమనస్సు నెల్లప్పుడును పారమార్థిక విషయములందే లీనము గావించి, యితరుల విషయమై తెలిసికొన కుతూహల పడకుము. క్రమక్రమముగా ధ్యానప్రార్థనలందు కాల మెక్కువగా గడుపుచు, శ్రీరామకృష్ణుల యుపదేశములను చదువుచుండుము.'' మరియొకనాడామె తమతో నొంటరిగా నుండినప్పుడు శ్రీ మాతృదేవియిట్లామెకు బోధించిరి : ''ఏ పురుషునితోనైన, తుదకు నీతండ్రితోనైనను సోదరునితోనైననుగూడ నీవెన్నడును చనువుగా నుండకుము. ఇక నితరులమాట చెప్పనేల ? చివరకు భగవంతుడే ఆ రూపమున వచ్చినను, పురుషునితో నీవు చనువుగా నుండ కూడదని మరియొకసారి నొక్కి చెప్పుచున్నాను.''

సన్న్యాసులు నివసించుచుండిన మఠమునకును, తదితర స్థలములకును తఱచుగా బోవలదని అమ్మగారీ శిష్యురాలికే

యిట్లు హితవు చెప్పుచుండువారు: "నీ మనస్సులో దురుద్దేశ్య మేమియు లేకపోవచ్చును. పవిత్రసంకల్పములతోనే నీవట్టిస్థలము లకు వెళ్లినను, నిన్ను చూచుటతోడనే వారికి మనోవికారములు కలుగవచ్చును. అట్లగునేని, నీవుకూడ దానికి బాధ్యురాల వగు దువు." ఇంతేకాక, యేకాలమునబట్టిన నాకాలమునను, ఇట్టివా రట్టివారనక యెవరితోనైనను తీర్థయాత్రలకు బోవలదనియు, శక్తి యున్నయెడల కొలదిమంది సాధువులకు భోజనము పెట్టు మనియు నామెకు బోధించి, అచ్చటనున్నవారిలో ఒక పుణ్యస్థల మునకుబోయి, మంచి గుణపాఠమును నేర్చుకొనివచ్చిన భక్తురాలి నామెకు జూపుచు, శ్రీ మాతృదేవి యొకపాట నుదాహరించుచు, "తీర్థయాత్రయును, విలాసార్థమగు పరదేశాటనమును దుఃఖ కారణములు. వాని విషయమై నీకు చిత్తక్షోభ వలదు. నీకు నిజముగా శ్రద్ధయే యున్నయెడల, నీ వింటిలోనుండియే యెక్కు వగా సాధింపగలవు," అని సెలవిచ్చిరి.

ఒకనాడు కొంతమంది భక్తురాండ్రొకానొక వ్యక్తిని విమర్శించుచుండగా, "నిన్నిచ్చటకు మొదటిసారి తోడ్కొని వచ్చినది ఆమెయే. ఆమెపట్ల నీవు గౌరవభావము విడనాడ వలదు," అని అమ్మగారీ శిష్యురాలినే హెచ్చరించిరి.

ఈ శిష్యురాలొక శిశువును దత్తముచేసికొన గోరినప్పుడు, తాము రాధును బెంచుకొని యనుభవించినకష్ట మామెకుజెప్పి, "అట్టిపని నెన్నడును చేయకుము. ఇతరులవిషయమున నెల్లెడల నీ విధ్యుక్తధర్మమును నిర్వహించుచుండుము. కాని, భగవంతు నొకనినే నీవు ప్రేమింపవలెను. ఐహికప్రేమ యెల్లప్పుడును, చెప్పనలవికాని దుఃఖమునకు కారణమగును," అని శ్రీ మాతృ దేవి హెచ్చరించిరి.

శ్యామదాస్ కవిరాజు చేయుచుండిన చికిత్సవలన శ్రీ మాతృదేవి యారోగ్యము కొంచెము బాగుగానుండెను. ఒక నాటి సాయంకాలమున పెక్కురు భక్తురాండ్రామెను సందర్శింపవచ్చిరి. వారిలో

స్త్రీల లజ్జాగుణప్రశంస

నొకయామె విశేషముగా నగలను సొగసైన వస్త్రములను ధరించి యుండెను. ఆమెయందించుక తత్తరపాటుకూడ కనిపించెను. వారిని సంబోధించి అమ్మగారిట్లు ప్రసంగించిరి : "చూడుడు! లజ్జయే స్త్రీకి భూషణము. భగవద్విగ్రహ పాదాంకితమైనప్పుడు తనజన్మ సార్థకమయ్యెనని పుష్పము తలంచును. అట్లుకానిచో చెట్టుననే వాడిపోవుట దానికి చాలమేలు. అట్టి పుష్పముల నెవడైన డాంబికుడు గుత్తిగాకట్టి తనముక్కు దగ్గర బెట్టుకొని, 'అహా! ఎంత సువాసన!' అని శ్లాఘించుటచూచిన నాకు చాల బాధగానుండును. బహుశః వాడు మరుక్షణముననే యాగుత్తిని నేలపై బారవైచి తన పాదరక్షతో త్రొక్కివేయవచ్చును. ఇక దానివైపే వాడు చూడడు." (ఆ స్త్రీని చాలకాలముక్రిందట నామెభర్త విడిచిపెట్టి, యెక్కడకో వెడలిపోయెనని తరువాత తెలియవచ్చెను.)

* * *

తాము త్వరలో శరీరమును చాలించెదమని శ్రీ మాతృదేవి చెప్పగావిని, యొకభక్తు డొకసారి తానిక దిక్కుమాలినవాడ నగుదునని తలంచుచు మిక్కిలి విచారించుచుండెను. అమ్మగారు వానికిట్లు ధైర్యము చెప్పిరి : "నా శరీరము విచ్ఛిన్నమైనను,

గురువుగా శ్రీమాతృదేవి బాధ్యత

నేను బాధ్యతవహించిన శిష్యులలో ప్రతివ్యక్తికిని ముక్తి లభించ నంతవరకు, నాకు విడుదల యుండగలదని తలంతువా? అంతవరకు

నేను వారితో నిరంతరము నివసింపవలెను. వారి విషయమున పాపపుణ్యముల బాధ్యతను నేనే పూర్తిగా వహించియున్నాను. మంత్రోపదేశము చేయుటయనిన అంత తేలికపని యనుకొను చుంటివా ? మేము వహింపవలసిన బాధ్యత యెంత ప్రచండమైనది! శిష్యుల విషయమున మేమెంత ఆందోళన పడుచుందుము! చూడుము! నీతండ్రి మరణించెను. ఆ వార్త నీ విషయమున వెంటనే నాకెంతో ఆందోళన కలిగించెను. 'అయ్యో! శ్రీ గురు దేవుడు వీనిని మరల పరిశోధించుచున్నాడే!' అని విచారించితిని. ఈ పరీక్షయందు దుత్తీర్ణుడవగుదువుగాకయని నిరంతరము ప్రార్థించు చున్నాను. ఈ కారణమువలననే నీకీ హితబోధనంతయు జేసితిని. నేచెప్పినదెల్ల గ్రహింపగలుగుచున్నావా ? నీవట్లు గ్రహింపగలిగి యుండినచో, నా చింతలెంతో తగ్గియుండెడివి. శ్రీరామకృష్ణులు తమ వేర్వేరు బిడ్డలతో వేర్వేరు విధముల లీలావినోదము సలుపు చున్నారు. కాని, అందువలన ప్రమాదమేమియు లేకుండునట్లు చూచుభారము నాది. నాసొంతముగ స్వీకరించినవారిని వారి కర్మమునకు విడనాడి యూరకొనజాలను.''

*　　　*　　　*

మహాత్ముల సేవలోగల ప్రమాదములు

మహాత్ములను సేవించువారి అపరాధములను గురించి శ్రీ మాతృదేవి యిట్లు ప్రసంగించిరి : ''మహాత్ములను సేవించునపు డెవరైనను ప్రమాదమునకు లోను కావచ్చును. ఆ ప్రమాదమిట్లు జరుగును. అట్టిమహనీయుల సేవాభాగ్య మనుభవించు వానికి గర్వ మెక్కువయై, తాను సేవించువ్యక్తి నతడు తనచేతి కీలుబొమ్మవలె నాడించి ప్రతివిషయమునను, తుదకాహార విహారాదులందుకూడ, తన యధికారమును చెలాయింపగోరును. దీని

వలన సేవాఫల మా సేవకుడు కోల్పోవును. తమ స్వసుఖములను మఱచి, తాము సేవించు పెద్దల కష్టసుఖములే తమ కష్టసుఖములుగా భావించువారివిషయమున నిట్లేల జరుగవలయును? సేవకుల పతనమునుగురించి నీవు మాట్లాడుచున్నావా? చాలమంది మహాత్ములు మిక్కిలి వైభవోపేతమైన జీవితమును గడపుచుందురు. ఈ భాగ్యభోగ్యములనుజూచి చాలమంది వారికడకు సేవకులుగా వచ్చి, భోగోన్మత్తులై తమగోతిని తామే త్రవ్వుకొనెదరు. సరియైన విధమున సేవచేయువా రెందరున్నారో చెప్పుము. చెరువులోని నీటిపై చంద్రుని ప్రతిబింబము పడినతోడనే నీటియందు ప్రతిబింబితమైన చంద్రుడు నిజముగా తమకూటములోని జీవియేయని భ్రమించి, ఆనంద పారవశ్యమున నెత్తాళ్లు (ఒకవిధమైన చిన్న చేపలు) అటునిటు దుముకును. కాని చంద్రు డస్తమించినప్పుడవి తమ పూర్వస్థితిలోనికి బోవును; వెఱ్ఱిసంతోషముతో నెగిరి యెగిరి, అలసిపోయి మాంద్యముగా నవి పడియుండును. దీని కంతటికిని కారణమేమో యవి గ్రహింపజాలవు.

* * *

పుణ్యకార్యములు - సుముహూర్తము

తనతల్లిని కాశీయాత్రకు దీసికొని పోగోరినప్పుడు దాముహూర్తము బాగులేక పోవుటచే నామె యందులకు సమ్మతింపలేదని ఒక శిష్యుడొకసారి విన్నవింప, శ్రీమాతృదేవియిట్లు బదులు చెప్పిరి: "నాయనా! దుర్ముహూర్తమున జేయుతీర్థయాత్ర పురాకృతపుణ్య కార్యముల ఫలమును నాశన మొనర్చునందురు. అట్లయ్యును, 'శుభస్యశీఘ్రమ్' అను నార్యోక్తిననుసరించి జనులు తమపవిత్రోద్దేశ్యముల నన్నిటిని సాధ్యమైనంత త్వరలో సాధించ వలెనను మాటకూడ నిజమే."

ద్వంద్వార్థముగల యీ మాటలు శిష్యునకు బోధపడక, అతడు కంగారుపడుచుండుట చూచి అమ్మగారిట్లు చెప్పిరి: "దుర్ముహూర్తసమయమున పుణ్యక్షేత్రములను దర్శింపబోవుట యుక్తము కాదని లౌకికుల యభిప్రాయము. ముహూర్తౌచితిని బాగుగా నాలోచించి జనులట్టి పవిత్రోద్దేశ్యమును తాత్కాలికముగా విడనాడవచ్చుననుట నిజమే. కాని మృత్యువు ముహూర్తము మంచిదా చెడ్డదాయను విషయమును పాటింపదుగదా! మరణమెప్పుడు వచ్చునో యెవరికిని తెలియదు గనుక, జనులు తమ పవిత్రోద్దేశ్యములను సాధించుటకు తగిన యవకాశము కలిగిన తోడనే, శుభముహూర్తమునకై వేచియుండక కార్యాచరణకు గడంగ వలయును." * * *

స్వప్రయోజ కర్తవ్యము విషయమున అపరిమిత విశ్వాసము తగదు

"అమ్మా! చెడుతలంపు లేవియు నామనస్సున బొడమవు" అని శిష్యుడొకనాడు చెప్పగా, అదరిపాటుతో "అట్లనకుము. అట్టిమాట నెవరు కాని చెప్పకూడదు." అని, అమ్మగారతనిని వారించుచు హెచ్చరించిరి.

* * *

అపవాదు-భక్తి మొదలగు విషయములను గురించి

కొంతవాదము చేసినతరువాత, నళినియును, మరికొలది మంది బాలికలును ఎట్టి అపవాదు జనులకు మంచిదని యడుగగా అపవాద విషయమున మంచి చెడ్డల ప్రసక్తియే యెట్లుండగలదని మొదట ప్రశ్నించి, పిమ్మట మాతృదేవి యిట్లు సెలవిచ్చిరి: "కాని ఐశ్వర్యము విషయమున నపవాద మంచిదే. 'వీరార్థ చాలధనవంతులు', అని యే మనుష్యునితోనైన చెప్పినప్పుడు అతడు పైకెంతనమ్రతను గనుబరచినను అంత

రంగమున మిక్కిలి సంతోషించును. ఈ ప్రసంగము చాలును. ఇకమనము భగవంతు నడుగవలసిన కోరికను మీరు నాకు చెప్పగలరా?'' "అత్తా! ఔనౌను! మనము దివ్యజ్ఞానమును, భక్తిని, ఈ లోకమున మనకు సుఖమునుగూర్చు నితరవస్తుచయమును కోరవలయును'' అని నళిని చెప్పెను. "ఒకేమాటలో చెప్పవలెననిన, వైరాగ్యమును అనగా నెట్టికోరికయు లేని స్థితిని మనము కోరవలెను. ఏలన, ఆశయే సర్వకష్టములకు మూలబీజము, బహు జననమరణములకు కారణము, ముక్తికంతరాయము'' అని అమ్మగారానతిచ్చిరి.

* * *

దివ్యప్రేమ-మానవప్రేమ

తనకును తనమిత్రునకునుమధ్య పొత్తు చెడినదని ఒక భక్తురాలు చెప్పినపిదప, "ఏ మానవవ్యక్తిని గాని ప్రేమించు నెడల నీ వందులకు కష్టపడవలసి యుందువు. భగవంతుని మాత్రమే ప్రేమించువారు నిజముగా ధన్యులు. భగవంతుని ప్రేమించుట యందెట్టి కష్టమును కలుగదు'' అని అమ్మగారు చెప్పిరి.

* * *

"అమ్మా! మీ యూరిలోని బాలవితంతువులు, మా ప్రాంతములం దట్టివారికి నిషిద్ధములైన పదార్థములను తినుటచూడ నా కాశ్చర్యమయ్యెను. సంఘము దీని నధిక్షేపించును'' అని పూర్వాచార పరాయణయగు నొకశిష్యురా లొకసారి తమతో చెప్పినప్పుడు, శ్రీ మాతృదేవి యిట్లు సెలవిచ్చిరి.

సాంఘికాచారములు - పారమార్థిక సాధనలు

"చూడుము. ఇది సాంఘికాచారములకు సంబంధించిన విషయము: ఈ యాచారములు దేశము నందలి వివిధప్రాంతములలో వేర్వేరుగా నుండును. మా ప్రాంతమున బాలవితంతు

వులకు ఆహారము విషయమునను, ఆభరణములను ధరించు విషయమునను మీ వైపునకంటె నెక్కువ స్వేచ్ఛనిచ్చెదరు. సహజముగా వీనిని వారపేక్షింతురు. రుచ్యములగు భక్ష్యములను బహిరంగముగా తిననియ్యనిచో, వారు రహస్యముగా వానిని తినెదరు. కాని, మొదట కొంత స్వేచ్ఛ నిచ్చినయెడల, తాము సంఘనియమమునకు విరుద్ధముగా ప్రవర్తించుచున్నామని క్రమక్రమముగా గ్రహించి తమంతటతామే వారీ యభ్యాసమును మానివేయవచ్చును. తుదకు చెప్పెడిదేమన, నీవీ స్వల్ప విషయములను గురించి చిత్తక్షోభపడకుము. అందువలన శ్రీగురుదేవుని మరచిపోయెదవు. జనులేమనిన, నననిమ్ము; శ్రీ గురుదేవుని నిరంతరము జ్ఞప్తియందుంచుకొని నీకు ధర్మమని తోచినదానిని చేయుచుండుము. 'జనులను పురుగులవలె చూడుము' అని శ్రీగురుదేవులు చెప్పుచుండువారు. ఇది పరనిందా పరాయణులకును, దుష్టసంస్కారములుగల జనులకు మాత్రమే వర్తించునుగాని అందరికిని వర్తింపదు.

* * *

పవిత్రత

జయరాంబటిలో శ్రీమాతృదేవి కడసారి నివసించుచుండినప్పుడు వంటపనికత్తెయగు బ్రాహ్మణస్త్రీ యొకనాటిరాత్రి యించుమించుగా తొమ్మిది గంటలవేళ నామెకడకువచ్చి, "అమ్మా! నేను కుక్కను తాకితిని; స్నానముచేయవలెను" అని చెప్పెను. "ఇప్పుడు రాత్రి చాల ప్రొద్దుపోయినది. స్నానము చేయకుము. కాలుసేతులు కడిగికొని, మరియొక బట్టనుకట్టుకొనిన చాలును" అని అమ్మగారు బదులు చెప్పిరి. అందుపై "ఓహో అది పనికిరాదు!" అని ఆ వంటకత్తె మారుపలుక. "అట్లైన నీ శరీరముపై కొంచెము గంగా జలము

చల్లుకొనుము'' అని అమ్మగారానతిచ్చిరి. అప్పటికిని కూడ, ఆ వంటకత్తెకు తృప్తికలుగకుండుట జూచి "అట్లైనచో నన్ను తాకుము'' అని పవిత్రతాస్వరూపిణి, శ్రీ మాతృదేవి సెలవిచ్చిరి.

* * *

అప్రమత్తతనుగురించి

"మీరెప్పుడైన నొకచోటునుండి మరియొకచోటునకు వెళ్లునప్పుడు మీ చుట్టుప్రక్కలనుండు వస్తువులను చక్కగా పరిశీలించి, మీరుండు స్థలమున నేమి జరుగుచున్నదో బాగుగా తెలిసికొనుచుండుడు. కాని నోరుమాత్రము మీరెన్నడు మెదపవలదు'' అని అమ్మగా రొకసారి చెప్పిరి.

* * *

కష్టముల నెదుర్కొనుట

"నాయనా! చూచితివా! నీకు కష్టము లెన్నడును రావనుమాట నిజముకాదు, కష్టము లెల్లప్పుడును వచ్చునుగాని, శాశ్వతముగా నుండవు. వంతెనక్రింది నీళ్ల వలె నవి గతించిపోవునని గ్రహింపుము'' అని అమ్మగారొకనా డొకశిష్యుని హెచ్చరించిరి.

* * *

సత్సంభాషణ

జయరాంబటిలో నొకనాడెవరో రాధుపిచ్చి తల్లినుద్దేశించి పరుషోక్తులాడుచుండుటను జూచి, శ్రీమాతృదేవియిట్లానతిచ్చిరి: "మాటలచేనైన మన మితరుల నెన్నడును నొప్పింపగూడదు. కష్టభాజనమగు సత్యము నైనను మన మనావశ్యకముగా పలుకకూడదు. ఎవరైన మోటు మాటలాడుట కలవడిరేని వారి స్వభావముకూడ మోటుబాఱును. తనమాటల నదుపులోనుంచుకొనలేని వానికి, సౌమ్యతయుండదు. 'ఒక కుంటివానిని వాడెట్లు కుంటివాడయ్యెనని మనమడుగ గూడదు' అని శ్రీ గురుదేవులు చెప్పుచుండువారు.''

పనికివచ్చు సర్వవస్తువుల యందు గౌరవ భావము చూపవలయును

ఒకనాటి యుదయమున శ్రీమాతృదేవి యొడలికి తైలము రాసుకొనుచుండగా, వాకిలి నెవరో ఊడ్చుచుండిరి. ఆ పనియైన తర్వాత నావ్యక్తి చీపురును విసిరి పారవైచెను. ఇది చూచి అమ్మగారిట్లానతిచ్చిరి: ''ఏమిది? పనియైన తోడనే చీపురుకట్టనంత నిరాదరణగా పారవేయుచున్నావు! దానిని విసిరి పారవైచుట కెంతకాలము పట్టునో, మెల్లగా దానినొక మూలనుంచుటకు గూడ నంతే కాలముపట్టును. ఎంతకొలదిపాటి వస్తువునైన మనము నిరాదరణ చేయరాదు. నీవొకవస్తువును గౌరవించు నెడల, అదిగూడ నిన్ను గౌరవభావముతో చూచును. నీకా చీపురుకట్ట మరల నక్కరలేదా? ఇంతేకాక, అది యీ కుటుంబమునకు చెందినది. ఆ కారణమును బట్టికూడ, అది గౌరవ పాత్రమైనది. చీపురుకట్టనైన మనము గౌరవముతో చూడవలెను. ఎంతచిన్నపనినైనను మనము గౌరవభావముతో చేయవలయును.

* * *

శిరస్సు పవిత్రమైనది

రాధుపెంపుడు పిల్లి 'మిని'యొకనాడు వాకిట నొకప్రక్కబరుండియుండెను. ఒకభక్తురాలా పిల్లిని కాలితో బుజ్జగించుచుండెను. ఆమె క్రమక్రమముగా తన పాదమును దానితలపై నుంచెను. ఇది చూచి అమ్మగారామెకిట్లు హితవాసంగిరి: ''నాతల్లీ! ఏమిచేయుచున్నావమ్మా? శిరస్సుగురుస్థానము. తల నెవరును పాదముతో తాకకూడదు. పిల్లికి నమస్కరింపుము.'' ''అమ్మా! నాకా విషయ మెన్నడును తెలియలేదు. నేడు నేనొక గుణపాఠమును నేర్చుకొంటిని'' అని యా భక్తురాలు బదులు చెప్పెను.

సమాప్తము